ఈనాడు


హైదరాబాద్ 7-10-2024 సోమవారం సిటీ సంపుటి 51. సంచిక 58

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 20 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

నేటి అలంకారము
శ్రీ మహాచండీ దేవి



మూసీ అభివృద్ధి ఆగదు

ఆ నది పేరు పిల్లలకు పెట్టుకునేలా ప్రక్షాళన చేస్తాం

- కాళేశ్వరంపై రూ.లక్ష కోట్లు కుమ్మరించారు
- మూసీ నిర్వాసితులకు రూ.10 వేల కోట్లు ఇవ్వడానికి సహకరించరా?
- కేటీఆర్, హరీశ్, ఈటల.. వారం రోజుల పాటు ఆ నది పరీవాహకంలో ఉంటే జనం బాధలు తెలుస్తాయి
- సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం
- 1,635 మందికి ఉద్యోగ నియామక పత్రాల అందజేత

ఈనాడు, హైదరాబాద్: ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. మూసీ అభివృద్ధి ఆగదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మీ చేతుల మీదుగానే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ జరగబోతోందని యువ ఇంజినీర్లనుద్దేశించి చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక 90 రోజుల్లోనే.. 31 వేల మందికి ఉద్యోగ నియామకపత్రాలిచ్చామని, తెలంగాణ భవిష్యత్‌లో యువ ఇంజినీర్లదే కీలకమైన బాధ్యత అని అన్నారు. అక్టోబరు 9న 11,063 మందికి ఉపాధ్యాయ నియామక పత్రాలు అందించబోతున్నామని, ఇది తమ చిత్తశుద్ధి అని చెప్పారు.

...మిగతా 2లో



టీజీపీఎస్సీ పరీక్షలో మెరిట్ సాధించిన జాస్మిన్‌కి వ్యవసాయాధికారిణిగా నియామక పత్రాన్ని అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతికుమారి. చిత్రంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ

టీ20 ప్రపంచకప్‌లో భారత్ బోణీ

మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు తొలి విజయాన్నందుకుంది. తొలిమ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో చిత్తయిన హర్మన్‌ప్రీత్ సేన.. ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించింది. మొదట తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి (3/19) విజృంభించడంతో పాక్‌ను 105/8కు కట్టడి చేసిన భారత్.. లక్ష్యాన్ని 7 బంతులు మిగిలుండగానే 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

ఛాంపియన్ లో

మీ వ్యాఖ్యలు వాస్తవ విరుద్ధం

- రుణమాఫీని అమలు చేశాం
- త్వరలో రూ.2 లక్షలు దాటినవారికీ..
- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ లేఖ

15లో



జూట్ బ్యాగ్‌లు కుడుతున్న మహిళలతో మంజుల

మొక్కవోని ధైర్యం... ఈ మగువల ప్రస్థానం

- కలిసిరాని సేద్యం.. అప్పుల బాధతో భర్తల బలవన్మరణం
- ఆత్మస్థైర్యంతో అతివల ముందడుగు
- స్ఫూర్తిపథంలో సాగుతున్న గ్రామీణ మహిళలు

15లో

2,560 మంది విద్యార్థులు.. 120 మంది టీచర్లు



- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పాఠశాలలకు వేర్వేరు బ్లాక్‌లు
- వాతావరణ అనుకూలంగా భవనాల నిర్మాణం
- సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలకు ప్రత్యేకంగా ఆడిటోరియం
- సమీకృత గురుకులాల ప్రత్యేకతలు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం నిర్మించనున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల్లో ఒక్కో దాంట్లో 2,560 మంది విద్యార్థులు ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకోనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల సొసైటీలకు చెందిన నాలుగు పాఠశాలలు ఈ భవనంలో ఉంటాయి. ఒక్కో పాఠశాలలో 640 మంది విద్యార్థుల చొప్పున ఉంటారు. ఈ పాఠశాలలకు వేర్వేరు బ్లాక్‌లు ఉంటాయి. ప్రతి పాఠశాలలో 30 మంది చొప్పున 120 మంది టీచర్లు పనిచేస్తారు. సమీకృత గురుకులానికి పరిపాలన భవనం ప్రత్యేకంగా ఉంటుంది. లైబ్రరీలో 5 వేల పుస్తకాలు, కంప్యూటర్ కేంద్రంలో 60 కంప్యూటర్లు ఉంటాయి.

...మిగతా 2లో

మంటల్లో బీరుట్

- పేలుళ్లతో దద్దరిల్లుతున్న లెబనాన్ రాజధాని
- ఆగని ఇజ్రాయెల్ వైమానిక దాడులు
- ఏ క్షణమైనా ఇరాన్‌పై దాడి: నెతన్యాహు


17లో

సమీకృత గురుకులాలకు 11న శంకుస్థాపన

- తొలివిడతలో 22 నియోజకవర్గాల్లో నిర్మాణం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

2లో




Inners for Winners
RAMRAJ
VESTS
BRIEFS • TRUNKS
ఎదగనివ్వండి మీ ఉత్సాహాన్ని
తద్వారా అంతరంగంలో
వేడుకలు మరియు సవాళ్ళ ద్వారా, రోజంతా సౌకర్యాన్ని మరియు ఆత్మ విశ్వాసాన్ని పొందండి. రామ్‌రాజ్ బనియన్లతో మీ వ్యక్తిత్వాన్ని వ్యక్తీకరించండి.
Shreyas Iyer - Cricketer
SCAN QR CODE
FOR STORE LOCATION
SUKRA SUPER FINE COTTON VESTS
ROMEX SUPERIOR BANIANS
RISE-UP PREMIUM BANIANS
ACOSTE LUXURY INNERWEARS
Breeze Eye Let Vests
WinStripe STRIPED BANIANS
ARCHERY GYM VEST
COMPACT PREMIUM COTTON RIB VESTS
LITTLE STARS KIDS INNERWEARS
RAMRAJ COTTON SHOWROOMS
HYDERABAD : AMEERPET | LAKDIKAPOOL | BODUPPAL | DILSUKH NAGAR | DR.A.S.RAO NAGAR | KOTHAPET | PARADISE | TRIMULGHERRY | KUKATPALLAY | VANASTHALIPURAM | CHANDANAGAR | CHAMPAPET KONDAPUR | MEHDIPATNAM | SUCHITRA | MADHAPUR |CHIKKADPALLY | SUNCITY | NAGARAM | CHINTAL| ISNAPUR | SAMSABAD | HASTHINAPURAM | NACHARAM | PRAGATHINAGAR | MANIKONDA
KARIM NAGAR | MANCHERIAL | KHAMMAM | KOTHAGUDEM | NIZAMBAD | KAMAREDDY| WARANGAL | HANAMAKONDA | SHADNAGAR | JANGAON | SANGAREDDY | MAHABUBNAGAR
ZAHEERABAD | SIDDIPET | GAJWEL | NALGONDA | SURYAPET | SHANKARPALLI
Available @ Ramraj Showrooms & All leading Textile Shops | Shop Online at www.ramrajcotton.in | Corporate Orders : +91 95140 68147

ఈనాడు

హైదరాబాద్ 7-10-2024 సోమవారం సిటీ సంపుటి 51. సంచిక 58
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 20 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

కాజీపేటలో రైల్వే కోచ్‌లూ తయారీ

- తెలంగాణ రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం అధిక ప్రాధాన్యం
- రూ.2,220 కోట్లతో 40 రైల్వే స్టేషన్ల అభివృద్ధి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



సికింద్రాబాద్ - గోవా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో ద.మ.రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, భాజపా నేతలు శ్యాంసుందర్ గౌడ్, దీపిక

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే రెజిమెంటల్‌బజార్: తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం భారీ ఎత్తున జాతీయ రహదారులు మంజూరు చేసి నిర్మించిందని.. ఇక రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులను పెద్దఎత్తున అభివృద్ధి చేస్తుందని కేంద బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాజీపేటలో వర్క్‌షాప్‌ను పీరియాడిక్ ఓవర్ హాలింగ్ (పీఓహెచ్) ప్రాజెక్టుగానే అనుకున్నప్పటికీ ప్రధాని మోదీ చొరవతో అది అప్‌గ్రేడ్ అయిందని వెల్లడించారు. ఇక్కడ రూ.521 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టులో గూడ్సు వ్యాగన్ల ఓవర్ హాలింగ్‌తో పాటుగా.. రైలు కోచ్‌లు, ఇంజిన్లు, వ్యాగన్లూ తయారవుతాయని తెలిపారు. తద్వారా మూడు వేల మందికి ప్రత్యక్షంగా.. మరెంతో మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. సికింద్రాబాద్-వాస్కోడగామా మధ్య ప్రవేశపెట్టిన నూతన ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర మంత్రి ఆదివారం సికింద్రాబాద్ స్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణకు దసరా కానుకగా కేంద్రం ఈ రైలును ప్రారంభించిందన్నారు. రానున్న రోజుల్లో రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి మోదీ ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టంచేశారు. సికింద్రాబాద్ నుంచి గోవాకు ఇప్పటివరకు లింక్ రైలు మాత్రమే ఉండేది. ఈ విషయాన్ని రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లగా కొత్త సర్వీసును ప్రకటించారు. ఈ రైలు తెలంగాణ, కర్ణాటక, గోవా రాష్ట్రాల పర్యాటక ప్రగతికి, వాణిజ్య, సాంస్కృతిక సంబంధాల బలోపేతానికి దోహదపడుతుంద'ని వివరించారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. 'రూ.715 కోట్ల వ్యయంతో చేపడుతున్న సికింద్రాబాద్ స్టేషన్ పునరభివృద్ధి పనులు 2025 చివరినాటికి పూర్తవుతాయి. రూ.425 కోట్లతో కాచిగూడ, రూ.429 కోట్లతో నాంపల్లి స్టేషన్లను ఆధునికీకరిస్తున్నాం. తెలంగాణలో 40కి పైగా రైల్వే స్టేషన్లను రూ.2,220 కోట్ల వ్యయంతో, ఆధునిక వసతులతో తీర్చిదిద్దుతున్నాం. వంద శాతం విద్యుద్దీకరణ పూర్తవడంతో పాటు వేగంగా డబ్లింగ్, ట్రిబ్లింగ్‌తో తెలంగాణ రైల్వే నెట్‌వర్క్‌లో వేగంగా పురోగమిస్తోంద'ని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

జహీరాబాద్‌కు రైల్వే నెట్‌వర్క్ పెంచుతాం

దేశంలో దిల్లీ తర్వాత అత్యధికంగా ఐదు వందేభారత్ రైళ్లు సికింద్రాబాద్ నుంచే వెళుతుండడం తెలంగాణకు కేంద్రం ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనమని కిషన్‌రెడ్డి వివరించారు. 'జహీరాబాద్‌లో రూ.2,361 కోట్లతో కేంద్రం ఆమోదం తెలిపిన ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో 1.74 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.. ఈ ప్రాంతానికి రైల్వే నెట్‌వర్క్ పెంచుతాం. హైదరాబాద్-నాగ్‌పుర్ మధ్య.. రూ.6,661 కోట్లతో జాతీయ రహదారుల అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభవుతాయ'ని వివరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ద.మ. రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, సికింద్రాబాద్ డీఆర్‌ఎం భరతేష్ కుమార్‌జైన్, భాజపా నేతలు శ్యాంసుందర్‌గౌడ్, దీపిక పాల్గొన్నారు.

కెనడాలో వెయిటర్ ఉద్యోగాలకు భారతీయ విద్యార్థుల బారులు



టొరంటో: కెనడాలోని బ్రాంప్టన్ నగరంలో ఓ రెస్టారెంట్‌లో వెయిటర్, సర్వర్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు దాదాపు మూడు వేల మంది బారులు తీరి ఉన్న వీడియో ఒకటి తాజాగా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. వారిలో అత్యధికులు భారతీయ విద్యార్థులేనని తెలుస్తోంది. ప్రధానంగా బయటి విద్యార్థులకు కెనడాలో ఉద్యోగ అవకాశాల కొరత తీవ్రతకు ఈ వీడియో అద్దం పడుతోందని పలువురు పేర్కొంటున్నారు. ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో నేతృత్వంలోని సర్కారు ఉద్యోగాల కల్పనలో ఘోరంగా విఫలమవుతోందని విమర్శిస్తున్నారు. అయితే- వెయిటర్ ఉద్యోగాల కోసం భారతీయులు బారులు తీరడాన్ని మరికొందరు సమర్థిస్తున్నారు. అవి కేవలం పార్ట్‌టైం ఉద్యోగాలని గుర్తుచేస్తున్నారు. విద్యార్థులు చదువుకుంటూ పార్ట్‌టైం పని చేసుకోవడం మంచిదేనని విశ్లేషిస్తున్నారు. ఆ వీడియోను నిరుద్యోగిత స్థాయికి దర్పణంగా భావించొద్దని పేర్కొంటున్నారు.

బాధలు చూశారు... భరోసా కల్పించారు! 6లో

9న ఉపాధ్యాయ నియామక పత్రాల అందజేత 3లో

ఐటీఐల్లో 860 ఖాళీ పోస్టులు
- కొత్త కాలేజీలు మంజూరైతే 3 వేల వరకూ..
6లో

ప్రభుత్వ భూముల దస్త్రాల డిజిటలైజేషన్

- టాంపరింగ్ కాకుండా చేస్తాం
- కొత్త చట్టం రాకముందే గ్రామానికో రెవెన్యూ అధికారి
- ఉద్యోగుల జాబ్ చార్ట్ రూపకల్పనకు అధ్యయన కమిటీ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మంత్రి పొంగులేటికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి. చిత్రంలో రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ఎవరు రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్నా.. ప్రభుత్వ భూములకు సంబంధించిన దస్త్రాల్లో దిద్దుబాట్లకు(టాంపరింగ్‌కు) పాల్పడకుండా ఉండేలా దస్త్రాల డిజిటలైజేషన్ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన ప్రారంభిస్తామన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన ధరణి పోర్టల్‌తో సామాన్య ప్రజలు, రైతులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. రాష్ట్రంలోని 272 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లతో మంత్రి హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీఐలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..'ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకొనేలా రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తాం. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఏమాత్రం రాజీపడొద్దు. దీనిపై జిల్లా, రాష్ట్ర స్థాయుల్లో మూడు నెలలకోసారి సమావేశాలు నిర్వహిస్తాం. కోర్టు కేసులున్న భూముల విషయంలో న్యాయ బృందాలతో సమావేశం నిర్వహిస్తాం. రాష్ట్రస్థాయి సమావేశంలో నేనూ పాల్గొంటా. ఉద్యోగులకు శిక్షణ తప్పనిసరి చేస్తాం.

ఆదర్శంగా కొత్త రెవెన్యూ చట్టం

దేశానికి ఆదర్శంగా ఉండేలా త్వరలో కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకురాబోతున్నాం. చట్టం అమలులోకి రాకముందే ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించే అంశంపై తుది నిర్ణయం తీసుకుంటాం. కొత్త చట్టంపై అన్ని వర్గాల వారి నుంచి సలహాలు స్వీకరిస్తున్నాం. దీనిలో భాగంగానే నల్గొండ జిల్లా తిరుమలగిరి, రంగారెడ్డి జిల్లా యాచారం మండలాల్లో పైలట్ ప్రాజెక్టు నిర్వహిస్తున్నాం. రెండు రోజుల క్రితం తిరుమలగిరి మండలానికి వెళ్లి రైతులతో మాట్లాడా. ఈ ఒక్క మండలంలోనే 4,380 ఎకరాల్లో సర్వే నిర్వహిస్తే.. 1,300 ఎకరాలకు సాగులో లేనివారి పేరు మీద పాసుపుస్తకాలు ఉన్నాయని వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ ఉద్యోగులకు సంబంధించిన జాబ్ చార్ట్ రూపకల్పనకు కమిటీ ఏర్పాటు చేస్తాం. ఇతర రాష్ట్రాల్లోని విధానాలను కమిటీ అధ్యయనం చేస్తుంది. త్వరలో ఉద్యోగుల పదోన్నతులు పూర్తి చేస్తాం. 33 జిల్లాల్లో సెలెక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను రూపొందిస్తాం. 17 మంది రెవెన్యూ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పించడానికి చర్యలు తీసుకుంటాం. ఎన్నికల తిరుగు బదిలీలపై దసరాలోపే నిర్ణయం తీసుకుంటాం. రెవెన్యూ ఉద్యోగులకు రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన వాహనాల కేటాయింపుపై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటాం' అని మంత్రి పేర్కొన్నారు. రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ మాట్లాడుతూ దాదాపు 3.50 లక్షల ధరణి దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం(ఎగ్జిక్యూటివ్), డిప్యూటీ కలెక్టర్ల సంఘం, ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రమోహన్, వి.లచ్చిరెడ్డి, వంగ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖాముఖి సందర్భంగా పలువురు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు చెప్పిన సమస్యలు, సలహాలకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

దిల్లీ పర్యటనలో తెలుగు రాష్ట్రాల సీఎంలు

- నేడు ప్రధానితో చంద్రబాబు భేటీ
- కేంద్ర హోంమంత్రి ఆధ్వర్యంలో నక్సల్ ప్రభావిత రాష్ట్రాల సదస్సుకు రేవంత్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ, అమరావతి: తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబులు రెండురోజులపాటు దిల్లీలో పర్యటించనున్నారు. రేవంత్ ఆదివారం రాత్రి 9 గంటలకు దేశ రాజధానికి చేరుకోగా.. చంద్రబాబు సోమవారం సాయంత్రం రానున్నారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నేతృత్వంలో ఇక్కడి విజ్ఞాన్ భవన్‌లో జరిగే నక్సల్ ప్రభావిత రాష్ట్రాల సీఎంల సదస్సులో ఇద్దరూ పాల్గొంటారని తొలుత భావించినా రేవంత్ మాత్రమే హాజరవుతారని, ఏపీ తరఫున హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొంటారని తెలిసింది. ఈ సమావేశంలో బిహార్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న కేంద్ర మంత్రులు పాల్గొంటారు. డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సీనియర్ అధికారులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలతో కలిసి 2026 నాటికి దేశవ్యాప్తంగా వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించడంపై సమాలోచనలు జరుపనున్నారు. చంద్రబాబు తొలుత ప్రధాని మోదీతో, తర్వాత రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో సమావేశమవుతారు. మంగళవారం కేంద్ర మంత్రులు అమిత్‌షా, నితిన్ గడ్కరీ, నిర్మలాసీతారామన్‌లతో వేర్వేరుగా భేటీ అవుతారు. వీరితో అమరావతి, పోలవరం నిధులు, రాష్ట్రంలో వివిధ రహదారుల అభివృద్ధి, రైల్వేజోన్ శంకుస్థాపన, సెయిల్‌లో విశాఖ స్టీల్ విలీనం, ఇటీవల సంభవించిన వరద బాధితులను ఆదుకొనేందుకు కేంద్రం నుంచి సాయం గురించి ఆయన చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రేవంత్‌రెడ్డి కూడా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌లను కలిసి రక్షణ, ఆర్థిక అంశాలపై చర్చించవచ్చని సమాచారం. హరియాణా, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్, కూటమి గెలవబోతున్నట్లు ఎగ్జిట్‌పోల్ సర్వేలు చెబుతున్న నేపథ్యంలో రేవంత్‌రెడ్డి మంగళవారం వరకూ దిల్లీలోనే ఉండి పార్టీ పెద్దలను కలిసి శుభాకాంక్షలు తెలిపే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

మోడల్ స్కూళ్లలో పదోన్నతులు, ఖాళీలపై కదలిక!

- 317 జీవోపై సర్కారుకు పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదన
- 010 పద్దు కింద వేతనాలు ఇవ్వాలని ఆర్థికశాఖకు దస్త్రం

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలన్నా... ఉన్న టీచర్లకు పదోన్నతులు ఇవ్వాలన్నా సర్వీస్ నిబంధనలు అడ్డంకిగా మారాయి. పాత సర్వీస్ నిబంధనలను సవరిస్తేనే 317 జీవో అమలు చేయడానికి వీలవుతుంది. ఈ అవరోధాన్ని తొలగించాలని, అందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ప్రస్తుతం ఆ దస్త్రం సాధారణ పరిపాలన శాఖ పరిశీలనలో ఉంది. అనుమతి దక్కితే మోడల్ పాఠశాలలకు సంబంధించిన ప్రధాన సమస్యలు ఒక్కొక్కటి పరిష్కారమవుతాయని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.



ఇదీ అడ్డంకి...

మొత్తం 194 ఆదర్శ పాఠశాలల్లో 3,880 ఉపాధ్యాయ పోస్టులకుగాను 1,100కిపైగా ఖాళీగా ఉన్నాయి. ఏకంగా 91 చోట్ల ప్రిన్సిపాళ్లు లేరు. సీనియర్ టీచర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రిన్సిపల్ పోస్టుల్లో 70 శాతం, పీజీటీల్లో 50 శాతం ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలి. టీజీటీ ఖాళీలను 100 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తారు. పదోన్నతులు ఇవ్వాలన్నా...కొత్త నియామకాలు చేపట్టాలన్నా 317 జీవో కింద టీచర్లను కేటాయించాలి. గతంలో ప్రిన్సిపల్ పోస్టులు రాష్ట్ర కేటగిరీలో, పీజీటీ, టీజీటీ పోస్టులు జోనల్ కేడర్‌లో ఉన్నాయి. రాష్ట్రపతి ఉత్తర్వుల్లో మార్పు చేసినందున ఇప్పుడు ప్రిన్సిపల్, పీజీటీ మల్టీ జోనల్, టీజీటీ జోనల్ కేడర్‌గా మారాయి. ఆ ప్రకారం ప్రస్తుతం సర్వీస్ నిబంధనలను సవరించాలి. ఆ తర్వాత 317 జీవో ప్రకారం టీచర్లను కేటాయిస్తారు. అనంతరం ఇప్పటికే ఉన్న టీచర్లకు పదోన్నతులు కల్పించడానికి వీలవుతుంది. ఈ ప్రక్రియలన్నీ పూర్తయితేనే నికరంగా ఎన్ని టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటాయన్నది పక్కాగా లెక్క తేలుతుంది. అప్పుడు మాత్రమే కొత్త నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మోడల్ స్కూళ్లు నెలకొల్పి 11 సంవత్సరాలైనా ఇప్పటివరకు టీచర్ల నియామకానికి ఒక్కసారి కూడా నోటిఫికేషన్ జారీ కాలేదు. అధికారులు మాత్రం వచ్చే జాబ్ క్యాలెండర్‌లో ఈ నియామకాలు ఉంటాయని చెబుతున్నారు.

మిగిలిన ఉద్యోగులకు ఇచ్చినట్లే వేతనాలు ఇవ్వాలని...

అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా వేతనాలు ఇస్తున్నారు. దానివల్ల వారికి ప్రతి నెలా ఒకటో తేదీన ట్రెజరీల ద్వారా జీతాలు లభిస్తున్నాయి. మోడల్ స్కూల్ సిబ్బందికి మాత్రం ప్రతి మూడు నెలలకు ఒకసారి బడ్జెట్‌ను ఆర్థిక శాఖ విడుదల చేయాల్సి ఉంటుంది. దానివల్ల ఇక్కడి టీచర్లకు వేతనాలు కొన్ని నెలల్లో 20వ తేదీకి కూడా అందటం లేదు. ఈ విధానాన్ని మార్చాలని మోడల్ స్కూల్‌తోపాటు ఇతర ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో తాజాగా పాఠశాల విద్యాశాఖ ఆర్థిక శాఖకు ప్రతిపాదన పంపింది.

- ఈనాడు, హైదరాబాద్



విజేతలను చూసి అసూయపడొద్దు

జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు, సంపన్నులు విలాసవంతమైన జీవితం గడుపుతుంటారని చాలా మంది భావిస్తుంటారు. మరికొందరు వారి ఆర్భాట జీవన శైలిని చూసి అసూయ పడుతుంటారు. అయితే వారు ఆ స్థాయికి రావడానికి, దాన్ని నిలబెట్టుకోవడానికి ఎంత కష్టపడుతున్నారన్నది మనం గుర్తించం. ఏళ్ల తరబడి క్రమశిక్షణతో, ఒకే లక్ష్యానికి కట్టుబడి, ఎన్నో సరదాలను, ఇష్టాలను త్యాగం చేస్తూ, దైనందిన జీవితం విసుగ్గా అనిపించినా వదిలేయకుండా వారు పడిన కష్టాన్ని తెలుసుకుంటే మనకు స్ఫూర్తి కలుగుతుంది.

– సాహిల్ బ్లూమ్, రచయిత

పాత మూడు కారిడార్లనూ కలుపుతూ

విమానాశ్రయ మెట్రో

పీ-7 రోడ్డు బదులు ఆరాంఘర్ మార్గం వైపు మార్పు

ఈనాడు, హైదరాబాద్: మెట్రో రెండో దశలో శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో రైలు ప్రతిపాదిత కొత్త కారిడార్-4కు ప్రస్తుతమున్న మూడు కారిడార్లను అనుసంధానం చేయనున్నారు. హైదరాబాద్ నగరంలో ఏ వైపున ఉన్నవారైనా మెట్రోలో విమానాశ్రయానికి చేరుకునేలా కారిడార్-1, 2, 3లను కొత్త కారిడార్‌కు కలపనున్నారు. మహానగరాల్లో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా విమానాశ్రయాల వరకు మెట్రో రైలు అనుసంధానం అనివార్యంగా మారుతోంది. అంతర్జాతీయ నగరంగా ఎదుగుతున్న భాగ్యనగరంలోనూ శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో కారిడార్ మార్గాన్ని ప్రభుత్వం ఖరారు చేసింది. నాగోల్ నుంచి ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు 36.6 కి.మీ. మార్గాన్ని ప్రతిపాదించింది. దీనికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక తుది మెరుగులు దిద్దుకుంటోంది.

ఎక్కడ కలుస్తాయంటే...

◆ కారిడార్-3 రాయదుర్గం నుంచి నాగోల్ వరకు ఉంది. ఇక్కడే నాగోల్ విమానాశ్రయ మెట్రో స్టేషన్, అక్కడి నుంచి కొత్త కారిడార్ నిర్మించనున్నారు. ◆ కారిడార్-1 మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వరకు ఉంది. ఎల్బీనగర్‌లో విమానాశ్రయ మెట్రో మార్గానికి కలుపుతారు. ◆ కారిడార్-2 జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు ఉంది. ఈ మార్గాన్ని రెండో దశలో ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట వరకు విస్తరిస్తారు. చాంద్రాయణగుట్ట వద్ద అతిపెద్ద జంక్షన్‌స్టేషన్ నిర్మించి.. విమానాశ్రయ మెట్రోకు అనుసంధానిస్తారు.

జన సంచారం అధికంగా ఉండే మార్గంలో..

వ్యయం తక్కువ అవుతుందని తొలుత నాగోల్-చాంద్రాయణగుట్ట-మైలార్‌దేవ్‌పల్లి నుంచి పీ-7 రోడ్డు మీదుగా విమానాశ్రయ మార్గాన్ని పరిశీలించారు. దీంతో పోలిస్తే మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఆరాంఘర్, శంషాబాద్ మీదుగా విమానాశ్రయానికి ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నట్లు డీపీఆర్ రూపొందించే క్రమంలో చేపట్టిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ)లో గుర్తించారు. ఎక్కువ మంది ప్రయాణికులు ఉపయోగించుకునే అవకాశం ఉందనే నిర్ణయానికి వచ్చారు. కేంద్రం సైతం మెట్రో రైలు ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలంటే సీఎంపీని కీలకంగా పరిగణిస్తుంది. దీంతో ఆరాంఘర్ మార్గాన్ని సర్కారు ఖరారు చేసింది.

మరో ఆరుగురు మావోయిస్టుల మృతదేహాల గుర్తింపు

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పుర్-దంతెవాడ జిల్లాల సరిహద్దులో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన 31 మంది మావోయిస్టుల్లో.. మరో ఆరుగురిని ఆదివారం గుర్తించారు. వారిలో నందు, సురేశ్ సలాం, మీనా నేతం, మహేశ్, మోహన్ మాండావి, సుక్కు యాదవ్ ఉన్నట్లు పోలీసు అధికారులు ప్రకటించారు. దీంతో ఇప్పటివరకూ 22 మందిని గుర్తించినట్లయింది. మరో 9 మందిని గుర్తించాల్సి ఉంది. ఈ ఆపరేషన్ నిర్వహించిన జవాన్లను ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్‌శర్మ ఆదివారం అభినందించారు.

సమీకృత గురుకులాలకు 11న శంకుస్థాపన

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

ఈనాడు, హైదరాబాద్: యంగ్ ఇండియా సమీకృత గురుకులాలకు ఈనెల 11న భూమి పూజ చేయనున్నట్లు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల వారిని, పేదలను ప్రపంచస్థాయి మానవ వనరులతో పోటీపడేలా తీర్చిదిద్దేందుకు వీలుగా వీటికి రూపకల్పన చేశామన్నారు. రాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా విద్యార్థులందరూ ఒకేచోట విద్యను అభ్యసించాలన్నది లక్ష్యమన్నారు. సమీకృత గురుకులాలపై ఆదివారమిక్కడ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సంక్షేమశాఖల ముఖ్యకార్యదర్శులు, గురుకుల సొసైటీల కార్యదర్శులుతో సమీక్ష నిర్వహించారు. నమూనా నిర్మాణాలను మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. “తొలివిడతలో 22 నియోజకవర్గాల పరిధిలో వీటిని చేపడుతున్నాం. ఒక్కోటి 20-25 ఎకరాల్లో ఉంటుంది. వచ్చే ఏడాది దసరా నాటికి నిర్మాణాలను పూర్తిచేస్తాం. ఆర్కిటెక్ సంస్థ గత 25 ఏళ్ల వాతావరణ పరిస్థితుల వివరాలు, ఇతర గణాంకాలను అధ్యయనం చేసి డిజైన్లు రూపొందించింది. అన్ని నియోజకవర్గాల్లో వీటిని నిర్మిస్తాం. అవసరమైతే సంఖ్యను పెంచుతాం. ఇందుకోసం రూ.5,000 కోట్లు ఖర్చు చేస్తాం. ఈ గురుకులాల్లో ఐదు నుంచి 12వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ప్రవేశాలకు ప్రస్తుతమున్న విధానం కొనసాగుతుంది. దరఖాస్తుల్లో కులం, మతం కాలమ్స్ కొనసాగుతాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల ప్రకారం విద్యార్థుల వినోదం కోసం కాంప్లెక్సులో థియేటర్ నిర్మించి, వారానికి లేదా నెలకో సినిమాను శాటిలైట్ ద్వారా ప్రదర్శిస్తాం” అని భట్టి తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి

అద్దె భవనాల్లో 662 గురుకులాలు...

ప్రస్తుతం రాష్ట్రంలోని గురుకులాల్లో సరైన వసతుల్లేవని, సంక్షేమశాఖల పరిధిలో 1,023 ఉంటే.. ఇందులో 662 అద్దెభవనాల్లో, సరైన వసతులు లేని పరిస్థితుల్లో కొనసాగుతున్నాయని డిప్యూటీ సీఎం విక్రమార్క తెలిపారు. “గత ప్రభుత్వం భవన నిర్మాణాలకు కేవలం రూ.73కోట్లు మాత్రమే ఖర్చుచేసింది. సరైన వసతులు లేకుండా విద్యార్థులకు మెరుగైన చదువు సాధ్యం కాదని మా ప్రభుత్వం భావించింది. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అత్యుత్తమ కార్పొరేట్‌స్థాయి వసతులతో సమీకృత గురుకుల భవనాలు నిర్మించాలన్న చారిత్రక నిర్ణయాన్ని తీసుకుంది” అని ఆయన తెలిపారు.

అప్పులుచేశారు.. సౌకర్యాలు కల్పించలేదు: కోమటిరెడ్డి

గత ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల అప్పులు చేసింది కానీ పేదలు చదువుకునే విద్యాలయాలకు మౌలిక సదుపాయాలు కల్పించలేదని మంత్రి కోమటిరెడ్డి ధ్వజమెత్తారు. “సమీకృత గురుకులాల నిర్మాణం.. దసరా సందర్భంగా ప్రజలకు ప్రభుత్వమిస్తున్న కానుక. దీన్ని ప్రజలు, ప్రతిపక్షాలు స్వాగతించాలి. ఎల్బీనగర్‌లోని ఒక గురుకులంలో 20 గదుల్లో 700 మంది విద్యార్థులున్నారని అక్కడి సిబ్బంది తెలిపారు. సోమవారం ఆ పాఠశాలను సందర్శిస్తా. అవసరమైతే మరో భవనం తీసుకుని విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తాం. మూసీ మురికికూపం నుంచి కోటిమందిని బయటపడేయాలని ప్రభుత్వం భావిస్తే, ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి” అని విమర్శించారు.

పదేళ్లుగా విద్యావ్యవస్థను పట్టించుకోలేదు: పొన్నం

సమీకృత గురుకులాల నిర్మాణం విప్లవాత్మకమైన నిర్ణయమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. “అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట 22వేల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.1,100 కోట్లు ఖర్చుచేశాం. పదేళ్లుగా విద్యావ్యవస్థను పట్టించుకోలేదు. మా ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ వేసి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసింది. గురుకులాల్లో పోస్టింగులు ఇచ్చింది. గత ప్రభుత్వం నాలుగేళ్లుగా అద్దె భవనాలకు అద్దెలు చెల్లించలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వివరాలు తెప్పించుకుని అద్దె సమస్యలు పరిష్కరించి, ఆయా భవనాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకున్నాం” అని మంత్రి పొన్నం తెలిపారు. ఈ ప్రభుత్వం తీసుకునే చర్యలతో గురుకుల విద్యావ్యవస్థ మరింత ఉన్నతస్థాయికి వెళ్లనుందని సీఎస్ శాంతికుమారి అన్నారు. సమీకృత గురుకుల నమూనా చూస్తుంటే అమెరికాలో ఎంబీఏ చదువుకున్న రోజులు గుర్తుకు వస్తున్నాయన్నారు.

2,560 మంది విద్యార్థులు.. 120 మంది టీచర్లు

(మొదటి పేజీ తరువాయి)

అన్ని తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఉంటాయి. 900 మంది ఒకేసారి కూర్చుని భోజనం చేసేలా డైనింగ్ హాలు నిర్మించనున్నారు. సమీకృత గురుకులాల నమూనా ఆవిష్కరణ సందర్భంగా ఆర్కిటెక్ నిపుణులు గురుకులాల్లో కల్పించే సౌకర్యాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కొడంగల్‌లో నిర్మించే సమీకృత భవనం వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం అక్కడున్న గురుకుల భవనాన్ని ఉపయోగించుకుంటూనే.. అదనపు భవనాలు, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురానున్నారు. సమీకృత గురుకుల భవనాలు నిర్మించే ప్రాంతాల్లో 25 ఏళ్ల క్రితం నుంచి అక్కడి ఉష్ణోగ్రతలు, వర్షపాతం, చలి, వేడిగాలుల తీవ్రత తదితర వాతావరణ అంశాల్ని ఆర్కిటెక్ సంస్థ పరిగణనలోకి తీసుకుంది. వాతావరణ అనుకూల భవనాలను డిజైన్ చేసింది. ప్రతి డార్మిటరీ గదిలో పది బెడ్‌లు, రెండు బాత్‌రూములు ఉండేలా ప్రణాళిక చేసింది.

తొలి విడత పైలట్ ప్రాజెక్టులో భవనాలు నిర్మించే ప్రాంతాలు..

కొడంగల్, హుస్నాబాద్, హుజూర్‌నగర్, ములుగు, ఖమ్మం, కొల్లాపూర్, చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, అచ్చంపేట, తిరుమలగిరి, మధిర, నల్గొండ, మంథని, పాలేరు, వరంగల్, అందోలు, భూపాలపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, తుంగతుర్తి.



సమీకృత గురుకుల భవనం నమూనా

గురుకులాల్లో కల్పించే సదుపాయాల్లో కొన్ని..

- ◆ విద్యార్థులు, ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి రెసిడెన్షియల్ క్యాంపస్
- ◆ ఇన్నోవేటివ్ బోధన విధానం
- ◆ సహజసిద్ధంగా వెలుతురు వచ్చేలా భవనాలు
- ◆ తక్కువ ఖర్చుతో కూడిన మెయింటెనెన్స్ ఉండేలా నిర్మాణాల్లో సహజసిద్ధ మెటీరియల్ వినియోగం
- ◆ గ్రీన్ క్యాంపస్, సోలార్, విండ్ ఎనర్జీ సదుపాయాలు
- ◆ దివ్యాంగులకు అనుకూలమైన సౌకర్యాలు
- ◆ వర్షపు నీటి సంరక్షణ
- ◆ సాంస్కృతిక, విద్యా కార్యక్రమాల కోసం ప్రత్యేక ఆడిటోరియం

క్యాంపస్‌లో ఉండే సౌకర్యాలివీ...

తరగతి గదులు, ల్యాబొరేటరీలు, కంప్యూటర్ సెంటర్, లైబ్రరీ, ఆడిటోరియం, వసతిగృహాలు, డైనింగ్, కిచెన్, బహుళ వినియోగ హాళ్లు, సిబ్బందికి నివాసగృహాలు, క్లబ్‌లు; వైద్యశాల, ఇండోర్ స్పోర్ట్స్, క్రికెట్, ఫుట్‌బాల్ మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్ కోర్టులు, ఔట్‌డోర్ జిమ్, థియేటర్, ల్యాండ్‌స్కేప్ కోర్టులు.

మూసీ అభివృద్ధి ఆగదు

> ఇరవయ్యేళ్లుగా పేదోళ్ల మధ్య.. ప్రజా జీవితంలోనే ఉన్నా. ఇల్లు కూలితే ఎంత బాధ ఉంటుందో నాకు తెలియదా? మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలు ఆ దుర్గంధంలోనే బతకాలా? వారికి మంచి భవిష్యత్ ఉండొద్దా? రూ.లక్ష కోట్లు కాళేశ్వరం మీద కుమ్మరించారు కదా.. రూ.10 వేల కోట్లు మూసీ నిర్వాసితులకు ఇవ్వడానికి సహకరించరా? వాళ్లకు మంచి కాలనీ ఏర్పాటు చేసి.. పాఠశాల, జూనియర్, ఇంజినీరింగ్ కాలేజీలు కట్టిద్దాం. ప్రతి దానికీ అడ్డుపడటం కాదు.. నిర్వాసితులను ఎలా ఆదుకుందామో సలహాలివ్వండి
>
> - విపక్ష నేతలనుద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

మీ (ఇంజినీర్ల) చేతుల మీదుగా అద్భుతమైన నిర్మాణాలు జరగబోతున్నాయని సీఎం అన్నారు. వివిధశాఖల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, వ్యవసాయాధికారులు, వ్యాయామోపాధ్యాయులు, లైబ్రేరియన్లు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల ఉద్యోగాలకు ఎంపికైన మొత్తం 1,635 మందికి ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు నియామకపత్రాలు అందించారు. ఈ సందర్భంగా కొత్త ఉద్యోగులనుద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. ‘కృష్ణా, గోదావరి, గంగ, యమున, సరస్వతి, కావేరి.. ఇలా నదుల పేర్లు తమ పిల్లలకు పెట్టుకునే తల్లిదండ్రులు.. మూసీ పేరు ఎందుకు పెట్టడం లేదు? ఎందుకంటే అది విషతుల్యం, మురికిమయం అయిపోయింది. అందుకే దాని ప్రక్షాళన చేపట్టాం. మూసీ పేరును కూడా పిల్లలకు పెట్టుకునేలా దాన్ని అభివృద్ధి చేసుకుందాం. మూసీ వద్దకు ఇలా వచ్చి అలా వెళ్లడం కాదు. కేటీఆర్, హరీశ్, ఈటల రాజేందర్‌లు వారం రోజుల పాటు మూసీ పరీవాహక నివాసాల్లో ఉండండి. అప్పుడు ప్రజల కష్టాలు, బాధలు తెలుస్తాయి’ సీఎం అన్నారు.

ఎవరిని ఆదర్శంగా తీసుకోవాలో ఆలోచించండి

‘భాక్రానంగల్, నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్ వంటి ప్రాజెక్టులు ఎన్ని విపత్తులొచ్చినా చెక్కుచెదరలేదు. హైదరాబాద్‌లో హైకోర్టు, అసెంబ్లీ, చార్మినార్.. ఇలా ఎన్నో అద్భుత చారిత్రక కట్టడాలున్నాయి. వందల ఏళ్లయినా ఠీవిగా నిలిచిన అలాంటి కట్టడాలు నిర్మించిన ఇంజినీర్లను ఆదర్శంగా తీసుకుంటారా? పదేళ్లలోనే కుప్పకూలిన కాళేశ్వరం కట్టిన వారిని అనుసరిస్తారా? వందేళ్ల అనుభవం ఒకవైపు.. పదేళ్ల దుర్మార్గం మరోవైపు. ఆలోచించుకోండి. హైదరాబాద్ దాహార్తిని తీర్చి, వరదలను నియంత్రించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి ఇంజినీర్లను మీరు ఆదర్శంగా తీసుకోవాలి. గత పదేళ్లలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రోడ్లు, అమరుల స్తూపం, సచివాలయం.. ఇలా అన్నింట్లోనూ నాణ్యత లోపమే. ఒక చిన్న గుడిసె వేసుకున్నా.. ఒక అంచనాతో ముందుకెళ్తాం. రూ.1.50 లక్షల కోట్లకు పెంచిన కాళేశ్వరం ప్రాజెక్టులో ఇంకా పనులు మిగిలే ఉన్నాయి. మల్లన్నసాగర్ నిర్మించిన చోట భూకంపాలు వచ్చే ప్రమాదం ఉందని సాంకేతిక నిపుణులు ముందే నివేదిక ఇచ్చారు. గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టులో ఏ రోజూ 15 టీఎంసీల కంటే ఎక్కువ నీళ్లు నింపలేదు. మీరు (భారాస ప్రభుత్వం) ఎలా కట్టారు? ఎక్కడ కట్టారు? అనే దానిపై విచారణకు సాంకేతిక నిపుణులను నియమిద్దాం. దాని వెనకాల ఉన్న మర్మమేంటో బయటపెడదాం’ అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

పదవీ విరమణ వరకూ అదే ‘గరం’తో ఉండండి..

‘రాజకీయాలు, ప్రభుత్వోద్యోగాల్లో మూడు దశలుంటాయని ఒక పెద్దాయన చెప్పారు. చేరినప్పుడు గరం (ఆవేశం)గా ఉంటారట.. కొంతకాలానికి నరం (మెత్తగా) అవుతారట. చివరకొచ్చేసరికి బేశరమ్ (సిగ్గు లేకుండా) అవుతారట. ఉద్యోగంలో చేరినప్పుడు ఎంత గరంగా ఉన్నారో.. పదవీ విరమణ చేసేవరకు అలాగే ఉండండి. ఈ నానుడి నాకు, మీకు వర్తించకుండా చూసుకుందాం. కేసీఆర్‌కు కొంత కాలం తెలంగాణ ఉద్యమమనే ముసుగు, రక్షణ కవచం ఉన్నాయి. ఆ గొప్పతనం ఆయనది కాదు.. తెలంగాణ ఉద్యమానిది. ఇవాళ ముసుగు తొలగిపోయింది. ఆయన ముఖం చెల్లక ఎక్కడో ఉన్నారు’ అని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

ప్రభుత్వానికి పేరు తెచ్చేలా పనిచేయాలి: మంత్రులు కోమటిరెడ్డి, సీతక్క

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ‘మీదైన శైలిలో మనసుపెట్టి, ప్రజల గుండెల్లో గుర్తుండిపోయేలా పనిచేయాలి’ అని కొత్త ఉద్యోగులను కోరారు. మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ‘మీరు చేపట్టే నిర్మాణాలు నాణ్యంగా ఉండేలా పనిచేయాలి. వందేళ్లయినా చెక్కు చెదరకుండా ఉండేలా నిర్మాణాల్లో భాగస్వాములు కావాలి’ అని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి మాట్లాడుతూ.. ‘అందరికీ హృదయపూర్వక అభినందనలు. మీరందరూ బాగా పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి’ అన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, కె.కేశవరావు, వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చేరిన చంపయీ సోరెన్

రాంచీ: ఝార్ఖండ్ మాజీ సీఎం, భాజపా నేత చంపయీ సోరెన్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. మధుమేహ సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయన శనివారం రాత్రి జంషెడ్‌పుర్‌లోని టాటా మెయిన్ ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం సోరెన్ ఆరోగ్యం మెరుగుపడుతోందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. “నా ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. త్వరలోనే పూర్తిగా కోలుకుని వస్తాను” అని ‘ఎక్స్’లో చంపయీ సోరెన్ పేర్కొన్నారు.

గ్రహం అనుగ్రహం

7–10–2024 సోమవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం
చవితి: ఉ. 6-58 తదుపరి పంచమి
అనూరాధ: రా. 11-36 తదుపరి జ్యేష్ఠ
వర్జ్యం: తె. 5-29 నుంచి
అమృత ఘడియలు: మ. 12-29 నుంచి 2-12 వరకు
దుర్ముహూర్తం: మ. 12-12 నుంచి 12-59 వరకు తిరిగి 2-33 నుంచి 3-21 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ. 5.54; సూర్యాస్తమయం: సా.5.43

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	36.7	25.2
నిజామాబాద్	35.6	24.4
ఆదిలాబాద్	35.3	24.2
ఖమ్మం	35.0	25.6
రామగుండం	33.6	25.4
హనుమకొండ	33.0	23.5
కరీంనగర్	33.0	22.0
మెదక్	32.6	21.0
హైదరాబాద్	32.3	23.5
నల్గొండ	30.5	23.6
సూర్యాపేట	30.0	25.0
మహబూబ్‌నగర్	30.0	23.7

ఇదీ సంగతి!




ఏం లేదు.. ‘విచారించి’ వదిలేస్తాం.. అంతే!

పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఓ వ్యక్తి నుంచి దిల్లీ పోలీసులు ఆదివారం రూ.10 కోట్ల విలువ చేసే కొకైన్‌ను పట్టుకున్నారు.

9న ఉపాధ్యాయ నియామక పత్రాల అందజేత

• ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

ఈనాడు, హైదరాబాద్: కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈ నెల 9న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో ఆదివారం సాయంత్రం సీఎస్ శాంతికుమారి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. "దాదాపు పది వేల మందికి పైగా ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈ నియామక పత్రాలను జారీ చేస్తున్నాం. ఎంపికైన వారి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను సంబంధిత జిల్లా కలెక్టర్లు పూర్తిచేశారు. సోమవారం సాయంత్రంలోగా తుది జాబితాను పాఠశాల విద్యా కమిషనర్ సంబంధిత జిల్లా కలెక్టర్లకు అందజేస్తారు. ఈ నెల 9 మధ్యాహ్నం 2 గంటల లోపే ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులందరూ ఎల్బీ స్టేడియానికి చేరేలా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలి. ప్రతి బస్సులో ఒక పోలీస్ కానిస్టేబుల్, సమన్వయ అధికారిని నియమించాలి. జిల్లా నుంచి వచ్చే బస్సులకు సమీపంలోనే పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటుచేయాలి. అభ్యర్థులను స్టేడియం సమీపంలో దించే విధంగా చర్యలు చేపట్టాలి. నగరంలో వర్షం వచ్చే అవకాశం ఉన్నందున రెయిన్ ప్రూఫ్ షామియానాను వేయాలి. ఈ ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేసే కార్యక్రమానికి అభ్యర్థులతో పాటు.. వారి కుటుంబ సభ్యులు కూడా వచ్చే అవకాశం ఉన్నందున తగు చర్యలు తీసుకోవాలి. స్టేడియంలో అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేయాలి" అని సీఎస్ సూచించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్, అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఈనాడు

జలాశయాలను పట్టించుకోరా?

బీడు భూములను సస్యశ్యామలం చేయడం, ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు విద్యుత్ వెలుగులతో దేశాభివృద్ధికి బాటలు పరచడమే లక్ష్యంగా దేశీయంగా అనేక ఆనకట్టలు నిర్మితమయ్యాయి. చీడపురుగులు చేరి పంటను పాడుచేసినట్లు- ఇసుక, మట్టి వంటివి భారీగా మేటవేసి ప్రధాన జలాశయాల నీటి నిల్వ సామర్థ్యాన్ని తెగ్గోసేస్తున్నాయి. ఫలితంగా ఆహార భద్రతకు, విద్యుదుత్పత్తికి, డ్యాముల మనుగడకు సవాళ్లు ఎదురవుతున్నాయి. పర్యావరణ, ఆర్థిక సమస్యలూ ముమ్మరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఆరువేల వరకు ఆనకట్టలు ఉన్నాయి. అవన్నీ కలిసి సుమారు 25 వేల కోట్ల ఘనపు మీటర్ల నీటిని నిల్వ చేయగలవు. పేరుకుపోతున్న పూడికతో దేశీయ జలాశయాల సగటు నిల్వ సామర్థ్యం తీవ్రంగా దెబ్బతింటున్నట్లు గత పరిశీలనలు చాటుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర జలసంఘం తాజా నివేదిక మరిన్ని దిగ్భ్రాంతికర విషయాలను వెల్లడించింది. వ్యర్థాల వెల్లువ మూలంగా తెలుగు రాష్ట్రాలకు ప్రాణసమానమైన శ్రీశైలం జలాశయం 102టీఎంసీల మేర నిల్వశక్తిని కోల్పోయింది. నాగార్జునసాగర్ (23శాతం), శ్రీరామసాగర్ (28శాతం), నిజాంసాగర్ (60శాతం) తదితరాల సామర్థ్యమూ భారీగా తరుగుపడటం ఆందోళన రేకెత్తిస్తోంది!

ఇండియాలో 2050 నాటికి పూడిక సమస్య తీవ్రతరమై 3,700 ఆనకట్టలు 26శాతం మేర నిల్వ శక్తిని నష్టపోతాయని ఐరాస అధ్యయనం నిరుడు అంచనా వేసింది. పొరుగున ఉన్న జనచైనాతో పోలిస్తే, ఇండియాకే ఈ ప్రమాదం ఎక్కువగా పొంచి ఉంది. విచ్చలవిడి పట్టణీకరణ, వ్యవసాయ విస్తరణ, అడవుల నరికివేత, పర్యావరణ మార్పులు వంటి వాటివల్ల నదుల్లోకి వ్యర్థాలు చేరి, అంతిమంగా అవి జలాశయాల్లో తిష్ఠవేస్తున్నాయి. దాంతో దిగువన ఉండే ప్రాజెక్టులు వరద ఇక్కట్లతో సతమతమవుతున్నాయి. జలాశయాల్లో పూడిక తొలగించి ఒక టీఎంసీ సామర్థ్యాన్ని పునరుద్ధరించాలంటే దాదాపు రూ.162 కోట్లు అవసరమవుతాయన్నది అధికారిక అంచనా. అంత సొమ్మును వెచ్చించడానికి అనేక రాష్ట్రాలు ముందుకు రావడం లేదు. ఒకవేళ పూడికతీత ప్రారంభించినా, తొలగించిన వ్యర్థాలను ఎక్కడ వేయాలన్నది మరో ప్రధాన ప్రశ్న. ఇలాంటి పరిస్థితుల్లో నదులు, రిజర్వాయర్లలో అవక్షేపాల బెడదపై కేంద్రం 2022లో ఒక విధానపత్రం తెచ్చింది. దానిపై రాష్ట్రాల అభిప్రాయాలు కోరింది. జలాశయాల పూడిక సమస్యపై కేంద్రం, రాష్ట్రాలు నిశితంగా చర్చించి సరైన కార్యాచరణ ప్రణాళికను సత్వరం సిద్ధం చేయాలి!

వాతావరణ మార్పుల మూలంగా రాబోయే రోజుల్లో వర్షపాతంలో తీవ్ర హెచ్చుతగ్గులు నెలకొంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి ప్రతి వాననీటి బొట్టునూ ఒడిసిపట్టి జాగ్రత్తగా వినియోగించుకోవడం తప్పనిసరి. అందుకోసం జలాశయాల్లో పూడికను కాలానుగుణంగా తొలగిస్తూ వాటిని కాపాడుకోవాలి. పంటపొలాలకు నీరందించే ప్రధాన, ఉప, పిల్లకాల్వలకూ ఏటా మరమ్మతులు చేపట్టడమూ అత్యంత కీలకమే. ఏపీలో జగన్ ఏలుబడిలో కాల్వల బాగుసేత అటకెక్కడంతో అన్నదాతలెందరికో తీరని వేదన తప్పలేదు. తెలంగాణలోనూ చాలా చోట్ల చెట్లు, ముళ్లకంపలు పెరిగి పంట కాల్వలు అధ్వానంగా మారాయి. మితిమీరిన మానవ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు నదీ పరీవాహక ప్రాంతాల్లో పెద్దయెత్తున చెట్లను పెంచితే జలాశయాలకు అవక్షేపాల తాకిడి కొంతవరకు తగ్గుతుంది. చైనా, జపాన్ వంటివి తక్కువ వ్యయంతో మంచి ఫలితాన్నిచ్చే పూడికతీత పద్ధతుల వైపు మొగ్గుతున్నాయి. అలాంటి మేలిమి విధానాలను అధ్యయనం చేసి ఆచరణలోకి తెచ్చేందుకు మన ప్రభుత్వాలూ కంకణబద్ధం కావాల్సిన కీలక తరుణమిది!



మీరు బలవంతులని చెప్పి బలహీనులను హింసించకండి. తొందరపాటుతనంతో మరొకరి రక్తాన్ని కళ్లజూడకండి. అలా చేస్తే ఇంకో కత్తి ఏదైనా వచ్చి మీ మెడపైనే పడుతుంది. సాటివారిని ప్రేమించేవారే పరమాత్మను దర్శించగలరు.

– గురు గోవింద్ సింగ్

అమూల్య సలహాలు

అంతర్యామి

రామరావణ సంగ్రామం జరుగుతోంది. ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్ర బంధనంతో లక్ష్మణుడితో సహా పలువురు వానరులను పడగొట్టాడు. అప్పుడు జాంబవంతుడు హనుమంతుణ్ని ఓషధీ పర్వతం నుంచి మృతసంజీవని, విశల్యకరణి, సావర్ణ్యకరణి, సంధానకరణి అనే నాలుగు ఓషధులు తెమ్మని చెబుతాడు. హనుమ తెచ్చిన వాటి పరిమళానికి బ్రహ్మాస్త్ర బంధనానికి పడిపోయిన వారందరూ లేచారు. ఆ విధంగా ఆపదసమయంలో జాంబవంతుడి సలహా యుద్ధవీరులను కాపాడింది. రావణుడితో యుద్ధం ప్రారంభమయ్యాక అగస్త్య మహర్షి ఉపదేశించిన ఆదిత్య హృదయం రాముడికి ఉత్సాహాన్నిస్తుంది. కష్టకాలంలో ఆత్మీయుల సలహాలు మనిషికి ఉపశమనాన్నిస్తాయి.



ఒక సందర్భంలో ధృతరాష్ట్రుడు విచారంతో కుమిలిపోతూ మహా బుద్ధిమంతుడైన విదురుణ్ని పిలిపిస్తాడు. మంగళదాయకమైన మాటలు చెప్పమంటాడు. ఆ సమయంలో విదురుడు ధృతరాష్ట్రుడికి చేసిన ఉపదేశం విదురనీతిగా ప్రసిద్ధికెక్కింది. దాన్ని శ్రద్ధగా విన్న ధృతరాష్ట్రుడు విదురుడు చెప్పినట్లే చేయాలని ఉన్నా, పుత్రవాత్సల్యం వల్ల తన బుద్ధి మారిపోతోందని వాపోతాడు. ప్రారబ్ధాన్ని దాటే శక్తి ఏ ప్రాణికీ లేదని నిరూపిస్తూ ధృతరాష్ట్రుడు కురువంశ నాశనానికి హేతువయ్యాడు. మరోవైపు సొంతవారిని చంపలేనని అస్త్ర సన్యాసం చేయబోయిన కిరీటికి కృష్ణపరమాత్మ గీతను బోధించాడు. ధర్మజ్ఞానాన్ని అందుకున్న అర్జునుడు సంశయరహితుడై యుద్ధంలో విజయం సాధించాడు.

పినతల్లి వల్ల అవమానం పొంది బాధపడుతున్న ధ్రువుణ్ని నారదుడు ఆశీర్వదిస్తాడు. 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే మంత్రాన్ని ఉపదేశించి మధువనానికి వెళ్లమని సలహా ఇస్తాడు. ధ్రువుడు అక్కడికి చేరుకుని శ్రీహరి రూపాన్ని తన మనసులో నిలుపుకొని తీవ్రమైన తపస్సు చేశాడు. శ్రీహరి ప్రత్యక్షమై ధ్రువుడికి వరాన్ని అనుగ్రహించాడు. మూడు లోకాలు నశించేటప్పుడు కూడా నశింపక ప్రకాశించే ధ్రువ నక్షత్రం ఏర్పడటానికి కారకుడు- ధ్రువుడికి మార్గదర్శకం చేసిన నారదుడే!

ఇంద్రాది దేవతలు అనేక సందర్భాలలో త్రిమూర్తులను స్తుతించి వారి సహాయం పొందేవారని మన పురాణాలు చెబుతున్నాయి. కలియుగంలో మానవులు లోభమోహాల్లో చిక్కుకుని బాధలు పడతారని వ్యాసమహర్షి గ్రహించాడు. మానవుల దుఃఖాలకు పరిష్కారాలతో అష్టాదశ పురాణాలను అనుగ్రహించాడు.

మనసు వ్యాకులతకు గురైనప్పుడు అనుభవ సంపన్నులైన కుటుంబ పెద్దలను, ఆయా రంగాల్లో నిష్ణాతులను సంప్రదించాలి. ఆపద వేళ అందరూ సలహాలిస్తారు. ఎవరి సలహాలు పరిగణనలోకి తీసుకోవాలో తెలుసుకున్నవారే వివేకవంతులు. మన శ్రేయోభిలాషులుగా నటించే శకునులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రశాంతంగా కళ్లు మూసుకుని ఇష్టదైవ నామస్మరణ చేసుకుంటున్నప్పుడు మన మనసే కొన్ని సమస్యలకు పరిష్కారాన్ని సూచిస్తుంది.

– ఇంద్రగంటి నరసింహమూర్తి

సంక్షుభిత లంకకు స్నేహహస్తం

శ్రీలంక కొత్త అధ్యక్షుడిగా అనూర కుమార దిసనాయకే బాధ్యతలు చేపట్టిన తరుణంలో కొలంబో-దిల్లీ సంబంధాలు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తిగా మారింది. ఈ క్రమంలోనే భారత విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఈ నెల నాలుగో తేదీన శ్రీలంకలో పర్యటించారు. లంకతో సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై ఇండియా చూపిస్తున్న విశేష శ్రద్ధకు జైశంకర్ పర్యటన అద్దంపడుతోంది.



శ్రీలంక అధ్యక్షుడిగా అనూర కుమార దిసనాయకే పదవీ స్వీకారం చేసిన తరవాత ఆయనను కలుసుకున్న తొలి విదేశీ ప్రతినిధి- భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్. పొరుగు దేశాలకు ప్రాధాన్యం, 'సాగర్' (మన ప్రాంతంలో అన్ని దేశాలకూ భద్రత, ప్రగతి) విధానాల్లో భాగంగానే జైశంకర్ శ్రీలంకలో పర్యటించినట్లు విదేశీ వ్యవహారాలశాఖ వివరించింది. ఉభయ దేశాల మధ్య చారిత్రక సంబంధాలున్నాయి. శ్రీలంక అభివృద్ధికి ఇండియా ఆర్థిక సాయం అందిస్తోంది. లంక 2022లో 5,100 కోట్ల డాలర్ల విదేశీ రుణ బకాయిలను చెల్లించలేక ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఆ సమయంలో దానికి ఇండియా 400 కోట్ల డాలర్లు ఇచ్చి ఆదుకొంది. లంక రుణాల పునర్వ్యవస్థీకరణకు అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) సంస్థతో పాటు ఇతర విదేశీ రుణదాతలను ఒప్పించడంలోనూ దిల్లీ కీలక పాత్ర పోషించింది.

రాజకీయ అస్థిరత...

తన దక్షిణ సరిహద్దులోని లంకలో చైనా ప్రాబల్యం పెరగడం భారత్‌కు ఆందోళన కలిగిస్తోంది. ఇటీవలి కాలంలో శ్రీలంకలో రాజకీయంగా అస్థిర పరిస్థితులు నెలకొనడంపైనా దిల్లీ కలవరపడుతోంది. పాకిస్థాన్ నుంచి నిరంతర ముప్పును ఎదుర్కొంటున్న ఇండియాకు ఇతర పొరుగు దేశాల్లోనూ పరిస్థితులు సజావుగా లేకపోవడం అవాంఛనీయం. 2008లో నేపాల్‌లో రాజరికం అంతమైనప్పటి నుంచి చీటికిమాటికి ప్రభుత్వాలు మారిపోతున్నాయి. మయన్మార్‌లో 2021లో ఆంగ్ సాన్ సూకీ నాయకత్వంలోని ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూలదోసి సైనిక కూటమి అధికారం చేపట్టినప్పటి నుంచి అక్కడ అంతర్యుద్ధం జరుగుతోంది. ఇక మాల్దీవుల నాయకత్వం చైనా, భారత్‌ల మధ్య ఊగిసలాడుతోంది. ఇటీవల బంగ్లాదేశ్‌లో తన సన్నిహిత నేస్తం షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోవడమూ భారత్‌కు దుర్వార్తే. ఇదంతా ఒక ఎత్తయితే, చైనా మన ఇరుగు పొరుగు దేశాలన్నింటినీ తన గుప్పిట్లోకి తెచ్చుకోవడానికి ఆర్థికంగా, ఇతరత్రా విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో జైశంకర్ శ్రీలంక యాత్ర ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు. ఆయన శ్రీలంక కొత్త అధ్యక్షుడు అనూర కుమార దిసనాయకేతో సమావేశమై రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత పటిష్ఠపరచుకోవడం గురించి చర్చించారు. శ్రీలంక ఆర్థిక పునర్నిర్మాణానికి భారత్ సాయం చేస్తూనే ఉంటుందని హామీ ఇచ్చారు. ఇంకా మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, విపక్ష నేత సజిత్ ప్రేమదాసతోనూ జైశంకర్ భేటీ అయ్యారు.

కొత్త అధ్యక్షుడు దిసనాయకే సభ్యుడిగా ఉన్న పాలక నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) కూటమి తన ఎన్నికల ప్రణాళికలో కార్యనిర్వాహక అధ్యక్ష పదవిని రద్దుచేసి, కొత్త రాజ్యాంగాన్ని రచిస్తామని వాగ్దానం చేసింది. కార్యనిర్వాహక అధ్యక్ష పదవి రద్దయ్యాక, ప్రత్యేక అధికారాలు లేని దేశాధ్యక్షుణ్ని పార్లమెంటు నియమిస్తుందని స్పష్టం చేసింది. కొత్త పార్లమెంటుకు నవంబరు 14న ఎన్నికలు జరుపుతామని దిసనాయకే ప్రకటించారు. మార్క్సిస్టు భావజాలం కలిగిన దిసనాయకే పార్టీ జనతా విముక్తి పెరమున (జేవీపీ)- ప్రస్తుత పాలక సంకీర్ణంలో ప్రధాన భాగస్వామి. వామపక్ష భావజాలం కలిగిన మరికొన్ని పార్టీలు కూడా ఎన్‌పీపీలో భాగస్వాములుగా ఉన్నాయి.

రూటు మార్చిన జేవీపీ...

శ్రీలంకలో సోషలిస్టు ప్రభుత్వ ఏర్పాటుకు 1971లో, 1987-89లో సాయుధ తిరుగుబాట్లు చేపట్టింది జనతా విముక్తి పెరమున. భారత్‌లోని పెట్టుబడిదారీ విధానాన్ని జేవీపీ అప్పట్లో తెగనాడింది. లంకలో తమిళ వేర్పాటువాదులకు దిల్లీ అండగా ఉంటోందని ఆగ్రహం వ్యక్తంచేసింది. భారత శాంతిరక్షక సేన లంకలో అడుగుపెట్టడాన్ని ఆక్షేపించింది. 1987నాటి భారత్-శ్రీలంక ఒప్పందాన్ని జేవీపీ వ్యతిరేకించింది. అది భారత సామ్రాజ్యవాదానికి ప్రతీక అనీ, శ్రీలంక సార్వభౌమత్వంపై దాడి అనీ విమర్శలు గుప్పించింది. అయితే, తదుపరి దశాబ్దాల్లో ఇండియాతో సుస్థిర సంబంధాలను ఏర్పరచుకోవడం ముఖ్యమని జేవీపీ గ్రహించింది. లంక ప్రయోజనాలను నెరవేర్చుకునే విధంగా ఇండియాతో ఆర్థిక బంధం నెరపాలని ఆ పార్టీ అంగీకరించింది.

దిసనాయకే దారెటు?

లంక రాజకీయాల్లో దిసనాయకే కీలక శక్తిగా ఎదుగుతున్నారని అధ్యక్ష ఎన్నికలకు ముందే భారత్ గ్రహించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో దిల్లీ, అహ్మదాబాద్, తిరువనంతపురాల్లో అయిదు రోజుల పర్యటనకు రావాల్సిందిగా దిసనాయకే ఆధ్వర్యంలోని ఎన్‌పీపీ ప్రతినిధి వర్గాన్ని ఆహ్వానించింది. అప్పట్లో దిసనాయకే మన విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ సహా పలువురు నాయకులను కలుసుకున్నారు. కొలంబో భద్రతా మహాసభ నిమిత్తం ఆగస్టులో లంకకు వెళ్లిన దోభాల్ అక్కడ దిసనాయకేతో భేటీ అయ్యారు. సెప్టెంబరు 21న దిసనాయకే దేశాధ్యక్షుడయ్యారు. ఆయనకు అందరికన్నా ముందు అభినందనలు తెలిపిన ప్రపంచ నాయకుల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఒకరు. దానికి దిసనాయకే ధన్యవాదాలు తెలిపారు కూడా. 2022 నాటి ఆర్థిక సంక్షోభం నుంచి శ్రీలంక గట్టెక్కడానికి భారత్ సాయపడిందని గతంలోనే ఆయన కృతజ్ఞతలు చెప్పారు. అయితే దిసనాయకే అధ్యక్షుడైన తరవాత భారత్‌తో అనుసంధాన ప్రాజెక్టులను సమీక్షిస్తానని ప్రకటించడం కలవరం కలిగిస్తోంది. అదానీ విద్యుత్ ప్రాజెక్టులపైనా సమీక్ష జరుపుతానన్నారు. నవంబరు 14 పార్లమెంటు ఎన్నికల తర్వాత కొత్త పార్లమెంటులో తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. మరోవైపు శ్రీలంకలో చైనా పెట్టుబడులు, ప్రాజెక్టులు పెరుగుతాయా అన్నది కీలక ప్రశ్నగా మారింది.

– అరూణిమ్ భుయాన్, విదేశాంగ వ్యవహారాల నిపుణులు



మాట సాయం

కొన్నిసార్లు మనసంతా చిరాగ్గా ఉంటుంది. ఏదో కోల్పోయినట్టుగా.. జీవితం యాంత్రికంగా విసుగ్గా అనిపిస్తుంది. ఏం చేయాలో, ఏం చేయకూడదో అర్థంకాదు. అలాంటప్పుడు ఎవరైనా మనల్ని కాస్త ప్రేమగా, ఆప్యాయంగా పలకరిస్తే- ఎండాకాలంలో వాన కురిసినట్టు ఎంత ఆనందంగా ఉంటుందో చెప్పలేం! అప్పటివరకు ఆవరించిన నిస్తేజం మాయమై మనసంతా సంతోషంతో నిండిపోతుంది కదా.. సరిగ్గా ఇలాగే అచ్చం మనలాగే ఇబ్బంది పడుతున్నవాళ్లు మన చుట్టూ ఎందరో ఉంటారు. ఈ ఉరుకుల పరుగుల జీవితంలో కాస్త ఆగి, చుట్టుపక్కల పరికించి చూస్తే.. చిన్న పలకరింపు కోసం పరితపించేవాళ్లు ఎందరో కనిపిస్తారు. ఎదుటివాళ్లకు సాయపడటమంటే.. అది ఆర్థికంగానే కానవసరం లేదు, మాటసాయమూ ముఖ్యమైనదే. ప్రేమగా పలకరించినా, వాళ్లు చెప్పేదాన్ని ఓపిగ్గా విన్నా ఎంతో ఫలితం ఉంటుంది. అదే వాళ్లకు అద్భుత సాయం అవుతుంది.

పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని బాధపడుతున్న పిల్లాణ్ని ఊరడిస్తూ నాలుగు మంచి మాటలు చెప్పి చూడండి. మీ ఓదార్పు మాటలు ఆ విద్యార్థిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి అనుకున్నది సాధించేలా చేయొచ్చేమో. ఈ మధ్య మత్తు పదార్థాల దురలవాటుకు బానిసలై జీవితాలను బలిచేసుకుంటోంది యువత. దాంతో వారి చదువులు అర్థాంతరంగా ఆగిపోతున్నాయి. ఆరోగ్యాలు పాడవుతున్నాయి. కొందరు జైలు పాలవుతున్నారు. మీ చుట్టుపక్కల పిల్లల్లో ఇలాంటి లక్షణాలను గమనిస్తే.. వారిని కూర్చోబెట్టి మాట్లాడండి. ఈ వ్యసనం వల్ల జీవితాలు ఎంత అల్లకల్లోలమవుతాయో, వారి మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న అమ్మానాన్నలు నలుగురి ముందూ తలెత్తుకోలేక ఎంత బాధపడతారో వివరించండి. వాళ్లలో వెంటనే మార్పు రాకపోవచ్చు. మీ మాటల ప్రభావంతో కనీసం ఆలోచించడం మొదలుపెట్టినా ప్రయత్నం ఫలించినట్టేగా.

దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్నవాళ్లూ ఒంటరితనంతో సతమతమవుతున్న వృద్ధులూ ఎందరో కనిపిస్తారు. అలాంటివాళ్లను సహానుభూతితో పలకరించండి. ధైర్యాన్నిచ్చే మాటలు చెప్పండి. అవి వారి మీద సానుకూల ప్రభావం చూపిస్తాయి. 'నాకే ఎందుకిలా జరిగింది' అని బాధపడటం మానేసి, తగ్గిపోతుందనే ఆశతో జీవించడం మొదలుపెడతారు. నాలుగు ఓదార్పు మాటలతో రేపటి మీద ఆశను చిగురింపజేయొచ్చు. చాలీచాలని సంపాదనతో దిగువ మధ్యతరగతి కుటుంబాలు భారంగా జీవితాలను వెళ్లదీయడం చూస్తుంటాం. అలాంటివాళ్లకు స్వయం ఉపాధి మార్గాల గురించి అవగాహన కల్పించొచ్చు. మాట సాయం చేసి పార్ట్‌టైమ్ ఉద్యోగాలు ఇప్పించొచ్చు. చెప్పుకుంటూ పోతే చేయూతనివ్వగల సందర్భాలెన్నో! కావాల్సిందల్లా అలా ఇవ్వాలన్న ఆలోచనా, ఇవ్వగల మంచి మనసూ. వాళ్ల సంగతి మనకెందుకులే అని ఎవరికి వారు అనుకుంటే- మనిషి జీవితానికి అర్థమే ఉండదు కదా!

– నరుకుల లక్ష్మి

సవాళ్లను అధిగమిస్తేనే సం'పత్తి'

ప్రపంచవ్యాప్తంగా 75కి పైగా దేశాల్లో పత్తిని సాగుచేస్తున్నారు. దుస్తులు, ఆహారం రెండింటినీ అందించే ఏకైక పంట ఇది. పత్తి గింజల నుంచి వంట నూనె, పశువుల దాణా ఉత్పత్తి అవుతాయి. కాండం, ఆకులను ఇంధనంగా వాడుకోవచ్చు. ప్రపంచంలో వ్యవసాయ యోగ్యమైన భూమిలో కేవలం 2.1శాతం విస్తీర్ణంలోనే పత్తి పంట సాగవుతున్నా- 27శాతం వస్త్ర అవసరాలను అదే తీరుస్తోంది. పది కోట్లకు పైగా కుటుంబాలు పత్తి సాగులో నిమగ్నమయ్యాయి. లక్షల మంది పేద గ్రామీణ మహిళలతో పాటు చిన్న కమతాలు కలిగిన రైతులు, కూలీలకు పత్తి రంగమే ప్రధాన జీవనోపాధి. దేశంలో మొట్టమొదటి పత్తి మిల్లు కోల్‌కతా సమీపంలో పోర్ట్‌గ్లోస్టర్‌లో 1818లో ఏర్పాటైంది. ప్రపంచంలో 3.24 కోట్ల హెక్టార్లలో పత్తి సాగవుతుండగా 1.30 కోట్ల హెక్టార్లతో భారత్ మొదటి స్థానాన్ని ఆక్రమించింది.



నేడు ప్రపంచ పత్తి దినోత్సవం. పత్తి సంబంధిత ఉత్పత్తుల ప్రాధాన్యం, పేదరిక నిర్మూలనలో అది పోషిస్తున్న పాత్ర గురించి అవగాహన పెంచడానికి దీన్ని నిర్వహిస్తున్నారు. దేశీయంగా స్థిరమైన ఆర్థికవృద్ధికి తనవంతు తోడ్పాటునందిస్తున్న పత్తి రంగం నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది.

పడిపోతున్న సాగు విస్తీర్ణం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకప్పుడు పత్తి ప్రధాన వాణిజ్య పంట. అపరాలు, నూనె గింజలు, తృణధాన్యాలకు ప్రత్యామ్నాయంగా పత్తిని ఎంచుకోవడంతో తెలుగు రాష్ట్రాల్లో దీని సాగు విస్తీర్ణం 70లక్షల ఎకరాల రికార్డుస్థాయిని అందుకొంది. 80వ దశకంలో తెల్లదోమ ఉద్ధృతితో సాగు సందిగ్ధంలో పడింది. అయితే, 2000 నుంచి బీటీ పత్తి విత్తనాల రాకతో సాగు విస్తీర్ణం అనూహ్యంగా పుంజుకుంది. 2016 వరకు సాగు ఆశాజనకంగా ఉన్న పరిస్థితుల్లో గులాబీరంగు పురుగు దాడి మొదలై సాగుదారులు సంకట స్థితిని చవిచూస్తున్నారు. ఈ పురుగు బెడద అంతకంతకు పెరుగుతుండటంతో రైతులు సాగును పరిమితం చేసుకుంటూ వస్తున్నారు. దీనికి తోడు కాలానుగుణంగా ఎదురవుతున్న సమస్యలు, ప్రతికూలతలతో ఇటీవల పత్తి సేద్యం తెల్లబోతోంది. ఈ ఏడాది తెలంగాణలో ఏడు లక్షల ఎకరాలు, ఏపీలో అయిదు లక్షల ఎకరాల మేర సాగు విస్తీర్ణం తగ్గిపోవడం గమనార్హం. రెండేళ్లుగా పత్తి సాగుదారులతోపాటు అనుబంధ పరిశ్రమలు, వ్యాపారులు సైతం ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. రైతులకు గులాబీరంగు పురుగు, తక్కువ ధరలు, ప్రతికూల వాతావరణం శరాఘాతంగా పరిణమించాయి. చీడపీడల నివారణ, కూలీల సమస్యతో వారు విసుగు చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏటా పత్తి పంటకు మద్దతు ధర పెంచుతున్నప్పటికీ, పెట్టుబడులకు తగ్గట్లుగా ప్రతిఫలం దక్కడంలేదు. మార్కెట్ ఒడుదొడుకులు వ్యాపారులకు అశనిపాతాలవుతున్నాయి. దాంతో వారు మిల్లులను మూసేసుకోవాల్సిన అగత్యం దాపురించింది.

తెలుగు రాష్ట్రాల్లో పత్తి సాగు విస్తీర్ణం (లక్షల హెక్టార్లలో)...

సంవత్సరం	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ
2020	6.03	24.07
2021	5.22	18.67
2022	6.65	20.00
2023	3.98	17.80
2024	3.89	17.50

కొంతకాలంగా నూలు మిల్లులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. కొవిడ్-19, యుద్ధాలకు తోడు పలు దేశాల్లో ఆర్థిక మాంద్యం వంటి పరిస్థితులు నెలకొనడంతో వస్త్రాలకు అంతర్జాతీయంగా గిరాకీ క్షీణించింది. మన దేశంలోని మిల్లులు ఎక్కువగా దారం ఎగుమతులపై ఆధారపడ్డాయి. దేశీయంగా దారానికి డిమాండ్ లేకపోవడం, ఎగుమతుల్లేక మిల్లుల్లో నిల్వలు పేరుకుపోవడంతో అవి డీలా పడుతున్నాయి. దాంతో మిల్లుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. పత్తి రేట్లకు అనుగుణంగా దారం ధరల్లో పెరుగుదల లేకపోవడంతో మిల్లులు ఆర్థికంగా చితికిపోతున్నాయి. ప్రభుత్వాల నుంచి రావాల్సిన ప్రోత్సాహకాలు సకాలంలో విడుదల కావడంలేదు. కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తీసుకుంటున్న విధాన నిర్ణయాలు నూలు మిల్లులకు ప్రతిబంధకంగా మారుతున్నాయి. పెద్దసంఖ్యలో ఉపాధి కల్పించే పత్తి మిల్లుల మనుగడకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. మిల్లులకు విద్యుత్తు, కూలి రేట్లు పెరగడంతో దారం తయారీ వ్యయమూ ఎగబాకుతోంది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీపడలేని పరిస్థితి ఉత్పన్నమైంది. తెలుగు రాష్ట్రాల్లో దారం ఉత్పత్తికే పరిమితమైన పరిశ్రమను వస్త్రం, దుస్తుల తయారీ వరకు తీసుకెళ్లగలిగితే- లక్షల మందికి ఉపాధి లభించడంతోపాటు పరిశ్రమ కళకళలాడుతుంది.

లాభసాటిగా మారాలంటే...


పత్తి పంటకు గులాబీరంగు పురుగు అపారనష్టం కలుగజేసి సాగుదారులను కోలుకోకుండా దెబ్బతీస్తోంది. నివారణకు పలురకాల రసాయనాలు చల్లినా, నూతన విధానాలు పాటించినా పురుగు నియంత్రణ అసాధ్యమవుతోంది. ఇటీవల ప్రయోగాత్మకంగా సంయోగ వియోగం పరిజ్ఞానంతో గులాబీపురుగు సంతతిని కట్టడిచేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. దీన్ని అభివృద్ధిపరచి రైతుల దరిచేర్చాలి. అధికవర్షాలు, ఉష్ణోగ్రతల పెరుగుదలవల్ల రసాయన మందుల ఖర్చు తడిసిమోపెడవుతోంది. విదేశాల్లో పత్తిసాగులో యాంత్రీకరణను అనుసరిస్తున్నారు. దాంతో సాగు ఖర్చులు తక్కువగా ఉంటున్నాయి. పైగా అక్కడ దిగుబడులు ఎక్కువ. సేద్యం వారికి లాభసాటిగా ఉండటంతో అంతర్జాతీయ విపణిలో మనకంటే తక్కువ ధరకే పత్తిని విక్రయిస్తున్నారు. దాంతో భారత్ తీవ్ర పోటీని ఎదుర్కొంటోంది. దేశీయంగా అధికసాంద్రత విధానంలో సాగును ప్రోత్సహించడం, యంత్రాల ద్వారా పత్తి తీయడం, చీడపీడలను తట్టుకునే వంగడాలను అందుబాటులోకి తీసుకురావడం ముఖ్యం. ఇటువంటి చర్యలే దేశంలో పత్తిసాగును లాభసాటిగా మార్చగలవు.

– పెనికలపాటి రమేష్

నెమలి పొగరు

హాయ్! బుజ్జీ!!

అనగనగా ఓ అడవి. పురి విప్పి నాట్యం చేస్తోందో నెమలి. రంగురంగుల తన పింఛాన్ని చూసుకుని చాలా ఆనందించింది. ఇంతలో ఓ కాకి వచ్చి అక్కడ వాలింది. అది నెమలితో కబుర్లు చెప్పాలనుకుంది. కానీ నెమలి, కాకిని చులకనగా చూసింది. 'మసిబొగ్గులాంటి నల్లటి రంగులో ఉండే నీకు, నాతో మాటలేంటి? అసలు నా స్థాయి ఏంటి? నీ స్థాయి ఏంటి? నాకు దగ్గరగా వచ్చి వాలడమే నువ్వు చేసిన తప్పు. పైగా నాతో మాట కలపాలని చూస్తావా? ఎంగిలి మెతుకులు తిని బతికే నీకు, ఈ అడవిలో పనేంటి?' అంటూ కాకిని అవమానించింది నెమలి.




'నువ్వు అందంగా ఉన్నావు. ఎవరూ కాదనరు. కానీ నన్నెందుకు అన్నేసి మాటలంటున్నావు? ఎవరి గొప్పదనం వారిది' అంది కాకి. 'ఏంటో నీ గొప్పలు. అయినా అల్పజీవివైన నువ్వు నాకే ఎదురు మాట్లాడతావా? ఆగు మృగరాజుకు చెప్పి, నీ సంగతి తేలుస్తా'నని పక్కనే గుహలో ఉన్న సింహానికి కాకి గురించి ఫిర్యాదు చేసింది నెమలి.

మొత్తం విన్న తర్వాత సింహం.. 'నెమలీ..! నువ్వు చక్కగా నృత్యం చేస్తావు. నీకు రంగురంగుల ఈకలున్నాయి. అందమైన శరీరమూ ఉంది. కానీ.. మంచి మనసు లేదు. అనవసరంగా కాకిని అన్ని మాటలంటున్నావే! అసలు దాని గొప్పదనం నీకేం తెలుసు? దానిలా ఎగరగలవా? కాకుల్లో ఉన్న ఐకమత్యం మీలో ఉందా? అవి వ్యర్థాలను తిని పరిసరాల పరిశుభ్రతకు పాటు పడుతున్నాయి. ఆ పని నువ్వు చేయగలవా?' అని ప్రశ్నించింది. నెమలి తలదించుకుంది. 'అందుకే చెబుతున్నా.. రూపాన్ని చూసి ఎవరినీ కించపరచకూడదు అని. ఈ ప్రకృతిలో ప్రతి ప్రాణీ ముఖ్యమే. దేనికుండే విలువ దానికి ఉంటుంది' అంది మృగరాజు. తన తప్పు తెలుసుకున్న నెమలి, కాకికి క్షమాపణలు చెప్పింది. అప్పటి నుంచి అది ఎప్పుడూ ఏ జీవినీ తన మాటలతో హింసించలేదు. ★

బొమ్మల్లో ఏముందో?

కింద ఇచ్చిన బొమ్మల ఆధారంగా వాటి ఆంగ్ల పేర్లను ఖాళీ గడుల్లో నింపగలరా?



జవాబు: 1.DICE 2.CORN 3.ROSE 4.STAR 5.ANT


HUM HAIN GENERATION LARGE.
HUMAARA HAR CELEBRATION
LARGE.
SEAGRAM'S
ROYAL STAG
PACKAGED DRINKING WATER
IT'S OUR LIFE.
WE LIVE IT LARGE.
SCAN TO MAKE YOUR CELEBRATIONS LARGE WITH SURYA KUMAR YADAV ALSO, WIN EXCITING GOODIES.*
*T&Cs Apply. For T&Cs visit: www.royalstagfan.com


HONDA
happy navratri and dussehra
Scooter అంటే ACTIVA
With H-Smart Technology
Cashback of 5% up to ₹5000#
Low ROI @ 7.99%**
To enjoy the video, please Scan QR Code.
ACTIVA OVER 3.25 CRORE* HAPPY CUSTOMERS
For more information give a missed call on
7230032200
IDFC FIRST Bank
Bank**/Credit Card#
HDFC BANK
Credit Card#
TATA CAPITAL Two Wheeler Loans **
L&T Finance **
For dealer details scan the QR Code
BOOK ONLINE NOW!
www.honda2wheelersindia.com
CLICK BOOK RELAX
Honda 2Wheelers
#Cashback Offer available on all Honda two-wheeler models for EMI transactions made using HDFC Bank credit cards and IDFC FIRST Bank credit cards through Pine Labs machines only. #Customers can avail 5% Instant cashback, up to a maximum of Rs. 5000. #Valid on one transaction per card/order during the offer period. #Cashback offer valid until 30th November 2024. #The scheme is available in select outlets only. **Approval of the loan is at the sole discretion of the financiers, and additional documentation may be required. **The interest rates, down payment, and tenure options are based on the financier's assessment of the applicant's credit profile. **The offers/features may be modified or withdrawn at any time without prior intimation. Product shown in the picture may vary from actual product available in the market. Accessories shown in the picture are not part of standard equipment. *Source: Cumulative Sales figure of Brand Activa from June 2001 to June 2024 as per HMSI internal data. CBR [Click, Book, Relax] facility available at selected dealerships only.

బాధలు చూశారు... భరోసా కల్పించారు!

- రిమోట్‌తో పనిచేసే ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ తయారీ
- మేధో హక్కులు సాధించిన ఆరుగురు సహాయ ఆచార్యులు


రిమోట్‌తో పనిచేసే ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్

పాలమూరు, న్యూస్‌టుడే- ఈనాడు, హైదరాబాద్: ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్... కొవిడ్ విజృంభించిన సమయంలో ఎక్కువగా వినిపించిన పేరు. శ్వాసకోశ వ్యాధుల చికిత్సలో ఇది కీలక భూమిక పోషిస్తుంది. దీన్ని ఉపయోగించే సమయంలో రోగి వద్ద ప్రత్యేకంగా వైద్య సిబ్బందిలో ఎవరో ఒకరు ఉండాలి. వారు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ఆక్సిజన్ సరిగా అందక రోగి ప్రాణాలు పోయే ప్రమాదముంటుంది. కొవిడ్ సమయంలో సిబ్బంది కొరత కారణంగా ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను ఉపయోగించడంలో వైద్యులు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్నారు.
ఈ సమస్యను కళ్లారా చూసిన మన రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఐదుగురు గణిత, భౌతిక శాస్త్రాల ఆచార్యులు పరిష్కారం చూపడానికి నడుంబిగించారు. వీరికి ఒడిశాకు చెందిన మరో ప్రొఫెసర్ తోడయ్యారు. అంతా


కేంద్ర ప్రభుత్వం అందించిన ధ్రువపత్రంతో పరిశోధకులు డా.మధు, భారతి దంపతులు

కలిసి రిమోట్, చరవాణితో నడిచేలా 15 కిలోల ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను తయారు చేశారు. రోగికి అందించాల్సిన ఆక్సిజన్ పరిమాణం, ప్రవాహం, ఇవ్వాల్సిన గంటలు తదితర వివరాలను దీని ప్యానల్ బోర్డుపై ఒకసారి నమోదు చేస్తే నిర్దేశించిన సమయం వరకు పూర్తి కచ్చితత్వంతో పనిచేస్తుంది. పరికరం పనితీరును రోగికి 100 మీటర్ల దూరంలో ఉండి సెల్, రిమోట్‌లలో చూస్తూ పర్యవేక్షించవచ్చు. అంటే పక్కన మరొకరు ఉండాల్సిన అవసరంలేదు.

గణిత... భౌతిక శాస్త్రాల మేళవింపు

ఈ క్రతువులో... గణిత సహాయ ఆచార్యులు డా.శంకర్‌రావు(వోక్సెన్ వర్సిటీ, సదాశివపేట), డా.మధు(పాలమూరు వర్సిటీ, మహబూబ్‌నగర్), డా. కె.భారతి (పీజీ కేంద్రం, కొల్లాపూర్),


పరిశోధకులు డా.సత్తెమ్మ


డా.శంకర్‌రావు


డా.అరుంధతి

సత్తెమ్మ(పీజీ కేంద్రం, గద్వాల), డా.లిపిక (సీవీ రామన్ గ్లోబల్ విశ్వవిద్యాలయం, భువనేశ్వర్), భౌతికశాస్త్ర సహాయ ఆచార్యురాలు డా.అరుంధతి(నల్లమల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, హైదరాబాద్) పాలుపంచుకున్నారు. వీరిలో మధు, భారతి భార్యాభర్తలు. ఈ పరికరం తయారీకి 2023 జూన్ నుంచి కసరత్తు చేశారు. వీరంతా ప్రతి శనివారం సదాశివపేటలోని వోక్సెన్ విశ్వవిద్యాలయంలో వందలసార్లు ప్రయోగాలు చేశారు. అనేక పరిశోధనల అనంతరం ఈ ఏడాది ఏప్రిల్‌లో తుదిరూపం ఇచ్చారు. తర్వాత దిల్లీలోని మేధో సంపత్తి హక్కుల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా... వారికి పేటెంట్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా డా.మధు మాట్లాడుతూ... ''ఈ పరికరంతో ఆక్సిజన్ గాఢతను పెంచొచ్చు. ఇతర వాయువుల నుంచి ఆక్సిజన్ వేరు చేయొచ్చు. ఈ పద్ధతిని గణితశాస్త్రంలోని పైథాన్ ప్రోగ్రాం ద్వారా తయారు చేశాం'' అని తెలిపారు. డా.శంకర్‌రావు మాట్లాడుతూ... ''విపత్తు సమయంతో పాటు సాధారణ పరిస్థితుల్లోనూ రోగిని కాపాడుకోవడానికి సెన్సర్‌తో పనిచేసే ఈ పరికరాన్ని రూపొందించాం. చిప్‌తో పనిచేసే వ్యవస్థపైనా పరిశోధన కొనసాగిస్తున్నాం'' అన్నారు. డా.అరుంధతి మాట్లాడుతూ... ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ)కి సాఫ్ట్‌వేర్‌లకు భిన్నంగా మా రిమోట్‌కు ప్రత్యేక ప్రోగ్రామింగ్ రాశామన్నారు.


అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, అయిలి వెంకన్నగౌడ్, గణేశ్‌చారి తదితరులు

కాగితాలకే పరిమితమైన బీసీ కులగణన: జాజుల

రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నేటి నుంచి 'కౌంట్‌డౌన్'

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు బీసీ కులగణన జరిపి.. అందుకనుగుణంగా 42 శాతం రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించిన 'కామారెడ్డి డిక్లరేషన్' కాగితాలకే పరిమితమైందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. కులగణనపై జీవో 20 జారీ చేసి రూ.150 కోట్లు బడ్జెట్ కేటాయించి ఏడు నెలలు గడిచినా అమలు చేయకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంఘాల నేతలు బి.బాలరాజ్‌గౌడ్, అయిలి వెంకన్నగౌడ్, కె.గణేశ్‌చారి, జాజుల లింగంగౌడ్, భాస్కర్ మేరు తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ కమిషన్ ఏర్పాటు చేసి నెల రోజులు గడిచినా ఇప్పటి వరకు ప్రక్రియ ప్రారంభించలేదని విమర్శించారు. కులగణన ప్రక్రియను 90 రోజుల్లోపు పూర్తి చేస్తామని న్యాయస్థానానికి స్పష్టం చేసి కూడా నెల రోజులు పూర్తైందన్నారు. సోమవారం నుంచి సామాజిక మాధ్యమాల్లో 'కౌంట్‌డౌన్' పేరిట ప్రతి రోజూ గడువు గుర్తు చేస్తామన్నారు. కులగణనపై రాహుల్‌గాంధీ సానుకూల ప్రకటనలు చేస్తున్నప్పటికీ రాష్ట్రంలో పరిస్థితి విరుద్ధంగా ఉందని అన్నారు.

ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి



ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం(జీజేఎల్ఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ పి.మధుసూదన్‌రెడ్డి(సరూర్‌నగర్ కళాశాల) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జీజేఎల్ఏ తెలంగాణ రాష్ట్ర మూడో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బలరామ్ జాదవ్(నిర్మల్), సహాధ్యక్షుడిగా ఇ.శ్రీనివాసరెడ్డి(కమలాపూర్), కోశాధికారిగా ఎ.శివప్రసాద్(బాలానగర్) తదితర హోదాల్లో మొత్తం 18 మందిని ఎన్నుకున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న 10+2+3 విద్యా విధానాన్ని కొనసాగించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేస్తున్న ఉచిత విద్యకు ఏటా రూ.5 కోట్లు నిధులివ్వాలని, కొత్త కళాశాలల్లో అధ్యాపకులను నియమించాలని, ఇంటర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని తీర్మానించారు. ఈ సమావేశానికి హాజరైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు.

గృహజ్యోతి బిల్లు రూ.3,914 కోట్లు!

- ఆ మొత్తాన్ని డిస్కంలకు ఇవ్వనున్న ప్రభుత్వం
- ఈఆర్‌సీకి తెలిపిన విద్యుత్ పంపిణీ సంస్థలు
- 200 యూనిట్లలోపు వాడుతున్న గృహ కనెక్షన్లు 1.08 కోట్లుగా వెల్లడి
- ఇప్పటివరకూ 50 లక్షల ఇళ్లకే ఉచితం అమలు

రాష్ట్రంలో అన్ని కేటగిరీల్లో కలిపి గృహ విద్యుత్ కనెక్షన్లు:	1.25 కోట్లు
వీటిలో 200 యూనిట్లలోపు వాడేవి:	1.08 కోట్లు
దక్షిణ డిస్కం పరిధిలో గృహ కనెక్షన్లు:	83.09 లక్షలు
వీటిలో 200 యూనిట్లలోపు వాడేవి:	69.71 లక్షలు
ఉత్తర డిస్కంలో మొత్తం గృహ కనెక్షన్లు:	42.36 లక్షలు
ఇందులో 200 యూనిట్లలోపు వాడే ఇళ్లు:	39.15 లక్షలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో 200 యూనిట్లలోపు కరెంటు వాడే ఇళ్ల కనెక్షన్లు 1,08,86,519 ఉన్నాయని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు వెల్లడించాయి. ఈ ఇళ్ల నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో కరెంటు బిల్లుల రూపంలో రూ.3,914.36 కోట్ల ఆదాయం వస్తుందని పేర్కొన్నాయి. గృహజ్యోతి పథకం కింద ఈ ఇళ్లకు ఉచితంగా విద్యుత్ సరఫరాకు ఆదేశించినందున.. ఈ బిల్లుల సొమ్మును రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా డిస్కంలకు అందజేయనుందని తెలిపాయి. ఈమేరకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలికి నివేదిక ఇచ్చాయి. నెలకు 201కి పైగా యూనిట్ల కరెంటు వాడే ఇళ్ల నుంచి రూ.4,374 కోట్ల ఆదాయం వస్తుందని పేర్కొన్నాయి.

అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చు..

రాష్ట్రంలో 1.08 కోట్ల ఇళ్లలో నెలకు 200 యూనిట్లలోపు కరెంటు వాడుతున్నా.. ఇవన్నీ పూర్తిగా గృహజ్యోతి పరిధిలోకి రాలేదు. ఇప్పటివరకూ డిస్కంలకు దరఖాస్తులు ఇచ్చిన దాదాపు అరకోటి కుటుంబాలను గుర్తించి ఈ పథకం కింద నెలనెలా జీరో కరెంటు బిల్లులను డిస్కంలు జారీచేస్తున్నాయి. ఉత్తర డిస్కం పరిధిలో 39.15 లక్షల ఇళ్లలో 200 యూనిట్లలోపే వాడుతున్నా ఇప్పటివరకూ 23 లక్షల ఇళ్లకు గృహజ్యోతి వర్తింపజేశారు. మిగిలిన ఇళ్లలో కొందరికి రేషన్‌కార్డులు లేకపోవడం, కొన్ని కుటుంబాలకు 2 లేదా అంతకుమించి ఇళ్లలో ఒకే పేరుతో కరెంటు కనెక్షన్ ఉండటం వంటి కారణాలతో ఈ పథకాన్ని వర్తింపచేయలేదు. రేషన్‌కార్డు ఉన్న కుటుంబ యజమాని పేరుతో ఒకటికి మించిన ఇళ్లకు కరెంటు కనెక్షన్లు ఉంటే వాటిలో ఒకదానికి ఉచిత కరెంటు పథకం కింద జీరో బిల్లు ఇస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకూ ఈ పథకం వర్తించని వారు.. అర్హులైతే సమీపంలోని విద్యుత్ కార్యాలయంలో దరఖాస్తు ఇస్తే గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నట్లు డిస్కంల వర్గాలు తెలిపాయి.


ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో తెలంగాణ డీజీపీ జితేందర్. -న్యూస్‌టుడే, తిరుమల

దర్యాప్తును త్వరగా పూర్తిచేయాలి

ఎంపీ రఘునందన్‌రావు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ప్రసాదాల్లో కల్తీ నెయ్యి వ్యవహారంపై సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన సిట్ తన దర్యాప్తును త్వరగా పూర్తిచేసి భక్తుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించాలని తెలంగాణ ఎంపీ రఘునందన్‌రావు కోరారు. ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. లడ్డూ అంశం కోట్ల మంది హిందువుల మనోభావాలతో కూడిన అంశమైనందున దర్యాప్తును తొందరగా పూర్తి చేసి వారి మనోభావాలను గౌరవించాలని పేర్కొన్నారు.

వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

మొదటి విడత 14 నుంచి 19వ తేదీ వరకు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర వ్యవసాయ, పశువైద్య, ఉద్యాన విశ్వవిద్యాలయాల్లో బీఎస్సీ వ్యవసాయ, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, బీఎస్సీ ఉద్యాన కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 14 నుంచి 19 వరకు మొదటి విడత కౌన్సెలింగ్ జరగనుంది. టీజీఈఏపీసెట్-2024లో అర్హత పొంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి ర్యాంకులు ఏ రోజు షెడ్యూల్‌లో ఉన్నాయో తెలుసుకొని హాజరుకావాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి సూచించారు. ధ్రువపత్రాల పరిశీలన కౌన్సెలింగ్ రోజే జరుగుతుందన్నారు. ఇతర వివరాల కోసం తమ విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.pjtsau.edu.in ను సందర్శించాలని సూచించారు.

ఎంపీలు, మాజీ ఎంపీల అంత్యక్రియలు అధికార లాంఛనాలతో నిర్వహించాలి

ప్రధాని, లోక్‌సభ స్పీకర్‌లకు మాజీ ఎంపీ గొట్టె భూపతి లేఖ

ఈనాడు, హైదరాబాద్: దేశంలో మంత్రులు, మాజీ మంత్రుల మాదిరే లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు, మాజీ ఎంపీల అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని పెద్దపల్లి మాజీ ఎంపీ గొట్టె భూపతి ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాలకు లేఖ రాశారు. లోక్‌సభ ఎంపీలు ఏడేసి శాసనసభ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తారని, రాజ్యసభ ఎంపీలు పెద్దల సభ సభ్యులుగా గౌరవం పొందుతున్నారని, వారి అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని అన్నారు. దీనిని పీఎంవో, సభాపతి కార్యాలయం పార్లమెంటరీ వ్యవహారాల శాఖకు పంపించగా.. ఈ అంశం హోంశాఖ పరిధిలోనిదని, మీ లేఖను ఆ శాఖ సంయుక్త కార్యదర్శికి పంపించామని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి శరద్ ద్వివేది బదులు పంపించారని భూపతి తెలిపారు.

తితిదేపై అవాస్తవాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

ఈవో శ్యామలరావు, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల, న్యూస్‌టుడే: తితిదేపై అవాస్తవాలు ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని ఈవో శ్యామలరావు, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. తితిదే ప్రతిష్ఠను దిగజార్చే విధంగా సామాజిక మాధ్యమాల్లో వదంతులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మాధవ నిలయం అన్నప్రసాద కేంద్రంలో ఓ భక్తుడి భోజనంలో జెర్రి వచ్చిందంటూ సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాప్తి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు తిరుమల టూటౌన్ సీఐ శ్రీరాముడు తెలిపారు.



నచ్చినవాటి కోసం త్యాగాలు తప్పవు

మీరు ఇష్టపడి పెళ్లి చేసుకొనే వ్యక్తితోనూ అప్పుడప్పుడూ గొడవలు పడుతుంటారు. మీరు ఎంతో ముచ్చటపడి కొన్న ఇంటికి కూడా మరమ్మతులు అవసరమవుతుంటాయి. మీ కలల ఉద్యోగమూ కొన్నిసార్లు మీ ఒత్తిడికి కారణమవుతుంటుంది. అంతమాత్రాన వాటిని పూర్తిగా వదిలేయడం పరిష్కారం కాదు. మనకు నచ్చినవాటి కోసం కొన్ని త్యాగాలు చేయడానికి సిద్ధమైతేనే జీవితం సజావుగా సాగుతుంది.

– మార్క్ మాన్సన్, రచయిత

ఎంతమంది..? ఏమోనండీ..!

- ఎంతకూ తేలని విద్యార్థుల లెక్క
- ఇప్పటికీ ఆధార్ నమోదు కాని వారు 6.68 లక్షలు
- డ్రాప్‌బాక్స్‌లోని 6.50 లక్షల మంది ఎక్కడికెళ్లినట్లు?
- బోగస్ విద్యార్థులూ వేలల్లోనే...

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో 1 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఎంత?.దీనికి సరైన సమాధానం దొరక్క అధికారులు బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ విద్యార్థుల సంఖ్యపై సందిగ్ధత వీడటం లేదు. యూడైస్ ప్లస్‌లోని డ్రాప్‌బాక్స్‌లో ఇంకా 6.50 లక్షల మంది విద్యార్థుల పేర్లు ఉన్నాయి. వారందరూ చదువు మానేశారా? ఎక్కడైనా చేరారా? చేరితే ఎక్కడ? అన్న ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. లెక్క తేల్చాలని పాఠశాల విద్యాశాఖ కొద్ది రోజుల క్రితమే డీఈఓలను ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది.

ఎన్నేళ్లు గడిచినా ఇదే సందిగ్ధత...

కేంద్ర ప్రభుత్వం ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల సంఖ్య కోసం 2012-13లో యూడైస్ పోర్టల్ (ఏకీకృత జిల్లా పాఠశాల విద్యా సమాచారం) అమల్లోకి తీసుకురాగా... రెండేళ్ల నుంచి దాన్ని యూడైస్ ప్లస్




పేరిట ఇంటర్ వరకు పొడిగించారు. ఇప్పటివరకు 64 లక్షల మందిని పోర్టల్‌లో నమోదు చేశామని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఒక పాఠశాల నుంచి మరో బడికి మారినా, టీసీ తీసుకొని ఇంటర్‌లో చేరినా ఆ విద్యార్థుల పేర్లను యూడైస్‌లోని డ్రాప్‌బాక్స్‌లో వేస్తారు. వేరే చోట చేరినప్పుడు టీసీపై ఉన్న శాశ్వత విద్యాసంఖ్య (పెన్)ను నమోదు చేసి కొత్త పాఠశాల, లేదా కళాశాలలో నమోదు చేయాలి. అయితే ఈనెల 12 నాటికి 8.18 లక్షల మంది పేర్లు డ్రాప్‌బాక్స్‌లో ఉన్నాయి. తాజాగా వాటి సంఖ్య 6.50 లక్షలకు తగ్గిందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. 6,68,193 మంది విద్యార్థులు ఆధార్ సంఖ్య ఇవ్వలేదు. ఈ రెండు సమస్యలను ఈనెల 26వ తేదీ నాటికి పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ డీఈఓలకు ఆదేశాలు జారీ చేసినా లక్ష్యం మాత్రం పూర్తికాలేదు. ఆధార్ సంఖ్య లేకుంటే ఒకే విద్యార్థి పేరు రెండు చోట్ల ఉండడానికి అవకాశం ఉంది. ప్రస్తుతం ఆ సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. కొన్ని పాఠశాలల్లో నెలల తరబడి విద్యార్థులు హాజరుకాకున్నా వారి పేర్లు మాత్రం రిజిస్టర్లలో నమోదవుతున్నాయి. పిల్లల సంఖ్య తగ్గితే అక్కడ పనిచేసే తమను మరో చోటకు బదిలీ లేదా డిప్యుటేషన్‌పై పంపిస్తారని కొందరు ఉపాధ్యాయులే అలా చేస్తున్నారన్న విమర్శలున్నాయి. విద్యార్థులందరికీ ఆధార్ సంఖ్య ఇవ్వాలని మూడేళ్ల క్రితమే 850 కిట్లను విద్యాశాఖ సమకూర్చుకుంది. ఆ పని కోసం మండల స్థాయిలో క్లస్టర్ రీసోర్స్ పర్సన్లు (సీఆర్‌పీ), ఎంఐఎస్ సమన్వయకర్తలున్నా ఇప్పటికీ 6.68 లక్షల మంది వివరాలు ఎందుకు ఇవ్వలేకపోతున్నారన్నది ప్రశ్నార్థకంగా ఉంది..

జూనియర్ కళాశాలల వల్లేనంటున్న విద్యాశాఖ

డ్రాప్‌బాక్స్‌లో లక్షల మంది విద్యార్థుల పేర్లు ఉండటానికి కారణం జూనియర్ కళాశాలలు...ముఖ్యంగా ప్రైవేట్ కళాశాలలు స్పందించకపోవడమేనని సమగ్ర శిక్ష అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇంటర్‌లో చేరితే టీసీపై ఉన్న శాశ్వత విద్యా సంఖ్య (పెన్) సహాయంతో నమోదు చేస్తే డ్రాప్‌బాక్స్‌లో సంఖ్య తగ్గుతుందని, అది వారు చేయడం లేదని చెబుతున్నారు. అది చేయకుంటే ఒకవేళ విద్యార్థులు చదువు మానేసినా తెలియదు. ఇంటర్ వర్గాలు మాత్రం కొన్ని కళాశాలల్లో సిబ్బంది లేకపోవడం వల్లే అది సాధ్యం కావడం లేదని సమాధానమిస్తున్నాయి. ఆధార్‌పై స్పందిస్తే చాలా మందికి ఆధార్ సంఖ్య ఉన్నా అప్‌డేట్ చేయకపోవడం వల్ల నమోదు కావడం లేదని చెబుతున్నారు.

ఇజ్రాయెల్‌ది నీతిలేని యుద్ధం

బాలగోపాల్ సంస్మరణ సభలో ప్రొ. అచిన్ వనైక్



ప్రొఫెసర్ అచిన్ వనైక్

ఈనాడు, హైదరాబాద్: ఇజ్రాయెల్ తన ఉనికికి ప్రమాదమనే సాకుతో పాలస్తీనాలో మారణహోమం సృష్టిస్తోందని ప్రముఖ రచయిత, యూనివర్సిటీ ఆఫ్ డిల్లీ విశ్రాంత ప్రొఫెసర్ అచిన్ వనైక్ విమర్శించారు. ఇజ్రాయెల్ సాగిస్తున్నది నీతి లేని సమరమని.. మధ్యప్రాచ్య ప్రాంతం మొత్తాన్ని యుద్ధం అంచులకు తీసుకెళ్తోందని మండిపడ్డారు. ప్రముఖ హక్కుల నేత కె.బాలగోపాల్ 15వ సంస్మరణ సభను హైదరాబాద్ సుందరయ్య భవన్‌లో ఆదివారం మానవహక్కుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 'పాలస్తీనాలో ఇజ్రాయెలీల మారణహోమం' అంశంపై అచిన్‌వనైక్ మాట్లాడుతూ.. 'ఇజ్రాయెల్ మారణహోమం వల్ల గాజా జనాభాలో 8 శాతం మంది చనిపోయారు. భారతదేశం చారిత్రకంగా పాలస్తీనాకు మద్దతు తెలుపుతూ వచ్చేది. నేటి భాజపా పాలనలో ఆ న్యాయమైన విధానాన్ని వదిలేసి ఇజ్రాయెల్‌కు మద్దతు తెలపడం అన్యాయం' అని విమర్శించారు. ట్రాన్స్‌క్వీర్ హక్కుల కార్యకర్త తాషీ చోడుప్ ప్రసంగిస్తూ.. 'ప్రజా, సామాజిక, రాజకీయ ఉద్యమాల్లో ట్రాన్స్‌జెండర్, క్వీర్, భిన్న లైంగిక సమూహాల హక్కులను భాగం చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో తప్పనిసరి' అన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, తిరుపతయ్య, హరికృష్ణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మూడు పుస్తకాల ఆవిష్కరణ

బాలగోపాల్ ఆలోచనలతో ప్రచురించిన 'బీల కోసం.. బతుకు కోసం', 'రిజర్వేషన్ల వర్గీకరణ- ప్రజాస్వామిక దృక్పథం', 'సిటిజన్స్ రిపోర్ట్ ఆన్ సెక్యూరిటీ అండ్ ఇన్‌సెక్యూరిటీ ఇన్ బస్తర్ డివిజన్' అనే మూడు పుస్తకాలను వేదిక ప్రతినిధులు ఆవిష్కరించారు. ఉమర్‌ఖాలిద్‌తోపాటు తోటి రాజకీయ ఖైదీలపై సినీ దర్శకుడు లలిత్ వచాని రూపొందించిన 'ప్రిజనర్ నం.62710 ఈజ్ ప్రెజెంట్' అనే డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అడవుల్లో ఈ నెల 4న జరిగిన ఎన్‌కౌంటర్‌ను మానవహక్కుల వేదిక సదస్సు ఖండించింది.

ఐటీఐల్లో 860 ఖాళీ పోస్టులు!

- కొత్త కళాశాలలు మంజూరైతే.. 3 వేల వరకూ..
- భర్తీకి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ఉపాధికల్పన శాఖ

ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థల (ఐటీఐ) బలోపేతంపై దృష్టిపెట్టిన సర్కారు.. వాటిల్లో ఖాళీ పోస్టుల భర్తీకి సన్నద్ధమవుతోంది. ఐటీఐలను ఆధునిక శిక్షణ కేంద్రాలు (ఏటీసీ)గా మార్చనున్న నేపథ్యంలో.. అన్ని కేటగిరీల్లో ఖాళీ పోస్టులను ఉపాధి కల్పనశాఖ గుర్తిస్తోంది. మరోవైపు ఐటీఐ లేని నియోజకవర్గాల్లో కొత్తగా ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదనలు స్వీకరిస్తోంది. వీటికి ఈ ఏడాదే అనుమతులు ఇవ్వనుంది. దీంతో భర్తీ చేయాల్సిన పోస్టుల సంఖ్య భారీగా పెరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బోధన పోస్టుల ఖాళీల భర్తీకి.. అర్హతలు, నియామక విధానాలపై ఉపాధి కల్పనశాఖ కసరత్తు చేస్తోంది. ఆధునిక పారిశ్రామిక అవసరాలు, టెక్నాలజీలు, బోధన పద్ధతులు, కొత్త యంత్రాలకు అనుగుణంగా అర్హతలపై సమాలోచనలు చేస్తోంది.

65 ఐటీఐల్లో 1100 పోస్టుల ఖాళీలు

రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రస్తుతం 65 ఐటీఐలు ఉన్నాయి. వీటిలో దాదాపు రెండు దశాబ్దాలుగా బోధన సిబ్బందిని భర్తీ చేయడంలేదు. సహాయ టెక్నికల్ అధికారులు, టెక్నికల్ అధికారులు, ప్రిన్సిపాళ్లు పదవీ విరమణ చేస్తున్నా... ఆ స్థానాల్లో కొత్త నియామకాలు లేకపోవడంతో సిబ్బంది కొరత నెలకొంది. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నా, ఆ ట్రేడ్లు బోధించేందుకు పోస్టులు మంజూరు చేయలేదు. ఈ క్రమంలో ప్రవేశాల సంఖ్యపై ప్రభావం పడుతోంది. ఉపాధి కల్పనశాఖ గణాంకాల ప్రకారం ఐటీఐల్లో మంజూరైన పోస్టులు 2,033 కాగా.. 1100కు పైగా ఖాళీగా ఉన్నాయి. గతేడాది ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న 240 మంది సహాయ టెక్నికల్ అధికారుల క్రమబద్ధీకరణ మినహా కొత్త నియామకాలు రాలేదు. తాజా అంచనాల ప్రకారం తక్షణం భర్తీచేయాల్సిన ఉద్యోగాల సంఖ్య 860 ఉన్నట్లు వెల్లడైంది. ఇందులోనూ కీలకమైన ట్రేడ్‌లలో 200కు పైగా పోస్టులు ఖాళీగా ఉండటం గమనార్హం. నియోజకవర్గానికో ఐటీఐ ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. వీటిని నియోజకవర్గస్థాయి నైపుణ్య శిక్షణ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఇప్పటికే ఐటీఐలు లేని నియోజకవర్గాల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తోంది. ఇవి మంజూరైతే ప్రభుత్వ ఐటీఐలు వందకు పైగా చేరుకునే అవకాశాలున్నాయి. వీటిలో అవసరమైన పోస్టులను కూడా కలిపితే ఖాళీల సంఖ్య 3 వేలకు చేరుకునే అవకాశాలున్నాయి.



వేగంగా ఏటీసీ నిర్మాణ పనులు..

తొలిదశలో 25 ఐటీఐలను ఆధునిక శిక్షణ కేంద్రాలు (ఏటీసీ)గా తీర్చిదిద్దనున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద మల్లేపల్లి ఐటీఐలో ప్రారంభించిన ఏటీసీ భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఏటీసీల్లో విద్యార్థులకు స్వల్ప, దీర్ఘకాల నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు టాటా టెక్నాలజీస్‌తో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ నేపథ్యంలో కొత్త ట్రేడ్‌లపై విద్యార్థులతో పాటు సంబంధిత ట్రేడ్‌ల బోధకులకు టాటా సంస్థ ప్రతినిధులు శిక్షణ అందిస్తారు. బోధకుల శిక్షణ కార్యక్రమానికి అర్హులైన ఏటీవో, డిప్యూటీ టీవోలను ఉపాధి కల్పనశాఖ గుర్తిస్తోంది. త్వరలోనే ఆయా సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. టాటా ప్రాజెక్టులో భాగంగా ఏటీసీల్లో మరో 600కు పైగా పోస్టులు వచ్చే అవకాశం ఉన్నట్లు ఉపాధికల్పన శాఖ వర్గాలు వెల్లడించాయి.

- ఈనాడు, హైదరాబాద్

ఛత్తీస్‌గఢ్ సరిహద్దులకు గ్రేహౌండ్స్

నిరంతర కూంబింగ్‌కు ప్రణాళిక

ఈనాడు, హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భద్రతా బలగాలు ముప్పేట దాడి చేస్తున్న నేపథ్యంలో మావోయిస్టులు తెలంగాణలోకి రాకుండా.. రాష్ట్ర పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. మావోయిస్టులపై పోరులో కీలకమైన గ్రేహౌండ్స్ బలగాలను సరిహద్దులకు తరలిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో కొన్ని నెలలపాటు నిరంతర కూంబింగ్ కొనసాగేలా వ్యూహరచన చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో శుక్రవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే.

ఇప్పటికీ వారి ఆధిపత్యంలోనే

దండకారణ్యంలో ఇప్పటికీ కొన్ని వందల చదరపు కిలోమీటర్ల ప్రాంతం మావోయిస్టుల ఆధిపత్యంలోనే ఉంది. దీంతో బలగాలు సైతం నిర్దుష్ట సమాచారం ఉన్నప్పుడే దాడి చేస్తూ జాగ్రత్తగా ముందుకు వెళుతున్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది ఇప్పటివరకూ దాదాపు 200 మంది మావోయిస్టులు భద్రతా బలగాల చేతుల్లో చనిపోగా మరో 500 మంది వరకూ అరెస్టు కావడమో, లొంగిపోవడమో జరిగింది. దండకారణ్యంలో ఇలా ఒత్తిడి పెరగడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు మావోయిస్టులు తెలంగాణలోకి రావచ్చని ఇక్కడి అధికారులు భావిస్తున్నారు. మావోయిస్టు అగ్రనాయకత్వానికి ఇక్కడి భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉండటం ఇందుకు ప్రధాన కారణం. వీరిని అడ్డుకునేందుకు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో గాలింపును పోలీసులు ఉద్ధృతం చేశారు. ఇందుకోసం గ్రేహౌండ్స్ బలగాలను సరిహద్దులకు తరలిస్తున్నారు. శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్ పూర్వాపరాలు పరిశీలించేందుకు తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్సైబీ), గ్రేహౌండ్స్ విభాగాల అధికారుల బృందం ఛత్తీస్‌గఢ్‌కు వెళుతోంది. ఎన్‌కౌంటర్ తీరుతెన్నులను ఈ బృందం అధ్యయనం చేయనుంది.



పూల సింగిడి.. మహిళల సందడి

ఓవైపు దేవీ శరన్నవరాత్రులు.. మరోవైపు బతుకమ్మ వేడుకలతో ఏ వీధిలో చూసినా ఆధ్యాత్మికతే వెల్లివిరుస్తోంది. కూకట్‌పల్లి గ్రామంలో ఆదివారం రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలు పేర్చి.. గౌరమ్మను ఆరాధిస్తూ మహిళలు ఆడిపాడారు.

చర్మం.. వ్యాధుల మర్మం

- ఉతకకుండా పదేపదే వాడితే స్కిన్ ఇన్‌ఫెక్షన్లు
- పిల్లలు, యువతలో 30-40 శాతం మందిలో సమస్యలు

ఈనాడు, హైదరాబాద్: జీన్స్ లేదా దళసరి ప్యాంట్లను ఉతక్కుండా మళ్లీమళ్లీ వేస్తున్నారా. అయితే చర్మ వ్యాధులు పొంచి ఉన్నట్లే. తాజాగా ఉస్మానియా ఆసుపత్రికి వచ్చే పిల్లలు, యువతలో ఈ తరహా చర్మ సమస్యలు కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

ఫ్యాషన్.. ఇన్‌ఫెక్షన్... చిన్న పిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకు ఎక్కువ శాతం మంది జీన్స్ ప్యాంట్లు ధరించడం ప్రస్తుత రోజుల్లో ఫ్యాషన్‌గా మారింది. రఫ్ అండ్ టఫ్‌గా ఉండటం, ఉతక్కపోయినా.. ఇస్త్రీ చేయకపోయినా.. వేసుకోవడానికి ఇబ్బంది ఉండదనే భావనతో చాలామంది వీటిపై ఆసక్తి చూపుతుంటారు. ఒకటి రెండుసార్లు వేసుకున్న తర్వాత ఉతికి మళ్లీ ధరిస్తే పెద్దగా ఇబ్బంది లేదు. చాలా మంది వారం పది రోజులు ధరించడంతో చర్మ సంబంధిత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చర్మానికి అంటి పెట్టుకునే (స్కిన్‌ఫిట్)లా ఉండటంతో గాలి ఆడక లోపల చెమట పట్టి వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లకు దారి తీస్తున్నాయి. దద్దుర్లు (అర్టికేరియా), గజ్జి (స్కేబిస్), తామర (ఆటోపిక్ డెర్మటైటిస్) వంటి ఇబ్బందులతో చాలామంది వైద్యులను సంప్రదిస్తున్నారు.



లక్షణాలు..

- చర్మం రంగు మారడం
- ఎర్రగా దద్దుర్లు రావడం
- దురద, మంట, వాపు
- పుండుగా మారి చీము కారడం
- సహజత్వం కోల్పోవడం
- పాలిపోయినట్లు కనిపించడం
- చర్మం దళసరిగా మారడం



ఏదో ఒక సమస్యతో ఆసుపత్రులకు..

0-18 వయసు పిల్లలు, యువతలో 30-40 శాతం మందిలో ఏదో ఒక చర్మ సమస్య వేధిస్తోంది. ప్రధానంగా పౌష్టికాహార లోపం, అపరిశుభ్రత, గాలి, వెలుతురు సోకని ఇళ్లలో పరిమితికి మించి ఉండటం, జన్యు ఇబ్బందులు, కాలుష్యం తదితర కారణాలు దోహదం చేస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. అధిక చక్కెర, నూనెలు, ఉప్పు ఉన్న జంక్‌ఫుడ్ తీసుకోవడంతో యువతలో మొటిమలు వస్తున్నాయని తెలిపారు.

జాగ్రత్తలు..

- వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం
- షర్ట్, ప్యాంటు రెండ్రోజులకు మించి వాడకపోవడం
- చర్మం మాయిశ్చరైజర్‌గా ఉంచుకోవడం
- తగినంత నీళ్లు తాగడం
- అలర్జీల నివారణకు చికిత్స
- నిత్యం 30 నిమిషాల పాటు వ్యాయామం
- ఆహారంలో ఆకు కూరలు, పండ్లు ఉండేలా చూడటం
- స్ట్రాబెర్రీలు, యాపిల్స్, పుచ్చకాయ, అరటి పండ్లు తీసుకోవడం
- చర్మం కాలుష్య బారిన పడకుండా దుస్తులు ధరించడం
- రోజులో కొంత సమయం చర్మానికి ఎండ తగిలే చూడటం
- జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండటం
- సమస్య ఉంటే వైద్యున్ని సంప్రదించాలి.

ఉస్మానియాలో ప్రత్యేక విభాగం...

చర్మ వ్యాధులకు ఉస్మానియాలో ప్రత్యేక విభాగం అందుబాటులోకి తెచ్చినట్లు డెర్మటాలజీ ప్రొఫెసర్ డాక్టర్ భూమేష్‌కుమార్ వెల్లడించారు. ఉచితంగా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. నిత్యం 100 మంది వరకు ఓపీ వస్తుండగా... 0-18 ఏళ్ల లోపు వారు ఎక్కువగా ఉంటున్నారు. తీవ్రమైన చర్మ వ్యాధి లక్షణాలు ఉంటే బయాప్సీ పరీక్షలు చేస్తామన్నారు. పిల్లల కోసం పిడియాట్రిక్ డెర్మటాలజీ శిక్షణ కేంద్రం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. డీఎం తర్వాత పిడియాట్రిక్ డెర్మటాలజీలో ఫెలోషిప్ అందిస్తున్నట్లు చెప్పారు.

తీర్థ యాత్రల పేరుతో ఘరానా మోసం



ఉప్పల్: తక్కువ ప్యాకేజీలో తీర్థ యాత్రలకు తీసుకెళ్తామంటూ నమ్మించాడు.. ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో వసూలు చేశాడు. చివరకు వందల మందికి కుచ్చుటోపీ పెట్టాడు ఉప్పల్‌లోని ఓ నిర్వాహకుడు. పోలీసుల, బాధితుల కథనం ప్రకారం.. ఉప్పల్‌లోని హైకోర్టు కాలనీలో ఉండే **భరత్‌కుమార్ శర్మ**(45) గాయత్రి టూర్స్ అండ్ ట్రావెల్స్ నడిపిస్తున్నాడు. పలు జిల్లా వాసులకు తక్కువ ప్యాకేజీలో మానస సరోవర్, ఇతర యాత్రలకు తీసుకెళ్తామని ప్రకటనలు ఇచ్చారు. నమ్మిన నగరంతో పాటు, రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో డబ్బులు ఇచ్చారు.

వందల మందికి టోకరా: తీర్థ యాత్రలకు ఆసక్తి చూపిన వారిలో అందరూ వయోవృద్ధులు ఉన్నారు. వీరంతా దాచుకున్న, పెన్షన్ డబ్బులను ఆతడికి చెల్లించారు. ఒక్కొక్కరి నుంచి రూ.2 నుంచి 4 లక్షల వరకు తీసుకున్నాడు. వందల మంది నుంచి రూ.కోట్లలో వసూలు చేశాడు. ఏళ్లు గడుస్తున్నా ఒక్కరిని తీర్థయాత్రలకు తీసుకెళ్లకుండా రకరకాల కారణాలు చెప్తూ వస్తున్నాడు. వీరిలో కొందరికి ఇక్కడి చెప్పులు కూడా జోన్స్ అయ్యాయి. వాళ్లను నమ్మించేందుకు నిత్యం వీడియోలు చేసి వాట్సాప్‌లకు పంపించేవాడు. తను ఉప్పల్‌లోనే ఉంటూ జమ్మూకశ్మీర్‌లో ఉన్నట్టుగా నమ్మించేవాడు. దీంతో విసుగెత్తిన రామంతాపూర్‌కు చెందిన ప్రియారెడ్డి ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి భరత్‌కుమార్‌శర్మను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ముందుకు కదల్లేరు.. వెనక్కి వెళ్లలేరు

- నగరంలో నిత్యం ట్రాఫిక్ పద్మవ్యూహం
- రోజూ 5 లక్షలమంది యాతన



ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: మహానగరం నలువైపులా ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. నిత్యం ఏదో ఒక సమయంలో ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ స్తంభించిపోతుండటంతో సుమారు 5 లక్షల మంది వాహనదారులు గంటల పాటు ఎటూ కదలక నరకం అనుభవిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి పలు మార్లు ఆదేశించినా ఫలితం కనిపించడం లేదు.

నగరంలో నిత్యం 40-50 లక్షల వాహనాలు తిరుగుతున్నాయని అంచనా. ఈ సంఖ్యకు అనుగుణంగా ప్రధాన మార్గాల విస్తరణ పనులు జరగడం లేదు. రద్దీ ప్రాంతాలను గుర్తించి వాటికి ప్రత్యామ్నాయ రూట్లను పరిశీలించి వాహనాలు మళ్లిస్తే కొంతవరకు ఒత్తిడి తగ్గుతుంది. గతంలో హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం అదనపు కమిషనర్‌గా ఏవీ రంగనాథ్ ఉన్న సమయంలో అనేక ప్రాంతాల్లో ఇలాంటి ప్రయోగాలు చేసి ఫలితాలు సాధించారు. రాజధాని పరిధిలో 3328 మంది పోలీసులు ట్రాఫిక్ విభాగంలో ఉంటే వీరిలో రోడ్లపైకి వచ్చే వారు 300 మంది దాటడం లేదు. చాలాచోట్ల హోంగార్డులను పెడుతున్నారు.

- లక్డీకాపూల్ నుంచి ఎస్‌ఆర్‌నగర్, ప్యారడైజ్ నుంచి బేగంపేట, జేబీఎస్ నుంచి ప్యారడైజ్, నల్లకుంట నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, జేఎన్‌టీయూ నుంచి సైబర్‌టవర్, కోఠి నుంచి ఎల్బీనగర్ వరకు ఇలా అనేక రూట్లలో నిత్యం ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదు. హైటెక్ సిటీ, మాదాపూర్ పరిసర ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం కురిసినా గంటల పాటు నరకమే.
- నగరంలో పది పన్నెండు కారిడార్లలో నిత్యం ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. ఇందులో ప్రధానమైనది మాసాబ్‌ట్యాంక్ నుంచి ఆరాంఘర్ వరకు ఉన్న కారిడార్. శుక్రవారం సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ట్రాఫిక్ స్తంభించింది. ఇక్కడ చాలామంది రోడ్లపైనే వాహనాలు ఉంచి వ్యాపారాలు చేస్తున్నారు. రాత్రయితే ప్రైవేటు బస్సులు అడ్డుగా నిలుపుతున్నారు. అత్తాపూర్ నుంచి మాసాబ్‌ట్యాంక్ వచ్చే రోడ్డులోనూ ఇదే పరిస్థితి.

ఇవీ మరికొన్ని కారణాలు!

- ట్రాఫిక్ అధికంగా ఉన్న రోడ్డులో గ్రీన్‌సిగ్నళ్లను అధిక సమయం ఉంచి తక్కువ ట్రాఫిక్ ఉండే రూట్లలో కొంత అధిక సమయం రెడ్ సిగ్నల్‌ను ఉంచే ఆటోమెటిక్ వ్యవస్థ ఉంది. దీన్ని పోలీసులు ఉపయోగించడం లేదు. నగరంలో 121 ప్రాంతాల్లో యూటర్న్‌లు, ఫ్రీ లెఫ్టులు చేయవచ్చని అధికారులు గుర్తించారు. వీటిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు. మహానగరంలో దాదాపు 200 ప్రాంతాల్లో చిన్నపాటి వర్షానికే ముంపు నీరు ట్రాఫిక్‌కు అవరోధంగా మారుతోంది.
- నిబంధనల ప్రకారం రాత్రి పది గంటల తర్వాతే ప్రైవేటు బస్సులు నగరంలో ప్రవేశించాలి. చాలా ప్రాంతాల్లో రాత్రి 8.30 నుంచే వచ్చేస్తున్నాయి.

గునుగు పూవు పుయ్యాలో.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



బతుకమ్మ ఉత్సవాల్లో గునుగు పూలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కందుకూరు శివారులో ఆ పూలను వృద్ధులు సేకరిస్తూ సద్దుల బతుకమ్మ రోజు విక్రయించేందుకు పోగు చేసుకుంటున్న దృశ్యం.

3 మాసాలు.. 5 వేల వివాహాలు



ఈనాడు, హైదరాబాద్: నగరానికి పెళ్లి కళ వచ్చేసింది. మూడునెలల పాటు మంచి ముహూర్తాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నట్టు పురోహితవర్గాలు అంచనా వేస్తున్నాయి. మూడు జిల్లాల్లో గత ఐదేళ్లలో జరిగిన వివాహాలతో పోల్చితే అత్యధికంగా వచ్చే మూడు నెలల్లో దాదాపు 5 వేల పెళ్లిళ్లు జరగనున్నట్టు ఫంక్షన్‌హాళ్లు, బ్యాంకెట్ హాళ్ల నిర్వాహకులు చెబుతున్నారు.

ముహూర్తాలు ఇలా..

నెల	తేదీలు
అక్టోబరు	12,13,16,20,27
నవంబరు	3,6,7,8,9,10,13,14,16,17
డిసెంబరులో	5,6,7,8,11,12,14,15,26

పెరిగిన అడ్వాన్స్ బుకింగ్‌లు.. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఉపనయనాలు, తదితర శుభకార్యాలకు ఈ నెల ఎంతో అనుకూలమైనదని రాష్ట్ర అర్చక సంఘం కన్వీనర్ శ్రీరంగం గోపీకృష్ణమాచార్యులు తెలిపారు. ఇప్పటికే బుకింగ్‌లు మొదలయ్యాయని తెలిపారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో 25 రోజుల పాటు మంచి ముహూర్తాలు ఉండటంతో భాజభజంత్రీలు, మండపాలను అలంకరించే వారికి, కేటరింగ్ సంస్థలకు సైతం ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయి. దసరా ఉత్సవంతో పాటు శుభకార్యాలకు అనువైన నెల కావడంతో మార్కెట్‌లోనూ సందడి నెలకొంది. వస్త్ర దుకాణాలు, బంగారం దుకాణాల్లో అమ్మకాలు పెరిగినట్టు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

హత్య చేసి.. హత్యాచారంగా చిత్రీకరించి



ప్రియాంక (మృతురాలు)



మంజుల (నిందితురాలు)

మూసాపేట: రూ.10 వేలు కూడా విలువ చేయని వెండి వస్తువుల కోసం ఓ మహిళ మరోమహిళను హతమార్చి.. హత్యాచారంగా చిత్రీకరించేందుకు విఫలయత్నం చేసింది. ఈ కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 2న మహిళ మృతదేహం వెలుగుచూడగా.. సాంకేతిక ఆధారాలతో నిందితురాలిని అరెస్టు చేశారు. డీసీపీ కె.సురేష్‌కుమార్ ఆదివారం కూకట్‌పల్లిలో వివరాలు వెల్లడించారు.

వెండి నగలపై వివాదం.. నిజామాబాద్ జిల్లా యెడపల్లి మండలానికి చెందిన ధర్మారం ప్రియాంక(23) భర్తతో విడిపోయి.. 2 నెలల క్రితం నగరానికి వచ్చి కేపీహెచ్‌బీకాలనీ మెట్రో స్టేషన్ కింద ఉంటోంది. చెడు వ్యసనాలకు బానిసైన ఆమెకు కూకట్‌పల్లిలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కటారి మంజుల(35) పరిచయమైంది. ప్రియాంక తన 2 వెండి గొలుసులు, మెట్టెలు మంజులకు ఇచ్చి దాచాలని కోరింది. కొన్ని రోజులకు తిరిగి అడగ్గా మంజుల ఇవ్వడం లేదు. విసిగిపోయిన ప్రియాంక నడిరోడ్డుపై మంజులతో గొడవకు దిగింది. తెలిసిన ముగ్గురితో కలిసి ఆమె ఇంటకెళ్లి బెదిరించి తన నగలు తీసేసుకుంది. దీన్ని అవమానంగా భావించిన మంజుల ప్రియాంకను అంతమొందించాలని పథకం వేసింది.

పట్టించిన సీసీ కెమెరాలు..

సెప్టెంబరు 30న మద్యం తాగుదామంటూ ప్రియాంకను ఇంటికి ఆహ్వానించి ఎక్కువ మద్యం తాగించి స్పృహ తప్పే వరకూ ఎదురుచూసింది. రాత్రి 11.30 గంటలకు బయటకు వెళ్లొద్దామంటూ తన స్కూటీపై ప్రియాంకను కేపీహెచ్‌బీకాలనీలో ఉదాసీన్ మఠానికి చెందిన నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లి బ్లేడుతో ప్రియాంక గొంతు కోసి హత్య చేసింది. ఆమె వెండి నగలు తీసుకుంది. హత్యాచారంలా చిత్రీకరించేందుకు ప్రియాంక ఒంటిపై లోదుస్తులు చింపేసి. . జననాంగం వద్ద, గొంతు నుంచి ఛాతీ వరకూ బ్లేడుతో గాట్లు పెట్టింది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితురాలు దొరికిపోయింది.



తెలుగుతల్లి వంతెన కింద ఆగిన ద్విచక్ర వాహనదారులు

నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం

నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. అడ్డగుట్ట కమ్యూనిటీహాల్ పరిధిలో అత్యధికంగా 43.8 మి.మీ వర్షపాతం నమోదైంది. న్యూమెట్టుగూడ ప్రైమరీ పాఠశాల పరిధిలో 28.3 మి.మీ, సీతాఫల్‌మండి పరిధిలో 24.3 మి.మీ, రాజీవ్‌గృహకల్ప పరిధిలో 16.0 మి.మీ వర్షం కురిసింది. నాలుగు ప్రాంతాల్లో మోస్తరు.. 16 చోట్ల స్వల్ప వర్షపాతం నమోదైంది.

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్






క్యాన్సర్‌ను ఖతం చేద్దాం

'రన్ ఫర్ గ్రేస్- స్క్రీన్ ఫర్ లైఫ్' నినాదంతో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం ఉదయం నిర్వహించిన పరుగులో ఐటీ ఉద్యోగులు, యువతీ యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, యశోద ఆసుపత్రి ఎండీ పవన్ గోరుగంటి, డాక్టర్ చినబాబు, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నీఫర్, డాక్టర్ బర్త్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ డేవిడ్ జోయల్ పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, గచ్చిబౌలి

స్మార్ట్ కార్డు.. తప్పదు నిరీక్షణ

- రెండు నెలలు దాటినా అందని వైనం
- ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వాహనదారులు



ఈనాడు, హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా వాహన లైసెన్సులు, ఆర్సీలకు సంబంధించి స్మార్ట్ కార్డులు పెండింగ్‌లో ఉంటున్నాయి. కొన్ని కార్యాలయాల్లో రెండు నెలలు దాటుతున్నా వాహనదారులకు చేరడం లేదు. దీంతో వారంతా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా నిత్యం రెండు వేల వాహనదారులు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. మరో 500 వరకు లైసెన్సులు జారీ చేస్తుంటారు. ఈ కార్డుల కోసం వాహనదారులు పోస్టల్ ఛార్జీలతో పాటు నిర్ణీత రుసుం చెల్లిస్తున్నారు. అయితే రెండు, మూడు నెలలు దాటుతున్నా కార్డు పోస్టు ద్వారా రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తమ స్మార్ట్ కార్డు వేరెవరికైనా చేరిందా..? అన్న అనుమానంతో సంబంధిత ఆర్టీఏ కార్యాలయాల్లో సిబ్బందిని సంప్రదిస్తున్నారు.

టీఎస్ కోడ్ అమల్లో ఉన్నప్పుడు వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించుకున్నప్పటికీ ఇంకా చాలా మందికి స్మార్ట్ కార్డులు జారీ కాలేదు. మార్చి 12 తర్వాత టీజీ కోడ్‌ను అమల్లోకి తెస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పటికే గ్రేటర్ వ్యాప్తంగా లక్షన్నర పైగా స్మార్ట్ కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. తొలుత వీరందరికీ టీఎస్ కోడ్‌తోనే స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాలని భావించినా ఇంకా కార్డులు ప్రింటింగ్ కాకపోవడంతో పెండింగ్‌లో ఉన్న కార్డులను కూడా కొత్త కోడ్‌తో జారీ చేయాలని అధికారులు నిర్ణయించారు. అవి పూర్తి స్థాయిలో ఇంకా వాహనదారులకు చేరలేదు.

దిల్లీ నుంచి రావాలి..

స్మార్ట్ కార్డుల ప్రింటింగ్, పంపిణీ ఈసారి దిల్లీకి చెందిన సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. ఇంతకు ముందు హైదరాబాద్‌లోనే ఈ కార్డుల ప్రింటింగ్ జరిగేది. అప్పట్లో పలుసార్లు ఈ కార్డుల పంపిణీలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. రిబ్బన్ లేదని, పెండింగ్ నిధులు విడుదల కాలేదని రకరకాల కారణాలు చెప్పి నిలిపివేశారు. తాజాగా ఇక్కడ నుంచి సమాచారం పంపించిన తర్వాత దిల్లీలో కార్డులు ప్రింటింగ్ చేసి మళ్లీ కొరియర్‌లో పంపిణీ చేస్తున్నారు. దీంతో వీటి పంపిణీలో ఆలస్యం జరుగుతోందని చెబుతున్నారు. కొత్త కోడ్ వచ్చిన తర్వాత ఇప్పటివరకు లక్షన్నర కార్డుల పైనే ప్రింటింగ్ కోసం దిల్లీకి అధికారులు పంపారు. ఇప్పటికైనా అధికారులు కార్డుల జారీపై దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

మూడు జోన్లు.. మూడు నెలల గడువు

వేసవి డిమాండ్ తట్టుకునేందుకు విద్యుత్తు వ్యవస్థ బలోపేతంపై దృష్టి



ఈనాడు, హైదరాబాద్: వేసవి డిమాండ్‌ను తట్టుకునేందుకు నగరంలోని మూడు జోన్ల పరిధిలో నెట్‌వర్క్ బలోపేతంపై విద్యుత్తు పంపిణీ సంస్థ దృష్టిపెట్టింది. ఇప్పటికే పలు సర్కిళ్ల పరిధిలో కొత్తలైన్లు వేస్తున్నారు. ఎల్‌టీ, 11కేవీ, 33 కేవీ లైన్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. బహుముఖ వ్యూహంతో ఈ పనులను డిస్కం చేపట్టింది. గతేడాది వేసవిలో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పెరిగే డిమాండ్‌ను తట్టుకోవడం ఒకటైతే.. అంతరాయలను తగ్గించడం, సరఫరా నష్టాలకు అడ్డుకట్ట వేసేందుకు పనులు చేపట్టింది. గత వేసవిలో కొన్ని ప్రాంతాల్లో 30-50 శాతం వరకు డిమాండ్ పెరిగింది. వీటిని దృష్టిలో పెట్టుకుని 60 శాతం లోడ్ దాటిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో అదనపు పీటీఆర్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఉపకేంద్రాల నిర్మాణాలు జరుగుతున్నాయి. మాస్టర్‌ప్లాన్, ఆపరేషన్, కన్‌స్ట్రక్షన్ విభాగాలు పనులు చేస్తున్నాయి. వీటికి వేర్వేరు పథకాల కింద నిధులు సమకూర్చేకునేలా డిస్కం కసరత్తు చేస్తోంది. శివారుల్లో విస్తరణ పనులు ఎక్కువగా చేపట్టిన రంగారెడ్డి జోన్‌లోనే రూ.212 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మెట్రోజోన్, మేడ్చల్ జోన్‌లో పెద్ద ఎత్తున పనులను చేపట్టారు. డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులకు సీఎండీ లక్ష్యాలు నిర్దేశించారు.



మురుగు పొంగింది.. రహదారిని ముంచెత్తింది

షేక్‌పేట, న్యూస్‌టుడే: షేక్‌పేట పాస్‌పోర్టు సేవాకేంద్రం సమీపంలో మురుగునీటి మ్యాన్ హోల్ పొంగిపొర్లుతోంది. అక్కడి ప్రధాన రహదారిపై మురుగు పరవళ్లు తొక్కుతోంది. మ్యాన్‌హోల్ మూత పగిలిపోవడంతో జలమండలి సిబ్బంది దానికి అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో రహదారి ఇరుగ్గా మారి ట్రాఫిక్ జామ్ అవుతుంది. వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

షేక్‌పేట పాస్ పోర్ట్ సేవా కేంద్రం సమీపంలో ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

రాహుల్ బొజ్జకు మంత్రుల పరామర్శ



విజయభారతి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం తదితరులు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: ఇటీవల కన్నుమూసిన పౌర హక్కుల నేత బొజ్జా తారకం సతీమణి, సీనియర్ ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జా మాతృమూర్తి, ప్రముఖ రచయిత్రి విజయభారతి సంస్మరణ కార్యక్రమం ఆదివారం బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పలువురు ఐఏఎస్ అధికారులు, విశ్రాంత అధికారులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదే సమయంలో రాహుల్ బొజ్జా, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మేమున్నాం.. ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

మీకు తోడుగా..

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

న్యూస్‌టుడే, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ

? బంజారాహిల్స్ రోడ్ నం.3 జర్నలిస్ట్ కాలనీలోని ప్లాట్ నం.17లో ఉన్న వీధిలో నాలుగు వీధి దీపాలు నెల రోజులకు పైగా వెలగడం లేదు. అధికారులకు చెప్పినా స్పందన లేదు.

–జ్యోత్స్న, స్థానికురాలు, జర్నలిస్ట్ కాలనీ

✓ ఆ సమస్య గురించి మాకు సమాచారం లేదు. సిబ్బందిని పంపి తనిఖీ చేయించి, వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

– సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధి దీపాల విభాగం), సర్కిల్– 18

– సుష్మ, మున్సిపల్ ఏఈ, వీధిదీపాల విభాగం, సర్కిల్– 18

? అమీర్‌పేట్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలోని నల్లపోచమ్మతల్లి ఆలయం వీధి దెబ్బతినడంతో ఇబ్బందికరంగా మారింది. రోడ్డంతా గుంతలమయంగా మారడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నాం.

– పురుషోత్తమ్‌రావు, సీనియర్ సిటిజన్

✓ సమస్య మా దృష్టికి రాలేదు. దెబ్బతిన్న రహదారిని వెంటనే మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం.

–చరణ్, ఏఈ, జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.17

ముందుచూపు లేక.. ముందుకు కదల్లేక

పెద్దమ్మ గుడి చుట్టూ ట్రాఫిక్ కష్టాలు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడికి భక్తుల తాకిడితో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ముఖ్యమంత్రి నివాసానికి కూతవేటు దూరంలోని ఈ పెద్ద ఆలయంలో ఉత్సవాల నేపథ్యంలో పోలీసు విభాగాలు, జీహెచ్ఎంసీ మధ్య సమన్వయం, ముందస్తు ప్రణాళిక పూర్తిగా లోపించాయి. సాధారణ రోజుల్లోనే పెద్దమ్మ తల్లిని దర్శించుకొనేందుకు దాదాపు పదివేల మందికి పైగా..ఆదివారం రోజు 40 నుంచి 50 వేల భక్తులు హాజరవుతుంటారు. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుంది. ఉత్సవాల సమయంలో వారాంతాల్లో భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల ఆలయానికి తరలివచ్చే భక్తుల వాహనాలతో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 36లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయి. రోడ్ నంబరు 36 నుంచి ఆలయానికి వెళ్లే దారి గుంతలమయమై మురుగు పారుతుంటుంది. ఉత్సవాల నిర్వహణకు ముందు ఇటు శాంతిభద్రతల విభాగం, ట్రాఫిక్



పెద్దమ్మగుడికి భక్తులు పోటెత్తడంతో రోడ్ నంబరు 36లో నిలిచిన ట్రాఫిక్

విభాగం, జీహెచ్ఎంసీ సంయుక్తంగా ఉత్సవాల సమయంలో వ్యవహరించాల్సిన తీరుపై కనీసంగా సమావేశాలు ఏర్పాటు చేసుకోలేదు. దీంతో ఆలయానికి వెళ్లే దారిలో ఆలయ సిబ్బందే బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను క్రమబద్ధీకరించాల్సి వస్తోంది. వాహనాల మళ్లింపు ప్రభావం రోడ్ నంబరు 36పై పడటంతో ఈ దారిలో వాహనదారులు ఆదివారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు కిలోమీటరు మేర వాహనాలు నెమ్మదించాయి. దాదాపు 70 నుంచి 80 వేల మందికి పైగా భక్తులు హాజరవడంతో ఇక్కడ ట్రాఫిక్ ఒక్కసారిగా అదుపుతప్పింది. భక్తులతోపాటు, ఈ దారిలో ప్రయాణించిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఆలయంలో తగినంత పార్కింగ్ సౌకర్యం లేక చాలా మంది రహదారికి ఇరువైపులా వాహనాలు నిలపాల్సి వచ్చింది. రద్దీ ఉన్న రోజుల్లో మళ్లింపు, రహదారులపై మురుగు, ఇతర ఇబ్బందులను తొలగించటానికి ఇకనైనా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రెచ్చిపోయిన చోరులు..

మరోవైపు పెద్దమ్మగుడి వద్ద భక్తుల తాకిడిని అదునుగా తీసుకొని దొంగలు రెచ్చిపోయారు. పోలీసులు కనీసంగా నిఘా పెట్టకపోవడంతో దొంగల పని సులువైంది. ఈ క్రమంలోనే ఆదివారం పెద్దమ్మ తల్లి దర్శనానికి వచ్చిన ఎస్సార్‌నగర్ ప్రాంతానికి చెందిన తేజస్విని, పావని, మాదాపూర్ ప్రాంతానికి చెందిన మాధవి, లింగంపల్లికి చెందిన సువర్చల అనే మహిళలు తమ చరవాణులు చోరీ అయినట్లు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యజ్ఞ మహోత్సవానికి నిధుల కేటాయింపుపై హర్షం

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం ప్రయత్నంతో గత రెండేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో బీసీ సంక్షేమ శాఖ, జిల్లా కలెక్టర్ల కార్యాలయాల్లో 'విశ్వకర్మ 'యజ్ఞ' మహోత్సవం, పూజాదికాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది కూడా రాష్ట్ర ప్రభుత్వం యజ్ఞ మహోత్సవానికి రూ.13 లక్షలు మంజూరు చేసిన సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంలకు సంఘం అధ్యక్షుడు డా.వేములవాడ మదన్మోహన్, గౌరవ అధ్యక్షుడు డా.లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రాగిఫణి రవీంద్రాచారి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నా అని పిలిస్తే.. అసభ్యంగా ప్రవర్తించాడు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: సోదరుడి వరసయ్యే వ్యక్తి ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనగర్‌కాలనీ ప్రాంతంలో నివసించే ఓ యువతి (27) తన బంధువు (సోదరుడు) అయిన అనీష్‌కు ఇల్లు చూపించడానికి తీసుకెళ్లింది. ఇంటిని చూపించే క్రమంలో ఆమెతో అనీష్ అసభ్యంగా ప్రవర్తించాడు. అతడు చేసిన పనికి ఒక్కసారిగా కంగుతింది. దీనిపై శనివారం రాత్రి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం పెట్టుబడి పేరుతో మోసం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: బంగారం వ్యాపారంలో పెట్టుబడి పెడితే రెండింతలు అవుతుందని నమ్మించిన ఓ యువకుడిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన షీలారాణి కుమార్తె తన స్నేహితుడైన కార్తిక్‌రెడ్డిని తల్లికి పరిచయం చేసింది. దీంతో కార్తిక్ రెడ్డి నమ్మకంగా నటించి పలు వ్యాపార అవకాశాలు చూపుతానంటూ డీఎస్ఆర్ గ్రూపు తన బంధువులదని చెప్పాడు. బంగారం వ్యాపారంలో బంగారాన్ని పెట్టుబడి పెడితే వారంలోనే రెండింతలు అవుతుందని షీలారాణిని నమ్మించాడు. దీంతో ఆమె తన వద్ద ఉన్న ఆభరణాలను కుదువపెట్టి వచ్చిన డబ్బుతో కేజీ బంగారాన్ని కొనుగోలు చేసి ఇచ్చింది. శ్రీనివాసచారి అనే వ్యక్తి ద్వారా తొలుత పంజాగుట్ట ప్రాంతంలో తీసుకుంటానని చెప్పాడు. అనంతరం జూబ్లీహిల్స్‌లోని అల్కజార్ మాల్ వద్ద ఆగస్టు 13న బంగారాన్ని తీసుకున్నాడు. వారం గడిచినా బంగారం తిరిగి ఇవ్వకపోవడంతోపాటు సందేశాలు పెట్టి సమయాన్ని సాగదీస్తూ వచ్చాడు. దీంతో అనుమానించిన షీలారాణి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి జూబ్లీహిల్స్ పోలీసులకు బదిలీ చేశారు. దీంతో కార్తిక్‌రెడ్డిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కుచ్చుటోపీ

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ఎంఎన్‌సీ కంపెనీల్లో బ్యాక్‌డోర్ ద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పిస్తానని, డబ్బు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్‌కాలనీలోని ఓ వసతిగృహంలో ఉంటున్న ఏపీకి చెందిన లక్ష్మీ కోటేశ్వరమ్మ ఉద్యోగ ప్రయత్నంలో ఉంది. ఆమె స్నేహితుడు శివకృష్ణ ద్వారా గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన వెంకటేష్ పరిచయమయ్యాడు. బ్యాక్‌డోర్ ద్వారా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆమెను నమ్మించాడు. ఇందుకు రూ.30 వేలు అడ్వాన్సుగా ఇవ్వాలని చెప్పాడు. అతడి మాటలను నమ్మి తనతో పాటు మరో 20 మందికి ఉద్యోగాలు కల్పించాలని, వారి నుంచి డబ్బు వసూలు చేసి రూ.3.3 లక్షలను వెంకటేష్‌కు ఇచ్చింది. ఉద్యోగాల పేరుతో నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు పంపాడు. ఉద్యోగంలో చేరాలంటే ఆన్‌లైన్ పరీక్ష రాయాల్సి ఉంటుందని చెప్పాడు. గత నెలలో గచ్చిబౌలి ప్రాంతంలోని ఒక ఓయో గదిలో పది మంది అభ్యర్థులకు ల్యాప్‌టాప్‌లను సమకూర్చి ఫేక్ ఆన్‌లైన్ ఎగ్జామ్ నిర్వహించాడు. తమను మోసం చేస్తున్నాడని గ్రహించిన లక్ష్మీ కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోకాపేటలో స్థలాన్ని అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న రామకృష్ణయ్య, చిత్రంలో మారుతి, పార్వతయ్య, నరేష్, కిషన్, ఉమామహేశ్వర్, శంకరయ్య

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: అఖిల గాండ్ల తెలికుల సామాజిక వర్గానికి గత ప్రభుత్వం కేటాయించిన ఎకరం భూమిని పలు విధాలుగా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించినట్లు ఆ సంఘం సీనియర్ నేత పాలూరి రామకృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో ఆ సామాజిక వర్గంలోని ఏడు సంఘాల నేత రామకృష్ణయ్య నేతృత్వంలో సమావేశమై చర్చించారు. కోకాపేటలో తమ సామాజిక వర్గానికి ఎకరం స్థలం కేటాయించారని, అది 2018లో పట్టా చేయించామన్నారు. అక్కడ తమ సామాజికవర్గం నుంచి దేశ విదేశాల్లో ఉన్న వారందరి సహకారంతో పాఠశాల ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అక్కడ తమ సమాజానికి ఆర్థికంగా తోడ్పాటుగా ఉండేలా సహకారం బ్యాంకును ఏర్పాటుపైనా చర్చించామన్నారు. ఏడు సంఘాల్లో ఒక్కో సంఘం నుంచి ముగ్గురిని ఎంపిక చేసి అడ్‌హక్ కమిటీని ఏర్పాటుచేసి ఆ కమిటీ ఆధ్వర్యంలో ముందుకు వెళతామన్నారు. సమావేశంలో తెలంగాణ గాండ్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జూపల్లి నరేష్, తెలంగాణ గాండ్ల సంఘం అధ్యక్షుడు జి.పార్వతయ్య, గాండ్ల తెలికుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రావు, తెలంగాణ గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇందల్వాయి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పండగల గొప్పదనం చాటి చెబుదాం



ప్రెస్‌క్లబ్ కార్యవర్గంతో మంత్రి సీతక్క

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: మన పండగల గొప్పదనాన్ని భావితరాలకు తెలియజెప్పాలని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం రాత్రి సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి పాల్గొని మహిళా పాత్రికేయులతో కలిసి బతుకమ్మ ఆడారు. తెలంగాణలో ఆచరించే పండగలన్నీ ప్రకృతితో ముడిపడి ఉన్నాయని, వీటి ప్రాధాన్యతను తర్వాత తరాలు మర్చిపోకుండా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రెస్‌క్లబ్ కార్యవర్గం, మహిళా పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్ పద్మావతి కాలనీలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి

పంజాగుట్ట: ఖైరతాబాద్ డివిజన్‌లోని పద్మావతి కాలనీలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో టీపీసీసీ ప్రధానకార్యదర్శి పి.విజయారెడ్డి పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

మల్లు రవికి సత్కారం



యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: తెలంగాణ ఎంపీల ఫోరమ్ కన్వీనర్‌గా నియమితులైన నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యుడు మల్లు రవిని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ.రవిశేఖర్‌రెడ్డి ఆదివారం కలిసి సన్మానించారు.

మానసిక వ్యాధులపై అవగాహనకు వాకథాన్



సంజీవయ్య పార్కులో నిర్వహించిన వాకథాన్‌లో వైద్యులు తదితరులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: వరల్డ్ మెంటల్ హెల్త్ అవేర్నెస్ వీక్‌లో భాగంగా ఎర్రగడ్డలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ (ఐఎంహెచ్) ఆధ్వర్యంలో మానసిక వ్యాధులపై అవగాహన కోసం వాకథాన్ నిర్వహించారు. ఆదివారం నెక్లెస్ రోడ్డులోని సంజీవయ్యా పార్కులో మానసిక వ్యాధులపై పనిచేస్తున్న పలు సంస్థలతో కలిసి దీన్ని నిర్వహించారు. ఐఎంహెచ్ సూపరింటెండెంట్ డా.అనిత, హెచ్ఓడీ సుధ ఆధ్వర్యంలో జరిగిన వాకథాన్‌లో సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా.అశోక్, ప్రధాన కార్యదర్శి డా.విశాల్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు డా.నరేష్, మెంటల్ హెల్త్ కమిటీ ఛైర్మన్ డా.జార్జ్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు డా.ఫణికాంత్, డా.రిషికేష్, డా.రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ డివిజన్ హబీబ్ ఫాతిమానగర్ ఫేజ్-2 సయిదా ఫాతిమా మసీదులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. బేగంపేటలోని మెడికవర్ హాస్పిటల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో వందమందికి పైగా పరీక్షలు చేయించుకున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, సంఘసేవకుడు మహమ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో మసీదు కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గేసుదరాజ్, సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సౌత్‌వెస్ట్ జోన్ హెచ్.ఎఫ్.నగర్ అధ్యక్షుడు నయీముద్దీన్, తెలంగాణ మైనారిటీస్ క్యాబ్‌డ్రైవర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు మహమ్మద్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ కార్మికుల సంక్షేమానికి కృషి



ఎన్నికైన సంఘం నూతన కార్యవర్గం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు, ఆయా సంస్థల్లో పనిచేసే కార్మికుల సంక్షేమానికి తమ వంతుగా కృషి చేస్తామని తెలంగాణ ఫ్లెక్స్ ప్రింటర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పేర్కొంది. ఆదివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో సంఘం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రెండేళ్లపాటు కొనసాగే ఈ సంఘానికి నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సప్పిడి నరేష్‌కుమార్, కొట్ల వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా ఎ.శ్రీనివాస్, కోశాధికారిగా ఎండీ ఖదీర్, సంయుక్త కార్యదర్శిగా పొలాస శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా ఎస్‌డీ ప్రసాద్, మహమ్మద్ అలీ ఉద్దీన్, కొండ రాజు కొనసాగుతారని సంఘం మాజీ అధ్యక్షుడు అన్సారి తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న యజమానులు, కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెప్పారు. నూతన సంఘాన్ని సత్కరించారు.



జూబ్లీహిల్స్‌లోని సీతారామ స్వామి దేవాలయంలో లలితా త్రిపుర సుందరీదేవిగా..



రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ ఇందిరానగర్ ఫేజ్-2లో..



బోరబండ సైట్-I కాలనీ రామాలయం వద్ద..




శ్రీనగర్‌కాలనీలోని ఆలయంలో శ్రీమహాలక్ష్మీదేవిగా..



కామధేనుదేవిగా నల్లపోచమ్మ

అమ్మ దర్శనం.. భక్త జన పరవశం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్‌లోని శ్రీసీతారామ స్వామి దేవాలయంలో కొలువుదీరిన పర్వతవర్ధిని దేవి ఆదివారం లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు, శ్రీవారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి.



బోరబండ స్వరాజ్యనగర్ హరిహర క్షేత్రంలో అన్నపూర్ణదేవికి పూజలు

తాగునీరు రోడ్డు పాలు



బంజారాహిల్స్ రోడ్డు నం.3లోని గ్రీన్ మసీదు ప్రధానగేటు ఎదురుగా దారిలో ఇలా..

బంజారాహిల్స్ న్యూస్‌టుడే: రహదారిపై తాగునీరు వృథాగా పోతోంది. స్థానిక బంజారాహిల్స్ రోడ్డు నం.3 ప్రధాన రహదారి నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారిలోని గ్రీన్ మసీదు (హుస్సేనియా మసీదు) ప్రధాన గేటు ఎదురుగా ఉన్న తాగునీటి పైపులైను మ్యాన్‌హోల్ ఉంది. ఈ క్రమంలో గత పది రోజులుగా నీటి సరఫరా జరిగినప్పుడల్లా దీన్నుంచి లీకై రోడ్డుపై వృథాగా పోతోందన్నారు. నీరు వృథా కావడమే కాకుండా రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని చెప్పారు. జలమండలి బంజారాహిల్స్ సెక్షన్ మేనేజర్ శివను వివరణ కోరగా.. సరఫరా జరిగే సమయంలో తనిఖీ చేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం



సభ్యత్వ నమోదులో చింతల రామచంద్రారెడ్డి, బోజిరెడ్డి తదితరులు

ఫిలింనగర్, న్యూస్‌టుడే: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభ్యున్నతికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ 139 బూత్‌లో ఆదివారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, స్థానిక సమస్యల పరిష్కారానికి పాటుపడాలని సూచించారు. భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.బోజిరెడ్డి, భాజపా డివిజన్ అధ్యక్షులు ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణను అడ్డుకునేందుకు పోరాటం సాగిస్తాం



ప్రసంగిస్తున్న కృష్ణ స్వరూప్, నాయకులు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: వర్గీకరణ, క్రీమిలేయర్‌పై రివ్యూ పిటిషన్‌లను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ డిస్మిస్ చేసినా.. క్యూరేటివ్ పిటిషన్ దాఖలుకు రాజ్యాంగపరమైన వెసులుబాటు ఉందని దళిత బహుజన పార్టీ (డీబీఎస్) జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ ఛైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని డీబీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం తీర్పుతో మాల, బేగరి, నేతకాని, దాసరి, మహర్ వంటి కులాలు ఆందోళన చెందవద్దని చెప్పారు. డిసెంబరు రెండో వారంలో దళితుల తిరుగుబాటు పేరుతో 'వర్గీకరణ వద్దు. . రాజ్యాధికారం కావాలి' నినాదంతో భారీ బహిరంగ సభ నిర్వహించడం ద్వారా సత్తా చాటాలని సమావేశంలో తీర్మానం చేశారు. వర్గీకరణ, క్రీమిలేయర్‌కు అనుకూలంగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రంలోని ఎన్డీఏ సర్కారుపై పోరాటం చేస్తామని ప్రకటించారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డా.వి.ఎల్.రాజు. రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జె.ఎన్.రావు, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు సీహెచ్ రోజాలీల, డీబీఎస్ గ్రేటర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు, ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.అశోక్, వీబీఐ రాష్ట్ర కార్యదర్శి తీగల శేఖర్, మాలమహానాడు (శ్రీకృష్ణ వర్గం) జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ, తెలంగాణ బేగరి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.సుచంద్ర, దర్జీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెండ్యాల సునీల్ చంద్ర రావ్, ఆదివాసీ హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ కొర్రా హరీష్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు మలోవత్ రవీంద్ర, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.







గాజుల అలంకరణలో, గాయత్రీదేవిగా బల్కంపేట ఎల్లమ్మ | అన్నపూర్ణాదేవిగా ఉజ్జయిని మహాకాళి | గాయత్రీదేవిగా పెద్దమ్మతల్లి | మహాలక్ష్మిగా ప్రత్యంగిరా అమ్మవారు

దేవీ నవరాత్రోత్సవాల్లో ఆదివారం నగరంలోని పలు ఆలయాల్లోని అమ్మవారు పలు రూపాల్లో కనిపించారు. బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానంలో మూలవిరాట్‌ను రంగురంగుల గాజులతో అలంకరించారు. అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అన్నపూర్ణాదేవిగా, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి గాయత్రీదేవిగా, ఆర్కేపురంలోని కుర్తాళం పీఠానికి చెందిన వారాహి సమేత ప్రత్యంగిరా దేవి మహాలక్ష్మి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. – సంజీవరెడ్డినగర్, బన్సీలాల్‌పేట్, రాణిగంజ్, జూబ్లీహిల్స్, ఆర్కేపురం, న్యూస్‌టుడే

కదలని చెత్తవాహనాలు

నగరంలో చెత్త వాహనాలు సరిగా పనిచేయట్లేదు. రోజూ ఉదయాన్నే వ్యర్థాలను తొలగించాల్సిన వాహనాలు రెండు, మూడు రోజులకోసారి వస్తున్నాయి. ఆ వాహనాలకు రవాణా విభాగం సహాయ ఇంజినీర్లు నిత్యం డీజిల్ కూపన్లు ఇస్తున్నారు. రెండు, మూడు వారాలకోసారి బ్రేక్‌డౌన్ పేరుతో మరమ్మతులు చేసినట్లు బిల్లులు పెడుతున్నారు. ఇప్పటివరకు ఒక్కో వాహనానికి చేసిన మరమ్మతుల ఖర్చుతో కొత్త వాహనాన్ని కొనుగోలు చేయొచ్చని అధికారులే అంటున్నారు. ఏళ్లుగా జరుగుతోన్న ఈ దందా ఇటీవల మరింత పెరిగింది. నగర పారిశుద్ధ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

ఈనాడు, హైదరాబాద్



జీహెచ్ఎంసీ ఆర్ఎఫ్‌సీ వాహనం

◆ రోజూ డీజిల్ తీసుకుని.. మూడ్రోజులకోసారి విధులకు

35 వాహనాల్లో 90 శాతం

◆ ఐదు నుంచి పది వీధుల్లోని చెత్త కుప్పలను తొలగించేందుకు జీహెచ్ఎంసీ రవాణా విభాగం 2016లో 35 రెఫ్యూజ్ కంపాక్టర్ వాహనాలను(ఆర్ఎఫ్‌సీ) కొనుగోలు చేసింది. మొదట్లో ఆయా వాహనాలు పక్కాగా పనిచేశాయి. కంటైనర్ లాంటి ట్రాలీలో వ్యర్థాలను ఎక్కువ మొత్తంలో నింపడం వాటి ప్రత్యేకత. తద్వారా ఒకేసారి ఎక్కువ వీధులను శుభ్రం చేయొచ్చనే ఉద్దేశంతో అధికారులు వాటిని సమకూర్చుకున్నారు. ఇప్పుడు వాటిలోని 90శాతం వాహనాలు రోజువారీ విధుల్లో పాల్గొనట్లేదు. రెండేళ్లుగా వాహనాల డ్రైవర్లు నరకం చూపిస్తున్నారని, మాట వినడం లేదని సర్కిళ్ల పారిశుద్ధ్య విభాగం అధికారులు నిత్యం కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదు చేస్తున్నారు.

◆ విధులు సరిగా నిర్వర్తించట్లేదనే కారణంతో.. సంబంధిత అధికారులు వాటికి కేటాయించిన చెత్త కుప్పలను తగ్గించారు. అంబర్‌పేట, ముషీరాబాద్, సికింద్రాబాద్, తదితర సర్కిళ్లలోని 70 చెత్తకుప్పలనే వాటికి అప్పగించారు. అయినా ఫలితం కనిపించట్లేదు. అంబర్‌పేటలో 3 రోజులకోసారి వాహనాలు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నాయని, ఫోన్ చేస్తే డ్రైవర్లు స్పందించడం లేదని, విధుల్లోకి వచ్చిన రోజు సైతం అసంపూర్తిగా పని చేస్తున్నారని సర్కిల్ పారిశుద్ధ్య అధికారి 'ఈనాడు'కు తెలిపారు. చెత్త కుప్పలను శుభ్రం చేసే బాధ్యతను ప్రైవేటు వాహనాలకు అప్పగిస్తామనే హెచ్చరికను డ్రైవర్లు ఖాతరు చేయట్లేదని, ప్రైవేటు వాహనదారులను బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

చెత్త రవాణా వాహనాలు, అధికారులు ఉపయోగించే వాహనాలకు జీహెచ్ఎంసీ ఏటా రూ.25 కోట్ల డీజిల్‌ను వినియోగిస్తోంది. మరమ్మతులకు మరో రూ.5 కోట్ల ఖర్చు. అందులో 70 శాతం నిధులు దారి మళ్లుతున్నాయనే విమర్శలున్నాయి. చెత్త రవాణా, ఇతర తనిఖీ వాహనాలకు జీపీఎస్ పరికరాలను అమర్చడం, చేయని మరమ్మతులకు బిల్లుల మంజూరు, డీజిల్ కూపన్ల మాయాజాలం ఏళ్లుగా కొనసాగుతోంది.

హోటళ్ల నుంచి వ్యర్థాలను సేకరించే వాహనాలు లేవు. స్వచ్ఛ ఆటోలే ఆ పని చేస్తున్నాయి. కొన్ని హోటళ్లు వ్యర్థాలను మురుగు కాలువల్లో, చెరువుల్లో వదిలేస్తున్నాయి. చెత్తకుప్పల తొలగింపును నిర్లక్ష్యం చేస్తోన్న వాహనాలను రాత్రివేళ హోటళ్ల వ్యర్థాల సేకరణకు ఉపయోగిస్తే బాగు.



అయ్యప్ప సొసైటీ సర్వే ఆఫ్ ఇండియా కాలనీ జంక్షన్



పంజాగుట్ట మోడల్ హౌస్ - జేవీఆర్ పార్కు రోడ్డు

దెబ్బతిన్న రహదారులు

ఈనాడు, హైదరాబాద్

రాజధానిలో రహదారులు ధ్వంసమయ్యాయి. వీధి దీపాల సమస్య కూడా తోడవడంతో గల్లీల దారులపై గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం జీహెచ్ఎంసీకి గుంతలపై వందలాది ఫిర్యాదులు అందుతున్నా స్పందన లేదు. ఐదేళ్ల క్రితం 800 కి.మీ ప్రధాన రహదారులను జీహెచ్ఎంసీ ప్రైవేటు నిర్వహణకు ఇచ్చింది. గుంతలు, అపరిశుభ్రత, పగిలిన మ్యాన్‌హోళ్లు, మసకబారిన విభాగినిలు, అసంపూర్తి కాలిబాటలు, ఇతరత్రా సమస్యలు కనిపించకుండా ప్రధాన రహదారులను మెరిసేలా తీర్చిదిద్ది.. ఐదేళ్లపాటు అలాగే కొనసాగించాలన్న లక్ష్యంతో బడా గుత్తేదారు సంస్థలకు వాటిని అప్పగించింది. అందుకు బల్దియా ఐదేళ్లలో రూ.1,585 కోట్లు వెచ్చించింది. కాంట్రాక్టు కాలపరిమితి డిసెంబరుతో ముగియనుంది.

ఉదాహరణలు..

● నారాయణగూడ నుంచి రామంతాపూర్‌నకు వెళ్లే వారంతా అరగంటపాటు నరకం చూపే రోడ్లపై ప్రయాణించాల్సిందే. అంబర్‌పేట 6 నంబరు చౌరస్తా నుంచి ముక్రం హోటల్ వరకు పైవంతెన వల్ల ఏర్పడ్డ మోకాలులోతు గుంతలను దాటి వెళ్లాలి. లేదంటే.. ప్రత్యామ్నాయ దారి డీడీకాలనీ, సాయిబాబా దేవాలయం, మల్లికార్జుననగర్ మీదుగా రామంతాపూర్ చేరుకోవాలి. నల్లకుంట ప్రధాన కూడలిలో, సాయిబాబా దేవాలయం రోడ్డు, సీజన్స్ ఆస్పత్రి సమీప రహదారుల్లో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ● పంజాగుట్ట మోడల్‌హౌస్ - జలగం వెంగళరావు పార్కు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది.

వీధి లైట్లు సరిగా వెలగడం లేదు

■ రాజ్‌భవన్ రోడ్డు, కేసీపీ కూడలి వద్ద తవ్విన భూగర్భ జలాశయం పనులతో కొద్దిపాటి వర్షానికే రహదారిపై రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

■ అయ్యప్ప సొసైటీ గోదావరి కట్స్ దుకాణం చౌరస్తా అస్తవ్యస్తంగా మారింది. అక్కడి నుంచి కైత్లాపూర్ వెళ్లే రోడ్డుపై అడుగడుగునా గుంతలే. ఇది ప్రైవేటు ఏజెన్సీలకు ఇచ్చిన రోడ్డు అయినప్పటికీ.. సర్వే ఆఫ్ ఇండియా, తులసినగర్ రోడ్డు చౌరస్తాలో మోకాలులోతు గుంతలు ఏర్పడ్డాయి. మ్యాన్‌హోళ్లన్నీ ధ్వంసమయ్యాయి. దాదాపు ఏడాదిన్నరగా ఈ కూడలిలో మరమ్మతులు జరగకపోవడం గమనార్హం. ఇదే రోడ్డులో శ్రీచైతన్య అకాడమీ వద్ద కాలిబాట ధ్వంసమై.. ఆ ప్రాంతం మురికికూపంగా మారింది.

■ సికింద్రాబాద్ మెట్టుగూడ మెట్రో స్టేషన్ కింద, ఖైరతాబాద్ మెట్రోస్టేషన్ కింద గుంతలమయంగా మారాయి.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో కృష్ణాయాదవ్, కార్పొరేటర్లు

గోల్నాక, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రకృతితో మమేకమై పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను తెలియజేస్తుందని తెలిపారు. ఆదివారం గోవింద్‌నగర్‌లో జరిగిన అంబర్‌పేట నియోజకవర్గం మహిళా చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. పొదుపు సంఘాల మహిళల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈనెల 9న సాయంత్రం అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, కార్పొరేటర్లు ఉమారాణి, అమృత, నేతలు మూల రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

సహజ సిద్ధ శిలా కళా సౌందర్యానికి నిలయం తెలంగాణ



కార్యక్రమంలో ప్రొ.వేదకుమార్, మహేందర్‌రెడ్డి, వేణుగోపాల్ తదితరులు

రాయదుర్గం న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రకృతి చెక్కిన సహజ సిద్ధ శిలా కళా అద్భుతాలు అనేకం ఉన్నాయని, వాటికి యునెస్కో గుర్తింపునకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని దక్కన్ హెరిటేజ్ అకాడమీ ఛైర్మన్ ప్రొ.వేదకుమార్ మణికొండ అన్నారు. అంతర్జాతీయ భౌగోళిక వైవిధ్య దినోత్సవం సందర్భంగా ఖాజాగూడ ఫక్రుద్దీన్ గుట్టపై జియో హెరిటేజ్ ట్రయల్, టాక్ ఆన్ జియో డైవర్సిటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి వేదకుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. తెలంగాణలో లక్షల ఏళ్ల నాటి భౌగోళిక వైవిధ్యాలు అనేకం ఉన్నాయని, అవి ప్రపంచంలోని అతిపెద్ద ప్రాకృతిక రాతి సౌందర్యాలుగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పాండవుల గుట్టను మాత్రమే జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించాయన్నారు. ఇప్పటికీ మరెన్నో గుర్తింపునకు అర్హమైన ప్రదేశాలున్నాయని చెప్పారు. వాటిని పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రభుత్వ విధానాలు, ఆచరణలు అమలులోకి తీసుకు రావాలన్నారు. జీఎస్ఐ విశ్రాంత డైరెక్టర్ కమతం మహేందర్‌రెడ్డి ప్రసంగిస్తూ.. భౌగోళిక ప్రాధాన్య ఆస్తులు పోతే తిరిగి పొందలేమని చెప్పారు. జీఎస్ఐ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ చక్కిలం వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రకృతి సహజసిద్ధ శిలాకళాకృతులతో అలరారుతున్న కొండలు భౌగోళిక అద్భుతాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కొండలను హైదరాబాద్ గ్రానైట్ కాంప్లెక్స్‌గా పిలుస్తారని తెలిపారు. అవి 250కోట్ల సంవత్సరాల కిందటివని, 10000 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయని వివరించారు. ఇంకా అనేక ప్రకృతి వింతలు, విశేషాలపై అధ్యయనాలు జరగాల్సి ఉందన్నారు. చరిత్రకారుడు రామోజు హరగోపాల్, సీనియర్ సైంటిస్ట్ సోమా రామ్మూర్తి, ఎ.ఆర్.రామ్‌రాజ్, సకీనా, జాజిర్ హుస్సేన్, వేముగంటి మురళీకృష్ణ, శోభాసింగ్, ఎస్.ఎస్.ప్రసాద్, మహేందర్‌రెడ్డి, వై.సుభాష్‌రెడ్డి, మహమ్మద్ అఫ్జల్, ఇలియాస్, ఎస్.ధనుంజయ, పి.నరహరి పాల్గొన్నారు.

గణేశ్ నవరాత్రుల సమయంలో భారీ విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బందులు లేకుండా ట్యాంక్‌బండ్‌పై పలు విద్యుత్తు స్తంభాలను తొలగించారు. తాజాగా వాటిని యథాస్థానంలో ఏర్పాటు చేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.



నిజాం ఆస్తులు కొట్టేసేందుకు నకిలీ పత్రాలతో కుట్ర

నగర సీసీఎస్‌లో ఏడో నిజాం మనవరాలు ఫిర్యాదు

ఈనాడు, హైదరాబాద్: నిజాం వారసులుగా నకిలీ పత్రాలు సృష్టించి ఆస్తులు కొట్టేసేందుకు కుట్రపన్నారంటూ ఏడో నిజాం ఉస్మానియా అలీ ఖాన్ బహదూర్ మనవరాలు ప్రిన్సెస్ ఫాతిమా ఫౌజియా శనివారం నగర సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మిర్ ఉస్మాన్ అలిఖాన్ రెండో కుమారుడు హైనస్ వాల్షన్ ప్రిన్స్ మౌజ్జమ్ ఝా బహదూర్ కుమార్తె ఫాతిమా ఫౌజిమా బంజారాహిల్స్‌లో ఉంటున్నారు. 2016లో నాంపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు తామే వారసులమంటూ తమ పేరిట జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) చేశారంటూ 150 మంది సాక్షులతో న్యాయస్థానం ద్వారా వారసత్వ పత్రం పొందినట్టు పేర్కొన్నారు. అవన్నీ ఫోర్జరీ సంతకాలతో సృష్టించిన నకిలీపత్రాలని, వాటితో నిజాం ఆస్తులు, ప్రభుత్వం నుంచి పరిహారం పొందుతున్నట్టు వివరించారు. ముస్లిం పర్సనల్ చట్టం ప్రకారం నిజాం 7కు దుల్హాన్ పాషా ఒక్కరే భార్య అని ఆయన భార్యలుగా చెప్పుకొంటున్న వారికి చట్టప్రకారం అర్హత లేదన్నారు. నకిలీపత్రాలతో న్యాయస్థానాన్ని మోసగించారన్నారు. తమిళనాడులో ఉన్న రూ.121 కోట్ల విలువైన ఎస్టేట్‌ను కాజేసేందుకు నిందితులు కుట్రపన్నుతున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదుచేయకపోవటంతో ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాలతో సీసీఎస్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



కుమార్తె పాడె మోస్తున్న రాజేంద్రప్రసాద్

ముగిసిన గాయత్రి అంత్యక్రియలు

భావోద్వేగానికి గురైన రాజేంద్రప్రసాద్

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: సినీనటుడు రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి(38) అంత్యక్రియలు కేపీహెచ్‌బీ ఏడోఫేజ్‌లోని కైలాసవాసంలో ముగిశాయి. ఆమె భర్త రాజ్‌కుమార్ చితికి నిప్పంటించారు. కుమార్తె పాడె మోసిన రాజేంద్రప్రసాద్ తోటి కళాకారులు, కుటుంబసభ్యుల వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. ఏపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, నిర్మాతలు అశ్వినీదత్, అల్లు అరవింద్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, శివాజీ, రమాప్రభ, చోటాకెనాయుడు గాయత్రి భౌతికకాయానికి నివాళులర్పించారు.

వడ్డీ మాఫీ.. అదనపు ఛార్జీలు రద్దు

పెండింగ్ నీటి బిల్లులకు ఓటీఎస్‌తో రాయితీ పొందే అవకాశం

ఈనాడు, హైదరాబాద్: మీ నీటి బిల్లులు రూ.వేలు లేదా లక్షల్లో పేరుకుపోయాయా.. అయితే, జలమండలి ప్రవేశపెట్టిన వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం(ఓటీఎస్)తో భారీ రాయితీ పొందే అవకాశమంది. గతంలో ఈ స్కీంతో అనేకమంది లబ్ధి పొందారు. జలమండలికి పెద్దఎత్తున ఆదాయం సమకూరింది. దీంతో మరోసారి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రస్తుతం ఉన్న బకాయిలపై వడ్డీతోపాటు అదనపు ఛార్జీలు రద్దు చేయనున్నారు. ఈ స్కీం ద్వారా కనీసం రూ.2 వేల నుంచి బకాయిలను బట్టి రూ.లక్షల్లోనే వడ్డీ రాయితీ పొందవచ్చునని అధికారులు తెలిపారు. గ్రేటర్‌వ్యాప్తంగా 13లక్షల నల్లా కనెక్షన్లు ఉండగా.. 7.1 లక్షల నల్లాదారులకు బకాయిలున్నాయి. గృహ నల్లాల నుంచి బల్క్ కనెక్షన్ల వరకు మొత్తం రూ.1961 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. ఇందులో వడ్డీ, అదనపు రుసుమే రూ.705 కోట్ల వరకు ఉంది. తాజాగా ఓటీఎస్ ద్వారా ఒకేసారి బకాయిల చెల్లింపునకు ముందుకు వచ్చే నల్లాదారులకు వడ్డీ మొత్తం మాఫీ చేయనున్నారు. గతంలో ఈ స్కీం ద్వారా లబ్ధి పొందిన వారు సైతం 50శాతం వరకు రాయితీ పొందే వీలుంది. ఉచిత నీటి పథకం వల్ల చాలా మంది బకాయిలు చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. దీనిపై వడ్డీల భారం పడుతోంది. ఎప్పటికైనా పెండింగ్ బిల్లులు చెల్లించక తప్పదు. ఈ తరుణంలో ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని జలమండలి సూచిస్తోంది.



కె.అశోక్‌రెడ్డి, ఎండీ, జలమండలి

నీటి బకాయిలు (రూ.కోట్లల్లో)

కేటగిరి	నల్లాల సంఖ్య	31.08.24 వరకు బకాయిలు	బకాయిలపై వడ్డీ	అసలు మొత్తం
గృహ నల్లాలు	557165	683.37	171.83	511.55
డొమెస్టిక్ స్లమ్	130338	88.14	36.65	51.49
వాణిజ్య	23219	190.58	61.81	128.77
పారిశ్రామిక	481	202.38	111.44	90.95
ఎంఎస్‌బీ	7049	20.89	4.29	16.60
బల్క్	9	663.29	271.20	393.09
కాలనీలు	179	112.59	48.53	64.06
మొత్తం	718440	1961.25	705.75	1255.51

సద్వినియోగం చేసుకోండి: అశోక్‌రెడ్డి, ఎండీ, జలమండలి

ఇప్పటివరకు ఉన్న బకాయిలపై వడ్డీ, ఆలస్య రుసుం రద్దు అవుతుంది. అవసరమైతే డివిజన్ వారీగా శిబిరాలు ఏర్పాటు చేసి అక్కడికక్కడ బకాయిలు చెల్లించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ఈ నెలాఖరు వరకు ఈ స్కీం అందుబాటులో ఉంటుంది.

'భారతావనిని కాపాడుకోవడం హిందువుల ధర్మం'

మారేడుపల్లి, న్యూస్‌టుడే: మనం అర్హత లేనివారికి స్వేచ్ఛను ఇవ్వడంతో భారతావనిలో స్వేచ్ఛ లేకుండా పోతోందని దానిని కాపాడుకోవడం హిందువుల ధర్మమని మానేపల్లి గ్రూప్ ఆఫ్ ఛైర్మన్, భువనగిరిలోని స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణదాత రామారావు, ఆర్ఎస్ఎస్ తెలంగాణ జనరల్ సెక్రటరీ కాచం రమేష్‌లు అన్నారు. వెస్ట్‌మారేడుపల్లి తపాలా కార్యాలయం సమీపంలోని క్రీడా మైదానంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ సంఘం వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకొని సికింద్రాబాద్ శాఖ ఆధ్వర్యంలో విజయదశమి, సంఘం శతాబ్ది ప్రారంభోత్సవంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలకు ఆయుర్వేద వైద్యులు కృష్ణప్రసాద్‌తో కలిసి విచ్చేసి మాట్లాడారు. కరసేవకులు కవాతు నిర్వహిస్తూ రూట్ మార్చ్‌గా బయలుదేరి వెస్ట్‌మారేడుపల్లి, మహాత్మాగాంధీనగర్, ఈస్ట్‌మారేడుపల్లి మీదుగా క్రీడా మైదానం చేరుకొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న రామారావు, కాచం రమేష్, కృష్ణప్రసాద్

బాలికను గర్భవతిని చేసిన వలస కార్మికుడు

నిందితుడిపై పోక్సో కేసు

శంషాబాద్, న్యూస్‌టుడే: బాలికను బెదిరించి పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడి గర్భవతిని చేసిన వలస కార్మికుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆర్జీఐఏ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్‌కు చెందిన దంపతులు గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలో రోజువారీ కార్మికులుగా పని చేస్తూ ఇద్దరు కుమార్తెలను పోషించుకుంటున్నారు. ఇటీవల తల్లి తను పనిచేసే పరిశ్రమ వద్దకు ఓ కుమార్తె(16)ను వెంట తీసుకుని వెళ్తోంది. అదే పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న బిహార్‌కు చెందిన అన్సారీ(24) ఆ బాలికపై కన్నేశాడు. అదనుచూసి ఆమెను బెదిరించి పలుమార్లు అత్యాచారం చేశాడు. ఇటీవల ఆ బాలిక అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లగా గర్భవతిగా తేలింది. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు ఆదివారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.






కళాకృతులు.. కళావిహీనం

షేక్‌పేట నుంచి ఫిలింనగర్ వెళ్లే మార్గంలో ఆకట్టుకునేలా కనిపించేలా డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన కళాకృతులకు నిర్వహణ కరవైంది. కొన్నింటి కాళ్లు, చేతులు విరిగిపోగా మరికొన్నింటి చేతుల్లో అమర్చిన సామగ్రి మాయమైంది. ఆకతాయిలు నిత్యం అక్కడ తిష్ఠ వేస్తున్నారు. అధికారులూ స్పందించండి

లాభాలంటూ ఆశ.. మాదకద్రవ్యాలంటూ బెదిరింపులు

- ■ 18 మంది అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల అరెస్టు
- ■ దేశవ్యాప్తంగా నిందితులపై 319 కేసులు

ఈనాడు, హైదరాబాద్, నారాయణగూడ, న్యూస్‌టుడే: షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు, ఫెడెక్స్ కొరియర్ పేరిట బెదిరింపులకు పాల్పడుతూ రూ.6.94కోట్లు కొట్టేసిన 18 మంది అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. సీపీ సీవీ ఆనంద్ ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. అంతర్రాష్ట్ర నేరగాళ్లు కేవలం స్మార్ట్ ఫోన్‌తోనే సామాన్యులను మోసగిస్తున్నారు. తాము సేకరించిన సమాచారం ఆధారంగా వాట్సాప్, ఫోన్ నంబర్లకు లింకులు పంపుతారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపుతారు. ఫెడెక్స్ కొరియర్‌లో మాదకద్రవ్యాలు వచ్చాయని బెదిరిస్తారు. నగరంలో ఈ తరహా మోసాలపై 10 కేసులు నమోదయ్యాయి. వేర్వేరు ప్రాంతాల్లోని నిందితులను పట్టుకునేందుకు సైబర్‌క్రైమ్ డీసీపీ కవిత దార, ఏసీపీలు చాంద్‌పాషా, శివమారుతి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్లు ప్రసాదరావు, నరేశ్, శీతారాములు, రాజు, ప్రమోద్ కుమార్ బృందాలు రాజస్థాన్, కర్ణాటక, మహారాష్ట్రల్లో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించారు. నిందితుల ఫోన్ నంబర్ల ఆధారంగా లొకేషన్ గుర్తించి పక్కా సమాచారంతో దాడులు చేశారు. బ్యాంకు ఖాతాల నిర్వహణ, కమీషన్ కోసం అద్దె ఖాతాలను సేకరిస్తున్న మూడు రాష్ట్రాలకు చెందిన నిఖేశ్ భటి, సంజయ్ బిమన్‌దాస్, యోగేశ్ కుమార్, దేవరాజ్ చంద్రావత్, రోహన్ యాదవ్, అమిర్ కాశీనాథ్ జాధవ్, ఆరిఫ్ బర్కత్ అలీ, సాకేత్ సతీశ్, అన్నగోకుల్ ఢాగే, అజయ్ గోపీనాథ్ మిశ్రా, కపిల్‌భౌ సాహెబ్ నగారే, రిధి బేడి, శ్రీధర్, ఉదయ్ కుమార్, వరుణ్ కుమార్, జి.కౌశిక్, సమీన్‌ఖాన్, షేకుల్ ఖాన్‌లను అరెస్ట్ చేశారు. నిందితులపై దేశవ్యాప్తంగా 319 కేసులు ఉండగా, తెలంగాణలో 45 కేసులు ఉన్నాయి. వారి నుంచి రూ.5 లక్షల నగదు, 26 ఫోన్లు, 16 ఏటీఎం కార్డులు, 11 చెక్ బుక్స్, 7 పాస్‌పుస్తకాలు, 10 సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల బ్యాంకు ఖాతాల్లోని రూ.1.61 కోట్ల నగదు లావాదేవీలను స్తంభింపజేశారు. అనుమానాస్పద లావాదేవీలు, ఫోన్ కాల్స్‌పై టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

మీరు డబ్బులిస్తే.. నే యూపీఐలో చెల్లిస్తా

మహానగరంలో మాయగాళ్ల హల్‌చల్



ఈనాడు, హైదరాబాద్: పెట్రోల్‌బంక్ వద్దకెళ్లిన యువకుడు తనకు నగదు చెల్లిస్తే ఆన్‌లైన్‌లో బదిలీ చేస్తానంటూ నిర్వాహకుడిని కోరాడు. 10శాతం అదనంగా సొమ్ము వస్తుందనే ఆశతో అతను అంగీకరించాడు. మొబైల్ నంబర్‌కు బ్యాంకు సందేశం రావటంతో మురిసిపోయాడు. కొంత సమయం తరువాత నగదు నిల్వలు పరిశీలించుకొని మోసపోయినట్టు గుర్తించాడు. గుర్తుతెలియని వ్యక్తి ఒకేరోజు మూడు చోట్ల ఇదే తరహాలో రూ.లక్షన్నర మేర కాజేశాడు. ఏటీఎం కేంద్రం వద్ద మధ్యవయస్కుడు తాను డెబిట్ కార్డు మరచిపోయానంటూ.. ఒక మహిళ వద్ద నగదు తీసుకొని యూపీఐ ద్వారా రూ.50 వేలు చెల్లించాడు. ఇంటికెళ్లి చూసుకున్న మహిళ నగదు రాలేదని పోలీసులను ఆశ్రయించింది. నగరంలో మాయగాళ్లు కొత్త తరహా మోసాలకు తెగబడుతున్నారు. ఏవో కారణాలు చెబుతూ 'మీరు నగదు ఇస్తే.. తాను యూపీఐలో చెల్లిస్తా' నంటూ బురిడీ కొట్టిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆసరా చేసుకొని వీలైనంత పెద్దమొత్తంలో కొట్టేస్తున్నారు.

మోసం రూపాలు అనేకం

నగదు చెల్లింపుల్లో యూపీఐ వినియోగం పెరిగింది. జేబుల్లో ఏటీఎం కార్డులు లేకున్నా ఫోన్‌లోనే లావాదేవీలు నిర్వహించే వెసులుబాటు వచ్చింది. ఈ అవకాశాన్ని మోసగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. రాజస్థాన్‌కు చెందిన ముఠా సభ్యులు.. నగరంలోని పలు దుకాణాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేసి యూపీఐ ద్వారా నగదు చెల్లించారు. కొంత సమయానికి ఆ నగదు ఉపసంహరణ జరగటంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో అంతర్రాష్ట్ర ముఠా యూపీఐ చెల్లింపులను ఆసరా చేసుకొని రూ.4కోట్ల విలువైన వస్తువులు కాజేసినట్టు నిర్ధారించారు. దేశవ్యాప్తంగా 10 కేసులతో ప్రమేయం ఉన్న 13 మందిని అరెస్ట్ చేశారు. తాజాగా ఇదే తరహాలో బ్యాంకులు, పెట్రోల్ బంకులు, షాపింగ్‌మాల్స్ వద్దకు చేరి తమకు అత్యవసరంగా డబ్బులు కావాలని. . కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో ఉన్నారంటూ అవతలి వారిని బోల్తా కొట్టిస్తున్నారు. వారి నుంచి నగదు చేతికి అందగానే యూపీఐ స్కానర్ ద్వారా చెల్లింపులు పూర్తిచేస్తున్నారు. బ్యాంకు ఖాతాలో నగదు జమైనట్టు ఫోన్‌కు సందేశం రావటంతో తేలికగా నమ్ముతున్నారు. నగదు నిల్వల్లో తేడాలున్నట్టు గుర్తించి అడిగితే సాంకేతిక కారణాలు కావచ్చంటూ మభ్యపెట్టి మాయమవుతున్నారు. సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న దొంగలు, సైబర్ నేరస్థులకు సహకరిస్తున్న ఏజెంట్లు ఈ తరహా మోసాలకు పాల్పడే అవకాశం ఉందని పోలీసు అధికారి అభిప్రాయం వ్యక్తంచేశారు. పరిచయం లేని వ్యక్తులతో నగదు లావాదేవీలు నిర్వహించటం నష్టంతోపాటు కొన్నిసార్లు పోలీసు కేసుల్లో ఇరుక్కొనే అవకాశం ఉందని హెచ్చరించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00	డ్రెస్డ్	197–00
రిటైల్	136–00	స్కిన్‌లెస్	224–00

అమెరికాలో బతుకమ్మ సంబరాలు



అమెరికాలోని నార్త్ కరోలినా కాంకార్డ్ కానన్‌రన్ ప్రస్థమ్‌లో తెలంగాణకు చెందినవారు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా పిల్లలు, పెద్దలు కలిసి ఆడిపాడారు. –ఈనాడు డిజిటల్, హైదరాబాద్

నిస్సాన్ న్యూ మ్యాగ్నైట్ కారు ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న వర్షిణి సౌందర్‌రాజన్, ఎండీ సిరాజ్ బాబూఖాన్

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: సరికొత్త టెక్నాలజీతో రూపొందించిన నిస్సాన్ న్యూ మ్యాగ్నైట్ కారును ఆదివారం నటీమణి వర్షిణి సౌందర్ రాజన్ ఎర్రగడ్డ వైబ్రంట్ నిస్సాన్ షోరూంలో ఆవిష్కరించారు. ఎండీ సిరాజ్‌బాబూఖాన్ మాట్లాడుతూ.. టెక్నాలజీ, 40 ప్లస్ స్టాండర్డ్ సేఫ్టీ ఫీచర్స్ ఉన్న ఈ కారు ధర అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. ఏఎస్ఎం అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

సంతాన భాగ్యం.. కల సాఫల్యం

● గాంధీలో త్వరలో అత్యాధునిక ఐవీఎఫ్ కేంద్రం



కేంద్రంలో పరికరాలు

గాంధీ ఆసుపత్రి, న్యూస్‌టుడే: గాంధీ ఆసుపత్రిలో సంతాన సాఫల్య కేంద్రంలో పూర్తిస్థాయి వైద్య సేవల్ని అందించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పెళ్లై ఏళ్లు గడిచినా పిల్లలు పుట్టకపోవడంతో ఎంతోమంది దంపతులు కార్పొరేట్, ప్రైవేటు సెంటర్ల చుట్టూ తిరుగుతూ రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇది పేద, మధ్యతరగతి వారికి తలకుమించిన భారమే. ఇలాంటి వారికి ఊరట కలిగిస్తూ.. పైసా ఖర్చు లేకుండా సంతాన సాఫల్యం కల్పించేందుకు సర్కారు గాంధీ ఆసుపత్రిలో ఇన్ విట్రో ఫెర్టిలిటీ (ఐవీఎఫ్) కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురానుంది.

మంత్రి ఆదేశాలతో.. ఇటీవల గాంధీ ఆసుపత్రిని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సందర్శించారు. ఈసందర్భంగా కేంద్రం ఏర్పాటుకు నిధులు మంజూరైన విషయాన్ని తెలుసుకొని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

సాకారం కానున్న ఐదేళ్ల కల... గాంధీలో 2018లో సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు చేశారు. కోవిడ్ కారణంగా ఈ ఆసుపత్రిని నోడల్ సెంటర్‌గా మార్చడంతో ఫెర్టిలిటీ సేవలు నిలిచిపోయాయి. కరోనా అనంతరం 2021 సెప్టెంబరులో తిరిగి పునఃప్రారంభించారు. 2022 జనవరిలో పలు రకాల వసతులు కల్పించి ఇంట్రా యుటెరిన్ ఇన్‌సెమినేషన్(ఐయూఐ) అందుబాటులోకి తెచ్చారు. ప్రతి నెల సుమారు 800 మందికి వైద్య సేవలు అందించి 40శాతం ఫలితాలు సాధించారు. ఈ నేపథ్యంలో 200 పడకల మదర్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) సూపర్ స్పెషాలిటీ సెంటర్ అందుబాటులోకి రావడం, మంత్రి ఆదేశాలు జారీ చేయడంతో ఐవీఎఫ్ కేంద్రాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు తగిన నిధులు కేటాయించి, అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా.. గాంధీ ఎంసీహెచ్ భవనంలో ఏర్పాటు చేసిన ఐవీఎఫ్ సెంటర్‌ను అధునాతన పరికరాలు, సౌకర్యవంతమైన వసతులతో కార్పొరేట్‌కు దీటుగా రూపొందించారు. ఎంబ్రియాలజీ ల్యాబ్, ఐవీఎఫ్ ఆపరేషన్ థియేటర్, ఆండ్రాలజీ ల్యాబ్‌లు, ఫలదీకరణ చేసేందుకు ఆధునిక ఎక్విప్‌మెంట్, సెమన్ ఎనాలసిస్ యంత్రాలు, రీఏజెంట్స్ డయాగ్నోస్టిక్ హిస్టరీ లేపరోస్కోపీ, అల్ట్రాసౌండ్, కంట్రోల్ వేరియంట్, హైపర్ స్టిమిలేషన్ (సీఓఏ)లను సమకూర్చుతున్నారు. ఐవీఎఫ్‌లో ఎంబ్రియాలజీ ప్రక్రియ అత్యంత కీలకమని వైద్యనిపుణులు తెలిపారు.

అన్నిరకాల సేవలు ఉచితం

– రాజకుమారి, గాంధీ సూపరింటెండెంట్



సంతానంలేని దంపతులు పిల్లల కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తుంటారు. ఇక్కడి ఐవీఎఫ్ సెంటర్‌లో అన్ని రకాల వైద్యసేవలు ఉచితంగా పొందవచ్చు. మందులు, స్కానింగ్ ఇతర వైద్యపరీక్షలు, సేవల కోసం పైసా ఖర్చు చేసే అవసరం లేదు. త్వరలోనే ఐవీఎఫ్ సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తాం.



రవీంద్ర భారతిలో బతుకమ్మ ఆడుతున్న మంత్రి సీతక్క

బతుకమ్మను బతికించుకుందాం: సీతక్క


రవీంద్రభారతి, న్యూస్‌టుడే: చినుకులు రాలుతున్న వేళ.. రవీంద్రభారతి ఆరుబయట బతుకమ్మలు ఆడుతూ.. మహిళలు సందడి చేస్తుంటే.. కళామందిరంలో గాయనీ గాయకులు 'ఆమని పాడవే హాయ్‌గా' శీర్షికన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యానికి స్వరనీరాజనం సమర్పించారు. వేడుకలో పాల్గొన్న మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ.. అత్తారింటికి వెళ్లిన ఆడబిడ్డ అప్పుడప్పుడు తల్లిగారింటికి రావడానికి, తమ కష్టసుఖాలు కన్నవాళ్లతో, స్నేహితులతో పంచుకోవడానికి చక్కటి వేడుక బతుకమ్మ అన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, గాయనీ గాయకులు సురేఖామూర్తి, వినోద్‌బాబు తదితరులు ఉన్నారు.

ప్రతి గౌడ బిడ్డ 'గోపా'లో సభ్యుడవ్వాలి: మంత్రి



మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం నెక్లెస్ రోడ్డు, పీవీమార్గ్‌లోని నీరా కేఫ్‌లో ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ ప్రతి గౌడ బిడ్డ గోపాలో సభ్యుడిగా చేరాలన్నారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, రాజేశంగౌడ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, హస్తకళల ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ గౌడ్, బీసీ కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు కోడూరు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. గోపా నూతన కార్యవర్గంలో అధ్యక్షుడు డాక్టర్ బండి సాయన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి జీవీ శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి మొగిలి రఘునాథ్ గౌడ్‌లతో పాటు 50 మంది ఒకేసారి ప్రమాణం చేశారు.



సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి



కిషన్‌రెడ్డికి పత్రిక అందజేస్తున్న దుర్గాప్రసాద్‌రెడ్డి, ప్రతినిధులు

కాచిగూడ, బర్కత్‌పుర – న్యూస్‌టుడే: సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని నేటి యువతకు తెలియజేయాలన్నారు. అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా సమ్మేళనానికి హాజరు కావాలని ఆదివారం కాచిగూడలోని నివాసంలో సమితి ప్రతినిదులు ఆహ్వాన పత్రికను అందజేశారు. సమితి సలహాదారు దుర్గాప్రసాద్‌రెడ్డి, ఛైర్మన్ పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, అధ్యక్షుడు శంకర్‌గౌడ్ రంగంపల్లి రాజు, పంజాల గిరిధర్‌గౌడ్, బింది మల్లికార్జున్‌గౌడ్, దోమకొండ కిషోర్, కె చంద్రశేఖర్, చింతల శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారుల క్రీడా పోటీలు షురూ



మాట్లాడుతున్న ఆర్ఎం డోబ్రియల్

దుండిగల్, న్యూస్‌టుడే: శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంలో క్రీడలు దోహదపడతాయని రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధాన అధికారి, అటవీ దళాల అధిపతి ఆర్ఎం డోబ్రియల్ పేర్కొన్నారు. దూలపల్లిలోని తెలంగాణ అటవీ అకాడమీలో ఏడో రాష్ట్రస్థాయి అటవీశాఖ అధికారుల క్రీడా పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మన జీవితంలో అంతర్భాగమని, క్రమశిక్షణను నేర్పుతాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 815 మంది అటవీ శాఖ అధికారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జోనల్, రాష్ట్ర స్థాయిలో ప్రతిభచూపిన వారు ఈనెల 16న రాయపూర్ వేదికగా జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనున్నారు. ప్రారంభ వేడుకలో రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధాన అధికారులు ఎలుసింగ్ మేరు, సువర్ణ, రామలింగం, రాష్ట్ర అటవీ అకాడమీ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వ వేదికపై భారతీయ ప్రమాణాలకు అగ్రస్థానం



ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: విశ్వవేదికపై భారతీయ ప్రమాణాలు ప్రత్యేక స్థానం పొందుతున్నాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం ఉదయం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రన్ ఫర్ క్వాలిటీలో పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. ఐమాక్స్ వద్ద ఉన్న హెచ్ఎండీఏ మైదానం నుంచి జలవిహార్ వరకు పరుగు సాగింది. బీఐఎస్ హైదరాబాద్ శాఖ అధిపతి పీవీ శ్రీకాంత్ మాట్లాడుతూ ఐఎస్ఐ మార్కు వినియోగదారుల భరోసాగా నిలుస్తోందని, ప్రతీ ఒక్కరూ బీఐఎస్ స్టాండర్డ్ మార్కు ఉన్న వస్తువులను మాత్రమే కొనాలని కోరారు. బీఐఎస్ జాయింట్ డైరెక్టర్లు సుజాత, తన్నీరు రాకేశ్, సెక్షన్ ఆఫీసర్ వనజ మూర్తి, ఎస్పీఓ అభిసాయి పాల్గొన్నారు.

అందుబాటులోకి వెన్నెముక ఆరోగ్య సంరక్షణ కొత్త విధానం



ఒప్పంద పత్రంతో పుల్లెల గోపీచంద్, చిత్రంలో చాముండేశ్వరనాథ్, కాసు కృష్ణారెడ్డి, డాక్టర్ సుకుమార్ సురా తదితరులు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: శస్త్రచికిత్స అవసరం లేకుండా కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని వెన్నెముక ఆరోగ్య సంరక్షణతో ఒక కొత్త విధానాన్ని ఆదివారం నగరంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఫిన్‌లాండ్‌లోని నార్డిక్ హెల్త్ భాగస్వామ్యంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 92లో ఎన్-ష్యూర్ హెల్తీ స్పైన్ పేరుతో ఏర్పాటుచేసిన ఈ వెన్నెముక ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని బ్యాడ్మింటన్ ఛాంపియన్, జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వెన్నెముక విషయంలో కృత్రిమ మేధ సహకారంతో రూపొందించిన ఈ విధానంలో ఉపయోగించే ఉపకరణాల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు అవుతుందన్నారు. ఎన్-ష్యూర్ హెల్తీ స్పైన్ ఛైర్మన్ కాసు ప్రసాద్‌రెడ్డి, సహ వ్యవస్థాపకులు డాక్టర్ సుకుమార్ సురా, సీఈఓ నరేష్‌కుమార్ పగడిమర్రి మాట్లాడుతూ పుల్లెల గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ (పీజీబీఏ) సహకారంతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకుందని అన్నారు. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు చాముండేశ్వరీనాథ్, హైసియా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ లింగిరెడ్డి, ఫిన్‌లాండ్‌లోని నార్డిక్ హెల్త్‌లో శిక్షణ, విద్యావిభాగాధిపతి జోహన్నా పెంటి తదితరులు పాల్గొన్నారు.

EENADU e Classifieds

AUTO

కార్ అమ్మాలనుకుంటున్నారా ? మేము అన్ని రకముల కార్లు కొంటాము. మీ ఇంటికి వచ్చి మీ కారుని సరైన ధరకు కొని స్పాట్ క్యాష్ ఇస్తాము. Ph: 9908000076

BUSINESS SERVICES

BUSINESS OFFER

Data Editing Software Projects are Available for Outsourcing to Companies with Min. 5 Computers. Ph: 9652438681

FOR SALE

India's Leading Dry Cleaning and Laundry Service Brand 'Tumbledry' Shankarpally, Hyd. Franchise for Sale. ✆ 7093001260, 9849518888, 9701641555.

New Petrol Bunk with land for sale @ Nacharam Lands for sale @ Jeedimetla 3498 Sqrds. ✆ 7013328787.

EDUCATION

రెగ్యులర్ & డిస్టెన్స్ గైడెన్స్: డిగ్రీ, PG, B.Tech, డిప్లొమా, D&B- ఫార్మసీ, D.Ed, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc(నర్సింగ్), GNM. Ph: 8866977112, 339

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు. హైదరాబాద్:- హోటల్ శ్రీకస్టల్స్, కామత్ హోటల్ ఎదురుగా, నాంపల్లి స్టేషన్‌రోడ్, ప్రతీనెల 7, 14, 21 తేదీల్లో మందులు.

HOME NEEDS

PEST CONTROL

Bio - Chem Pest Control (Since: 2006) చెదలు, బొద్దింకల నివారణకు వాసనరాని, కెమికల్ 5 సం॥ గ్యారెంటీతో ఫ్రీ ఇన్‌స్పెక్షన్. ✆ 9705657924/ 7729928646.

PERSONAL CLASSIFIEDS

LOST

నా పేరు నడుమ శ్రావిత. వయస్సు 33 సం॥లు. 2023వ సంవత్సరంలో కౌకూర్‌కు ఇల్లు షిఫ్ట్ అవుతుండగా నా పాస్‌పోర్టు (R1618202) పోయింది. పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినచో ఈ నెంబరులో సంప్రదించండి. 7674992479

PEOPLE CARE

OLD AGE HOME

కవిత హోంకేర్: వృద్ధులు/ పేషెంట్స్/ పిల్లల్ని చూసుకొనుటకు వంట/ఇంటి పనికి వర్కర్స్‌ని మీ ఇంటికే పంపిస్తాం. Ph: 8367210132, 9951853432.

ఒమేగా హోంకేర్ వంట / ఇంటిపని, వృద్ధులను, పేషెంట్లని, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటి వద్దకే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. ✆ 89776 39664, 89776 39665.

REAL ESTATE

FLAT FOR SALE

ECIL

Ready to Occupy New 3BHK 1575 Sq.Ft Super Deluxe Flats for sale at Mallapur, Nacharam. Rathi Constructions Mahesh: 9848577552, 6302946914

GACHIBOWLI

Flats for Sale 2BHK (2 Flats) and 1BHK (1 Flat) at Narsingi, Rangareddy (Dist). Near Highway. Contact: 7780758762.

KUKATPALLY

Flat for Sale. 1400 Sft Commercial Space suitable for Hospitals, Offices, Ready to move with Tenant 40,000/- Rent. KPHB Road-4 ✆ 9581111479, 8885861116.

HOUSE FOR SALE

GHATKESAR

G+1, 2200 Sft, 125 Sq.Yd, Plot No.198, Aushapur, New City C Sector, Warangal H/Way, S/F Nr. Anukushapur- Aushapur Road. 9848059995, 9010586368.

SECUNDERABAD

Trimulgherry Military Dairy Farm Road, Duplex House 4 B/R East Facing 133 Sq.Yds. 2300 Sft, House for Sale. Ph: 9848475723.

LAND FOR SALE

Hyd. కి 40 KMS, కరీంనగర్ మేడ్చల్ హైవే మధ్యలో వంటిమామిడికి 8 KMS 30' రోడ్ శాకారంలో 11 ఎకరాల భూమి అమ్మబడును. (9 ఎ. నాల భూమి, 2 ఎ. నాల Agri భూమి) సతీష్‌రావు. సెల్: 99490 28838.

PLOT FOR SALE

GHATKESAR

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ హైవే బిబి నగర్ టౌన్, AIMS అతి సమీపంలో, HMDA & RERA అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్లు కలవు. గే॥ క॥ ఆల్ డె॥ స్పాట్ రిజి॥. బ్యాంక్ లోన్, ఫ్రీ సైట్ విజిట్. Ph: 9989032598.

HAYATHNAGAR

గజము 2500/- విజయవాడ హైవే, నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ స్విమ్మింగ్‌పూల్, కాటేజీ 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలు 1210గ. (10 గుంటలు) ప్లాట్ అమ్మకం. Ph: 9390261598.

SRISAILAM HIGHWAY

కందుకూరు టౌన్‌లో (Fourth City) హైవే ప్రక్కన ఇళ్ల మధ్య HMDA గేటెడ్ టౌన్‌షిప్‌లో ప్రీమియం ప్లాట్స్ కలవు. & కందుకూరు దగ్గర 70 Acr ఫామ్‌ల్యాండ్ ప్రాజెక్ట్‌లో రిసార్ట్ ఫెసిలిటీతో చక్కని ప్లాట్స్ కలవు. గజం 8000/- ✆ 9030121310.

SHADNAGAR

Launching & Dussera Offer: Buy 242 Sq.Yds. Farm Plot get Free 1 BHK Farm House 6999/- per Sq.Yd. Shadnagar. Nr. RRR. ✆ 9676606974.

GENERAL

దసరా ఆఫర్ - నెలకు 10,000/- ఆదాయంతో 10 నెలలు 5 మందికి మాత్రమే. అమరావతికి 15Km, Hyd హైవేకు 4Km, ORRకు 200 మీ॥, కంచికచర్ల దగ్గర, ఇళ్ళప్రక్కన, CRDA వెంచర్, స్పాట్ రి॥, బ్యాంకు లోన్. ✆ 88018 03689.

సువర్ణభూమి హైదరాబాద్, వైజాగ్‌లో. డిటిసిపి హెచ్ఎండిఏ హుడా అప్రూవల్ కలిగిన ప్లాట్లు గలవు. ఎటువంటి ఏజెంట్ బ్రోకర్ లేకుండా డైరెక్ట్ కంపెనీ ద్వారా కొనుక్కోవచ్చు. చాలా తక్కువ ధరకే 70% లోన్ ఫెసిలిటీ కలదు. 9966777773.

LEASE/ RENT

LB.Nagar 'X' Roads towards Sagar Ring Road 200' Main Road & 30' Backside Road, G+4 Floors, 14000Sft With Cellar, new Complete building, OC received & Ready to occupy. Ph: 9391428899, 9059415299

LAND REQUIRED

భూమి కావలెను, ఆయిల్ పామ్ సాగు కోసం రైతు సొసైటీకి 10 నుండి 50 ఎకరాలు ఖరీదుకు భూమి కావలెను. ధర ఎకరం 10 లక్షల లోపు. సంప్రదించండి: 9440522536, 7013226716.

TO LET

COMMERCIAL

Offices & Stores only near BHEL, Kakatiya Nagar Road No.4, ICICI Bank back 4000 Sft, 2nd, 3rd Floor, Lift. 9848232133, 9000691234.

WANTED

Wanted Land & Building for Lease/ Rent for School in and around Ameerpet. 12,000 Sq.Ft to 20,000 Sq.Ft. Ph/ WhatsApp: 9100774129.

JOBS

Wanted Site Supervisors 1-2Yrs- Exp. Salary: 15K-20K, @ Balaji Prefab P. Ltd, Mahadevapuram, Gajularamaram. Ph: 9949328855

Need retired Bankers and Home Makers please contact: 6304994315. Good salary + incentives.

Sri Padmalaya Auto Finance., Wanted 2 Wheeler Collection Manager, Data Operators, Telecallers, Hyd. ✆ 9866675669, 9494954566.

Walkin Interview for Electrician and Plumber in Kukatpalli. Contact: 7989896938, 9542341512

Wanted Female for Data entry (B.tech/MBA) & female Accountant, Exp: 3yrs. Ph.No: 9502574565, 8919939115

Vijetha College, Clock Tower near Secunderabad Railway Station Wanted Lady Telecaller, Lady Clerk. Cont: 9848407157.

Wanted Office Executives Age below 35 Yrs Bike is a must. Sal. 25 to 30K + Fuel. Ph: 9848172914.

Req for showroom in abids office boys, helpers, salesman, office assistant (female) & marketing exe. Ph: 9440091832

Walk-In-Interview. A Well Potential Org. 18 Years Successfully Completed 2 States Shortly Open Regional Office in Hyd Required below Staff Urgently. 1.Chief Administrative Officer: (Male Only) - 2Posts. Retd. Govt. Officers & Above Caders. Yearly Package: 15 to 20 Lakhs. 2.Jr. Managers: M/F, -15Posts, 10 Years Job Exp., 45 Yrs & Above /Retd., /VRS From Banks /State /Central are Eligible. Yearly Package: 10L. Interviews On: 7th & 8th-October at Company Board Room. Con: Subba Lakshmi Akella, (M.A.) ✆ 8885782299.

రాణిగంజ్ ఆఫీస్‌లో పనిచేయుటకు హౌస్‌కీపింగ్ లేడీస్ మరియు ఆఫీస్ బాయ్స్ కావలెను. హిందీ, తెలుగు మాట్లాడుట తప్పనిసరి. Contact: 9100788404

ఉద్యోగ అవకాశములు 18 సం॥లుగా ఉభయ రాష్ట్రాలలో మంచి గుర్తింపు కలిగిన ప్రముఖ కార్పొరేట్ సంస్థనందు దిగువ ఉద్యోగాలకు అభ్యర్థులు కావలెను. * Sr. Managers: (M/F) ఖాళీలు- 2, 10 సం॥లుపైబడి కార్పొరేట్‌లో అనుభవం కలవారు లేదా రిటైర్డ్ ఉద్యోగులు అర్హులు. ఆదాయం నెలకు: 70,000/- * Trainee Managers: (M/F) ఖాళీలు- 6, 35 సం॥లుపైబడి కనీసం 5 సం॥లు అనుభవం కలవారు అర్హులు. ఆదాయం నెలకు 50,000/-. Note: ఇంటర్వ్యూలు 7-10-24 న రీజినల్ ఆఫీసునందు జరుగును. Con: V. Rao Kancharla. Ph: 9848496867.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. 8317512135.

REQUIREMENT AT THE HYDERABAD BOAT CLUB

Require EXPERIENCED CATERER to run our club canteen. We invite applications from those capable of providing Quality & Hygienic food to our esteemed members.

Require candidate for F & B MANAGER & HOUSE KEEPING STAFF with good experience.

Interested candidates, contact : 9848584141, 8106724999 (or) thehyderabadboatclub@gmail.com

TOURS AND TRAVELS

కార్తీకమాసం జ్యోతిర్లింగాలు భీమశంకర్, త్రయంబకేశ్వర్, ఘృష్ణేశ్వర్, ఔండా నాగనాథ్, పరళీ వైద్యనాథ్, షిరిడి, కొల్హాపూర్, పండరీపూర్, తుల్జాపూర్ + 20 క్షేత్రములు 8 రోజులు మహారాష్ట్ర ఏసీ బస్సు Nov. 4 & 26. లక్ష్మి టూర్స్. ✆ 98662 46466.

రామేశ్వరం, కన్యాకుమారి, మదురై, కంచి 10 వేలు, 8 రో॥ 25-11 ★ కాశీ ప్రయాగ, నైమిశారణ్యం, అయోధ్య 12 1/2 వేలు. 9 రో॥ 17-10. అన్ని టూర్స్ మా స్వంత వంట భోజనం & రూమ్స్. సత్యసాయి. 9618933189.

3/11, రామేశ్వరం, కన్యాకుమారి, అరుణాచలం, కంచి, శ్రీరంగం, 10 రో॥ 17/1 మధుర, సోమనాథ్, ద్వారక, ఉజ్జయిని, ఓంకారేశ్వర్ 11 రో॥ 13/2, కాశీ, అయోధ్య, రై॥ బ॥ వ॥ భో॥. ✆ 9849274315.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

లంగ్ క్యాన్సర్‌ను ముందే గుర్తిస్తే ప్రాణాలు కాపాడొచ్చు



సదస్సు ప్రారంభిస్తున్న వైద్యులు నాగార్జున మాటూరు, పవన్ గోరుకంటి తదితరులు

మాదాపూర్, న్యూస్‌టుడే: మన దేశంలో ఊపిరితిత్తుల వ్యాధులు, ముఖ్యంగా ఊపిరితిత్తుల క్యాన్సర్లు, క్షయ, న్యుమోనియాలు పెరుగుతున్నాయని హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ సీనియర్ పల్మనాలజీ వైద్య నిపుణులు డాక్టర్ వి.నాగార్జున మాటూరు అన్నారు. సీటీ స్కాన్‌ల వాడకం పెరగడంతో చాలా సందర్భాల్లో ఊపిరితిత్తుల నోడ్యూల్స్ గుర్తిస్తున్నారని తెలిపారు. ఆదివారం మాదాపూర్‌లోని యశోద ఆసుపత్రిలో 'నోడ్యూల్ సమ్మిట్-2024' సదస్సు నిర్వహించారు. డాక్టర్ వి.నాగార్జున మాటూరు మాట్లాడుతూ.. ఊపిరితిత్తుల క్యాన్సర్ భారత్‌లో మరణాలకు ప్రధాన కారణమన్నారు. యశోద గ్రూప్ హాస్పిటల్స్, డైరెక్టర్, డాక్టర్.పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. హైటెక్ సిటీ యశోద హాస్పిటల్‌లోని పల్మనరీ మెడిసిన్ స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ డిపార్ట్‌మెంట్, క్లినికల్, ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ రంగంలో రోగుల సంరక్షణ, పరిశోధన, విద్యలో కొత్త ప్రమాణాలను నెలకొల్పిందన్నారు. కార్యక్రమంలో విదేశీ వైద్యులు డాక్టర్ మషాహిదే ఓకీ, డాక్టర్ కైల్ హోగార్త్, డాక్టర్ యౌన్ మింగ్ సాయ్, డాక్టర్ లిన్ షెంగ్ హావో, డాక్టర్ ఎరిక్ డేనియల్ టెండా పాల్గొన్నారు.

దాండియా జోరు.. యువత హుషారు



నవరాత్రి ఉత్సవ్‌లో యువతీ యువకుల జోరు

బేగంపేట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కంట్రీక్లబ్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవ్- 2024 బేగంపేటలోని పోలీసు హాకీ స్టేడియంలో ఆదివారం రాత్రి దాండియా వేడుకలు ఆకట్టుకున్నాయి. కంట్రీక్లబ్ సీఎండీ రాజీవ్ రెడ్డి, ఈవెంట్ నిర్వాహకులు సందీప్ కుమార్ పాల్గొన్నారు.

బీసీలు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి



నిరంజన్‌ను సన్మానిస్తున్న వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్, ప్రీతి

కాచిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని బీసీలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ అన్నారు. ఆదివారం కాచిగూడలో మున్నూరు కాపు సంఘం మహాసభ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రీతి, ప్రధాన కార్యదర్శి సునీత ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలకు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నిరంజన్ హాజరయ్యారు. మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి హన్మంత్‌రావు, ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్, అనిల్‌కుమార్, ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ రఘునాథ్‌రావు, ట్రస్టీలు పాల్గొన్నారు.

పండగలతో ప్రజల మధ్య ఐకమత్యం



పూజలు చేసిన తలసాని శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్, న్యూస్‌టుడే: పండగలు ప్రజల మధ్య సమైక్యత దోహదం చేస్తాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన బషీర్‌బాగ్‌లోని చారిత్రక కనకదుర్గ నాగలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఛైర్మన్ రామరాజు, కార్పొరేటర్ డా.సురేఖ, సభ్యులు రమేశ్‌యాదవ్, శ్రీశైలం, భీష్మ రవీందర్, మాజీ కార్పొరేటర్ రాంచందర్‌రాజు, ఆల పురుశోత్తంరావు, ప్రకాశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న నవరాత్రి కంచిపట్టు చీరలు



జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: తొమ్మిది రంగులు, తొమ్మిది డిజైన్లతో రూపొందించిన నవరాత్రి పట్టు చీరలు జూబ్లీహిల్స్ మంగళగౌరీ గ్రాండియర్ శాఖలో కనువిందు చేస్తున్నాయి. ఆదిపరాశక్తి తొమ్మిది రూపాలు, నవరాత్రి పూజల ప్రత్యేకతలను ప్రతిబింబిస్తూ బంగారం, వెండి, రాగి తీగలతో కూడిన డిజైన్లతో తెలుపు, ఎరుపు, గాఢ నీలం, పసుపు, బాటిల్ గ్రీన్, గ్రే, లేత నీలం, ఆరంజ్, పింక్ ఇలా తొమ్మిది రంగులతో రూపొందించినట్లు మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.కృష్ణమూర్తి తెలిపారు. దేశంలోని వివిధ ప్రదేశాల చేనేత కళాకారులతో తొమ్మిది నెలల కాలంలో తొమ్మిది రంగుల్లో తొమ్మిది ప్రత్యేకమైన డిజైన్లతో విశిష్టమైన తొమ్మిది రకాల పట్టు చీరలకు రూపకల్పన చేశామన్నారు. దేవీ నవరాత్రుల సందర్భంగా వీటిని కొనుగోలుదారులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

తగ్గింపు ధరల్లో బ్రాండెడ్ దుస్తులు



మాదాపూర్, న్యూస్‌టుడే: మాదాపూర్‌లోని రహేజా మైండ్ స్పేస్ ఐటీ పార్క్‌లోని ది వెస్టిన్ హోటల్‌లో ప్రముఖ దుస్తుల కంపెనీ తమ ఫ్రెష్ కలెక్షన్స్ స్టాక్ 80శాతం వరకు తగ్గింపుతో విక్రయిస్తున్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు దుస్తుల విక్రయం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. 35కుపైగా కౌంటర్లలో 30వేలకుపైగా దుస్తులు ఇక్కడ ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. ప్రసిద్ధ బ్రాండ్ దుస్తులు, పాదరక్షలు భారీ తగ్గింపుతో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8 వరకు అమ్మకాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

శక్తిరూపం

శ్రీమహాచండీ దేవి



ప్రసన్న వదనంతో కొలువైన దేవతలు... ఉగ్రరూపంలో దర్శనమిచ్చే దేవతామూర్తులు ఇద్దరూ మనకు పరిచయమే! కాళీదేవిని పోలి ఉండే చండీదేవి మాత్రం ఈ రెండు రూపాల్లోనూ దర్శనమిస్తుంది. ఎక్కువగా ఉగ్రరూపంలోనే కనిపించే ఈ అమ్మవారు దయని ప్రదర్శించేప్పుడు ఉమ, గౌరి, పార్వతి, హైమావతి, శాకంబరీ, అన్నపూర్ణ, భవానిగానూ... కోపమొస్తే దుర్గ, కాళి, శ్యామ, చండీ, చండిక, భైరవిగానూ కనిపిస్తుంది. ఈ తల్లి ఉద్భవం వెనక పురాణాల్లో ఒక కథ ఉంది. రాక్షసులు ఇంద్రుడి సింహాసనాన్ని లాక్కోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. దేవతల్నీ ఇబ్బందిపెడుతుంటారు. వారి ఆగడాలను తట్టుకోలేకపోయిన దేవతలు పరమశివుణ్ణి ప్రార్థిస్తే... దీనికి పరిష్కారం మాతృదేవతను ప్రార్థించడమే అని చెప్పారట. దీంతో దేవతలంతా ఆమెను ప్రార్థించి ప్రసన్నం చేసుకుంటారు. ఆ తల్లి అనుగ్రహంతో సరస్వతి, లక్ష్మి, మహాకాళి... చండీ రూపం ధరించి రాక్షసులను సంహరిస్తారు. త్రిశక్తి రూపిణిగా శ్రీమహాచండీ అమ్మవారు ఉద్భవించడంతో ఆమెలో అందరు దేవతలూ ఉన్నారని భావిస్తారంతా. మహాచండిని ప్రార్థిస్తే సకల దేవతలను ఆరాధించినట్టేనని నమ్ముతారు కూడా. అమ్మవారిని మనసారా ప్రార్థిస్తే విద్య, కీర్తి, సంపదలు లభిస్తాయనీ శత్రువులైనా మిత్రులుగా మారతారనీ నమ్ముతారు.

పూల జాతర

బతుకమ్మకు... బొగడబంతి!



వర్షాలు పడి పూలు విరగబూసే కాలంలో వస్తుంది బతుకమ్మ పండగ... అందుకే ఇది పూల పండగ అయ్యింది. ఇందులో వాడే పూలల్లో బొగడ బంతి ఒకటి. మన చిన్ననాటి జ్ఞాపకాల దొంతరల్లో దాగిన ఈ పువ్వు... ఇప్పుడు ఆధునిక అలంకరణల్లో అందంగా అమరిపోతోంది. పూల దండలూ, మండపాలు...ఇలా అన్నింట్లోనూ కనిపిస్తుంది. చిన్న గ్లోబ్ ఆకృతిలో ఒకదానిపై మరొకటి పొందిగ్గా రేకల్ని పేర్చినట్లు కనిపిస్తుంది. రాణీరంగుతో పాటు లేత గులాబీ, ఊదా, తెలుపు రంగుల్లోనూ ఇది దొరుకుతుంది. దీన్నే గుండు బంతి, గ్లోబ్ ఉసిరి, వడమల్లి అని కూడా పిలుస్తారు. ఈ మొక్కలోనూ, పూలల్లోనూ ఔషధ గుణాలు ఎక్కువే. ముఖ్యంగా ఇందులోని బీటాసైనిన్‌ని సేకరించి క్యాన్సర్ ఔషధాల్లో వాడతారట. అలానే, ఈ మొక్కలో, పూలల్లో ఉండే ఆంథోసైనిన్లు మన చర్మాన్ని అతినీలలోహిత కిరణాల నుంచి రక్షిస్తాయి. అంతేకాదు ఇందులోని యాంటీ మైక్రోబియల్ లక్షణాలు... దగ్గు, జలుబు, వైరస్‌లను అడ్డుకుంటాయి.

నచ్చేటట్లు తినిపించాలి మరి...



పిల్లలకి అన్నం తినిపించడం తల్లులకు పెద్ద ప్రహసనమే. రంగూ, రుచీ, వాసన... కారణం ఏదైనా సరే! వారికి నచ్చేవి కొన్నే ఉంటాయి. కానీ, ఇలా వారు ఒకేరకం తింటుంటే మాత్రం శరీరానికి అన్నిరకాల పోషకాలు అందవు. మరి వారు అన్నీ తినాలంటే..

పిల్లలకు సరైన ఆకలి వేయాలన్నా, పెట్టిన పదార్థాలు ఇష్టంగా తినాలన్నా... ముందు వారి శరీరానికి తగినంత శ్రమ ఉండాలి. అప్పుడే వారు సమయానికి తినగలరు. అన్ని రకాల పదార్థాలూ రుచి చూస్తారు.

- ఏ కూర వండినా, ఏ వంటకం చేసినా దాని రంగూ, రుచీ, వాసనలతో చిన్నారులను ఆకట్టుకోవచ్చు. చక్కటి అలంకరణతో కట్టిపడేయొచ్చు. అందుకే పిల్లలకోసం చేసే వంటకాల్ని గార్నిష్ చేయడం మరచిపోవద్దు. సాధారణ ఇడ్లీలకు బదులు మసాలా ఇడ్లీ, క్రంచీ దోశ, కలర్‌ఫుల్ నువ్వుల లడ్డూలు... ఇలా ఎన్నో ప్రయోగాలు చేయొచ్చు. కొన్నింటిని చూసినప్పుడు ఇష్టపడకపోయినా, రుచితో మెప్పించొచ్చు. వారు మెచ్చనివాటిని పౌడర్‌గానో, జ్యూస్‌గానో ఇతర పదార్థాల్లోనో కలిపేయండి. కచ్చితంగా తింటారు.
- చిన్నారులకు ఆహారంపై ఇష్టం ఏర్పరచాలంటే...వాటితో అనుబంధమూ పెంచాలి. ఆయా పండ్లూ, కూరగాయల గురించి కథలుగానో, పాటలుగానో మలచి చెప్పండి. సులువుగా పెరిగే టొమాటో, వంకాయ, కొత్తిమీర, మెంతికూర... వంటి వాటిని వారితో నాటించండి. అవి పెరిగాక కాయలు కోయించి కూరల్లో వాడేలా చూడండి. ఇదంతా వారికి ఎంతో ఆసక్తికరంగా ఉండి క్రమంగా వాటిపై ఇష్టమూ పెరుగుతుంది.
- పెద్దల ఆహారపుటలవాట్లూ చిన్నారులపై ప్రభావితం చూపుతాయని తెలుసా? మీరేమో ఘుమఘుమలాడేలా మసాలాలూ, జంక్‌ఫుడ్... వంటివి తింటూ మీ పిల్లల్ని మాత్రం 'ఇవే మంచివి... వీటినే తినాలి' అని నియంత్రించలేరు. మీరు ఆరోగ్యకరమైన అలవాట్లను పాటిస్తే వాళ్లూ మిమ్మల్ని అనుసరిస్తారు.

ఆమే ఒక సైన్యం

పువ్వులాంటి సుకుమారం... చదువులో సరస్వతి... లక్ష్మీదేవిలాంటి ప్రసన్నత్వం... అమ్మాయిలంటే గుర్తుకొచ్చే లక్షణాలే ఇవి... అయితే ఇది సాధారణ వేళల్లో! ఎవరికైనా ప్రమాదం ఎదురైనా, తన వాళ్లకి ఆపద వచ్చినా మహాచండిలా మారతారు. ధైర్యాన్ని ప్రదర్శిస్తారు. నవరాత్రుల్లో... అలాంటి కొందరిని మీరూ కలుసుకోండి!

తుపాకీకి బెదరలేదు!

వనలాల్‌రువాతీ



రాత్రి వేళ... దిల్లీలోని సఫ్దార్ ఎన్‌క్లేవ్ వద్ద బీట్ పెట్రోలింగ్‌లో ఉన్నారు వనలాల్ రువాతీ. దగ్గర్లో ఏదో గొడవ అవుతోంటే పరుగెత్తుకుంటూ వెళ్లారు. విధులు ముగించుకుని వెళ్తోన్న ఓ లాయర్ వాహనాన్ని ఇద్దరు యువకులు కారుతో ఢీకొట్టారు. పట్టించుకోకుండా వెళ్లబోతున్న వాళ్లని లాయర్ నిలదీశాడు. తాగున్న ఆ యువకులు అతనితో వాగ్వాదం చేయడమే కాదు దాడికీ దిగారు. లాయర్‌కి మద్దతుగా జనాలు రాబోతే తమ దగ్గరున్న తుపాకీతో బెదిరిస్తున్నారు. మైకంలో వాళ్లు పొరపాటున కాలిస్తే తుపాకీ గుళ్లకి తోడు తొక్కిసలాటతో మరింత ప్రమాదం అనుకున్నారు వనలాల్. ఇంకేం ఆలోచించకుండా ఆ యువకుడి చేయి పట్టుకుని తుపాకీని ఆకాశంవైపు గురిపెట్టేలా చేశారు. అతన్ని నిలువరించి తుపాకీని స్వాధీనపరుచుకున్నారు. ఈమెది ఐజ్వాల్. సైన్యంలో చేరాలని కలలు కన్న ఆమె అది వీలవ్వక పోలీసు విభాగంవైపు వచ్చారు. దిల్లీలో పోస్టింగ్. 'హిందీ సరిగా రాదు... చైనీస్ అమ్మాయివా' అంటూ తోటివారు యాస, రూపం విషయాల్లో ఏడిపించేవారు. ఆమె మాత్రం అవేమీ పట్టించుకోకుండా తన బాధ్యతలను నిర్వర్తిస్తూ వచ్చారు. సంఘటన జరిగిన రోజు కాస్త అటూ ఇటూ అయినా ఆమెకు ప్రమాదం. అయినా అవతలి వ్యక్తిని ధైర్యంగా నిలువరించి ప్రాణనష్టం జరగకుండా చూశారు. ఆమె ధైర్యానికి పైవాళ్ల నుంచే కాదు... ఆ వీడియో బయటకు వచ్చాక జనాల నుంచి 'ధైర్యశాలి, అభినవ దుర్గ' అంటూ కితాబులు అందుకున్నారు.



సమయస్ఫూర్తితో ప్రాణాలు కాపాడి...

అపర్ణ



ఓ విద్యార్థిని. ఇంటి నుంచి హాస్టల్‌కి వెళుతోంది. లగేజీని పక్కన పెట్టి, రైల్లో తినడం కోసమని తినుబండారాలు కొనుక్కుంటోంది. ఇంతలో రైలు నెమ్మదిగా కదలడం చూసి గబగబా లగేజీ తీసుకుని పరుగు తీసింది. ఓ చేతిలో లగేజీ, మరోచేతిలో ఆహారంతో కూడిన కవర్లు. హ్యాండిల్ పట్టుకునే వీలులేదు. దీంతో పట్టుకోకుండానే రైలు ఎక్కడానికి ప్రయత్నించింది. తీరా కాలు జారి రైలుకీ, ప్లాట్‌ఫామ్‌కీ మధ్య పడిపోయింది. అక్కడే ఉన్న రైల్వే కానిస్టేబుల్ అపర్ణ వెంటనే విజిల్ ఊదుతూ ఆ అమ్మాయిని చేరుకున్నారు. ఆ అమ్మాయి పట్టాలమీదకి జారకుండా చేతులు పట్టుకోవడమే కాదు... రైలు వల్ల ఆమెకు గాయాలు కాకుండా ఆమె శరీరాన్ని ప్లాట్‌ఫామ్‌కి అదిమిపట్టి ఉంచారు. మరోవైపు విజిల్ వేయడమూ ఆపలేదు. విజిల్ శబ్దానికి ప్లాట్‌ఫామ్ మీదున్న అధికారులు వెంటనే రైలు ఆపించి, అమ్మాయిని బయటకు తీశారు. పెద్దగా గాయాలు కాలేదు. దీంతో ఆమె తేరుకున్నాక అదే రైలు ఎక్కించి పంపారు. తాజాగా ఉడుపిలో జరిగిందీ సంఘటన. ఆ క్షణం వెంటనే అపర్ణ సమయస్ఫూర్తితో స్పందించక పోయినా తనకేదైనా అపాయం జరిగితే అని ఆలోచించినా ఎంత ఘోరం జరిగుండేది? అవతలివ్యక్తి ప్రాణాలు కాపాడటమే లక్ష్యమనుకున్నారు కాబట్టే అందరి ప్రశంసలూ అందుకున్నారు అపర్ణ.

ముగ్గురితో పోరాడింది!

మన్‌దీప్ కౌర్



ఇల్లు నిర్మానుష్య ప్రాంతంలో ఉంది. ఇంట్లో మన్‌దీప్ కౌర్, పిల్లలు తప్ప ఎవరూ లేరు. ఎవరో తలుపు కొట్టారని తెరిస్తే దొంగలు. వారెవరో పసిగట్టిన ఆమె తలుపు వేయబోయింది. అది గమనించిన వాళ్లు బలవంతంగా తెరవబోయారు. ఈమె ఒక్కరు...వాళ్లేమో ముగ్గురు. అయినా బలమంతా ఉపయోగించి తలుపు మూసేసింది. అవతలివైపు నుంచి వాళ్లేమో బలంగా తోస్తున్నారు. అయినా ఆమె ఎవరైనా కాపాడటానికి వస్తారన్న ఆశతో ఓవైపు అరుస్తూనే గడియపెట్టేసింది. అరుపులకు పిల్లలు భయపడుతున్నారు. మరోవైపు వాళ్ల బలానికి ఆ గడియ విరుగుతుందేమోనన్న భయం. అయినా తలుపు తెరుచుకోకుండా పట్టుకునే పక్కనే ఉన్న సోఫాను మరో చేత్తో లాగి అడ్డంగా పెట్టేసింది. ఆపై పోలీసులకీ, కుటుంబ సభ్యులకూ ఫోన్‌లో సమాచారమిచ్చింది. ఇదంతా కొద్దినిమిషాల్లోనే జరిగిపోయింది. కాసేపు బయటే తచ్చాడిన దొంగలు చేసేదేమీలేక పరుగు లంకించుకున్నారు. తననీ, పిల్లల్నీ, ఇంటినీ కాపాడుకున్న అమృత్‌సర్‌కి చెందిన ఓ సామాన్య గృహిణి సాహసమిది. ఆపద వేళ తనవాళ్ల కోసం హీరోగా మారిన ఈమె ప్రయత్నం సీసీటీవీ ఫుటేజీల్లో రికార్డైంది. 'ఎక్స్'లో పోస్ట్ చేయగా వైరల్ అవ్వడమే కాదు... ఆమెను 'ధీర వనిత' అంటూ కొనియాడుతున్నారు.

మా సంసారంలో వాళ్ల పెత్తనమేంటి?

పెళ్లై ఏడాది అవుతుంది. ఆయన ఏ నిర్ణయం తీసుకోవాలన్నా వాళ్ల అమ్మ, అక్కల్ని అడగాలంటారు. వాళ్లు అంగీకరిస్తే తప్ప ఏ పనీ చేయరు. నా అభిప్రాయాలంటే లెక్కలేదు. దీనివల్ల మా మధ్య గొడవలు అవుతున్నాయి. మా సంసారంలో ఇతరులు జోక్యం చేసుకోవడం నచ్చడం లేదు. ఈ విషయాన్ని నా భర్తకు ఎలా చెప్పాలి? – ఓ సోదరి

డియర్ వసుంధర

డా. మండాది గౌరీదేవి, మానసిక నిపుణురాలు

సాధారణంగా పెళ్లికి ముందు ప్రతి ఒక్కరూ.. భర్త, పిల్లలు, సంసారం, కుటుంబం... వంటి విషయాల గురించి కొన్ని కలలు కంటుంటారు. కొంతమంది తమ అభిప్రాయాలను పెళ్లికి ముందే కాబోయే వారితో చర్చిస్తారు. మీవారు అన్నీ అక్క, అమ్మలతోనే చర్చించి నిర్ణయిస్తూ, మీకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంవల్ల అసంతృప్తికి లోనవడం, ఘర్షణ పడటం సహజమే. కానీ, అది సమస్యకు పరిష్కారం కాదు. వాళ్లతో పెరగడంవల్ల వాళ్ల నిర్ణయాలను అమలు చేయడం వంటివి కొన్నేళ్లుగా మీవారికి అలవాటై ఉండొచ్చు. ఆ విషయం అతనికి సాధారణంగా అనిపిస్తోంది. మీకు మాత్రం మీ సంసారం, జీవితం గురించి వేరే ఆలోచనలు ఉండటంతో దాన్ని అంగీకరించలేకపోతున్నారు. ఇతరులు ఆధిపత్యం చెలాయిస్తున్నారనే బాధతో కోపం, చిరాకు ప్రదర్శించడం, అయిష్టత చూపించడం చేస్తున్నారు. దాన్ని అతడు ఒప్పుకోక మీతో ఘర్షణ పడుతున్నాడు. మధ్యలో వచ్చిన మీరు మీ మాటే వినాలనడం అతడికి రుచించడంలేదు. దాంపత్యంలో ఒకరిమీద మరొకరికి నమ్మకం, ఇష్టం రావాలంటే అవతలి వారికి కొంత సమయం ఇవ్వాలి. మీకు ఎలా ఈ కుటుంబం మీద అంచనాలు ఉన్నాయో, అత్త, ఆడపడుచులకు కూడా ఆ ఇంటికోడలుగా తమలో ఒకరిగా మిమ్మల్ని ఇముడ్చుకోవడానికి కొంత సమయం పడుతుంది. మీరు ఆధిపత్యాన్ని చెలాయిస్తారనే భయం వారికీ ఉండొచ్చు. ముందు మీవారితో ప్రేమ, అనుబంధం పెంచుకోండి. కుటుంబంలో మీరూ భాగమేనని తెలిపేలా సూచనలు ఇవ్వండి. ఇది కాలక్రమంలో మీపై నమ్మకాన్ని పెంచాలి. అదే సమయంలో వారి ఆధిపత్యం గురించి పదే పదే ఫిర్యాదు చేయొద్దు. అది ప్రతికూలంగా ఆలోచించేలా చేస్తుంది. కుటుంబ చర్చల్లో పాల్గొనండి. ఎవరైనా చెప్పింది నచ్చితే మెచ్చుకోండి. క్రమంగా మార్పు వస్తుంది. కొంత ఓపిక అవసరం.

ఎన్ని క్రీములు మార్చినా, ఎంత ఖరీదైనవి రాసినా... ఫలితం ఉండట్లేదు అని ఎప్పుడైనా అనిపించిందా? అలాంటప్పుడు ఉత్పత్తి మార్చడం కాదట... ఏం తింటున్నామో గమనించుకోమంటున్నారు నిపుణులు. ఎందుకంటే...

క్రీములే చాలవు మరి!



జీర్ణవ్యవస్థ, చర్మ ఆరోగ్యాలు ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయని తెలుసా? మన పేగుల్లో మేలు చేసే బ్యాక్టీరియా అంటే సూక్ష్మజీవుల కమ్యూనిటీ ఉంటుంది. ఇవి ఆహారం జీర్ణమవడంలోనే కాదు, రోగనిరోధకత పెరగడం సహా ఇంకా ఎన్నో విధాలుగా సాయపడతాయి. వాటిల్లో చర్మఆరోగ్యం కూడా ఒకటి. ఈ సూక్ష్మజీవుల సంఖ్యలో తేడాలొస్తే అది ఇన్‌ఫ్లమేషన్‌కీ తద్వారా చర్మసమస్యలకీ దారితీస్తాయి. నిజానికి జీర్ణవ్యవస్థ ఇబ్బందులే మన ముఖంపై ప్రతిఫలిస్తాయంటారు నిపుణులు. సరిగా తినకపోయినా, ఆరోగ్యమైన వాటికి చోటివ్వకపోయినా చర్మం కళ తప్పడం దగ్గర్నుంచి, ఇన్‌ఫెక్షన్ల వరకూ ఎన్నో సమస్యలకు దారితీస్తాయి. యాక్నే, ఎగ్జిమా, చిన్నవయసులోనే వృద్ధాప్య ఛాయలు వంటివి ఆహారం విషయంలో మనం చేసే నిర్లక్ష్యానికి సూచికలే. కాబట్టి, ఏదో ఒకదానితో కడుపు నింపుకోవడం, వేళలు పాటించకపోవడం వంటివి చేయొద్దు. రోజువారీ ఆహారం ద్వారా ఎ, సి, డి, ఇ విటమిన్లు, మినరల్స్ అందుతున్నాయా అనేది గమనించుకోండి. ప్రాసెస్ చేసిన, నూనెలో వేయించిన, చక్కెరలు, చెడు కొవ్వులు ఉన్నవాటికి వీలైనంతవరకూ దూరంగా ఉండండి. బదులుగా తాజా కూరగాయలు, పండ్లు, పెరుగు, నట్స్ వంటివాటికి చోటివ్వండి. అతిగా టీ, కాఫీ, కూల్‌డ్రింక్‌లను తాగుతోంటే తగ్గించుకోవాలి. నీళ్లు ఎక్కువగా తాగాలి. వారంలో కనీసం అయిదు రోజులు వ్యాయామానికి కేటాయించాలి. రోజూ ఏడు గంటలైనా నిద్ర ఉండేలా చూసుకోండి. అప్పుడు పొట్ట తద్వారా చర్మం బాగుపడుతుంది. అదండీ సంగతి... క్రీములపైనే ఆధారపడక పొట్ట సంగతీ పట్టించుకోండి... టమ్మీ ఖుష్ అయితేనే స్కిన్ ఖుష్ అవుతుంది మరి.

పక్షులను ఆహ్వానిద్దామా...







తోటకు పూలందం. ఆ పూల పై పక్షులు వాలితే మరింత అందం. వాటిని అలానే చూడాలనిపిస్తుంది. కానీ రకరకాల కారణాల వల్ల ఆ దృశ్యాలు కనుమరుగైపోతున్నాయి. అయితే ఆ అందాలను తిరిగి తీసుకురావచ్చు. రంగురంగుల పక్షులను మన బాల్కనీతోటల్లోకి ఆహ్వానించొచ్చు. అందుకోసం ఈ బర్డ్ ఫీడర్లు ఉపయోగపడతాయి. వీటిలో ఆహార ధాన్యాలను ఉంచి పక్షులకు అందించొచ్చు. పక్షులను బట్టి అనేక రకాల ఫీడర్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. అందులోనూ సృజనాత్మకతకు అద్దం పట్టేలా అచ్చం పువ్వుల్లా ఉండే ఫీడర్లు అనేకం వచ్చాయి. వీటిని తోట, బాల్కనీ, ఇంటి ముందు.... ఇలా ఎక్కడైనా పెట్టొచ్చు. అందానికి అందం పక్షులనూ ఆకర్షించొచ్చు. స్నేహితులు, బంధువులకు బహుమతిగానూ అందించొచ్చు... ప్రయత్నించండి.









చదువు

■ e-mail: edc@eenadu.in

సమయం సరిపోతుందా?

ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తిచేశాను. సివిల్స్ కోచింగ్ కూడా తీసుకున్నాను. ఫార్మా జాబ్ చేస్తూ సివిల్స్‌కు సిద్ధం కావాలనుంది. ఇలాచేస్తే ప్రిపరేషన్‌కు సమయం సరిపోతుందా? - కోనేటి శిరీష



■ ప్రైవేటు ఉద్యోగాల్లో పని సమయం, పని ఒత్తిళ్లు ఎక్కువ. అవసరం అయినప్పుడు సెలవులు దొరకడమూ కష్టం కావొచ్చు. ఒకరోజులో అందుబాటులో ఉన్న 24 గంటల్లో దాదాపు 10 గంటలు ఉద్యోగం, ప్రయాణం, మరో 8-10 గంటలు నిద్ర, ఆహారం లాంటి వ్యక్తిగత అవసరాల కోసం కేటాయిస్తే.. మీ చేతిలో 4-6 గంటల సమయం మాత్రమే అందుబాటులో ఉంటుంది. గతంలో సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో విజయం సాధించిన చాలామంది రోజుకు పది గంటల పాటు చదివినట్లుగా ఇంటర్వ్యూలో చెప్పారు. ఉద్యోగం చేస్తూ సివిల్స్ సాధించినవారు కూడా ఉన్నారు. మరో రెండేళ్లు సివిల్స్ మీదే దృష్టి పెట్టి, ఒకవేళ నెగ్గలేకపోతే ఆ తరువాత ఉద్యోగం గురించి ఆలోచించవచ్చు. సివిల్స్‌లో లోతైన ఆలోచన, విశ్లేషణ, సృజనాత్మకత, పరిజ్ఞానం మెరుగ్గా ఉన్నవారికే విజయావకాశాలు ఎక్కువ. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్‌ఫ్రమ్‌హోమ్

వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్

సంస్థ: కలానీ గట్టానీ అండ్ కంపెనీ
నైపుణ్యాలు: ఇంగ్లిష్, హిందీ మాట్లాడటం
స్టైపెండ్: రూ.3,000
☛ internshala.com/i/11c45d

ఐఓఎస్ యాప్ డెవలప్‌మెంట్

సంస్థ: గో ఎలెవెంత్ మైల్ టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఫైర్‌బేస్, ఫ్లట్టర్
స్టైపెండ్: రూ.5,000-25,000
☛ internshala.com/i/5f248a

ఏడబ్ల్యూఎస్ డెవోప్స్ ఇంజినీర్

సంస్థ: క్వాంటియోటా (గ్రెనోబుల్, ఫ్రాన్స్)
నైపుణ్యాలు: డెవోప్స్, డెకర్, గిట్, జన్‌కిన్స్, కుబర్‌నెట్స్, టెర్రాఫామ్
స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/d4fe5d

వీటికీ దరఖాస్తు గడువు: అక్టోబరు 31

ఈఎస్ఈకి వ్యూహం!

దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రతిష్ఠాత్మకంగా భావించే ఇంజినీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (ఈఎస్ఈ) ప్రకటన వెలువడింది. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వ సర్వీసెస్‌లో 232 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ పరీక్ష సన్నద్ధత వ్యూహం తెలుసుకుందాం!



సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ విభాగాల్లో ఏటా ఈఎస్ఈని నిర్వహిస్తారు. ఈ పరీక్ష ద్వారా సెంట్రల్ ఇంజినీరింగ్ సర్వీసెస్, మిలిటరీ ఇంజినీర్ సర్వీసెస్, సెంట్రల్ వాటర్ ఇంజినీరింగ్, సెంట్రల్ పవర్, నేవల్, బోర్డర్ రోడ్ ఇంజినీరింగ్ సర్వీసెస్, ఇండియన్ స్కిల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్, ఇండియన్ డిఫెన్స్ సర్వీసెస్, ఇండియన్ టెలికమ్యూనికేషన్ సర్వీసెస్, జూనియర్ టెలికాం ఆఫీసర్, ఇండియన్ రేడియో రెగ్యులేటరీ సర్వీసెస్‌లలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్ లాంటి గ్రూప్-ఎ నియామకాలు జరుగుతాయి.

ఈ ఉద్యోగాలు పొందినవారికి సమాజంలో గౌరవం, ఉద్యోగ భద్రత, పదోన్నతులతో అత్యున్నత స్థాయికి చేరుకునే అవకాశం, ఉద్యోగ సంతృప్తి లభిస్తాయి. వీటితోపాటు 7వ పే కమిషన్‌తో మొదటి నెల జీతం రూ.లక్ష వరకూ ఉంటుంది.

దరఖాస్తు ప్రక్రియ

అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో www.upsconline.nic.in వెబ్‌సైట్ ద్వారా వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) ప్లాట్‌ఫామ్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. తర్వాత ఈ వివరాలు ఉపయోగించి దరఖాస్తు చేసుకోవాలి. అర్హత గల అభ్యర్థులకు ఈ-అడ్మిషన్ కార్డును పరీక్షకు ఒక వారం ముందు జారీచేస్తారు. దీన్ని యూపీఎస్ఈ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.

పరీక్ష రుసుము: రూ.200. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులు దీన్ని చెల్లించనవసరం లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 8 అక్టోబరు, 2024 సాయంత్రం 6 గంటల వరకు.

ఓటీఆర్, దరఖాస్తులో తప్పుల సవరణ: 09 అక్టోబరు 2024 నుంచి 15 అక్టోబరు వరకు.

విద్యార్హతలు: ఇంజినీరింగ్ లేదా సమాన అర్హత. ఎమ్మెస్సీ/ తత్సమానం. కానీ ప్రతిపాదించిన మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ సబ్జెక్టుల్లో ఏదో ఒకదాన్ని ఎంచుకోవాలి.

వయసు: పరీక్ష రాసే సంవత్సరం జనవరి 1వ తేదీకి 21 నుంచి 30 సంవత్సరాలు. కొన్ని కేటగిరీల అభ్యర్థులకు గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది.

ఈఎస్ఈ పరీక్ష విధానం

స్టేజ్-1 (ప్రిలిమినరీ): ఆబ్జెక్టివ్ విధానం. క్యాలిక్యులేటర్లు అనుమతించరు. నెగెటివ్ మార్కులుంటాయి.

ప్రశ్నపత్రం	సబ్జెక్టు	మార్కులు/సమయం
పేపర్-1	జనరల్ స్టడీస్ అండ్ ఇంజినీరింగ్ ఆప్టిట్యూడ్	200 / 2 గంటలు
పేపర్-2	ఇంజినీరింగ్ సబ్జెక్టు	300 / 3 గంటలు
మొత్తం		500 మార్కులు

స్టేజ్-2 (మెయిన్స్) కన్వెన్షనల్

ప్రిలిమినరీ ద్వారా 1:6 లేదా 1:7 నిష్పత్తిలో మెయిన్స్‌కు అర్హత ఇస్తారు. ఈ ఏడాది 232 ఖాళీలు కాబట్టి 1392 నుంచి 1624 మంది మెయిన్స్ పరీక్ష రాయడానికి అర్హులవుతారు.

ప్రశ్నపత్రం	సబ్జెక్టు	మార్కులు/ సమయం
పేపర్-1	ఇంజినీరింగ్ సబ్జెక్టు	300 మార్కులు/ 2 గంటలు
పేపర్-2	ఇంజినీరింగ్ సబ్జెక్టు	300 మార్కులు/ 3 గంటలు
మొత్తం		600 మార్కులు

◆ పై రెండు పేపర్లలో ఎక్కువ నిడివితో ప్రశ్నలుంటాయి. చదవడంతోపాటు రాయడమూ అలవాటు చేసుకోవాలి.

◆ క్వశ్చన్ కమ్ ఆన్సర్ బుక్‌లెట్ (క్యూసీఏబీ) విధానం ప్రకారం సమాధానాలు రాయడానికి నిర్ణీత స్థలాన్ని కేటాయిస్తారు. అందుకని సూటిగా జవాబు రాయడం మంచిది.

స్టేజ్-3: మౌఖిక పరీక్ష (200 మార్కులు)

◆ రెండు స్టేజిల్లో మార్కుల ఆధారంగా అభ్యర్థులను 1:2 నిష్పత్తిలో పర్సనల్ ఇంటర్వ్యూకు అనుమతిస్తారు. మూడు స్టేజిల్లో కలిపి 1300 మార్కులుగాను వచ్చిన మార్కుల ఆధారంగా, ఖాళీలకు అనుగుణంగా తుది జాబితా రూపొందిస్తారు.

విజయ సాధనకు..

ఈఎస్ఈ ప్రిలిమ్స్ ప్రశ్నలు ఎక్కువ, సమయం తక్కువ. అందువల్ల అందుబాటులో ఉన్న పరీక్ష సమయంలో ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించామనేది ముఖ్యం.

◆ నాలుగేళ్ల ఇంజినీరింగ్ సిలబస్‌తో పోలిస్తే ఈఎస్ఈ పరీక్ష సిలబస్ తక్కువే. ఒక పెద్ద కొండ సైతం రోజుకు ఒక బండ తొలగిస్తే.. కొంత కాలానికి మటుమాయం అవుతుంది. కాబట్టి అభ్యర్థులు అధైర్యపడకుండా రోజుకు కొన్ని అంశాలు అర్థంచేసుకుంటూ ముందుకు వెళితే అందుబాటులో ఉన్న సమయంలో సిలబస్‌ను పూర్తిగా అభ్యాసం చేయొచ్చు.

◆ సిలబస్‌ను వీలైనన్నిసార్లు పరిశీలించి అందులోని అంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. సిలబస్‌ను బట్టి ఏ అంశాల్లో బలంగా, బలహీనంగా ఉన్నామో తెలుసుకుని దానికి అనుగుణంగా ప్రిపరేషన్ ప్రణాళికను రూపొందించుకోవాలి.

◆ అభ్యర్థులు మంచి ప్రామాణిక పాఠ్య పుస్తకాలు/ అధ్యయన సామగ్రి (స్టడీ మెటీరియల్) ఎంచుకోవాలి.

◆ ఈఎస్ఈ ప్రశ్నపత్రాల విషయానికి వస్తే సిలబస్ పరిధి చాలా విశాలం. ప్రశ్నలు మాత్రం 20 నుంచి 25 శాతం సులభం, మధ్యస్థం, 20 నుంచి 25 శాతం కొంత కఠినంగా ఉంటాయి.

◆ గత కొన్ని సంవత్సరాల నుంచీ ప్రాక్టికల్ ప్రశ్నలు చేర్చడం వల్ల ప్రశ్నపత్రం కఠినత్వం పెరిగింది.

◆ అభ్యర్థులు నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్ బేసిక్స్‌పై ఎంతో కొంత అవగాహన సాధించి ఉంటారు. ఈఎస్ఈ సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని అంశాలవారీగా బేసిక్స్‌పై పట్టు సాధించాలి.

◆ సాధారణంగా అభ్యర్థులు తమకు నచ్చిన అధ్యాయాలను చదవడానికి సుముఖతతో ఉంటారు. కానీ ఈ పరీక్షలో వెయిటేజ్‌ని దృష్టిలో ఉంచుకుని అధ్యాయాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం ముఖ్యం.

◆ ప్రాథమిక అంశాల సాధన తర్వాత గత ఈఎస్ఈ, గేట్, సివిల్ సర్వీసెస్, ఇతర రాష్ట్రాల సర్వీసెస్ ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. దీని వల్ల ఏయే అంశాలపై ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో అవగతం అవుతుంది.

◆ అభ్యర్థులు సన్నద్ధతలో భాగంగా ప్రతి చాప్టర్, సబ్జెక్టు చదివిన తర్వాత దానికి సంబంధించిన ఆన్‌లైన్ టెస్టులు రాయాలి.

◆ పునశ్చరణ అత్యంత కీలకం. చదివిన ప్రతి అంశాన్నీ పునశ్చరణ చేయాలి. దీంతోపాటు ఆన్‌లైన్‌లో నిర్వహించే మాదిరి ప్రశ్నపత్రాలను (మాక్‌టెస్టు) రాయడం, నమూనా ప్రశ్నపత్రాలను సాధన చేయాలి.




◆ చాప్టర్‌వైజ్ టెస్టులు, మాక్ టెస్టులు రాసేటప్పుడు, నమూనా ప్రశ్నపత్రాలు సాధన చేసేటప్పుడు తప్పుగా సమాధానం రాసిన ప్రతి ప్రశ్ననీ సవరించుకుని, ప్రత్యేక శ్రద్ధతో సాధన చేయాలి.

- ప్రొ. వై.వి. గోపాలకృష్ణమూర్తి
డైరెక్టర్, ఏస్ ఇంజినీరింగ్ అకాడమీ

దాటవేసే అలవాటును దాటవేయండి!

ప్రముఖ రచయిత బ్రాయన్ ట్రేసీ రాసిన 'ఈట్ దట్ ఫ్రాగ్' పుస్తకం విద్యార్థులకూ, కెరియర్ ప్రారంభంలో ఉన్నవారికీ మార్గదర్శకం.



పుస్తకం

ఈ పుస్తకం పేరులో ఉన్న 'ఈట్ దట్ ఫ్రాగ్' ('ఆ కప్పను తిను') వినడానికి వింతగా ఉన్నా, అదొక కష్టతరమైన పనినీ, చేయలేమనుకున్న పనినీ చేయడాన్ని సూచిస్తుంది.

ప్రాధాన్య క్రమం

పుస్తకంలో ప్రధానంగా చెప్పిన తొలి సూత్రం- ప్రాధాన్య క్రమాన్ని సరిచేసుకోవడం. ప్రతిరోజు చేయాల్సినవాటిలో A పనులు అత్యంత ముఖ్యమైనవి, B పనులు ద్వితీయమైనవి, C పనులు చాలా తక్కువ ప్రాధాన్యమైనవి, D పనులు ఇతరులకు అప్పగించవచ్చు, E పనులను వెంటనే చేయాల్సిన అవసరం లేదు. ఈ పద్ధతిని అనుసరించడం వల్ల సమయాన్ని వృథా చేయకుండా, అవసరమైన పనులను ముందుగా పూర్తి చేయగలరు.

ముఖ్యమైన పనులను చేయడానికి సమయాన్ని ప్రత్యేకంగా కేటాయించడం చాలా అవసరం. ఇక్కడ 80/20 సూత్రాన్ని (పరీటో ప్రిన్సిపల్) సూచించారు. అంటే మన 80% ఫలితాలు 20% ముఖ్యమైన పనుల నుంచి వస్తాయి.

బద్ధకం వల్ల పనులు చేయకుండా దాటవేయడం (ప్రొక్రాస్టినేషన్) మన ప్రగతికి అడ్డుపడే ప్రధాన శత్రువు. దీన్ని అధిగమించడానికి కఠినమైన పనులను ముందుగా చేయాలి. ఉదయం మొదటగా కష్టమైన, ఎక్కువ శ్రమతో కూడుకున్న పనిని పూర్తి చేయడం వల్ల, ఆ రోజు మిగిలిన పనులు సులభంగా అనిపిస్తాయి.

లక్ష్యాలపై దృష్టి

లక్ష్యాలపై నిరంతరం దృష్టి పెట్టాలని రచయిత బ్రాయన్ సూచిస్తారు. చిన్న లక్ష్యాలను సాధించడం ద్వారా పెద్ద విజయాలను చేరుకోవచ్చు. విద్యార్థులు తమ విద్యలో గానీ, వ్యక్తిగత అభివృద్ధిలో గానీ ఆచరణాత్మకమైన చిన్న లక్ష్యాలను పెట్టుకుంటే, పెద్ద విజయాలను అందుకోవడం సులువు.

ముందుగా ప్రణాళిక చేసుకుంటే చేయాల్సిన పని క్రమం తప్పకుండా, సమయానికి పూర్తి అవుతుంది. విద్యార్థులు తమ సిలబస్‌ను చక్కగా ప్రణాళికతో అమలు చేయడం ద్వారా పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించగలరు. కెరియర్ ప్రారంభంలో ఉన్నవారు తమ పనులను ముందుగా ప్రణాళిక చేస్తే, సాఫల్యాన్ని త్వరగా పొందగలరు.

అభ్యాసం, క్రమశిక్షణ

సక్రమ సమయ నిర్వహణ కోసం, పనుల ప్రాధాన్య క్రమం కోసం, దాటవేసే అలవాటును దాటవేయడం కోసం నిరంతర అభ్యాసం అవసరం. క్రమశిక్షణకు అలవాటు పడిన విద్యార్థులు తమ లక్ష్యాలను త్వరగా సాధించగలుగుతారు. ఇది యువతకు కూడా మార్గదర్శకం. ఈ పుస్తకం తెలుగు అనువాద రూపంలో ('అతి కష్టమైన పని అన్నిటికన్నా ముందు') కూడా లభ్యమవుతోంది.

– రహ్మాన్ & సంపత్

శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ



ఈనాడు, అమరావతి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రభుత్వం అంగరంగ వైభవంగా నిర్వహిస్తోంది. వేడుకల్లో నాలుగో రోజు ఆదివారం.. శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దుర్గమ్మ దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. గత మూడు రోజులతో పోలిస్తే.. రెట్టింపు సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాధారణ భక్తుల దర్శనాలకు ఆటంకం లేకుండా వీఐపీలకు ప్రత్యేక సమయాలను కేటాయించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం మెట్ల మార్గాల్లో ప్రత్యేకంగా స్టెయిర్‌కేస్ లిఫ్ట్‌ను ఈ ఏడాది తొలిసారి ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో నడిచి వచ్చే వారి కోసం తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, పిల్లలకు పాలను అందిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన, దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

నాగ్‌పుర్ వందేభారత్ బోగీల తగ్గింపు!

- 20 కోచ్‌ల నుంచి 10కి...
- మహారాష్ట్ర ఎన్నికల తర్వాత నిర్ణయం అమలు

ఈనాడు, హైదరాబాద్: సికింద్రాబాద్-నాగ్‌పుర్ వందేభారత్ రైలుకు ప్రయాణికుల ఆదరణ తగినంతగా లేకపోవడంతో బోగీల సంఖ్యను కుదించాలని రైల్వే శాఖ సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఈ రైల్లో మొత్తం 20 బోగీలు ఉండగా 10కి పరిమితం చేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. త్వరలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఇప్పుడే బోగీల సంఖ్యను తగ్గిస్తే ఎన్నికల్లో ఆ రాష్ట్రంలో ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు ముగిసిన తర్వాత కోచ్‌లు తగ్గించనున్నట్లు ఓ కీలక ప్రజాప్రతినిధి 'ఈనాడు'కు తెలిపారు.



సగం సీట్లు ఖాళీ!

హైదరాబాద్ నగరం నుంచి- విశాఖపట్నానికి రెండు.. తిరుపతి, బెంగళూరు నగరాలకు ఒక్కోటి చొప్పున నాలుగు వందేభారత్‌లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రైళ్లన్నీ 110-120 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో నడుస్తున్నాయి. సెప్టెంబరు 16న ప్రధాని మోదీ ప్రారంభించిన నాగ్‌పుర్-సికింద్రాబాద్ వందేభారత్ మాత్రం దాదాపు సగం సీట్ల ఖాళీతో వెళుతోంది. డిమాండ్ తక్కువగా ఉండటంతో కోచ్‌ల సంఖ్యను తగ్గించాలని రైల్వేబోర్డు నిర్ణయించినట్లు సమాచారం. ఆదివారం సికింద్రాబాద్-వాస్కోడగామా నూతన ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించిన సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మిగతా వందేభారత్‌లకు 100%పైగా ఆక్యుపెన్సీ రేషియో వస్తోందనీ.. సికింద్రాబాద్-నాగ్‌పుర్ వందేభారత్ గురించి కేంద్రం ఆలోచిస్తోందని అన్నారు.

ఆ 10 కోచ్‌లు విశాఖ, బెంగళూరు ట్రైన్లకు!

నాగ్‌పుర్ రైల్లో తగ్గించే 10 కోచ్‌లను ఏ వందేభారత్‌కు కలపాలన్న విషయంపైనా రైల్వే శాఖ దృష్టి సారించింది. సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య ఇప్పటికే రెండు వందేభారత్‌లు ఉన్నాయి. ఒక దానిలో 16, మరో దానిలో 8, సికింద్రాబాద్-బెంగళూరు రైల్లో 8 కోచ్‌లు ఉన్నాయి. తగ్గించే కోచ్‌లను కలిపే విషయంలో విశాఖపట్నం, బెంగళూరు ట్రైన్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం.



మిమ్మల్ని పోల్చుకోవాల్సింది ఆ ఇద్దరితోనే..

మిమ్మల్ని మీరు పోల్చుకోవాల్సింది ఇద్దరితో మాత్రమే. వారెవరంటే సరిగ్గా ఏడాది క్రితం నాటి మీరు; వచ్చే ఏడాది నాటికి మారబోయే మీరు. మీ అసలైన పురోగతి తెలిసేది ఈ రెండు పోలికలతోనే. లక్ష్యం దిశగా మీరు ఎంత దూరం ప్రయాణించారో తెలియజేయడంతోపాటు, ఇకమీదట చేయబోయే ప్రయాణానికి అవసరమైన ఉత్సాహాన్ని అవి అందిస్తాయి. అందుకే ఇతరులతో మిమ్మల్ని పోల్చుకుని నిరాశ చెందొద్దు.

– డికీ బుష్, కంటెంట్ క్రియేటర్

రూ.100కు చేరువలో టమాట



ఈనాడు, హైదరాబాద్: టమాట ధరలు భారీగా పెరుగుతున్నాయి. నెలన్నర క్రితం వరకు కిలో రూ.20 నుంచి రూ.30 పలికిన ధర ఇప్పుడు రూ.100కు చేరువవుతోంది. ప్రస్తుతం రైతుబజార్లు, హోల్‌సేల్‌లో కిలో టమాట ధర రూ.60-80 ఉండగా.. రిటైల్ మార్కెట్‌లో రూ.100కు చేరువైంది. డిమాండ్‌కు సరిపడా టమాట రాకపోవడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టమాట పంట దెబ్బతిందని.. దీంతో ధరలు అమాంతం పెరిగాయని పేర్కొంటున్నారు. సాధారణంగా ఈ సమయంలో టమాట ధరలు తగ్గి.. వేసవిలో పెరుగుతాయి. వర్ష ప్రభావంతో ప్రస్తుతం ధరలు పెరిగాయని, కొత్త పంట చేతికొచ్చే వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఉల్లి, పలు కూరగాయలు సైతం..

ఉల్లి ధర సైతం భారీగా పెరిగింది. రైతుబజార్లలో కిలో రూ.50 చొప్పున విక్రయిస్తుండగా.. రిటైల్, ఇతర మార్కెట్లలో రూ.60-70కి తగ్గడంలేదు. రిటైల్‌మార్కెట్లలో కిలో బెండకాయలు రూ.70, బీన్స్ రూ.100, దొండ రూ.60, క్యాప్సికం రూ.80, బీరకాయ రూ.70 చొప్పున విక్రయిస్తున్నారు.

కార్పొరేషన్ ఏర్పాటైతేనే పేద రెడ్లకు చేయూత

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- సన్మాన కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు రాలేదంటూ వేదికపై పలువురి నిరసన


మాదాపూర్, న్యూస్‌టుడే: పేద రెడ్లకు చేయూత ఇవ్వాలంటే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు అవసరమని, దాన్ని సాధించుకునేందుకు అంతా కలిసి కృషి చేద్దామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం శిల్పారామంలోని మౌంటెయిన్ హైట్స్‌లో రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో రెడ్డి ప్రజాప్రతినిధుల సన్మాన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏళ్లుగా కార్పొరేషన్ కోసం పోరాటం చేస్తున్నా ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. ఈ విషయంలో పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కరీంనగర్ సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే విధివిధానాలు రూపొందించి అమలు చేసేలా కృషి చేస్తామని తెలిపారు. రెడ్డి జేఏసీ ఛైర్మన్ అప్పంగారి రాంరెడ్డి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని శిల్పాకళా వేదికలో నిర్వహించాలని నెల రోజుల ముందే రుసుం చెల్లించామని, కానీ ప్రభుత్వ కార్యక్రమం ఉందని చెప్పి శనివారం అర్ధరాత్రి అధికారులు ఇవ్వడం సాధ్యం కాదని చెప్పారన్నారు. రెడ్డి కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించి నిధులు కేటాయించాలనే అంశాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలనే ముఖ్యోద్దేశంతో దీనిని నిర్వహించినట్లు తెలిపారు. రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డి మాట్లాడుతూ.. రెడ్లను కించపరిచేలా కొందరు మాట్లాడుతున్నారని, వారి ప్రవర్తన మార్చుకోకపోతే పోరాటం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నల్గొండ డీసీసీబీ ఛైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సన్మాన మహోత్సవానికి ఆహ్వానించినా పలువురు ప్రజాప్రతినిధులు రాకపోవడాన్ని నిరసిస్తూ వేదికపై కొందరు నిరసనకు దిగారు. జిల్లాల నుంచి వందల మంది తరలివస్తే నాయకులెవరూ హాజరుకాకపోవడం శోచనీయమన్నారు. వారిని జేఏసీ ప్రతినిధులు సముదాయించారు.



ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి జేఏసీ ప్రతినిధులు

ఈనాడు సినిమా

నిఖిల్.. 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'



రుక్మిణీ వసంత్, నిఖిల్

కథానాయకుడు నిఖిల్.. దర్శకుడు సుధీర్ వర్మ కలయికలో ఓ చిత్రం తెరకెక్కింది. 'స్వామిరారా', 'కేశవ'ల తర్వాత వీళ్లిద్దరి నుంచి వస్తున్న మూడో సినిమా ఇది. బి.బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించారు. రుక్మిణీ వసంత్ కథానాయిక. దివ్యాంశ కౌశిక్ కీలక పాత్ర పోషించింది. ఈ సినిమాకి 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మేరకు ఆదివారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అందులో నిఖిల్, రుక్మిణి ఓ నది తీరాన జంటగా నడిచొస్తూ కనిపించారు. "ప్రేమ కథతో ముడిపడి ఉన్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. నిర్మాణానంతర పనులు ముగింపు దశలో ఉన్నాయి. దీపావళి సందర్భంగా సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది'' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: కార్తీక్, నేపథ్య సంగీతం: సన్నీ ఎం.ఆర్, ఛాయాగ్రహణం: రిచర్డ్ ప్రసాద్.

ఫ్లాష్‌బ్యాక్



షారుక్ ఖాన్, సుస్మితా సేన్


సెట్లో అడుగుపెట్టేవరకూ హీరో షారుక్ అని తెలియదు

చిత్రపరిశ్రమలో ఎంతో మంది అందాల తారలు షారుక్‌తో కలిసి నటించాలని ఉవ్విళ్లూరుతుంటారు. కానీ తనకెప్పుడు ఆయనతో కలిసి నటించాలనే ఆలోచన రాలేదని, అనుకోకుండా వచ్చిన ఓ అవకాశంతో తన కెరీర్ మలుపు తిరిగిందని అంటోంది బాలీవుడ్ కథానాయిక సుస్మితా సేన్. ఈమె, షారుక్ జంటగా నటించిన 'మైహూనా' చిత్రానికి అప్పట్లో మంచి మార్కులే పడ్డాయి. ఎన్నో విజయవంతమైన పాటలకు కొరియోగ్రాఫర్‌గా పనిచేసిన దర్శకురాలు ఫరాఖాన్ తెరకెక్కించిన మొదటి చిత్రమిది. ఇందులో చాందినీ పాత్రలో కనిపించి యువతను విశేషంగా ఆకట్టుకుంది సుస్మితా సేన్. కానీ ఈ సినిమా సెట్లో అడుగు పెట్టే వరకూ.. షారుక్ ఇందులో భాగమని తెలియదని ఓ సందర్భంలో పంచుకుందామె. "సిర్ఫ్ తుమ్'లో 'దిల్బర్' అనే పాట చిత్రీకరిస్తున్నప్పుడు ఫరా.. తను దర్శకత్వం వహించే మొదటి సినిమాలో హీరోయిన్‌గా నటిస్తారా? అని అడిగింది. కచ్చితంగా నటిస్తానని మాటిచ్చాను. కొన్నేళ్లకు ఆమె తన తొలి చిత్ర కథతో నన్ను సంప్రదించారు. సినిమా కథేంటి? కనీసం హీరో ఎవరని అడగకుండానే ఇచ్చిన మాట కోసం ప్రాజెక్టును అంగీకరించాను. ఓ రోజు షూటింగ్‌కు రమ్మని ఫిల్మ్ సిటీకి పిలిచారు ఫరా. షూటింగ్ స్పాట్‌కి వెళ్లే సరికి అక్కడ షారుక్‌ను చూసి ఆశ్చర్యపోయాను. ఇది నా జీవితంలో జరిగిన ఓ అద్భుతమైన విషయం. 'మై హూనా'లో షారుక్ హీరోయిన్ అవుతానని ఎప్పుడూ ఊహించలేదు. కానీ అనుకోకుండా ఆయనతో కలిసి నటించడం నన్ను కెరీర్‌లో మరో మెట్టు ఎక్కేలా చేసింద''ని ఆనాటి సంగతులను గుర్తుచేసుకుంది సుస్మితా సేన్.

33ఏళ్ల తర్వాత మళ్లీ?



మణిరత్నం



రజనీకాంత్

కథానాయకుడు రజనీకాంత్.. దర్శకుడు మణిరత్నం 33ఏళ్ల విరామం తర్వాత తిరిగి చేతులు కలపనున్నారా? ఈ విజయవంతమైన కాంబోలో ఓ కొత్త ప్రాజెక్ట్ పట్టాలెక్కనుందా? అవుననే చెబుతున్నాయి కోలీవుడ్ వర్గాలు. రజనీ - మణిరత్నం కలయికలో వచ్చిన 'దళపతి' 1991లో విడుదలై బాక్సాఫీస్ ముందు భారీ విజయాన్ని అందుకుంది. కానీ, ఆ తర్వాత ఈ ఇద్దరూ మళ్లీ కలిసి పని చేయలేదు. అయితే ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత ఈ హిట్ కాంబో పునరావృతం కానుందని సమాచారం. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ విషయమై రజనీకాంత్, మణిరత్నంకు మధ్య చర్చలు జరిగాయని.. అన్నీ అనుకున్నట్లు జరిగితే డిసెంబరులో రజనీ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాపై స్పష్టత వచ్చే అవకాశముందని తెలిసింది. ప్రస్తుతం రజనీ నటించిన 'వేట్టయన్' విడుదలకు సిద్ధమవగా.. 'కూలీ' చిత్రీకరణ దశలో ఉంది. 'జైలర్ 2' పట్టాలెక్కేందుకు సిద్ధంగా ఉంది. అలాగే మరో ఇద్దరు యువ దర్శకులు రజనీ కోసం కథలు సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. ఇక మణిరత్నం ప్రస్తుతం కమల్‌హాసన్‌తో 'థగ్ లైఫ్' చేస్తున్నారు. 'నాయకన్' (1987) విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న సినిమా ఇది. వేసవికి ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలుస్తోంది.

'కూలీ' వైజాగ్‌లో ముగించారు..

రజనీకాంత్ - లోకేశ్ కనగరాజ్ కలయికలో తెరకెక్కుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ'. కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. నాగార్జున, శ్రుతి హాసన్, ఉపేంద్ర తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ కొన్నాళ్లుగా విశాఖపట్నంలో జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ షెడ్యూల్‌కు సంబంధించి రజనీ పాత్ర షూట్ ఇప్పటికే పూర్తవగా.. ఇప్పుడు మొత్తం షెడ్యూల్‌ను ముగించారు. ఈ విషయాన్ని శ్రుతిహాసన్ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించింది. ఈ చిత్ర తదుపరి షెడ్యూల్ ఈనెల 15నుంచి చెన్నైలో మొదలు కానుంది. ఇది మొదలైన కొద్ది రోజుల్లోనే రజనీ తిరిగి సెట్లోకి అడుగు పెట్టనున్నారు. ఇటీవల చిన్న శస్త్ర చికిత్స చేయించుకున్న ఆయన వైద్యుల సలహా మేరకు ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు.

మంచి కథ.. ఓ ట్విస్ట్



రవి కిశోర్, బి.గోపాల్, పాండు రంగారావు, పరుచూరి వెంకటేశ్వరరావు, సుదర్శన్, రఘుబాబు

పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు సుదర్శన్ పరుచూరి హీరోగా రవి కిశోర్ తెరకెక్కించిన చిత్రం 'మిస్టర్ సెలెబ్రిటీ'. చిన్న రెడ్డయ్య, ఎన్.పాండు రంగారావు సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. "సెలెబ్రిటీలపై పుకార్లు రావడం.. వాటి వల్ల ఏర్పడే పర్యవసానాల నేపథ్యంలో దర్శకుడు మంచి కథ అల్లుకున్నాడు. ఇందులోని ట్విస్ట్ కూడా అందర్నీ మెప్పిస్తుంది. కొత్త కాన్సెప్ట్‌తో వచ్చిన ఈ సినిమాని అందరూ ఆదరించాలని కోరుకుంటున్నా'' అన్నారు. "ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. రఘుబాబు కామెడీకి అందరూ నవ్వుతున్నారు. నేను కూడా సుదర్శన్‌తో ఓ సినిమా చేస్తాను" అన్నారు దర్శకుడు బి.గోపాల్. దర్శకుడు రవి కిశోర్ మాట్లాడుతూ.. "ఈ సినిమాకి అన్ని ప్రాంతాల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ చిత్రానికి వరలక్ష్మీ శరత్ కుమార్ పాత్ర ప్రధాన బలం" అన్నారు. ఈ కార్యక్రమంలో రఘుబాబు, పాండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

యాక్షన్ కిల్లర్



పూర్వాజ్

జ్యోతి పూర్వాజ్ ప్రధాన పాత్రలో పూర్వాజ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కిల్లర్'. ప్రజయ్ కామత్‌తో కలిసి పూర్వాజ్ స్వయంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర మోషన్ పోస్టర్‌ను ఇటీవల విడుదల చేశారు. "ఇదొక విభిన్నమైన యాక్షన్ థ్రిల్లర్. వైవిధ్యభరితమైన సినిమాల్ని ఇష్టపడే ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది. ఇతర నటీనటులతో పాటు మరిన్ని వివరాలు త్వరలో ప్రకటిస్తాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: అషీర్ ల్యూక్, సుమన్ జీవ రత్నం, ఛాయాగ్రహణం: జగదీశ్ బొమ్మిశెట్టి.

అదితి-అర్జున్.. వన్స్‌మోర్



అర్జున్ దాస్, అదితి శంకర్

గతేడాది 'మహావీరుడు' సినిమాతో ప్రేక్షకులను పలకరించింది తమిళ కథానాయిక అదితి శంకర్. త్వరలో తెలుగులోకి అడుగు పెట్టడానికి ముస్తాబవుతోన్న ఈ భామ.. నటుడు అర్జున్ దాస్‌తో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. విఘ్నేశ్ శ్రీకాంత్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. తాజాగా ఈ సినిమాకు 'వన్స్ మోర్' అనే పేరును ఖరారు చేసినట్లు తెలుపుతూ.. ఓ వీడియోను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. ప్రేమకథ, కుటుంబ బంధాల నేపథ్యంలో దీన్ని తీర్చిదిద్దినట్లు వీడియోతో స్పష్టమవుతోంది. యువరాజ్ గణేశన్ నిర్మిస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది ప్రేమికుల రోజున విడుదల చేయనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

సైకో.. దెయ్యం పాత్రలు చేయాలనుంది!

"వినూత్నమైన కథతో యాక్షన్, వినోదం మేళవింపుగా రూపొందిన సినిమా 'విశ్వం'. ఈ చిత్ర విషయంలో నటిగా నాకు ప్రతిదీ సవాల్‌గానే అనిపించింది'' అంటోంది కావ్య థాపర్. ఇటీవలే 'డబుల్ ఇస్మార్ట్'తో ప్రేక్షకుల్ని పలకరించిన ఈమె ఇప్పుడు 'విశ్వం'తో అలరించేందుకు సిద్ధమైంది. గోపీచంద్ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీను వైట్ల తెరకెక్కించారు. ఇది ఈ నెల 11న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది.



కావ్య థాపర్

"శ్రీను వైట్ల ఈ కథ చెప్పినప్పుడే భలే వైవిధ్యభరితంగా ఉందనిపించింది. దీంట్లో నా పాత్ర కూడా చాలా కొత్తగా ఉంటుంది. అందుకే కథ వినగానే చేస్తానని చెప్పేశా. ఈ సినిమాలో వినోదం కథలో భాగంగానే ఉంటుంది తప్ప బలవంతంగా ఇరికించినట్లుగా ఉండదు. దీంట్లో దాదాపు 16మంది కమెడియన్స్ ఉన్నారు. అయితే తెరపై ఎన్ని పాత్రలు కనిపిస్తున్నా.. ఎవరి ప్రాధాన్యత వారికే ఉంటుంది. అన్ని పాత్రలు ప్రేక్షకుల్ని మెప్పించేలాగే దర్శకుడు శ్రీను ఈ కథ రాసుకున్నారు''.

❑ "ఈ సినిమాని ఇటలీ, హిమాచల్ ప్రదేశ్, మనాలి తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. కొన్నిసార్లు మైనస్ డిగ్రీల వాతావరణంలో.. ఇంకొన్నిసార్లు అధిక ఉష్ణోగ్రతల వద్ద చిత్రీకరించిన సందర్భాలున్నాయి. అలాగే కొండలు ఎక్కడం లాంటి కష్టతరమైన పనులు చేయాల్సి వచ్చింది. ఇవన్నీ ఎదుర్కొంటూ నటించడం శారీరకంగా సవాల్‌గా అనిపించింది. అందుకే ఈ చిత్రం చేశాక ఎలాంటి క్లిష్టమైన పాత్రనైనా చేస్తాననే ధైర్యం వచ్చింది. నాకు గొప్ప అనుభూతిని అందించిన సినిమా ఇది''.

❑ "ఈ చిత్రంలో నేను కాస్ట్యూమ్ డిజైనర్‌గా స్టైలిష్ పాత్రలో కనిపిస్తాను. నా పాత్రలో గ్రే షేడ్ కూడా కనిపిస్తుంది. అలాగే ఆద్యంతం నవ్విస్తుంది. ఒకరకంగా నటనకు ప్రాధాన్యమున్న గ్లామర్ పాత్రిది. అందుకే ఈ పాత్ర నాకు కాస్త సవాల్‌గా అనిపించింది. అలాగే నా కుటుంబ సభ్యులుగా నరేశ్, ప్రగతి పాత్రలూ వినోదాత్మకంగా ఉంటాయి. ముఖ్యంగా దీంట్లోని ట్రైన్ ఎపిసోడ్ చాలా కొత్తగా.. అందర్నీ అలరించేలా ఉంటుంది''.

❑ "జయాపజయాలు అందరికీ ఎదురవుతుంటాయి. వాటిని నియంత్రించడం నా చేతుల్లో లేదు. నేను నా వరకు ఎంచుకున్న పాత్రకు నటిగా నూటికి నూరు శాతం న్యాయం చేశానా? లేదా? అనే చూసుకుంటా. దానికోసం ఎంత కష్టానికైనా వెనకాడను. మిగిలింది దేవుడిపై భారం వేస్తా. నేనిప్పటి వరకు ఎక్కువగా గ్లామర్ పాత్రలే చేశా. కానీ, నటిగా నాకు అన్ని రకాల పాత్రలు పోషించాలని ఉంది. సైకో కిల్లర్ పాత్రలు, దెయ్యం పాత్రలు.. ఇలా సవాల్ విసిరే పాత్రలన్నీ చేయాలని ఉంది. ఇప్పటికే నేను మూడు చిత్రాలకు సంతకాలు చేశా. త్వరలో వాటి వివరాలు ప్రకటిస్తా. అలాగే మరికొన్ని కథలు చర్చల దశలో ఉన్నాయి."

దసరాకి ముహూర్తం



నాని

ఇటీవలే 'సరిపోదా శనివారం'తో మరో విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు కథానాయకుడు నాని. ప్రస్తుతం 'హిట్ 3' చిత్రీకరణతో తీరిక లేకుండా గడిపేస్తున్నారు. ఇప్పుడాయన మరో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టేందుకు సిద్ధమయ్యారు. నాని - శ్రీకాంత్ ఓదెల కలయికలో ఎస్ఎల్‌వీసీ సినిమాస్ పతాకంపై ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. 'దసరా' విజయం తర్వాత వీళ్ల కాంబోలో వస్తున్న రెండో చిత్రమిది. ఇది విజయదశమి సందర్భంగా ఈ నెల 12న కొబ్బరికాయ కొట్టుకోనుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేయనున్నట్లు తెలిసింది. దీనితోనే చిత్ర కథ, ఇతర వివరాలపై స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈసారి ఇది 'దసరా'కు మించిన యాక్షన్ కథాంశంతో రూపొందనుందని.. నాని మునుపెన్నడూ చూడని భిన్నమైన లుక్‌లో కనిపించనున్నారని ప్రచారం సాగుతోంది.

త్రిప్తి ప్రేమలో రాజ్



త్రిప్తి దిమ్రీ

'భూల్ భులయ్యా 3'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది అందాల తార త్రిప్తి దిమ్రీ. ప్రస్తుతం ఆమె, రాజ్ కుమార్ రావ్ జంటగా నటిస్తోన్న కామెడీ డ్రామా చిత్రం 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో'. దీనిని రాజ్ శాండిల్య తెరకెక్కిస్తున్నారు. టీ సిరీస్, బాలాజీ మోషన్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. 90కాలం నాటి ప్రేమకథా నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. తాజాగా ఈ సినిమాలోని "చుమ్మా తెరా.."అనే పాటను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "ఓ మెరీ క్యూటీ ఓ మెరీ క్యూటీ తెర ఫొటో సెండ్ కరో..' అంటూ సాగుతున్న ఈ పాటలో త్రిప్తి ప్రేమ కోసం రాజ్ చేస్తున్న ప్రయత్నాలను చూపించారు. ఇందులో వీరిద్దరూ పెప్పీ స్టెప్పులతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది.

టీజర్ చూసి మహేశ్‌బాబు మెచ్చుకున్నారు



అర్జున్, అశోక్, మానస, బాలకృష్ణ

దేవకీ నందన వాసుదేవ'తో సినీప్రియుల్ని అలరించనున్నారు మహేశ్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని అర్జున్ జంధ్యాల తెరకెక్కించారు. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మించారు. మానస వారణాసి కథానాయిక. దర్శకుడు ప్రశాంత్ వర్మ కథ అందించారు. ఈ సినిమా నవంబరు 14న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఆదివారం ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో అశోక్ గల్లా మాట్లాడుతూ.. "ఇది విజయనగరం నేపథ్యంలో జరిగే కథ. నేనిందులో కృష్ణ పాత్రలో కనిపిస్తా. అమ్మ చెబితే ఏదైనా చేసే కుర్రాడు. ఇది పెద్ద స్పాన్ ఉన్న కమర్షియల్ చిత్రంగా ఉంటుంది. టీజర్ చూసి మహేశ్‌బాబు బాగుందని మెచ్చుకున్నారు. మాకింత మంచి కథ ఇచ్చినందుకు ప్రశాంత్ వర్మకు కృతజ్ఞతలు" అన్నారు. "ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న పక్కా కమర్షియల్ చిత్రమిది. ఇప్పటి వరకు ఇలాంటి కథ రాలేదు. భీమ్స్ దీన్ని 'మురారీ'తో పోల్చారు. స్క్రీన్‌ప్లే బాగా కుదిరింది" అన్నారు దర్శకుడు అర్జున్. ఈ కార్యక్రమంలో మానస, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రేస్ 4 సన్నాహాలు



సైఫ్ అలీఖాన్

'రేస్' ఫ్రాంఛైజీ చిత్రాలు బాలీవుడ్‌లో మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్నాయి. ఇప్పటికే ఇందులో రూపొందిన మూడు భాగాలు సినీప్రియులను విశేషంగా ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ ఫ్రాంఛైజీలో 'రేస్ 4' రాబోతున్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ కథానాయకుడు సైఫ్ అలీఖాన్ ప్రధాన పాత్రలో ఈ నాలుగో భాగాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు నిర్మాత రమేశ్ తౌరానీ. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. రాబోయే ఈ ప్రాజెక్టు గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు. "సైఫ్ తిరిగి 'రేస్' ఫ్రాంఛైజీలోకి వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మొదటి రెండు భాగాల్లో ఆయన యాక్షన్ హంగామాకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ప్రస్తుతం దర్శకుడిని, మిగతా నటీనటులను ఖరారు చేసే పనిలో ఉన్నాం. వచ్చే ఏడాది చిత్రీకరణను ప్రారంభించి.. అధికారికంగా సినిమాను ప్రకటిస్తాం" అని చెప్పుకొచ్చారు. ఇందులో సిద్ధార్థ్ మల్హోత్రా ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.

మార్కో రాక ఖరారు



ఉన్ని ముకుందన్

తెలుగు, మలయాళ చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకులను అలరించిన నటుడు ఉన్ని ముకుందన్. తాజాగా ఈయన 'మార్కో' చిత్రంతో రావడానికి సన్నద్ధమవుతున్నారు. క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో హనీఫ్ అదేనీ తెరకెక్కిస్తున్నారు. షరీఫ్ ముహమ్మద్ నిర్మిస్తున్నారు. ఇందులో యుక్తి తరేజా, అన్సన్ పాల్, రియాజ్ ఖాన్, కబీర్ దుహన్ సింగ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. తాజాగా ఈ సినిమా డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు రాబోతుందని సామాజిక మాధ్యమాల వేదికగా తెలిపింది చిత్రబృందం. "ఈ క్రిస్మస్‌కు ఎక్స్‌మస్ కేక్‌ను కట్ చేసేందుకు సిద్ధంగా ఉండండి" అనే వ్యాఖ్యను జోడించింది. ప్రస్తుతం 'గెట్ సెట్ బేబీ'తో బిజీగా ఉన్నారు ముకుందన్.

గురుశిష్యులుగా సల్మాన్, వరుణ్



వరుణ్ ధావన్



సల్మాన్ ఖాన్

ఓ వైపు కథానాయకుడిగా తన యాక్షన్ సన్నివేశాలతో అభిమానుల్ని మురిపిస్తూనే.. మరో వైపు అవకాశం వచ్చినప్పుడల్లా అతిథి పాత్రల్లో మెరుస్తూ సినీప్రియుల్ని మెప్పిస్తుంటారు బాలీవుడ్ అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్. ఇప్పుడాయన 'బేబీ జాన్' చిత్రంలో అతిథి పాత్రలో తళుక్కున మెరవడానికి సిద్ధమయ్యారు. వరుణ్ ధావన్, కీర్తి సురేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. వామికా గబ్బీ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌ను కాలీస్ తెరకెక్కిస్తున్నారు. ప్రియా అట్లీ, జ్యోతి దేశ్‌పాండే సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో వరుణ్ గురువుగా సల్మాన్ కనిపించనున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఆయన తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణను పూర్తి చేసినట్లు తెలుస్తోంది. క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. ప్రస్తుతం 'సికందర్' చిత్రీకరణలో ఉన్నారు సల్మాన్.

ఛాంపియన్

మహిళల టీ20 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో చిత్తయిన భారత జట్టు.. తర్వాతి మ్యాచ్‌లో పుంజుకుంది. తన రెండో మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను ఓడించింది. చిరకాల ప్రత్యర్థిపై ఒకప్పట్లా ఆధిపత్యం చలాయించకపోయినా, నెట్ రన్‌రేట్ బాగా పెంచుకునే స్థాయి ప్రదర్శన చేయకపోయినా.. టోర్నీలో తొలి విజయంతో ఉపశమనాన్ని పొందింది హర్మన్‌ప్రీత్‌సేన. తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి సంచలన బౌలింగ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది.


షెఫాలి వర్మ 32

కష్టపడ్డా.. కొట్టేశారు


అరుంధతి 3/19

● టీ20 ప్రపంచకప్‌లో భారత్ అమ్మాయిల బోణీ ● అరుంధతి, శ్రేయాంక విజృంభణ ● పాక్‌పై విజయం

దుబాయ్

టీ20 ప్రపంచకప్‌లో చిరకాల ప్రత్యర్థి పాక్‌పై భారత్ తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అరుంధతిరెడ్డి (3/19), శ్రేయాంక పాటిల్ (2/12) విజృంభించడంతో పాక్‌పై పైచేయి సాధించింది. సోమవారం జరిగిన గ్రూపు-ఎ మ్యాచ్‌లో భారత్.. ఆరు వికెట్ల తేడాతో పాక్‌ను మట్టికరిపించింది. న్యూజిలాండ్ చేతిలో ఓడి సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకున్న భారత్.. పాక్‌పై గెలుపుతో ఆశలను సజీవంగా ఉంచుకుంది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన పాక్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 105 పరుగులు సాధించింది. భారత బౌలర్లు సమష్టిగా సత్తాచాటి పాక్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. ఓపెనర్ షెఫాలి వర్మ (32; 35 బంతుల్లో 3×4), జెమీమా రోడ్రిగ్స్ (23; 28 బంతుల్లో), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (29 రిటైర్డ్ హర్ట్; 24 బంతుల్లో 1×4) రాణించడంతో భారత్ 18.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. పొట్టి కప్పులో పాక్‌పై తన గెలుపోటముల రికార్డును 5-2తో భారత్ మరింత మెరుగుపరుచుకుంది. మొత్తంగా పాక్‌తో తలపడ్డ 16 టీ20ల్లో భారత్‌కిది 13వ విజయం. ఈ గెలుపుతో 2 పాయింట్లు లభించినా.. కివీస్ చేతిలో భారీ వ్యత్యాసంతో ఓడిన భారత్ పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. భారత్ (-1.217) కంటే మెరుగైన నెట్ రన్‌రేట్ కలిగిన పాక్ (0.555) మూడో స్థానంలో కొనసాగుతోంది. న్యూజిలాండ్ (2.900), ఆస్ట్రేలియా (1.908) వరుసగా తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.

చిన్న లక్ష్యమైనా..: పిచ్ నెమ్మదిగా ఉండటం.. పాక్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో భారత లక్ష్య ఛేదన అనుకున్న దానికంటే నెమ్మదిగా సాగింది. 106 పరుగుల లక్ష్యం చిన్నదే అయినా ఓపెనర్లు షెఫాలీ, స్మృతి మంధాన (7) జాగ్రత్తగా ఆడారు. అయితే పాక్ బౌలర్లు మరింత ఒత్తిడి పెంచడంతో స్మృతి వికెట్ పారేసుకుంది. వరుసగా 9 డాట్ బాల్స్ ఆడిన స్మృతి.. పదో బంతికి (బౌలర్ సాదియా) పాయింట్‌లో తుబా చేతికి చిక్కింది. అనంతరం షెఫాలి, జెమీమా భారత్‌ను లక్ష్యం దిశగా నడిపించారు. జెమీమా చురుగ్గా స్ట్రైక్ రొటేట్ చేయగా.. షెఫాలి వీలుచిక్కినప్పుడల్లా బంతిని బౌండరీ ఆవలికి తరలించింది. దీంతో 10 ఓవర్లలో భారత్ స్కోరు 50 పరుగులకు చేరుకుంది. అయితే ధాటిగా ఆడే క్రమంలో షెఫాలి పెవిలియన్ చేరుకుంది. క్రీజులోకొచ్చిన హర్మన్ వేగంగా పరుగులు రాబట్టింది. హర్మన్, జెమీమా సింగిల్స్, డబుల్స్‌తో స్కోరు బోర్డును నడిపించారు. అయితే పేసర్ ఫాతిమా సనా (2/23) వరుస బంతుల్లో జెమీమా, రిచా ఘోష్ (0)లను ఔట్ చేయడంతో మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారింది. ఈ స్థితిలో భారత్ విజయానికి 27 బంతుల్లో 26 పరుగులు అవసరమయ్యాయి. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన హర్మన్.. దీప్తిశర్మ (7 నాటౌట్)తో కలిసి 19 బంతుల్లో 24 పరుగులు జోడించి జట్టును విజయానికి చేరువ చేసింది. మరో రెండు పరుగులు కావాల్సిన సమయంలో మెడ నొప్పితో హర్మన్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగింది. ఆ తర్వాతి బంతిని బౌండరీకి తరలించిన సజన పని పూర్తిచేసింది.

బౌలర్లు సమష్టిగా..: మొదట పాక్‌ను భారత బౌలర్లు సమష్టి ప్రదర్శనతో కట్టడి చేశారు. పేసర్ రేణుక సింగ్ (1/23) ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెనర్ గుల్ ఫెరోజా (0)ను ఔట్ చేసింది. అనంతరం దీప్తి (1/24), అరుంధతి, శ్రేయాంక, ఆశ (1/24) విజృంభించడంతో పాక్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ముఖ్యంగా అరుంధతి కెరీర్లోనే ఉత్తమ బౌలింగ్ ప్రదర్శన చేసింది. మునీబా (17), నిదా దార్ (28), ఫాతిమా (13), అరూబా (14 నాటౌట్)ల పోరాటంతో పాక్ స్కోరు 100 దాటింది.


హర్మన్‌ప్రీత్

పాకిస్థాన్ ఇన్నింగ్స్: మునీబా (స్టంప్డ్) రిచా (బి) శ్రేయాంక 17; గుల్ ఫెరోజా (బి) రేణుక 0; సిద్రా (బి) దీప్తి 8; ఒమైమా (సి) షెఫాలి (బి) అరుంధతి 3; నిదా దర్ (బి) అరుంధతి 28; ఆలియా (ఎల్బీ) (బి) అరుంధతి 4; ఫాతిమా సనా (సి) రిచా (బి) ఆశ 13; తుబా (సి) షెఫాలి (బి) శ్రేయాంక 0; సయ్యదా అరూబ్ నాటౌట్ 14; నష్రా సంధు నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం:** (20 ఓవర్లలో 8 వికెట్లకు) **105; వికెట్ల పతనం:** 1-1, 2-25, 3-33, 4-41, 5-52, 6-70, 7-71, 8-99; **బౌలింగ్:** రేణుక సింగ్ 4-0-23-1; దీప్తిశర్మ 4-0-24-1; అరుంధతిరెడ్డి 4-0-19-3; శ్రేయాంక పాటిల్ 4-1-12-2; ఆశ శోభన 4-0-24-1

భారత్ ఇన్నింగ్స్: షెఫాలి (సి) ఆలియా (బి) ఒమైమా 32; స్మృతి (సి) తుబా (బి) సాదియా 7; జెమీమా (సి) మునీబా (బి) ఫాతిమా 23; హర్మన్‌ప్రీత్ రిటైర్డ్‌హర్ట్ 29; రిచా ఘోష్ (సి) మునీబా (బి) ఫాతిమా 0; దీప్తిశర్మ నాటౌట్ 7; సజన నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం:** (18.5 ఓవర్లలో 4 వికెట్లకు) **108; వికెట్ల పతనం:** 1-18, 2-61, 3-80, 4-80; **బౌలింగ్:** ఫాతిమా సనా 4-0-23-2; సాదియా ఇక్బాల్ 4-0-23-1; నిదా దర్ 1.5-0-10-0; ఒమైమా 3-0-17-1; నష్రా 4-0-21-0; తుబా 2-0-14-0

హర్మన్‌కు ఏమైంది?

భారత్ విజయానికి 9 బంతుల్లో రెండు పరుగులే కావాలి. నిదా బౌలింగ్‌లో క్రీజు వదిలి బయటికి వచ్చి షాట్ ఆడి మ్యాచ్‌ను ముగించాలని చూసింది భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్. కానీ బంతిని అందుకోలేకపోయింది. పాక్ వికెట్ కీపర్ మునీబా బంతిని సరిగా అందుకుని ఉంటే హర్మన్ స్టంపౌటయ్యేదే. కానీ ఆమె విఫలమైంది. అయితే తిరిగి క్రీజును చేరుకోవడానికి ప్రయత్నించేందుకు కాలిని చాచే క్రమంలో హర్మన్ పట్టు తప్పి పడిపోయింది. ఈ క్రమంలో ఆమె గాయపడింది. ఫిజియో వచ్చి చికిత్స అందించిన హర్మన్ బ్యాటింగ్ కూడా కొనసాగించలేకపోయింది. మెడ నొప్పితో బాధ పడుతూ పెవిలియన్‌కు కదిలింది. మ్యాచ్ అనంతరం బహుమతి ప్రదానోత్సవానికి కూడా హర్మన్ రాకపోవడంతో బుధవారం శ్రీలంకతో మ్యాచ్‌లో ఆమె ఆడుతుందా లేదా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.


అర్ష్‌దీప్ సింగ్ 3/14

టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించిన టీమ్‌ఇండియాకు టీ20 సిరీస్‌లోనూ అదిరే ఆరంభం దక్కింది. కొందరు కీలక ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చినా తొలి మ్యాచ్‌లో భారత్ దంచికొట్టింది. బంతితో, బ్యాటుతో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ.. బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించింది. బంగ్లా పతనంలో అర్ష్‌దీప్ కీలక పాత్ర పోషించాడు. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గొప్పగా పునరాగమనం చేస్తే.. పేస్ సంచలనం మయాంక్ యాదవ్ అరంగేట్రంలో ఆకట్టుకున్నాడు. హార్దిక్ పాండ్య ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తా చాటాడు.

అలవోకగా..

● తొలి టీ20లో బంగ్లాదేశ్‌పై భారత్ ఘనవిజయం ● మెరిసిన అర్ష్‌దీప్, వరుణ్, హార్దిక్


వరుణ్ చక్రవర్తి 3/31

గ్వాలియర్

టీ20 సిరీస్‌లో టీమ్‌ఇండియా ఘనంగా బోణీ కొట్టింది. ఆల్‌రౌండ్ జోరును ప్రదర్శిస్తూ ఆదివారం తొలి మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. అర్ష్‌దీప్ సింగ్ 3/14), వరుణ్ చక్రవర్తి (3/31), మయాంక్ యాదవ్ (1/21) ధాటికి మొదట బంగ్లాదేశ్ 19.5 ఓవర్లలో 127 పరుగులకే ఆలౌటైంది. మెహిదీ హసన్ మిరాజ్ (35 నాటౌట్; 32 బంతుల్లో 3×4) టాప్ స్కోరర్. హార్దిక్ (39 నాటౌట్; 16 బంతుల్లో 5×4, 2×6) మెరవడంతో లక్ష్యాన్ని భారత్ 11.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (29; 14 బంతుల్లో 2×4, 3×6), సంజు శాంసన్ (29; 19 బంతుల్లో 6×4) బ్యాట్ ఝుళిపించారు. అర్ష్‌దీప్ సింగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఈ విజయంతో సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యం సంపాదించింది. రెండో మ్యాచ్ బుధవారం దిల్లీలో జరుగుతుంది.

హార్దిక్ ధనాధన్: స్వల్ప లక్ష్యాన్ని టీమ్‌ఇండియా ఎలాంటి ఒత్తిడి లేకుండా అలవోకగా ఛేదించింది. ప్రత్యర్థికి చిన్న అవకాశం కూడా ఇవ్వకుండా ధనాధన్ బ్యాటింగ్‌తో త్వరగా పని పూర్తి చేసింది. శాంసన్‌తో కలిసి అభిషేక్ శర్మ (16; 7 బంతుల్లో 2×4, 1×6) ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించాడు. తొలి ఓవర్లో శాంసన్ రెండు ఫోర్లు కొడితే.. రెండో ఓవర్లో తస్కిన్ బౌలింగ్‌లో అభిషేక్ సిక్స్, రెండు ఫోర్లు దంచేశాడు. కానీ మంచి ఊపుమీదున్న దశలో అభిషేక్ రనౌట్ కావడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. కానీ బంగ్లాకు పెద్దగా సంతోషించడానికేమీ లేకపోయింది. ప్రతి బ్యాటరూ ధాటిగా బ్యాటింగ్ చేయడంతో లక్ష్యం వేగంగా కరిగింది. కెప్టెన్ సూర్యకుమార్ కాసేపే ఉన్నా.. బంగ్లాకు చేయాల్సినంత నష్టం చేశాడు. ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. తస్కిన్ బౌలింగ్‌లో రెండు ఫోర్లు, సిక్స్ కొట్టాడు. ఆరో ఓవర్లో అతణ్ని ముస్తాఫిజుర్ ఔట్ చేసినా భారత్‌కు పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేకపోయింది. అప్పటికే స్కోరు 65. ఓ భారీ షాట్‌కు యత్నించి ఎనిమిదో ఓవర్లో శాంసన్ కూడా ఔటయ్యాడు. కానీ భారత్‌పై బంగ్లా ఎలాంటి ఒత్తిడీ తేలేకపోయింది. హార్దిక్ చెలరేగిపోయాడు. అరంగేట్ర ఆటగాడు నితీశ్‌కుమార్ రెడ్డి (16 నాటౌట్) ఓ వైపు నిలవగా.. మరోవైపు హార్దిక్ దంచికొట్టాడు. చకచకా ఫోర్లు, సిక్స్‌లు బాదేసి ఊహించినదానికన్నా ముందే మ్యాచ్‌ను ముగించాడు. నితీశ్‌తో అభేద్యమైన నాలుగో వికెట్‌కు హార్దిక్.. 24 బంతుల్లోనే 52 పరుగులు జోడించాడు.


హార్దిక్ 39 నాటౌట్

బంగ్లా విలవిల: భారత్ బౌలింగ్ దళం సమష్టిగా బంగ్లాదేశ్ వెన్నువిరిచింది. స్పిన్నర్లు, పేసర్లూ అత్యంత కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఏ దశలోనూ ప్రత్యర్థి బ్యాటర్లకు స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించే అవకాశం ఇవ్వలేదు. క్రమం తప్పకుండా వికెట్లు పోవడంతో బంగ్లా ఇన్నింగ్స్ ఏ దశలోనూ ఊపందుకోలేదు. అర్ష్‌దీప్ సింగ్ టాప్‌ను లేపేస్తే.. ఆ తర్వాత వరుణ్ చక్రవర్తి మాయ చేశాడు. అరంగేట్ర బౌలర్ మయాంక్ యాదవ్ కూడా తన పేస్‌తో బ్యాటర్లను బెంబేలెత్తించాడు. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న టీమ్‌ఇండియాకు పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అదిరే ఆరంభాన్నిచ్చాడు. భారత బౌలింగ్ దాడిని ఆరంభించిన అతడు, అయిదో బంతికే లిటన్ దాస్ (4)ను వెనక్కి పంపి బంగ్లాకు షాకిచ్చాడు. లిటన్ ఎడ్జ్‌తో రింకుకు దొరికిపోయాడు. అర్ష్‌దీప్ తన తర్వాతి ఓవర్లో మరో ఓపెనర్ పర్వేజ్ ఎమాన్ (8)ను బౌల్డ్ చేయడంతో బంగ్లా 14/2తో నిలిచింది. భారత బౌలర్లు జోరు కొనసాగించడంతో 57/5తో చిక్కుల్లో పడడానికి బంగ్లాదేశ్‌కు ఎంతో సమయం పట్టలేదు. మూడేళ్ల విరామం తర్వాత జట్టులోకి వచ్చిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి.. తన రెండో ఓవర్లోనే హృదోయ్ (12)ను ఔట్ చేశాడు. ఇక తన తొలి ఓవరే మెయిడెన్ వేసిన స్పీడ్ సంచలనం మయాంక్.. తన తర్వాతి ఓవర్లో అనుభవజ్ఞుడైన మహ్మదుల్లా (1)ను ఔట్ చేయడం ద్వారా బంగ్లా పతనాన్ని వేగవంతం చేశాడు. కాసేపటి తర్వాత జేకర్ అలీ (8)ని వరుణ్ బౌల్డ్ చేశాడు. మరోవైపు వికెట్లు పడుతున్నా పట్టుదలతో క్రీజులో నిలిచిన నజ్ముల్ శాంటో (27; 25 బంతుల్లో 1×4, 1×6)ను చివరికి వరుణ్ వెనక్కి పంపాడు. 12 ఓవర్లు ముగిసే సరికి బంగ్లా 75/6తో నిలిచింది. అయినా ఆ జట్టు కాస్త గౌరవప్రద స్కోరు సాధించిందంటే కారణం మిరాజ్ పోరాటమే. ఒత్తిడిలో చక్కగా బ్యాటింగ్ చేసిన అతడు.. రిషాద్ (11), తస్కిన్ అహ్మద్ (12)ల సహకారంతో బంగ్లా స్కోరు 120 దాటించాడు.

పునరాగమనం అదరహో..

ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున చాలా ఏళ్ల నుంచి నిలకడగా రాణిస్తున్నాడు తమిళనాడు స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి. ఏటా అత్యధిక వికెట్ల వీరుల జాబితాలో అతను పేరు కనిపిస్తుంటుంది. కానీ టీమ్‌ఇండియా తరఫున మాత్రం తన ప్రదర్శన సాధారణం. మూడేళ్ల కిందట జట్టులో చోటు దక్కినా.. ఆకట్టుకోలేకపోయాడు. 6 టీ20లు ఆడి 2 వికెట్లే పడగొట్టాడు. భారత జట్టులోకి ఎంపికైన తొలి సిరీస్‌లోనే ఫిట్‌నెస్ సమస్యలు వెంటాడాయి. ప్రదర్శనా అంతంతమాత్రం కావడంతో అతడికి మూడేళ్ల పాటు అవకాశమే దక్కలేదు. ఇక మళ్లీ భారత జట్టులోకి రావడం కష్టమే అనుకుంటున్న తరుణంలో బంగ్లాదేశ్‌తో టీ20లకు అనుకోకుండా సెలక్టర్ల నుంచి పిలుపు అందుకున్నాడు. ఈసారి అవకాశాన్ని అతను వృథా చేసుకోలేదు. పునరాగమనంలో తొలి మ్యాచ్‌లోనే మూడు వికెట్లు పడగొట్టాడు. తన రెండో బంతికే అతను వికెట్ పడగొట్టాల్సింది. కానీ తౌహిద్ క్యాచ్‌ను నితీశ్ నేలపాలు చేశాడు. ఆ ఓవర్లో 15 పరుగులు సమర్పించుకున్నప్పటికీ వరుణ్ వెరవలేదు. తర్వాతి ఓవర్లో 3 పరుగులే ఇచ్చి వికెట్ తీశాడు. తర్వాతి రెండు ఓవర్లలోనూ అతను వికెట్లు తీశాడు.

ఆ ఇద్దరి అరంగేట్రం


మయాంక్, నితీశ్ కుమార్

తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి అంతర్జాతీయ క్రికెట్లో అరంగేట్రం చేశాడు. ఈ సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్.. మాజీ వికెట్‌కీపర్ పార్థివ్ పటేల్ నుంచి క్యాప్‌ను అందుకున్నాడు. రెండు ఓవర్లు బౌలింగ్ చేసి 17 పరుగులిచ్చిన అతడు.. ఛేదనలో 16 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తరఫున ఆకట్టుకున్న నితీశ్ ఇంతకుముందే అరంగేట్రం చేయాల్సింది. జింబాబ్వేతో అయిదు టీ20ల సిరీస్ కోసం తొలిసారి భారత జట్టుకు ఎంపికైన అతడు, గాయం కారణంగా ఆ పర్యటనకు దూరమయ్యాడు. ఈ ఏడాది ఐపీఎల్ సన్‌రైజర్స్ తరఫున అదిరే ప్రదర్శన చేసిన నితీశ్ కుమార్ రెడ్డి.. 'ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ద సీజన్' అవార్డును కూడా అందుకున్నాడు. సీజన్‌లో అతడు 11 ఇన్నింగ్స్‌ల్లో 142.92 స్ట్రైక్‌రేట్‌తో 303 పరుగులు చేశాడు. మీడియం పేస్‌తో మూడు వికెట్లు పడగొట్టాడు. పేస్ సంచలనం మయాంక్ యాదవ్ కూడా ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేశాడు. 2024 ఐపీఎల్‌లో తన సంచలన పేస్‌తో మయాంక్ అందరినీ ఆకర్షించిన సంగతి తెలిసిందే. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున నాలుగు మ్యాచ్‌లే ఆడినా ఎంతో ప్రభావాన్ని చూపించాడు. నిలకడగా 150 కిలోమీటర్ల వేగంతో బంతులేస్తూ ఔరా అనిపించిన అతడు.. ఏడు వికెట్లు పడగొట్టాడు. ఇందులో బెయిర్‌స్టో, మ్యాక్స్‌వెల్ వికెట్లు కూడా ఉన్నాయి. గాయం కారణంగా మయాంక్ చాలా త్వరగా టోర్నీని వీడాడు. గాయం నుంచి కోలుకున్న అతడు.. తొలి టీ20లో బంగ్లా బ్యాటర్లను తన పేస్‌తో హడలెత్తించాడు.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: పర్వేజ్ ఎమాన్ (బి) అర్ష్‌దీప్ 8; లిటన్ దాస్ (సి) రింకు (బి) అర్ష్‌దీప్ 4; నజ్ముల్ శాంటో (సి) అండ్ (బి) వాషింగ్టన్ సుందర్ 27; హృదోయ్ (సి) హార్దిక్ (బి) వరుణ్ చక్రవర్తి 12; మహ్మదుల్లా (సి) వాషింగ్టన్ సుందర్ (బి) మయాంక్ యాదవ్ 1; జేకర్ అలీ (బి) వరుణ్ చక్రవర్తి 8; మెహిదీ హసన్ మిరాజ్ నాటౌట్ 35; రిషాద్ (సి) హార్దిక్ (బి) వరుణ్ చక్రవర్తి 11; తస్కిన్ అహ్మద్ రనౌట్ 12; షోరిఫుల్ (బి) హార్దిక్ 0; ముస్తాఫిజుర్ (బి) అర్ష్‌దీప్ 1; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (19.5 ఓవర్లలో ఆలౌట్) 127; **వికెట్ల పతనం:** 1-5, 2-14, 3-40, 4-43, 5-57, 6-75, 7-93, 8-116, 9-117; **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 3.5-0-14-3; హార్దిక్ 4-0-26-1; వరుణ్ చక్రవర్తి 4-0-31-3; మయాంక్ యాదవ్ 4-1-21-1; నితీశ్‌కుమార్ రెడ్డి 2-0-17-0; వాషింగ్టన్ సుందర్ 2-0-12-1

భారత్ ఇన్నింగ్స్: సంజు శాంసన్ (సి) రిషాద్ (బి) మిరాజ్ 29; అభిషేక్ శర్మ రనౌట్ 16; సూర్యకుమార్ (సి) జేకర్ అలీ (బి) ముస్తాఫిజుర్ 29; నితీశ్‌కుమార్ రెడ్డి నాటౌట్ 16; హార్దిక్ పాండ్య నాటౌట్ 39; ఎక్స్‌ట్రాలు 3 **మొత్తం:** (11.5 ఓవర్లలో 3 వికెట్లకు) **132; వికెట్ల పతనం:** 1-25, 2-65, 3-80; **బౌలింగ్:** షోరిఫుల్ 2-0-17-0; తస్కిన్ 2.5-0-44-0; ముస్తాఫిజుర్ 3-0-36-1; రిషాద్ 3-0-26-0; మిరాజ్ 1-0-7-1


సచిన్

అమెరికా లీగ్‌తో జట్టుకట్టిన సచిన్

వాషింగ్టన్/టెక్సాస్: దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్ అమెరికా జాతీయ క్రికెట్ లీగ్ (ఎన్‌సీఎల్)లో భాగమయ్యాడు. లీగ్ యాజమాన్యంలో చేరుతున్నట్లు ఆదివారం సచిన్ ప్రకటించాడు. "నా జీవితంలో క్రికెట్ గొప్ప ప్రయాణం. అమెరికాలో క్రికెట్‌కు ఆదరణ లభిస్తున్న తరుణంలో ఎన్‌సీఎల్‌లో చేరడం ఆనందంగా ఉంది'' అని సచిన్ పేర్కొన్నాడు. ఈ సీజన్‌లో సునీల్ గావస్కర్, జహీర్ అబ్బాస్, వసీం అక్రమ్, దిలీప్ వెంగ్‌సర్కార్, వివియన్ రిచర్డ్స్, వెంకటేశ్ ప్రసాద్, సనత్ జయసూర్య, మొయిన్‌ఖాన్, బ్లెయిర్ ఫ్రాంక్లిన్ యువ ఆటగాళ్లకు మెంటార్, కోచ్‌లుగా వ్యవహరిస్తారు. షాహిద్ అఫ్రిది, సురేశ్ రైనా, దినేశ్ కార్తీక్, షకిబ్, ఉతప్ప లాంటి క్రికెటర్లు ఈ లీగ్‌లో బరిలో దిగుతున్నారు.

పాక్, ఇంగ్లాండ్ తొలి టెస్టు నేటి నుంచే


ఇంగ్లాండ్, పాక్ కెప్టెన్లు పోప్, మసూద్

ముల్తాన్: సొంతగడ్డపై టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్ చేతిలో 0-2తో చిత్తుగా ఓడిన పాకిస్థాన్ మరో పరీక్షకు సిద్ధమైంది. ఇంగ్లాండ్‌తో మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ రూపంలో సవాల్‌ను ఎదుర్కోనుంది. రెండు జట్ల మధ్య తొలి టెస్టు సోమవారం ఆరంభం కానుంది. తొడ కండరాల గాయం నుంచి పూర్తిగా కోలుకోని బెన్ స్టోక్స్ మ్యాచ్‌కు దూరమవగా.. ఓలీ పోప్ సారథ్యంలో ఇంగ్లాండ్ బరిలో దిగనుంది. సొంతగడ్డపై స్టోక్స్ గైర్హాజరీలో 2-1తో శ్రీలంకతో సిరీస్‌ను కైవసం చేసుకున్న ఇంగ్లాండ్.. రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఉంది. ఫాస్ట్ బౌలర్ బ్రైడన్ కార్స్ అరంగేట్రం చేస్తుండగా.. గస్ అట్కిన్సన్ విదేశాల్లో మొదటి టెస్టు ఆడనున్నాడు. సుమారు రెండున్నరేళ్ల తర్వాత ఆల్‌రౌండర్ క్రిస్ వోక్స్ టెస్టు మ్యాచ్‌లో బరిలో దిగుతున్నాడు. 2022లో పాక్‌లో పర్యటించిన ఇంగ్లాండ్.. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 3-0తో ఆతిథ్య జట్టును చిత్తుచేసింది. తాజా సిరీస్‌లోనూ అలాంటి ఫలితమే పునరావృతం చేయాలని ఇంగ్లాండ్ భావిస్తోంది. మరోవైపు పాక్ కెప్టెన్ షాన్ మసూద్‌కు ఈ సిరీస్ కఠిన పరీక్షగా నిలువనుంది. సారథిగా వ్యవహరించిన అయిదు టెస్టుల్లోనూ పాక్ ఓడటంతో మసూద్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఆల్‌రౌండర్ ఆమిర్ జమాల్ చేరిక పాక్‌కు ఏ మేరకు లాభిస్తుందో చూడాలి.

నకమురా చేతిలో ఆనంద్ ఓటమి

గ్లోబల్ చెస్ లీగ్


ఆనంద్

లండన్: గ్లోబల్ చెస్ లీగ్‌లో గ్యాంజెస్ గ్రాండ్‌మాస్టర్స్ వైఫల్యం కొనసాగుతూనే ఉంది. తొలి మూడు మ్యాచ్‌ల్లో ఓటమి తర్వాత నాలుగో మ్యాచ్‌లో విజయంతో పుంజుకున్నట్లే కనిపించిన ఆ జట్టు.. అయిదో మ్యాచ్‌లో మళ్లీ భంగపడింది. ఆనంద్ నేతృత్వంలోని గ్యాంజెస్ ఆదివారం 4-10తో అమెరికన్ గ్యాంబిట్స్ చేతిలో ఓడిపోయింది. విశ్వనాథన్ ఆనంద్ (గ్యాంజెస్).. నకమురా చేతిలో ఓడిపోయాడు. సలిమోవాపై ఎలిసబెత్ (గ్యాంబిట్స్) గెలిచింది. దుడా (గ్యాంబిట్స్)తో గేమ్‌ను అర్జున్, యాంగ్యితో గేమ్‌ను పర్హామ్ (గ్యాంజెస్), టిబిసారతో గేమ్‌ను వైశాలి (గ్యాంజెస్), జోనాస్‌తో గేమ్‌ను వొలోదార్ (గ్యాంజెస్) డ్రాగా ముగించారు. అమెరికన్ గ్యాంబిట్స్ క్రీడాకారులు తెల్లపావులతో ఆడారు. గ్యాంబిట్స్ ఆదివారం మరో మ్యాచ్ కూడా ఆడింది. ఆ పోరులో 7-9తో అల్పైన్ ఎస్‌జీ పైపర్స్ చేతిలో ఓడింది. అల్పైన్ మరో మ్యాచ్‌లో 7-9తో అలాస్కన్ నైట్స్ చేతిలో పరాజయం పాలైంది. ఇంకో మ్యాచ్‌లో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ 12-3తో ముంబా మాస్టర్స్‌పై ఘనవిజయం సాధించింది. ఆడిన అయిదు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన అలాస్కన్ నైట్స్.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది.

మొక్కవోని ధైర్యం... ఈ మగువల ప్రస్థానం



తాము తయారుచేస్తున్న జ్యూట్ ఉత్పత్తుల గురించి వివరిస్తున్న మంజుల

ఆకారపు మల్లేశం

'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి

వీరంతా గ్రామీణ మహిళలు.. పెళ్లి చేసుకొని భర్త, పిల్లాపాపలతో ఆనందంగా ఉన్న సమయంలో పాతికేళ్ల లోపు వయసులో ఊహించని కష్టాలు వచ్చాయి. సాగు కలిసిరాక.. చేసిన అప్పులు తీర్చే దారి కానరాక.. భర్తలు ఆత్మహత్య చేసుకోగా వీరి జీవితాలు కన్నీటి సంద్రమయ్యాయి. అప్పుల భారం.. కుటుంబ పోషణ వంటి సవాళ్లు చుట్టుముట్టగా వీరు ధైర్యాన్ని కూడగట్టుకొని అచంచల విశ్వాసంతో స్వావలంబన దిశగా ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం గజ్వేల్‌లో ఉంటున్న కర్నాల మంజుల నిండు గర్భిణిగా ఉన్నప్పుడు అప్పుల బాధ తట్టుకోలేక భర్త ఆత్మహత్య చేసుకోగా అప్పులిచ్చిన వారు.. తమ బాకీ తీర్చిన తర్వాతే శవాన్ని పాడె ఎక్కించాలని పట్టుబట్టారు. ఆ పరిస్థితుల్లో కన్నీటిని దిగమింగుకొని తానే అప్పు చెల్లిస్తానని ఆమె హామీ పత్రం రాసి ఇచ్చారు. దుఃఖాన్ని దిగమింగుకుని.. పట్టుదలతో అడుగులు వేశారు. ఇప్పుడు జనపనార సంచుల తయారీతో మరో 20 మందికి ఉపాధినిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇలాంటి మరికొందరు విధివంచిత మహిళలూ ఆత్మస్థైర్యంతో స్వశక్తిని కూడగట్టుకుని పురోగమిస్తున్నారు. సాధారణ గ్రామీణ మహిళలు వేస్తున్న ఈ వడివడి అడుగుల ప్రస్థానంపై ప్రత్యేక కథనమిది.

కొంగొత్త అడుగులేస్తూ ముమ్మందుకు...

యాదాద్రి భువనగిరి జిల్లా గంధమల్లకు చెందిన కర్నాల మంజుల భర్త శ్రీధర్ (27)కు సొంతంగా ఎకరం భూమి ఉండగా మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని భార్యాభర్తలు వ్యవసాయం చేశారు. కరవు ప్రాంతం కావడంతో నీటి వసతి కోసం ఐదు బోర్లు వేశారు. రూ.5.70 లక్షల మేర అప్పు అయింది. అప్పుల వాళ్ల వేధింపులతో 2015 జనవరి 26న భర్త పురుగుమందు తాగి చనిపోయారు. అప్పటికి ఆమెకు బాబు.. పైగా గర్భిణి కూడా. మృతదేహం అక్కడ ఉండగానే అప్పుల వాళ్లు వచ్చి డబ్బు కట్టాలని డిమాండ్ చేశారు. బంధువులంతా ముఖం చాటేయగా.. రుణాన్ని తానే తీరుస్తానని ఆమె హామీ పత్రం రాసిచ్చి భర్త అంత్యక్రియలు పూర్తిచేయించారు. కుటుంబాన్ని ఎలా సాకాలా అని ఆలోచించి ముందు కుట్టు పని నేర్చుకున్నారు. స్థానికంగా పెద్దగా ఆదాయం లేకపోవడంతో సమీపంలోని మెదక్ జిల్లా గజ్వేల్‌కు వెళ్లారు. వేర్వేరు ప్రయత్నాలు చేశారు. తర్వాత అక్కడే జనపనార సంచులు కుట్టి, విక్రయించడం ప్రారంభించారు. తొలుత ఆమె ఒక్కరే దీన్ని మొదలుపెట్టగా మూడేళ్ల వ్యవధిలోనే 50 మిషన్లతో విస్తరించారు. ప్రస్తుతం ఆమె వద్ద 20 మంది పనిచేస్తున్నారు. భర్త చేసిన అప్పు తీర్చారు. కొత్తగా ఆమె చిరుధాన్యాల ఆహార పదార్థాల తయారీ కేంద్రం ప్రారంభించారు.

ఒంటరి మహిళలకు ధైర్యం నూరిపోస్తూ...

మంజుల తనకు వచ్చే ఆదాయంలో కొంత ఒంటరి మహిళల కోసం వెచ్చిస్తున్నారు. వారి కుటుంబ అవసరాలకు, పిల్లల చదువుకు సాయం అందిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఒంటరి మహిళల సంఘానికి ఆమె అధ్యక్షురాలిగా ఉన్నారు. పలు జిల్లాల్లో పర్యటిస్తూ వారి కష్టాలను తెలుసుకొని ధైర్యం నూరిపోస్తున్నారు. తన గాథను అందరికీ తెలియజేస్తూ ఎన్ని కష్టాలు ఎదురైనా దృఢచిత్తంతో పోరాడి విజయం సాధించాలని సూచిస్తున్నారు. "వంద మందికైనా ఉపాధి కల్పించాలన్నది నా లక్ష్యం. నాకు ఇప్పటి వరకు ఎలాంటి ప్రభుత్వ సాయం అందలేదు. ప్రభుత్వశాఖలు, సంస్థల నుంచి ఆర్డర్లు వస్తే వాటికీ జ్యూట్ బ్యాగ్‌లను సరఫరా చేస్తా" అని మంజుల తెలిపారు.

అప్పుల వాళ్లు భూమిని స్వాధీనం చేసుకున్నా..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు అజ్మీరా నరేశ్ ఎకరం పోడుభూమిలో పంటలు వేసి నష్టపోయారు. రూ.2 లక్షల వరకు అప్పు చేసి.. తీర్చలేక 2017 నవంబరు 21న ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటికి ఆయనకు భార్య అరుణ (24), ఇద్దరు పిల్లలున్నారు. నరేశ్ చనిపోయిన తర్వాత ప్రభుత్వ పరిహారం అందలేదు. దీంతో అప్పుల వాళ్లు భూమిని స్వాధీనం చేసుకున్నారు. అయినా ఆమె ధైర్యం కోల్పోలేదు. కూలి పనులు చేస్తూ తొలుత అడుగులు ప్రారంభించారు. దాతల సాయంతో తర్వాత పిండిమిల్లు పెట్టుకొని.. దాని ఆసరాతో ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

పొదుపు సంఘంలో చేరి అప్పులు చెల్లిస్తూ...



యాదాద్రి జిల్లా దత్తాయిపల్లికి చెందిన రాచనాల రామచంద్ర వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారు. కరవు ప్రాంతం కావడంతో పంటలు సరిగా పండలేదు. రూ.3 లక్షల అప్పు అయింది. వడ్డీ వ్యాపారుల వేధింపులు అధికమవడంతో 2012లో పొలం వద్ద కరెంటు తీగను పట్టుకొని ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటికి ఆయనకు భార్య లావణ్య (20), ముగ్గురు పిల్లలున్నారు. అంతగా చదువుకోని లావణ్య పొదుపు సంఘంలో చేరి అప్పులు చెల్లించడంతో పాటు ముగ్గురు పిల్లలను చదివిస్తున్నారు.

పిండిమిల్లు ఏర్పాటు చేసుకొని..



జయశంకర్ భూపాలపల్లి మండలం గూడాటిపల్లి ఎడ్ల అమరేందర్‌కు సొంత భూమి లేదు. మూడెకరాలు కౌలుకు తీసుకొని రూ.3 లక్షల అప్పు చేసి.. మిర్చి, పత్తి వేశారు. వరుసగా మూడేళ్లు అధికవర్షాలతో దిగుబడులు రాక పంట నష్టపోయారు. 2016 నాటికి అప్పులు రూ.ఆరు లక్షలకు చేరుకున్నాయి. వాటిని ఎలా తీర్చాలా అనే మనోవేదనతో ఆ ఏడాది అక్టోబరు 15న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటికి అమరేందర్ భార్య మానస (23) రెండు నెలల బాలింత. కష్టాన్ని దిగమింగి చిన్న బాబును తీసుకొని ఆమె కూలి పనులు చేస్తూ జీవనం ప్రారంభించారు. అత్తమామలు, మరిది సాయంతో మొత్తం అప్పు తీర్చారు. ఆ తర్వాత రైతు స్వరాజ్య వేదిక వారు ఆమెకు రూ.40 వేల ఆర్థిక సాయం అందించగా గ్రామంలో పిండిమిల్లు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు.

పాడితో వచ్చే ఆదాయంతో...



భూపాలపల్లి జిల్లా పొనగండ్లకు చెందిన మారవేణి భాస్కర్ నాలుగు ఎకరాల్లో పంటల సాగు కోసం రూ.8.50 లక్షల అప్పులు చేసి నష్టాలు రావడంతో 2018 నవంబరు 8న ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటికి ఆయనకు భార్య సుమలత (22), ఏడాది వయసు గల కుమారుడు ఉన్నారు. ఆ సమయంలో ఆమెకు ఏం చేయాలో అర్థం కాలేదు. తొలుత కూలి పని చేస్తూ ముందుకు సాగారు. తర్వాత గేదెలను కొని.. పాడిపై వచ్చే ఆదాయంతో జీవిస్తూ, కుమారుడిని చదివిస్తున్నారు.

దాతల సాయంతో కిరాణా వ్యాపారం

నల్గొండ జిల్లా నాంపల్లి మండలం రాజ్యా తండాకు చెందిన రమావత్ మధు సొంత భూమి రెండు ఎకరాల్లో నష్టం రావడంతో అప్పుల బాధ తాళలేక 2017లో ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటికి ఆయనకు భార్య చెలి (25), ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త చనిపోయాక ఆమె సొంతంగా వ్యవసాయం ప్రారంభించారు. పంటను పండించి అప్పు తీర్చడంతో పాటు దాతల సాయంతో కిరాణా షాపు ఏర్పాటు చేసుకొన్నారు. అటు పంటలు పండిస్తూ.. లాభాలను పొందడంతో పాటు కిరాణా దుకాణం ద్వారా ఆదాయం పొందుతున్నారు.

ఆస్తి కోసం.. అత్తతో కలిసి మామను చంపిన అల్లుడు



మృతుడు శంకర్

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: అతడో ఇల్లరికం అల్లుడు. మామ పేరిట ఉన్న కొద్దిపాటి ఆస్తిని చేజిక్కించుకోవాలన్న దుర్బుద్ధి పుట్టింది. అతడి ఆలోచనలకు అత్త వంత పాడింది. ఆమెతో కలిసి మామను గొంతు నులిమి హత్య చేశాడు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో ఆదివారం ఈ దారుణం వెలుగుచూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉద్మీర్‌గల్లీకి చెందిన క్యామొల్ల శంకర్ (50) మేకల కాపరి. అతనికి భార్య చిన్నమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలిద్దరికీ పెళ్లిళ్లు కాగా.. పెద్దల్లుడు రవి ఇల్లరికంగా అత్తగారింట్లోనే ఉంటున్నాడు. శంకర్‌కు ఇంటితోపాటు మరో ఖాళీ జాగా, జీవాలు ఉండగా వాటి కోసం శనివారం రాత్రి మామతో రవి గొడవ పడ్డాడు. తర్వాత అత్తతో చర్చించి.. మామను అంతమొందించాలనుకున్నాడు. మేకల కొట్టంలో నిద్రిస్తున్న శంకర్‌ను అర్ధరాత్రి వేళ రవి, చిన్నమ్మ కలిసి గొంతు నులిమి చంపేశారు. ఆదివారం తెల్లవారుజామున మృతదేహాన్ని ఇంటి వద్దకు తీసుకొచ్చి.. సహజ మరణంగా అందరినీ నమ్మించారు. పట్టణంలోనే నివసిస్తున్న రెండో కుమార్తె సవిత తండ్రి మృతి వార్త తెలిసి పుట్టింటికి వచ్చింది. మృతదేహంపై మెడ వద్ద గాట్లు చూసి అనుమానం రావడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ వెంకటనారాయణ ప్రాథమిక విచారణలో హత్యకు ఆధారాలు లభించడంతో రవి, చిన్నమ్మలను అదుపులోకి తీసుకున్నారు. తర్వాత నిందితులిద్దరూ హత్య చేసినట్లు అంగీకరించారని సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధతో కౌలు రైతు బలవన్మరణం



రాజబాపు

కాటారం, న్యూస్‌టుడే: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రానికి చెందిన కొండ రాజబాపు (45) అనే కౌలు రైతు అప్పుల బాధలు తట్టుకోలేక ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డారు. ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల మేరకు.. పలిమెల మండలంలో కొన్నేళ్ల క్రితం భూమి కౌలుకు తీసుకొని రాజబాపు పత్తి పంట వేశారు. రెండేళ్లుగా అననుకూల పరిస్థితులతో పంటలో నష్టం వాటిల్లి రూ.7 లక్షల మేర అప్పుల పాలయ్యారు. అనంతరం కాటారం వచ్చి నాలుగెకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేస్తే ఇక్కడా సుమారు రూ.4 లక్షల అప్పులయ్యాయి. మూడేళ్ల క్రితం రాజబాపు కూతురు ఆత్మహత్య చేసుకొంది. అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనతో పాటు కూతురు చనిపోయిందనే మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం కలుపు నివారణ మందు తాగారు. కుటుంబసభ్యులు గమనించి వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

అవమాన భారంతో యువకుడి ఆత్మహత్య



సయ్యద్ పాషా

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్నేహితుడు చేసిన తప్పునకు తనపై దాడి చేశారని ఓ యువకుడు అవమాన భారంతో బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలో ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. రేగళ్లపాడు గ్రామానికి చెందిన సయ్యద్ పాషా(32) కిరాణా దుకాణం నడుపుతూ జీవించేవారు. యాతాలకుంటకు చెందిన అతడి స్నేహితుడు ధనేకుల ఖాసుబాబు వారం క్రితం పాషా సెల్‌ఫోన్ నుంచి రేగళ్లపాడుకు చెందిన ఓ వివాహితకు ఫోన్ చేసి అసభ్యంగా సంభాషించారు. ఆమె తన భర్త, బంధువులకు విషయం చెప్పడంతో వారు శనివారం పాషా వద్దకు వచ్చి నిలదీశారు. తనకేం తెలియదని, ఖాసుబాబు మాట్లాడాడని చెప్పినా వినకుండా తీవ్రంగా కొట్టి యాతాలకుంటకు తీసుకెళ్లారు. ఖాసుబాబు పరారీ కావడంతో పాషాపై అక్కడా దాడి చేశారు. ఈ ఘటనను అవమానంగా భావించిన పాషా రాత్రి పురుగు మందు తాగారు. ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తుండగా అంతలోనే మృతిచెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

జిల్లా గ్రంథాలయ సంస్థలకు ఛైర్మన్ల నియామకం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ జిల్లాల గ్రంథాలయ సంస్థలకు ఛైర్మన్లను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 3 వరకు వేర్వేరు తేదీలతో ఈ జీవోలు జారీ అయ్యాయి. గద్వాల జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నెల్లి శ్రీనివాసులు, మహబూబ్‌నగర్-మల్లు నర్సింహారెడ్డి, వికారాబాద్- శేరి రాజేశ్‌రెడ్డి, నారాయణపేట- వరాల విజయ్‌కుమార్, కామారెడ్డి- మద్ది చంద్రకాంత్‌రెడ్డి, సంగారెడ్డి- గొల్ల అంజయ్య, వనపర్తి- జి.గోవర్ధన్, రంగారెడ్డి- ఎ.మధుసూదన్‌రెడ్డి, కరీంనగర్- సత్తు మల్లయ్య, సిరిసిల్ల- నాగుల సత్యనారాయణగౌడ్, నిర్మల్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా సయ్యద్ అర్జుమాండ్ అలీ నియమితులయ్యారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆంగ్ల పాఠాలు

- ఓయూ ఈఎల్‌టీసీలో మెలకువల బోధన

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం కొత్తగా ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు ఏర్పాటు చేస్తుండడం, ఇప్పటికే ఉన్న వాటిని ఆంగ్ల మాధ్యమంలోకి మార్చిన నేపథ్యంలో తెలుగులో పాఠ్యాంశాలు బోధిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇలాంటి వారికి ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆంగ్లభాష శిక్షణ కేంద్రం(ఈఎల్‌టీసీ) సులభమైన పరిష్కారాలను అందిస్తోంది. ఉపాధ్యాయులకు ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆంగ్ల పాఠాలను బోధించేందుకు అవసరమైన మెలకువలను ఈ విద్యా సంవత్సరం నుంచి నేర్పుతోంది. ఇందులో భాగంగా వారంపాటు ఓయూలోనే కార్యశాల నిర్వహిస్తోంది. రూ.2,500 ఫీజు చెల్లించిన, ఆసక్తి ఉన్న వారందరికీ దశలవారీగా శిక్షణ ఇవ్వనున్నామని, శిక్షణ పూర్తయ్యాక ధ్రువపత్రాలు ఇస్తామని ఈఎల్‌టీసీ సంచాలకులు ప్రొఫెసర్ బి.విజయ వివరించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఇఫ్లూ, నిట్, టీఐఎస్ఎస్, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని నిపుణులు ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆంగ్ల బోధనపై శిక్షణ ఇస్తున్నారు. ఇంతేకాదు.. సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధను ఉపయోగించి ఆంగ్లపాఠాలను అర్థవంతంగా చెప్పే అంశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తున్నారు.



మీ వృద్ధికి అడ్డుపడే విలన్ ఎవరంటే..

మీ గురించి మీక్కూడా తెలియని రహస్యమేంటంటే మీకు అపరిమితమైన సామర్థ్యం ఉంది. దానికి ఎలాంటి హద్దుల్లేవు. దాన్ని ఎంత ఎక్కువ వినియోగించుకుంటే అంతగా మీరు వృద్ధి చెందుతారు. కానీ మీరు అలా చేయకుండా ఓ విలన్ అడ్డుపడుతున్నాడు. అతడెవరో కాదు మీరే. మీ సామర్థ్యాలు అంతంత మాత్రమే అని భావిస్తూ మీకు మీరు హద్దులు గీసుకుంటున్నారు. ఆ ధోరణి మానండి.

– దివ్యా మిత్తల్, ఐఏఎస్ అధికారిణి

మీ వ్యాఖ్యలు వాస్తవ విరుద్ధం

- ప్రధాని మోదీకి రాసిన లేఖలో సీఎం రేవంత్‌రెడ్డి




ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ పథకాన్ని విజయవంతంగా అమలు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 27 రోజుల్లోనే 22,22,067 మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ కింద రూ.17,869.22 కోట్లను జమ చేశామని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇదే అతిపెద్ద పంట రుణమాఫీ అని పేర్కొన్నారు. రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న రైతులకు త్వరలో మాఫీ అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ గ్యారంటీ బంగారు(గోల్డెన్) గ్యారంటీ అని రైతులు విశ్వసిస్తున్నారని చెప్పారు. ఆ మేరకు ప్రధాని మోదీకి ఆయన లేఖ రాశారు. అందులోని అంశాలను 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. "మహారాష్ట్రలో శనివారం జరిగిన ఒక బహిరంగ సభలో మీరు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, దాని అమలు కోసం రైతులు ఇంకా ఎదురుచూస్తున్నారని అన్నారు. మీ ప్రకటన నాకు చాలా బాధ కలిగించింది. అది వాస్తవ విరుద్ధంగా ఉంది. మీకు పూర్తి నిజాలను గణాంకాలు సహా వివరిస్తున్నాను. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే విజయవంతంగా రుణమాఫీని అమలు చేసింది. మొదటి విడత కింద జులై 18న 11,34,412 మందికి రూ.లక్ష వరకు రూ.6034.97 కోట్లను, రెండో విడతగా జులై 30న 6,40,823 మందికి రూ.1.50 లక్షల వరకు రూ. 6190.01 కోట్లను, మూడో విడతగా ఆగస్టు 15న 4,46,832 మందికి రూ.2 లక్షల వరకు రూ.5644.24 కోట్లను మాఫీ చేశాం. మొత్తంగా 22,22,067 మందికి రూ. 17,869.22 కోట్లను మాఫీ చేశాం. ఇది రైతు సంక్షేమంపై మా అంకితభావాన్ని చాటుతోందని దృఢంగా విశ్వసిస్తున్నాను. రైతులపై ఆర్థిక భారం తగ్గించి, అప్పుల ఒత్తిడి లేకుండా వారు రాష్ట్ర వ్యవసాయ ఉత్పాదకత పెంపుదలలో కీలక భూమిక పోషించేందుకు దోహదపడుతుందని నమ్ముతున్నాను. రూ.రెండు లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులు అదనపు మొత్తాన్ని చెల్లిస్తే రూ.2 లక్షలను ప్రభుత్వం జమ చేస్తుంది. కష్టజీవులైన రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని నిర్ణీత కాలపరిమితితో పూర్తి చేసేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లను కేటాయించింది. అర్హత గల ప్రతి రైతుకు రుణమాఫీ చేసేందుకు రూ.31 వేల కోట్లు వెచ్చించేందుకు సిద్ధమయింది.

మీ సహకారం, మార్గనిర్దేశం కావాలి

రైతుల సంక్షేమానికే మా ప్రాధాన్యం. వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించే దిశగా ఇద్దరం కలిసి అడుగులు వేద్దాం. రుణమాఫీకి సంబంధించిన అధికారిక సమాచారం మా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంది. మా పారదర్శకతను తెలియజేసేందుకు ఈ వివరాలు మీకు పంపుతున్నాను. రైతుల అభ్యున్నతికి మేం చేస్తున్న ప్రయత్నాలు మా చిత్తశుద్ధిని చాటుతున్నాయని బలంగా నమ్ముతున్నాను. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమివ్వడంలో మా కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. తెలంగాణలో రైతుల సంక్షేమాన్ని పెంపొందించేందుకు మీ సహకారం, మార్గదర్శకత్వం కావాలి" అని ప్రధాని మోదీకి రాసిన లేఖలో రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

సగం మందికీ రుణమాఫీ కాలేదు

- మీరు యావత్ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు
- సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు బహిరంగ లేఖ



ఈనాడు, హైదరాబాద్: ఎస్‌బీఐ నుంచి అందిన డేటా ప్రకారం.. సుమారు 5.5 లక్షల మందికి అంటే సుమారు 50 శాతం రైతులకు రుణమాఫీ కాలేదని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. ఇతర బ్యాంకుల్లోనూ ఇలాంటి పరిస్థితులు ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు. రుణమాఫీ విషయంలో తెలంగాణ రైతులతో పాటు యావత్ దేశాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపిస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో రుణమాఫీపై ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి లేఖ రాసిన నేపథ్యంలో హరీశ్‌రావు స్పందించారు. ఎస్‌బీఐ నుంచి సేకరించిన సమాచారాన్ని లేఖతో పాటు విడుదల చేశారు. "తెలంగాణ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు పంట రుణ మాఫీని విజయవంతంగా అమలు చేసిందని మోదీకి లేఖ రాయడమంటే.. దేశాన్ని తప్పుదారి పట్టించడమే. ఈ మోసపూరిత విధానాలను మీరు మొత్తం దేశానికి విస్తరింపజేశారని తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ 2023 డిసెంబరు 9న పంట రుణాలను మాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. కానీ, ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ హామీని నిలబెట్టుకోలేకపోయింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో దాని గడువును 2024 ఆగస్టు 15కు పొడిగించింది. తెలంగాణ రైతుల నమ్మకం పొందడానికి ముఖ్యమంత్రిగా మీరు దైవసాక్షిగా హామీ ఇచ్చారు. రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ పూర్తి చేశామని ముఖ్యమంత్రిగా మీరు చేసిన ప్రకటన పూర్తిగా తప్పు అని.. 25-09-2024న నేను ఆర్టీఐ ద్వారా ఎస్‌బీఐ నుంచి పొందిన సమాచారాన్ని బట్టి స్పష్టంగా అర్థమవుతోంది. రాష్ట్రంలో రూ.లక్షలోపు రుణం ఉన్న రైతుల సంఖ్య 5,74,137 కాగా.. 2,99,445 మందికి మాత్రమే రుణమాఫీ అయింది. రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర మధ్య రుణమున్న రైతుల సంఖ్య 2,62,341 కాగా.. ఇప్పటివరకు 1,30,915 మందికి మాత్రమే మాఫీ అయింది. ఇక రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల మధ్య రుణమున్న రైతుల సంఖ్య 1,65,607 కాగా.. ఇప్పటివరకు 65,231 మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. రూ.2 లక్షలకు మించిన రుణాలను.. సంబంధిత రైతులు ఆపై మొత్తం చెల్లించిన తర్వాత మాఫీ చేస్తామని మీరు ప్రకటించారు. చాలామంది రైతులు ఎంతోకాలం కిందటే రూ.2 లక్షల కంటే ఎక్కువగా ఉన్న మొత్తాలను చెల్లించారు. అయినప్పటికీ ఎస్‌బీఐ నివేదిక ప్రకారం రుణమాఫీ జరగలేదు. పంట రుణమాఫీకి 31 షరతులను పెట్టి చాలామంది రైతులు అర్హతను కోల్పోయేలా చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరేళ్ల కిందట ప్రారంభించి.. రైతులకు విజయవంతంగా రూ.72,000 కోట్లు అందించిన 'రైతుబంధు'ను.. ఈ ఖరీఫ్ సీజన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం దసరా పండగకు ముందు విడుదల చేయలేదు. ఈ పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా తప్పుడు ప్రచారం చేయడానికి ముందే.. మీరు ఇచ్చిన మాట ప్రకారం పంట రుణమాఫీని పూర్తి చేయాలని కోరుతున్నాను" అని హరీశ్‌రావు తన లేఖలో ముఖ్యమంత్రిని కోరారు.

విధి నిర్వహణలో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ హఠాన్మరణం

హుజూరాబాద్, కరీంనగర్-2 డిపోల పరిధుల్లో ఘటనలు



రమేశ్‌సింగ్



మూర్తి

తెలంగాణచౌక్(కరీంనగర్), శంకరపట్నం, న్యూస్‌టుడే: కరీంనగర్ జిల్లా వేర్వేరు డిపోల్లో పని చేసే ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. హుజూరాబాద్ ఆర్టీసీ డిపో డ్రైవర్ సైదాపూర్ మండలం దుద్దెనపల్లి గ్రామానికి చెందిన ఠాకూర్ రమేశ్‌సింగ్(46) ఆదివారం బస్సు నడుపుతూ హుజూరాబాద్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. గజ్వేల్ సమీపంలోకి చేరుకోగానే ఛాతీలో నొప్పి వస్తుందని కండక్టర్, ప్రయాణికులకు తెలిపారు. అప్రమత్తమైన వారు 108 అంబులెన్సును పిలిపించి రమేశ్‌ను ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మరో ఘటనలో కరీంనగర్-2 డిపో కండక్టర్ చిగురుమామిడికి చెందిన ఆర్.ఎల్.మూర్తి(59) శనివారం రాత్రి శిల్పా కోడూర్‌కు నైట్‌హాల్ట్ డ్యూటీపై వెళ్లి తిరిగి ఆదివారం ఉదయం కరీంనగర్ బస్టాండుకు చేరుకున్నారు. కంట్రోలర్ వద్ద ఛార్టులో వివరాలు రాస్తూ హఠాత్తుగా కుప్పకూలి పడిపోయారు. అప్రమత్తమైన సిబ్బంది ఆయనకు సీపీఆర్ చేసి, 108కు సమాచారమిచ్చారు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డీఎం మల్లయ్య చెప్పారు. మూర్తికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

పిడుగుపాటుతో యువతి, యువకుడి మృతి



రాజు



శ్రావణి

ఐనవోలు, న్యూస్‌టుడే: పిడుగుపాటు యువతి, యువకుడిని బలితీసుకుంది. ఈ ఘటన హనుమకొండ జిల్లాలో చోటుచేసుకొంది. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. ఐనవోలు మండలం వెంకటాపూర్‌లో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పొలాల్లో పనిచేస్తున్న రైతులు, కూలీలు, ఇంటికి వెళ్తున్నవారు సమీపంలోని రేకుల షెడ్డు కిందకు చేరుకున్నారు. సుమారు 4 గంటలకు షెడ్డు పక్కనే ఉన్న చెట్టుపై పిడుగు పడింది. షెడ్డు అంచున సైకిల్ పట్టుకొని నిలుచున్న యువరైతు కూకట్ల రాజు (25), ఆ పక్కనున్న ఇంటర్ విద్యార్థిని దౌత్‌బాజీ శ్రావణి (17) కూడా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. షెడ్డు కింద ఉన్న మరో పది మంది కూలీలు కరెంటు షాక్ కొట్టినట్లు ఎగిరిపడ్డారు. కళ్లముందే తమ పిల్లలు మృతి చెందడంతో వారి తల్లులు గుండెలవిసేలా రోదించారు. మృతదేహాలను గ్రామస్థులు పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

చెన్నై ఎయిర్ షోలో అపశ్రుతి

- ఎండ తీవ్రతకు నలుగురి మృతి
- స్పృహ కోల్పోయిన 230 మంది

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: చెన్నైలో ఆదివారం 'ఎయిర్ షో' సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ షోను తిలకించేందుకు జనం విపరీతంగా పోటెత్తారు. ఎండ తీవ్రతకు నలుగురు స్పృహ కోల్పోయి మృతి చెందారు. భారత వైమానికదళం 92వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చెన్నై మెరినా తీరంలో 'ఎయిర్ షో' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. విమానాలు, హెలికాప్టర్ల విన్యాసాలు చూసేందుకు సుమారు 4 లక్షల మంది తరలివచ్చారు. మెట్రో స్టేషన్లు, లోకల్ రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లు జనంతో కిక్కిరిసిపోయాయి. షో ముగియగానే ఒక్కసారిగా జనమంతా వెనుతిరగడంతో ఎక్కడికక్కడ తీవ్రమైన రద్దీ చోటుచేసుకుంది. అప్పటికే ఎండ వేడిమి మరింత తీవ్రమైంది. జనం రద్దీలో చిక్కుకోవడం, ఎండ కారణంగా సుమారు 230 మంది వరకు అస్వస్థతకు గురై స్పృహ కోల్పోగా వారిలో 93 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని సమాచారం. వారిలో జాన్ (56), దినేష్‌కుమార్ (37), కార్తికేయన్ (34) మృతిచెందారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తూ ఓ ఆస్పత్రి వద్ద స్పృహ కోల్పోయిన శ్రీనివాసన్ కూడా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి వచ్చేవారి సౌకర్యార్థం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు చేపట్టలేదని, దీంతో పలువురు అస్వస్థతకు గురై మరణించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఎయిర్ షో సమయంలో రద్దీగా ఉన్న చెన్నై మెరీనా తీరం

గాలి కడుపున నీటి జననం ఇలా!

తొలిసారిగా వీక్షించిన శాస్త్రవేత్తలు

హైడ్రోజన్, ఆక్సిజన్ పరమాణువుల కలయికతో నీరు తయారవుతుందన్నది మనకు తెలిసిందే! సూక్ష్మస్థాయిలో ఈ ప్రక్రియ జరుగుతున్న తీరును తొలిసారిగా శాస్త్రవేత్తలు వీక్షించగలిగారు. హైడ్రోజన్, ఆక్సిజన్ పరమాణువులు విలీనమై, నానో పరిమాణంలో నీటి బుడగలు రూపుదిద్దుకోవడాన్ని వారు చూశారు. అంతేకాదు.. ఈ ప్రక్రియను వేగవంతం చేసే విధానాన్నీ కనుగొన్నారు. కరవు ప్రాంతాల్లో నీటిని వేగంగా తయారు చేయడానికి ఇది ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

పలీడియం అనే అరుదైన మూలకం.. నీటిని వేగంగా ఉత్పత్తి చేయగలదని 1900ల నుంచి పరిశోధకులకు తెలుసు. అయితే, నిర్దిష్టంగా ఇదెలా జరుగుతుందన్నది వారికి అంతుచిక్కకుండా ఉంది. దీని గుట్టు విప్పాలంటే.. నీటి సృష్టిని ప్రత్యక్షంగా వీక్షించడంతోపాటు, దాన్ని పరమాణు స్థాయిలో విశ్లేషించాల్సి ఉంటుంది. ఇంత సూక్ష్మ స్థాయిలో ఈ ప్రక్రియను చూడటం ఇటీవలి వరకూ శాస్త్రవేత్తలకు సాధ్యంకాలేదు. కొద్దినెలల కిందట అమెరికాలోని నార్త్‌వెస్టర్న్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ విషయంలో ముందడుగు వేశారు. గాల్లోని అణువుల తీరును ప్రత్యక్షంగా విశ్లేషించడానికి కొత్త విధానాన్ని కనుగొన్నారు. తేనెతుట్టె ఆకృతిలోని నానోరియాక్టర్లలో వాయు పరమాణువులను ఒడిసిపట్టే పలుచటి పొరను అభివృద్ధి చేశారు. తద్వారా వీటిలో జరిగే ప్రక్రియలను హై వాక్యూమ్ ట్రాన్స్‌మిషన్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోపుల సాయంతో వీక్షించే సామర్థ్యాన్ని సాధించారు.



ఈ సూత్రం ఆధారంగా పలీడియం పొరను శాస్త్రవేత్తలు రూపొందించారు. మొదట వారు పలీడియంలోకి హైడ్రోజన్ పరమాణువులు ప్రవేశించడాన్ని వీక్షించారు. ఆ తర్వాత ఆ లోహ ఉపరితలంపై చిన్నపాటి నీటి బుడగలు ఏర్పడటాన్ని చూశారు. మానవులు ప్రత్యక్షంగా వీక్షించిన అత్యంత చిన్నపాటి బుడగల ఆవిర్భావ ప్రక్రియ ఇదేనని శాస్త్రవేత్తలు తెలిపారు.

వేగాన్ని పెంచారు..

పలీడియం సాయంతో నీటి ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించిన శాస్త్రవేత్తలు.. తర్వాత ఆ ప్రక్రియను వేగవంతం చేసే విధానంపై దృష్టిపెట్టారు. పలీడియంకు మొదట హైడ్రోజన్‌ను, ఆ తర్వాత ఆక్సిజన్‌ను జోడించడం ద్వారా దీన్ని సాధించొచ్చని తేల్చారు. హైడ్రోజన్ పరమాణువులు చాలా చిన్నగా ఉంటాయి. అందువల్ల అవి పలీడియం పరమాణువుల మధ్యకు చొచ్చుకెళ్లి, అక్కడ ఇమిడిపోతాయి. దీనివల్ల ఆ లోహపు పొర వెడల్పు పెరుగుతుంది. ఇలా పలీడియాన్ని హైడ్రోజన్‌తో నింపాక.. పరిశోధకులు ఆక్సిజన్‌ను జోడించారు. దీనివల్ల హైడ్రోజన్ వెలుపలికి వచ్చి.. ఆక్సిజన్‌తో చర్య జరిపింది.

దాహార్తి తీరుతుంది..!

- భారీ పలీడియం ఫలకాల్లో ఎక్కువ మొత్తంలో నీటిని తయారుచేసి, కరవు ప్రాంతాల దాహార్తి తీర్చవచ్చు.
- అంతరిక్ష యాత్రికులు భవిష్యత్‌లో ఈ ఫలకాల్లోకి పలీడియాన్ని నింపుకొని రోదసిలోకి వెళ్లి, అక్కడ నీటిని తయారుచేసుకోవచ్చు. వీరు ఈ ఫలకాలకు ఆక్సిజన్ జోడిస్తే సరిపోతుంది.
- పలీడియం ధర ఎక్కువే అయినా నీటి ఉత్పత్తి ప్రక్రియలో ఆ ఫలకాలను రీసైకిల్ చేయవచ్చు. వాటిని పదేపదే వాడొచ్చు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా వచ్చిన భక్తుల రద్దీ ఆదివారం కొనసాగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయి రింగ్‌రోడ్డులోని బాటగంగమ్మ ఆలయం వరకు భక్తులు వేచి ఉన్నారు. సర్వదర్శనానికి 24 గంటలకు పైగా పడుతోందని తితిదే ప్రకటించింది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు పొందిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని తొమ్మిది కంపార్టుమెంట్లలో వేచి ఉన్నారు. వీరికి మూడు గంటల్లో దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని 75,552 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.2.54 కోట్ల హుండీ కానుకలు లభించాయి.



ముత్యాల పందిరిలో మలయప్ప వైభవం


తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ముత్యపు పందిరి వాహనసేవ వైభవంగా జరిగింది. రుక్మిణి, సత్యభామ సమేతంగా శ్రీవారు ఊరేగుతూ భక్తకోటికి అభయప్రదానం చేశారు. ఉదయం సింహ వాహనసేవలో యోగ నారసింహుని రూపంలో స్వామివారు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం శ్రీవారి ఆలయంలో స్నపన తిరుమంజనం ఘనంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యమైన గరుడ వాహన సేవ మంగళవారం నిర్వహించనున్నారు. వాహన సేవను తిలకించేందుకు భారీ ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో తితిదే ముందస్తు ఏర్పాట్లు చేపట్టింది.



యాదాద్రి పుణ్యక్షేత్రం ఆదివారం భక్తులతో నిండిపోయింది. వివిధ విభాగాల నుంచి ఆలయానికి నిత్య ఆదాయం రూ.32,50,448 చేకూరిందని అధికారులు తెలిపారు. శ్రీ దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి లలితా దేవి అలంకరణ జరిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట

జగన్మాత సేవలో నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ సభ్యుడు



దసరా ఉత్సవాల్లో భాగంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో ఉన్న జగన్మాత దుర్గమ్మను నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ సభ్యుడు ఎన్.వి.బదరీనాథ్ ఆదివారం దర్శించుకున్నారు.

- న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

నేడు గాంధీభవన్‌లో 'మంత్రులతో ముఖాముఖి'

ఈనాడు, హైదరాబాద్: గాంధీభవన్‌లో 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమంలో భాగంగా సోమవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల సమస్యలను మంత్రి తుమ్మల తెలుసుకుని పరిష్కరిస్తారని ఆయన మీడియాకు చెప్పారు. ఈ కార్యక్రమం పలుమార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే.

నూనెగారుతున్న ఆయిల్‌పామ్ లక్ష్యం!

- సాగుకు రైతుల నిరాసక్తత
- లక్షల సంఖ్యలో మూలుగుతున్న మొక్కలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు కోసం దిగుమతి చేసుకున్న మొక్కలు లక్షల సంఖ్యలో నిరుపయోగంగా పడిఉన్నాయి. రైతులు మొక్కలను తీసుకోవడానికి అంతగా ఆసక్తి చూపకపోవడంతో దాదాపు 10 నెలలుగా అవి క్షేత్రాల్లోనే మూలుగుతున్నాయి. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు వీటి పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడంతో భారీగా నష్టపోయే పరిస్థితి నెలకొంది.

రాష్ట్రంలో భారీఎత్తున ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం రైతులకు సబ్సిడీ సౌకర్యం కల్పించింది. 14 ప్రైవేటు కంపెనీలతో ఒప్పందాలు చేసుకొంది. ఈ మేరకు కంపెనీలు విత్తనాలు దిగుమతి చేసుకుని క్షేత్రాల్లో పెంచి పంపిణీకి లక్షల సంఖ్యలో మొక్కలను సిద్ధంచేశాయి. ప్రభుత్వ నిర్దేశంతో ఉద్యాన, వ్యవసాయాధికారులు రైతులతో ఆయిల్‌పామ్



జనగామ క్షేత్రంలో నిరుపయోగంగా ఉన్న మొక్కలు

సాగుపై సమావేశాలు నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి చూపిన 82,556 మంది పేర్లను నమోదు చేశారు. ఆయా రైతులకు ఎకరానికి 57 చొప్పున మొక్కలను కంపెనీల ద్వారా పంపిణీ చేయాలి. ఒక్కో మొక్కకు ప్రభుత్వం రూ.200 చెల్లిస్తోంది. కాగా ఇంతవరకు 12,488 మంది మాత్రమే మొక్కలను తీసుకొని సాగు ప్రారంభించారు. ధరలపై అనిశ్చితితోపాటు.. సాగు ప్రారంభించిన మూడేళ్లవరకూ ఎలాంటి ఫలసాయం రాని పరిస్థితుల్లో రైతులు అంతగా ఆసక్తి చూపడం లేదు. రూ.లక్షలు వెచ్చించి మొక్కలు పెంచామని.. మరో ఆరు నెలల్లో వాటిని వినియోగించకపోతే పూర్తిగా ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయా కంపెనీల ప్రతినిధులు వాపోతున్నారు.

పంపిణీకి చర్యలు: మంత్రి తుమ్మల

గతంలో ముడి పామాయిల్ దిగుమతిపై కేంద్రం సుంకం ఎత్తివేయడంవల్ల గెలల ధర తగ్గి రైతులు నిరాశపడడమే కాకుండా, కొత్తగా సాగు చేయాలనుకున్నవారిపైనా ప్రతికూల ప్రభావం చూపింది. దీనిపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు స్వయంగా వివరించడమేగాక లేఖలు రాశాను. దీంతో కేంద్రం సుంకాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. దీనివల్ల గెలల ధర పెరిగింది. ఇక రాష్ట్రంలో చాలా మంది రైతులు పామాయిల్ సాగువైపు మొగ్గుచూపే అవకాశం ఉంది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు సాంకేతిక సలహాలు అందిస్తూ, కొత్త రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించాలని వ్యవసాయ, ఉద్యానవన అధికారులకు ఆదేశాలిస్తాం. మొక్కలను త్వరితగతిన పంపిణీ చేయిస్తాం.


బతుకుపై జలఖడ్గం.. భరోసానిస్తున్న దాతృత్వం

కూలిపోయిన ఆవాసాలు.. బురదపాలైన తిండిగింజలు.. కొట్టుకెళ్లిన వాహనాలు.. దెబ్బతిన్న పంటపొలాలు ఒక్కటేమిటి వరద బీభత్సానికి సర్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలిన వారెందరో. విపత్తులో కకావికలమైన బాధితులు మళ్లీ నిలదొక్కుకునేందుకు దాతలు చేయందిస్తున్నారు.



ఈనాడు ఎండీ కిరణ్‌కు రూ.15 లక్షల విరాళం అందజేస్తున్న భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ కుమారుడు భాష్యం సాకేత్‌రామ్, హైదరాబాద్ భాష్యం సీఈఓ చైతన్య. చిత్రంలో ఈనాడు అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్.

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..



పావినేని మురళీనాథ్ నెల్లూరు
విరాళం: రూ.1,00,000

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
ఎన్టీఆర్ మెమోరియల్ డిగ్రీ కాలేజీ, అద్దంకి, బాపట్ల జిల్లా	15,000
మణిదీప ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, కల్లూరు, కర్నూలు జిల్లా	13,000
రావిపాటి రామప్రసాద్, హైదరాబాద్	12,501
ములకల కనకదుర్గ, కాకినాడ	11,116
సాకినేని నరసయ్య చౌదరి, హైదరాబాద్	10,116
కింతలి మన్మధరావు, హైదరాబాద్	10,116
ఎల్.సాయిమహేశ్, హైదరాబాద్	10,116
దేవరపల్లి వెంకట రమణారెడ్డి, హైదరాబాద్	10,100
బుద్ధరాజు రాజకుమార్ వర్మ, బొండపల్లి, విజయనగరం జిల్లా	10,000
డా.గంటా శ్రీనివాసరావు, హైదరాబాద్	10,000
వాడపల్లి సత్యదేవ్, కాకినాడ	10,000
నీలం శివకుమార్, రాజమహేంద్రవరం	10,000
కొప్పుల కాశీపతిరావు, నిడదవోలు, తూర్పుగోదావరి జిల్లా	10,000
శ్రీ విశ్వభారతి పాఠశాల, నగరి, చిత్తూరు జిల్లా	5,116
బాలాజీ చంద్రశేఖర్, బాలాజీ వసుంధర, అనంతపురం	5,116
చిమిరల రామకృష్ణప్రసాద్, కొల్లిపర, గుంటూరు జిల్లా	5,116
రాధిక దగ్గుబాటి, న్యూజెర్సీ, అమెరికా	5,116
ఎడ్లపల్లి సదాశివరావు, హైదరాబాద్	5,001
గొడుగుల సీత, బెంగళూరు	5,001
దామచర్ల చిరంజీవి, దావగూడూరు, ప్రకాశం జిల్లా	5,000
తాడిశెట్టి చంద్రశేఖర్, షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా	5,000
ఎం.గోపాలకృష్ణ, హైదరాబాద్	5,000
బెహరా శ్రీనివాసరావు, రాజమహేంద్రవరం	5,000
జుజ్జూరు పుణ్యవతి, చందర్లపాడు, ఎన్టీఆర్ జిల్లా	5,000
వల్లేపల్లి బసవేశ్వరరావు, తెనాలి	5,000
యలమంచిలి ప్రభాకరరావు, ప్రభావతి, విజయవాడ	5,000
ఎన్.కిరణ్‌బాబు, తిరుపతి	5,000
డా.మురళీకృష్ణ, మైసూరు, కర్ణాటక	5,000





మహాలక్ష్మి.. @ రూ.6,66,66,666

మహబూబ్‌నగర్ పట్టణం బ్రాహ్మణవాడలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆదివారం రూ.6,66,66,666 విలువైన నగదుతో మహాలక్ష్మిగా అలంకరించారు. మార్కెట్లో చలామణిలో ఉన్న 10, 20, 50, 100, 200, 500 రూపాయల నోట్లతో అమ్మవారిని, ఆలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తమిళనాడు రాష్ట్రం సేలం ప్రాంతానికి చెందిన కళాకారులతో ఈ అలంకరణ చేయించామని, దర్శించుకున్న ప్రతి భక్తుడికీ ఒక రూపాయి నాణెం అందజేసినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా వెంకటేశ్వర్లు తెలిపారు.

- న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ సాంస్కృతికం

రూ.కోటితో ఛాంబర్ నిర్మాణమా..?

వ్యయంపై ప్రభుత్వం ఆరా

ఈనాడు, హైదరాబాద్: వాణిజ్యపన్నుల శాఖలో కమిషనర్ విధులు నిర్వహించే ఛాంబర్ పునర్నిర్మాణం కోసం రూ.కోటి వ్యయం ఎందుకైందని ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఈ పనులు ఎందుకు చేయించారు? ఎవరు చేశారు? టెండర్లు ఎలా ఇచ్చారనే వివరాలను పరిశీలిస్తోంది. గతంలో కమిషనర్‌గా పనిచేసిన అధికారి ఈ ఛాంబర్ నిర్మించారని, వ్యయంపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. ఒకవేళ ఛాంబర్‌ను పునర్నిర్మాణం చేయాలంటే మొత్తం పనిని ఒకే టెండరుగా పిలిచి ఎందుకు అప్పగించలేదని శాఖలోని అధికారులను ప్రభుత్వం ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీనిపై విచారణ చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.



ప్రస్తుత మీ పరిస్థితి వాటి ఫలితమే..

ప్రస్తుతం మీరు వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎలాంటి స్థితిలో ఉన్నా అది గత పదేళ్లలో మీరు తీసుకున్న నిర్ణయాలు, చేసిన పనుల ఫలితమేనని తెలుసుకోండి. అలాగే పదేళ్ల తర్వాత మీరు ఏ స్థాయికి చేరుతారన్నది కూడా మీరు చేసే కష్టంపైనే ఆధారపడి ఉంటుందని గుర్తించండి. అందుకే సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ వివేకంతో సరైన నిర్ణయాలు తీసుకుంటే ఇప్పటికన్నా ఉన్నతంగా జీవించగలరు.

- అభిజిత్ ఛోక్సీ, ఇన్వెస్ట్‌మెంట్ నిపుణులు

ఎంత ఎదిగినా మూలాలు మర్చిపోవద్దు

- పర్యాటక మంత్రి జూపల్లి

ఈనాడు, హైదరాబాద్: ఎంత ఎదిగినా మన మూలాలు, సంస్కృతీ సంప్రదాయాలను మరవొద్దనీ.. విశిష్ట సంస్కృతే మన ప్రత్యేక గుర్తింపు అని పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. దుబాయ్‌లో శనివారం జరిగిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి జూపల్లి పాల్గొన్నారు. ఈ వేడుకలు తెలంగాణ సంస్కృతికి అద్దం పడతాయని, ఆ పండగ మహిళ శక్తిని చాటుతుందని పేర్కొన్నారు. రెండ్రోజుల దుబాయ్ పర్యటనలో భాగంగా.. పర్యాటక అభివృద్ధి, ప్రమోషన్‌పై ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జూపల్లితో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దుబాయ్ పర్యాటక శాఖ అధికారి జాసిం మొహమద్ అల్ అవాదీ పాల్గొన్నారు. దుబాయ్ పురోగతి, ఆర్థికాభివృద్ధిలో పర్యాటక కేంద్రాల పాత్ర, అక్కడ అనుసరిస్తున్న విధానాలపై ఈ సందర్భంగా మంత్రి అడిగి తెలుసుకున్నారు.



దుబాయ్ బతుకమ్మ వేడుకల్లో జూపల్లి, ఆది శ్రీనివాస్ తదితరులు

* తెలంగాణ పర్యాటక ప్రమోషన్, అభివృద్ధి, పెట్టుబడుల కోసం మంత్రి జూపల్లి ఆదివారం అమెరికాకు చేరుకున్నారు. ఆయనకు అక్కడి ఎన్నారైలు స్వాగతం పలికారు. ఈ నెల 8 నుంచి 10 వరకు లాస్ వెగాస్‌లో జరగనున్న గ్లోబల్ సమావేశాల్లో మంత్రి పాల్గొంటారు.

మూసీ ప్రక్షాళనకు రూ.లక్షన్నర కోట్లు ఎందుకు?

- సుందరీకరణ పేరుతో మాల్స్ కట్టి పెద్దలకు కట్టబెట్టేయత్నం
- సీఎంకు ఈటల బహిరంగ లేఖ

ఈనాడు, హైదరాబాద్: మూసీ ప్రక్షాళన పేరుతో రూ.లక్షన్నర కోట్లు వెచ్చిస్తామనడం వెనుక మతలబు ఏంటో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పాలని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. సుందరీకరణ పేరుతో మాల్స్ కట్టి, పెద్దలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మూసీ పరీవాహక ప్రాంత ప్రజల సమస్యపై అఖిలపక్ష సమావేశం పెడితే ఎక్కడికైనా రావడానికి తాను సిద్ధమని స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎంకు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. 'సబర్మతి నది ప్రక్షాళనకు రూ.రెండు వేల కోట్లు, నమామి గంగే ప్రాజెక్టుకు 12 ఏళ్లలో రూ.22 వేల కోట్లు ఖర్చయ్యాయి. మూసీ ప్రక్షాళనకు రూ.1.50 లక్షల కోట్లు ఎందుకవుతాయి? దీనికి డీపీఆర్ ఉందా? కాంట్రాక్టు ఎవరికి ఇచ్చారు? రూ.కోట్ల విలువ చేసే ఇంటిని తీసుకుని డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తామంటే ఎలా? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పాలి' అని ఈటల డిమాండ్ చేశారు. హైదరాబాద్ భవిష్యత్తును, అభివృద్ధిని ప్రశ్నార్థకంలో పడవేస్తున్నారంటూ సీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'హైడ్రాకు, మూసీ ప్రక్షాళనకు నేను వ్యతిరేకం కాదు. హైదరాబాద్‌లోని చెరువుల్లో దుర్గంధాన్ని తొలగించాలి. ఆ పని చేయకుండా 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూముల్లో, ప్రభుత్వం అనుమతించిన లేఅవుట్లలో ఇళ్లు కట్టుకున్న నిరుపేదల్ని భయభ్రాంతులకు గురిచేయడాన్ని, అడ్డగోలుగా వారి ఇళ్లను కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం?' అని ఈటల పేర్కొన్నారు.



దామగుండం అడవిని కాపాడుకుందాం

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క

పూడూరు, న్యూస్‌టుడే: దామగుండం అడవిని కాపాడుకొని.. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. దామగుండం అడవిలోని ఆలయ పరిసరాల్లో ఆదివారం బహుజన బతుకమ్మ నిర్వహించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ.. దామగుండం అడవిలో నేవీ ప్రాజెక్టు ఏర్పాటుతో జీవ వైవిధ్యం దెబ్బతినడంతో పాటు ప్రజలకు హాని కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. దేశభద్రతకు తాము వ్యతిరేకం కాదని.. అవసరమయితే నేవీ ప్రాజెక్టును మరో చోటుకు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే ప్రాజెక్టు కట్టడం సరి కాదన్నారు. అనంతరం దామగుండంపై రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరించారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిపాడారు. కార్యక్రమంలో దామగుండం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు వెంకటయ్య, సభ్యులు సత్యానందస్వామి తదితరులు, పలువురు ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు.



సీడీని ఆవిష్కరిస్తున్న విమలక్క, సత్యానందస్వామి, మహేశ్‌రెడ్డి తదితరులు

నష్టం అపారం అందాలి సాయం

RAMOJI GROUP

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.

- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు

ఈనాడు రిలీఫ్ ఫండ్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

వేదికపైనే గుండెపోటు.. కుప్పకూలిన రాముడి పాత్రధారి

చికిత్స పొందుతూ మృతి


సునీల్ కౌశిక్

దిల్లీ: ఓ ప్రదర్శనలో రాముడి పాత్ర పోషించిన వ్యక్తి వేదిక మీదనే గుండెపోటుతో కుప్పకూలాడు. దీంతో అతడిని ఆస్పత్రికి తరలించినా ప్రాణాలు దక్కలేదు. ఈ విషాదకర ఘటన దిల్లీలోని షహ్‌దరా జిల్లా విశ్వకర్మ నగర్‌లో ఆదివారం జరిగింది. బాధితుడిని సునీల్ కౌశిక్(45)గా గుర్తించారు. సీతా 'స్వయంవరం' సన్నివేశం ప్రదర్శిస్తున్న క్రమంలో కౌశిక్ అస్వస్థతకు గురయ్యాడు. వేదిక వెనక్కి వెళ్లి ఒక్కసారిగా కుప్పకూలాడు. దీంతో అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు అతడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

రూ.1,814 కోట్ల విలువైన మెఫెడ్రోన్ పట్టివేత

మధ్యప్రదేశ్‌లో ఘటన

అహ్మదాబాద్: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ సమీపంలోని ఓ కర్మాగారంలో రూ.1,814 కోట్ల విలువైన మెఫెడ్రోన్(ఎండీ) డ్రగ్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఈ విషయాన్ని గుజరాత్ హోంశాఖ సహాయ మంత్రి హర్ష సంఘవి 'ఎక్స్' వేదికగా ఆదివారం వెల్లడించారు. ఈ ఆపరేషన్‌ను గుజరాత్ యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్(ఏటీఎస్), దిల్లీలోని నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) సంయుక్తంగా శనివారం నిర్వహించాయి. ఈ క్రమంలో ఘన, ద్రవ రూపంలో ఉన్న 907.09 కిలోల ఎండీతోపాటు, మరింత ముడిసరుకును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



లక్ష్యం లేకపోవడమే అసలు సమస్య

చాలా మంది జీవితంలో ఎదగకపోవడానికి కారణం సరిగా ప్రయత్నించకపోవడం కాదు, అసలు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్ణయించుకోకపోవడం. మారుతున్న అభిరుచులు, ఆసక్తులకు తగ్గట్లు తరచూ తమ గమ్యాలను మార్చుకోవడం. ఇలాంటి లక్ష్యం లేని ప్రయాణం చుక్కాని లేని నావ లాంటిది. ఎంత శ్రమించినా ముందుకు పోతున్నట్లే ఉంటుంది కానీ గమ్యాన్ని చేరడమంటూ ఉండదు.

– కోడీ శాంచెజ్, బ్రాండ్ బిల్డర్

భారత్‌లో..

మందులకు లొంగని బ్యాక్టీరియా

ఐసీఎంఆర్ అధ్యయనంలో వెల్లడి



దిల్లీ: ఆసుపత్రుల్లో వచ్చే బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు భారత్‌లో మొండిగా తయారవుతున్నాయని భారత వైద్యపరిశోధన మండలి అధ్యయనంలో తేలింది. యాంటీబయాటిక్స్ చికిత్సకు ఇవి లొంగడం లేదని వెల్లడైంది. రక్తంలో ఇన్‌ఫెక్షన్ల (బీఎస్‌ఐ)కు ప్రధానంగా కారణమవుతున్న క్లెబ్సియెల్లా నిమోనియే, యాసినెటోబ్యాక్టర్ బౌమెనియై అనే సూక్ష్మజీవులు ఇమిపెనెమ్ అనే యాంటీబయాటిక్స్‌కు లొంగడంలేదని పరిశోధకులు తెలిపారు. వీటికితోడు రక్తంలో ఇన్‌ఫెక్షన్లను కలిగిస్తున్న స్టాఫిలోకోకస్ ఆరేయస్, ఎంటిరోకోకస్ ఫేషియంలు.. ఆక్సాసిలిన్, వాంకోమైసిన్ అనే యాంటీబయాటిక్స్‌కు లొంగడంలేదని గుర్తించారు. ఇవి బీఎస్‌ఐ ఇబ్బంది లేని రోగులపై మాత్రం పనిచేస్తున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఆసుపత్రిలో చేరిన 48 గంటల తర్వాత రోగులకు ఏదైనా ఇన్‌ఫెక్షన్ తలెత్తితే దాన్ని ఆరోగ్యపరిరక్షణ కేంద్రంతో ముడిపడ్డ ఇన్‌ఫెక్షన్‌గా వర్గీకరిస్తారు. భారత్‌లోని 39 ఆసుపత్రుల్లో పరిశీలన అనంతరం ఐసీఎంఆర్ ఒక నివేదిక రూపొందించింది. ఇందులో బీఎస్‌ఐ, మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లు, వెంటిలేటర్‌తో ముడిపడిన నిమోనియా వంటి వ్యాధుల తీరుతెన్నులపై దృష్టిసారించింది. దీని ప్రకారం..

- ■ యాసినెటోబ్యాక్టర్ ఎస్‌పీపీ అనే బ్యాక్టీరియా వల్ల వెంటిలేటర్‌తో ముడిపడ్డ నిమోనియా వస్తోంది.
- ■ మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లకు కారణమయ్యే ఈకోలి, క్లెబ్సియెల్లా నిమోనియే, యాసినెటోబ్యాక్టర్ బౌమానైల్లో యాంటీబయాటిక్ నిరోధకత ఎక్కువగా కనిపిస్తోంది. ఇవి కార్బాపెనెమ్ ఫ్లోరోక్వినోలోన్స్, మూడోతరం సెఫాలోస్పోరిన్ అనే యాంటీబయాటిక్స్‌కు లొంగడంలేదు.
- ■ ఈకోలి బ్యాక్టీరియాతో వచ్చే రక్త సంబంధ ఇన్‌ఫెక్షన్లకు చికిత్స చేయడానికి పిపెరాసిలిన్-టాజోబ్యాక్టమ్ వంటి యాంటీబయాటిక్స్‌ను వాడుతుంటారు. అయితే గత ఏడేళ్లలో ఇవి ఆసుపత్రుల్లోని రోగులపై సరిగా పనిచేయడం లేదు.

జ్ఞాన నేత్రం

మంటల్లో బీరుట్

- కొనసాగుతున్న ఇజ్రాయెల్ వైమానిక దాడులు
- గాజాలో మసీదు, పాఠశాలపై బాంబులు: 26 మంది మృతి


ఇజ్రాయెల్ వైమానిక దాడితో బీరుట్‌లో ఎగసిపడుతున్న మంటలు

దేర్ అల్–బలాహ్/బీరుట్/టెల్ అవీవ్: గాజా యుద్ధానికి సోమవారంతో ఏడాది పూర్తవుతున్న వేళ.. ఇజ్రాయెల్ భారీస్థాయిలో విరుచుకుపడుతోంది. దాడుల తీవ్రతను అమాంతం పెంచింది. ఇటు హమాస్, అటు హెజ్‌బొల్లాపై ఏకకాలంలో బాంబుల వర్షం కురిపిస్తోంది. ముఖ్యంగా లెబనాన్ రాజధాని బీరుట్ బాంబుల మోతలతో దద్దరిల్లుతోంది. హెజ్‌బొల్లా రాజకీయ, సైనిక కేంద్రాలే లక్ష్యంగా విరామం ఎరుగకుండా చేస్తున్న ఈ వైమానిక దాడులతో సహాయక చర్యలు జరగడం లేదు. శిథిలాల కింద మృతదేహాలు వెలికితీయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని లెబనాన్ అధికారులు చెబుతున్నారు. హెజ్‌బొల్లాకు పట్టున్న దాహియా ప్రాంతంపైనైతే ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు ఆగకుండా బాంబులు వేస్తూనే ఉన్నాయి. బీరుట్ శివారు ప్రాంతాలపై ఇప్పటి వరకు ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో శనివారం రాత్రి జరిపినవే అత్యంత దారుణమైనవని లెబనాన్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు పాత్రికేయులు పేర్కొన్నారు. బాణసంచాలా మొదలైన దాడులు అంతకంతకూ పెరుగుతూ ఉదయం వరకూ భీకరంగా సాగాయని చెప్పారు. 24 గంటల్లో 25 మంది మృతి చెందారని 127 మందికి పైగా గాయాలపాలయ్యారని లెబనాన్ ఆరోగ్యమంత్రిత్వశాఖ తెలిపింది. గాజాలో హమాస్‌పైనా ఆదివారం ఐడీఎఫ్ విరుచుకుపడింది. దేర్ అల్-బలాహ్‌లోని ఓ మసీదు, ఓ పాఠశాలపై దాడి చేసింది. ఈ రెండు ఘటనల్లో 26 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. అయితే తాము హమాస్ మిలిటెంట్లను లక్ష్యం చేసుకొని దాడులు చేశామని ఐడీఎఫ్ పేర్కొంది. మరోవైపు దక్షిణ ఇజ్రాయెల్‌లోని బీర్‌షెబా బస్టేషన్ దగ్గర ఉగ్రవాది జరిపిన కాల్పుల్లో ఓ మహిళా పోలీసు అధికారి మృతి చెందారు. 10 మందికి గాయాలయ్యాయి. కాల్పులు జరిపిన ఉగ్రవాదిని సంఘటనా స్థలంలోనే ఐడీఎఫ్ సైనికులు హతమార్చారు. ఉగ్రవాదిని 29 ఏళ్ల ఇజ్రాయెలీ పౌరుడు అహ్మద్ అల్ ఉక్బిగా గుర్తించారు.

అప్రమత్తమైన ఇరాన్

ఏ క్షణమైనా దాడులు చేస్తామని ఇజ్రాయెల్ హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ అప్రమత్తమైంది. ఆదివారం రాత్రి 9 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు దేశంలోని విమాన సర్వీసులను రద్దు చేసింది. ఇజ్రాయెల్ దాడి చేయొచ్చన్న అనుమానాల నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు.

ఇరాన్ ఖుద్స్ ఫోర్స్ చీఫ్ హతం..?

ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ దళం(ఐఆర్‌జీసీ)లోని ఖుద్స్ ఫోర్స్‌కు భారీ ఎదురు దెబ్బ తగిలినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ దళం చీఫ్ ఇస్మాయిలీ ఖానీ ఇటీవల బీరుట్‌పై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు చేసిన దాడిలో మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. ఇదే నిజమైతే.. ఇరాన్ సైన్యానికి షాకే. ఐడీఎఫ్ దాడుల సందర్భంగా.. హెజ్‌బొల్లాకు సాయం చేసేందుకు గత వారం ఖుద్స్ ఫోర్స్ కమాండర్ బీరుట్‌కు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు చేసిన దాడిలో అతడు చనిపోయాడని ఐఆర్‌జీసీ వర్గాలు వెల్లడించినట్లు న్యూయార్క్ టైమ్స్ కథనం వెల్లడించింది.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

ప్రతీకారం తప్పదు: నెతన్యాహు

బాలిస్టిక్ క్షిపణులతో తమ పౌరులపై దాడి చేసిన ఇరాన్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. ''తమ పౌరులపై, నగరాలపై దాడి చేయడాన్ని ప్రపంచంలో ఏ దేశమూ అంగీకరించదు. ఇజ్రాయెల్ కూడా ఒప్పుకోదు. ఈ దాడులకు స్పందించే హక్కు మాకు ఉంది'' అని తెలిపారు.

విధ్వంసకర పాలనను అడ్డుకోవాలి

- అధికారంలోకి వచ్చిన రోజే సరిహద్దులను మూసేస్తా: ట్రంప్


సభలో ట్రంప్ ప్రసంగం.. ఎలాన్ మస్క్ సందడి

వాషింగ్టన్: దేశాన్ని విధ్వంసానికి గురిచేస్తున్న కమలా హారిస్ హయాంను అడ్డుకోవాలని, ఆమె అమలు చేస్తున్న లెఫ్ట్ ఎజెండాకు చరమగీతం పాడాలని అమెరికా అధ్యక్ష ఎన్నికల రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బయటకు రావాలని, ఓటు వేయాలని కోరారు. తనపై హత్యాయత్నం జరిగిన పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో శనివారం మరోసారి ట్రంప్ భారీ ప్రచార సభను నిర్వహించారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్, ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ హాజరైన ఈ సభలో వేల మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ హారిస్‌పై విరుచుకుపడ్డారు. 'హారిస్ రాడికల్ మార్క్సిస్టు. కాంగ్రెస్‌లో ఆమెకు గౌరవం లేదు. కాంగ్రెస్‌ను ఆమె అపహాస్యం చేశారు. అసలు ఆమె పోటీలో నిలుస్తారని ఎవరూ అనుకోలేదు. అది బైడెన్‌పై జరిగిన తిరుగుబాటు. అవునన్నా కాదన్నా నేను బైడెన్ అభిమానిని. అకస్మాత్తుగా వారు వచ్చి ఆయనను వైదొలగాలని కోరారు. ఆయన తిరస్కరించినా బలవంతంగా తప్పించారు. బైడెన్‌కు 1.4 కోట్ల ఓట్లు వచ్చాయి. హారిస్‌కు ఒక్క ఓటూ రాలేదు. ఏ ఒక్క సెనెటర్ కన్నా చెత్త సెనెటర్ హారిస్. అమెరికా సెనెట్‌లో ఆమె అట్టడుగున ఉంటారు. అన్నింటినీ ఆమె విధ్వంసం చేశారు' అని ట్రంప్ పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన రోజే అక్రమ వలసలను అడ్డుకోవడానికి అన్ని సరిహద్దులను మూసేస్తానని తెలిపారు.

ట్రంప్ తప్పక గెలవాలి: మస్క్

ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసం ట్రంప్ తప్పకుండా గెలవాలని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ పేర్కొన్నారు. 'ఇది తప్పక గెలవాల్సిన పరిస్థితి. ఈ సభలో ఉన్న, లైవ్ చూస్తున్న వారందరికీ ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా. ఓటును రిజిస్టరు చేసుకోండి. ట్రంప్‌ను గెలిపించండి. మీరు ఓటేయకపోతే అమెరికాకు ఇవే చివరి ఎన్నికలు అవుతాయి' అని మస్క్ అభిప్రాయపడ్డారు.

విద్యుత్తు ఉచితంగా ఇస్తే..

భాజపా తరఫున ప్రచారం చేస్తా

- ప్రధాని మోదీకి కేజ్రీవాల్ సవాల్



దిల్లీ: దేశంలోని 22 ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో ప్రజలకు ఉచిత విద్యుత్తు అందించాలని ప్రధాని మోదీకి ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సవాల్ విసిరారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే ఆ పని చేస్తే.. తాను భాజపా తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తానని పేర్కొన్నారు. దిల్లీలో 'జనతా కీ అదాలత్' పేరిట ఆదివారం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. దమ్ముంటే వచ్చే నెలలో ఝార్ఖండ్, మహారాష్ట్రలతోపాటే దిల్లీకి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కూడా భాజపాకు సవాల్ విసిరారు.

నువ్వుల పట్టిని చూపిస్తూ.. దిల్లీలో ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా గెలిస్తే.. విద్యుత్తు, నీరు, మహిళకు బస్సు ప్రయాణం వంటి ఉచితాలన్నింటికీ తెరపడుతుందని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నువ్వుల పట్టి (మిఠాయి)ని తీసి అందరికీ చూపించారు. ''నేను మిఠాయి తయారీదారుడిలాంటి వాడిని. ప్రజల చక్కెర, నువ్వులు, నెయ్యి, యాలకుల పొడిని కలిపి నువ్వుల పట్టిగా తయారుచేశాను. ఆ మిఠాయిని వారికే తిరిగిచ్చాను. ఇదేమీ నాది కాదు.. దేవుడి ప్రసాదం'' అని వ్యాఖ్యానించారు.

ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు

- అన్ని జోన్లకు రైల్వేబోర్డు ఆదేశం

దిల్లీ: రైళ్ల రాకపోకలకు సంబంధించి ప్రయాణికులకు సమాచారం ఇవ్వకపోవడం, ఇచ్చిన సమాచారం సమగ్రంగా లేకపోవడం వంటివి జరిగితే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని దేశంలోని మొత్తం 17 జోన్లకు రైల్వే బోర్డు లేఖ ద్వారా ఆదేశాలు జారీ చేసింది. అన్ని రైల్వేస్టేషన్లలో రైళ్ల స్థితిగతులపై ప్రదర్శించే బోర్డులు విశ్వసనీయతతో ఏకీకృత విధానంలో ఉండాలని సూచించింది. నేషనల్ ట్రైన్ ఎంక్వయిరీ సిస్టం (ఎన్‌టీఈఎస్) వెబ్‌సైటులోనూ రైళ్ల రాకపోకలు, కోచ్‌ల పరిస్థితులపై కచ్చితమైన సమాచారం ఉండాలని బోర్డు తెలిపింది. ప్లాట్‌ఫాంలపై ఆయా రైళ్ల రాకకు సంబంధించిన సమాచారంతో ఏర్పాటుచేసే సూచిక బోర్డుల్లో రైళ్ల పేర్లు, నంబర్లు, నడుస్తున్న స్థితి ఉండాలని లేఖలో బోర్డు పేర్కొంది.

హరియాణాలో 67.9% పోలింగ్

చండీగఢ్: హరియాణాలో శనివారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 67.9% పోలింగ్ నమోదైంది. సిర్సా జిల్లాలోని ఎలెనాబాద్ స్థానంలో అత్యధికంగా 80.61% మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఫరీదాబాద్‌లోని బడ్ఖల్ నియోజకవర్గంలో అత్యల్పంగా 48.27% ఓటింగ్ జరిగింది. ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆదివారం ఈ మేరకు వివరాలు వెల్లడించింది.





EENADU Vol: 51, Iss: 58 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. 95 & 96, Survey No. 150, Phase-II, CIE, Gandhinagar, Quthbullapur Village & Mandal, Hyderabad, Medchal District - 500 037, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223, RNI No. 27656/75, Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ప్రమాదకరంగా కృత్రిమమేధ

- దేశాలన్నీ జాగ్రత్తగా ఉండాలి
- పాత వ్యాపారంలా ఐరాస
- కౌటిల్య ఎకనామిక్ సదస్సులో జైశంకర్ వ్యాఖ్యలు

దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికపై కేంద్రమంత్రి విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. కౌటిల్య ఎకనామిక్ సదస్సులో పాల్గొన్న ఆయన ఏఐ వల్ల ఉత్పన్నమయ్యే ప్రమాదాల గురించి హెచ్చరించారు. రాబోయే దశాబ్ది కాలంలో ఇది ప్రపంచాన్ని తీవ్ర ప్రభావితం చేస్తుందన్నారు.

"ప్రపంచ పర్యావరణ వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది కీలకమైన అంశం. ఒకప్పటి అణ్వాయుధాల్లానే ప్రస్తుతం ఇది కూడా చాలా ప్రమాదకరం. దీన్నుంచి సంభవించే పరిణామాలను ఎదుర్కోవడానికి అన్ని దేశాలూ సిద్ధంగా ఉండాలి" అని జై శంకర్ అన్నారు. రానున్న కాలంలో ఏఐ ప్రభావం అధికంగా ఉండనుందన్నారు. ప్రపంచీకరణ గురించి మాట్లాడిన ఆయన.. రాబోయే రోజుల్లో ప్రపంచీకరణ అనేది ఆయుధంగా మారొచ్చని, దీనిపట్ల ప్రపంచ దేశాలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఐక్యరాజ్య సమితి గురించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. "ఇది ఆర్థికపరమైన సమావేశం. అందువల్ల బిజినెస్ మాటల్లోనే వివరిస్తా. ఐక్యరాజ్య సమితి పాత వ్యాపారంలా మారింది. దాని పరిధి చాలా ఉన్నప్పటికీ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్పులు జరగడంలేదు. బిజినెస్ ప్రపంచంలో స్టార్టప్‌ల మాదిరిగా ఐరాస కూడా ముందుకు సాగాల్సి ఉంది'' అని అభిప్రాయపడ్డారు. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్, పాశ్చాత్య ఎజెండాను భారత్‌పై రుద్దాలని చూస్తున్న జార్జి సోరోస్‌లతో ఎవరితో కలిసి రాత్రి విందుకు ఇష్టపడతారన్న ప్రశ్నకు.. జైశంకర్ తెలివిగా సమాధానం ఇచ్చి అందర్నీ ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం శరన్నవరాత్రి ఉత్సవాల జరుగుతున్న నేపథ్యంలో తాను ఉపవాస దీక్షలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

భారత పర్యటనకు విచ్చేసిన మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు



దిల్లీలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌తో మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు

దిల్లీ: మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు భారత్‌లో నాలుగు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం మధ్యాహ్నం దిల్లీకి చేరుకున్నారు. మాల్దీవుల ప్రథమ మహిళ సాజిదా మొహమ్మద్ ఆయన వెంట ఉన్నారు. నాలుగు నెలల్లో ముయిజ్జు భారత్‌కు రావడం ఇది రెండోసారి అయినా, తొలి ద్వైపాక్షిక పర్యటన ఇదే. జూన్‌లో జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అక్టోబరు 10 దాకా కొనసాగనున్న ఈ పర్యటనలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీలతో ముయిజ్జు సమావేశమవుతారు. ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలకు తోడు ఉభయులకూ ప్రయోజనకరమైన అంతర్జాతీయ అంశాలపై వీరి మధ్య చర్చలు జరుగుతాయని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. 'ముంబయి, బెంగళూరు నగరాల్లో జరిగే వ్యాపార కార్యకలాపాలకు ముయిజ్జు హాజరవుతారు. హిందూ మహాసముద్రంలో మాల్దీవులు భారత్‌కు కీలకమైన పొరుగు దేశం. ప్రధాని మోదీ దృక్పథమైన 'సాగర్' (ప్రాంతీయంగా అందరికీ భద్రత, అభివృద్ధి) విధానంలో దీనికి ప్రత్యేకస్థానం ఉంది'' అని పేర్కొంది.

జైశంకర్ పాక్ పర్యటన.. సానుకూల పరిణామం

- పాకిస్థాన్ మాజీ మంత్రి ఖుర్షీద్ మహ్మూద్ కసూరీ

లాహోర్, పెషావర్: భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ త్వరలో ఇస్లామాబాద్ పర్యటనకు వస్తుండటం సానుకూల పరిణామం అని పాకిస్థాన్ మాజీ విదేశీ వ్యవహారాల మంత్రి ఖుర్షీద్ మహ్మూద్ కసూరీ పేర్కొన్నారు. ఇది పాక్-భారత్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తలను చల్లార్చడంలో ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. షాంఘై సహకార సంఘం (ఎస్‌సీవో) సమావేశంలో పాల్గొనేందుకు ఈ నెల 15, 16 తేదీల్లో జైశంకర్ ఇస్లామాబాద్‌కు వెళ్లనున్నారని భారత్ శుక్రవారం ప్రకటించింది. అయితే ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య ఎటువంటి ద్వైపాక్షిక చర్చలు ఉండబోవని జైశంకర్ స్పష్టం చేశారు.

ఆయన్ను ఆహ్వానించడం లేదు: పీటీఐ

తమ పార్టీ చేపట్టబోయే ఆందోళన కార్యక్రమానికి జైశంకర్‌ను ఆహ్వానించబోవడంలేదని పాకిస్థాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ (పీటీఐ) స్పష్టం చేసింది. అంతకు ముందు ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ ముఖ్యమంత్రి సలహాదారు మహ్మూద్ అలీ సైఫ్ మాట్లాడుతూ..తమ నిరసన కార్యక్రమానికి జైశంకర్‌ను ఆహ్వానించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో పీటీఐ అధికారంలో ఉంది.



నవ రాత్రుల సందర్భంగా పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో రేడియో ఆకారంలో ఆకట్టుకుంటున్న దుర్గామాత మండపం

అతివ అందలం ఎక్కడం జీర్ణించుకోలేకపోతున్నారు

- మహిళా సర్పంచి తొలగింపుపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

దిల్లీ: ఎన్నికైన ప్రజా ప్రతినిధిని తొలగించడాన్ని తేలిగ్గా తీసుకోకూడదని, ముఖ్యంగా ఆ ప్రతినిధి గ్రామీణ ప్రాంతానికి చెందిన మహిళ అయితే అది మరింత ఆందోళన కలిగించే విషయమని సుప్రీంకోర్టు పేర్కొంది. మహారాష్ట్రలో ఓ మహిళా సర్పంచిని తొలగిస్తూ జారీ అయిన ఉత్తర్వులను రద్దు చేసింది. అధికారంలోకి మహిళలు రావడం.. నిర్ణయాలు తీసుకోవడం.. వారి ఆదేశాలను పాటించాల్సిరావడం.. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని.. ఇందుకు ఈ సంఘటనే ఒక ఉదాహరణ అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం తెలిపింది."ఒక దేశంగా అన్ని రంగాల్లో లింగ సమానత్వం కోసం ప్రయత్నిస్తున్నాం. మహిళా సాధికారత వైపునకు అడుగులు వేస్తున్నాం. ప్రభుత్వ కార్యాలయాల్లోనే కాదు.. చట్టసభల్లోనూ మహిళల భాగస్వామ్యం ఉండాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. మనం సాధించే పురోగతిపై ఇలాంటి సంఘటనలు మాయని మచ్చగా మిగిలిపోతాయి" అని గత నెల 27న ఇచ్చిన ఉత్తర్వుల్లో ధర్మాసనం పేర్కొంది.

లద్దాఖ్ భవన్‌లో వాంగ్‌చుక్ నిరాహార దీక్ష

దిల్లీ: పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ తన అనుచరులతో కలిసి నిరాహార దీక్షకు దిగారు. దిల్లీలో తాను ప్రస్తుతం బస చేస్తున్న లద్దాఖ్ భవన్‌లోనే దాదాపు 17మంది అనుచరులతో కలిసి ఆదివారం దీక్షను ప్రారంభించారు. తొలుత దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద దీక్ష కోసం అనుమతి కోరగా.. పోలీసులు నిరాకరించారు. దీనికి సంబంధించిన లేఖను వాంగ్‌చుక్ 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. ప్రత్యామ్నాయ వేదిక దొరకకపోవడంతో లద్దాఖ్ భవన్ గేటు ముందు నిరసనకు దిగాల్సి వచ్చిందని వాపోయారు. లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలన్న డిమాండుతో లేహ్ ఎపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్ (కేడీఏ) నేతృత్వంలో గత నెల 1న లేహ్ నుంచి సోనమ్ వాంగ్‌చుక్ సహా పలువురు 'దిల్లీ చలో' పాదయాత్రను మొదలుపెట్టారు. వాంగ్‌చుక్‌తో పాటు మరికొంత మందిని గత సోమవారం రాత్రి దిల్లీ పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. అనంతరం వారిని విడుదల చేశారు.

ఉక్రెయిన్‌పైకి 87 డ్రోన్లు

- ఒకరి మృతి

కీవ్: రాజధాని కీవ్ సహా 14 ప్రాంతాలపై 87 డ్రోన్లతో పాటు క్షిపణులనూ రష్యా ప్రయోగించిందని ఉక్రెయిన్ వాయుసేన ఓ ప్రకటనలో తెలిపింది. ఇందులో 56 డ్రోన్లను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. ఖర్కీవ్ ప్రాంతంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారని, ఓ గ్యాస్ పైప్‌లైన్‌కూ నష్టం వాటిల్లిందని వెల్లడించింది. తమ దేశానికి ఆయుధాలు సరఫరా చేసే గ్రూపునకు ఈ నెల 12న తన విజయ ప్రణాళికను వివరిస్తానని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించిన మరుసటి రోజు ఈ భారీ డ్రోన్ల దాడి జరగడం గమనార్హం. ఇప్పటికే తన ప్రణాళికను గతవారం బైడెన్‌కు జెలెన్‌స్కీ సమర్పించారు. ఇందులోని వివరాలు బహిర్గతం కాలేదు. అయితే ఈ ప్రణాళికలో నాటోలో ఉక్రెయిన్ సభ్యత్వంతో పాటు.. రష్యా భూభాగంలోకి సుదీర్ఘ శ్రేణి క్షిపణుల ప్రయోగానికి సంబంధించిన అంశం కూడా ఉంది.

వైద్యుల గ్రీన్‌కార్డుల జారీలో వేగం పెంచాలి


- భారత సంతతి అమెరికా వైద్యుల సంఘం డిమాండ్

న్యూయార్క్: అమెరికాకు కొత్తగా ఎన్నికయ్యే అధ్యక్షులు వలస విధానాలను, ఆరోగ్య రంగాన్ని సంస్కరించాలని, వైద్యుల గ్రీన్‌కార్డుల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని భారత సంతతి అమెరికా వైద్యుల సంఘం (ఏఏపీఐ) డిమాండు చేసింది. అందరికీ వైద్యం అందేలా చర్యలు తీసుకోవడంతోపాటు వలస విధానాలు, వీసా సమస్యలు, వైద్యంలో టెక్నాలజీ వినియోగం, వివక్ష లేని విధానాలపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉందని సంఘం అధ్యక్షుడు సతీశ్ కత్తుల కోరారు. అమెరికాలో హెచ్1బీ వీసాలపైనే 15 నుంచి 20 ఏళ్లుగా వైద్యులు ఉంటున్నారని, వారికి గ్రీన్ కార్డులు ఇవ్వాలని డిమాండు చేశారు. స్థానిక వైద్యులు వెళ్లలేని మారుమూల ప్రాంతాలకు వెళ్లి భారత సంతతి వైద్యులు సేవలందిస్తున్నారని చెప్పారు. అమెరికాలో 1,20,000 మంది భారత సంతతి వైద్యులు ఈ సంఘంలో సభ్యులుగా ఉన్నారని వివరించారు.

ప్రయాణికుడికి అస్వస్థత.. కోపెన్‌హగెన్‌కు దారిమళ్లిన ఎయిరిండియా విమానం

దిల్లీ: ఆదివారం దిల్లీ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం మార్గమధ్యంలో ఓ ప్రయాణికుడు అస్వస్థతకు గురవడంతో వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో కోపెన్‌హగెన్ (డెన్మార్క్)కు దారి మళ్లింది. ఆ ప్రయాణికుడిని కోపెన్‌హగెన్‌లో ఆసుపత్రికి తరలించాక విమానం మళ్లీ లండన్‌కు బయలుదేరింది. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కోపెన్‌హగెన్ విమానాశ్రయంలోని తమ క్షేత్రస్థాయి సిబ్బంది తగిన చర్యలు తీసుకొన్నట్లు ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు.

విమానం కిందికి దిగగానే మంటలు..



ఇంటర్నెట్ డెస్క్: కాలిఫోర్నియాలోని శాన్ డియాగో నుంచి లాస్‌వెగాస్‌కు వెళుతున్న ఫ్రాంటియర్ ఎయిర్‌లైన్స్ విమానానికి శనివారం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. విమానం హ్యారీరీడ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కిందికి దిగగానే అడుగుభాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి చుట్టూ దట్టమైన పొగ వ్యాపించింది. వెంటనే స్పందించిన విమానాశ్రయ భద్రతా సిబ్బంది ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను ఆర్పివేశారు. ఆ సమయంలో విమానంలో మొత్తం 190 మంది ప్రయాణికులు, ఏడుగురు సిబ్బంది ఉన్నారు. వీరందరూ క్షేమంగా ఉన్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు.

చిక్కుకుపోయిన విదేశీ పర్వతారోహకులు సురక్షితం



గోపేశ్వర్: ఉత్తరాఖండ్ చమోలీ జిల్లాలోని చౌఖంబ మూడో శిఖరానికి వెళ్లే మార్గంలో మూడు రోజుల క్రితం చిక్కుకుపోయిన ఇద్దరు విదేశీ పర్వతారోహకులను విపత్తు నిర్వహణ కేంద్రం ఆదివారం రక్షించింది. అమెరికాకు చెందిన మిచెల్ థెరిసా డ్వోరాక్, యూకేకు చెందిన ఫే జేనీ మానర్స్‌లు గురువారం పర్వతారోహణను ప్రారంభించారు. కాగా, చౌఖంబ మూడో శిఖరానికి వెళ్లే మార్గంలో వారు 6,015 మీటర్ల ఎత్తులో ఉన్న సమయంలో కీలకమైన క్లైంబింగ్ గేర్‌లతో కూడిన బ్యాగు లోయలో పడిపోయింది. దీంతో వారు అక్కడే చిక్కుకుపోయారు. వీరి ఆచూకీ కోసం ఐఏఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ రెస్క్యూ బృందాలు శుక్రవారం రెండు హెలికాప్టర్ల ద్వారా ప్రత్యేక ఆపరేషన్‌ను ప్రారంభించాయి. ఆదివారం వారి ఆచూకీని కనిపెట్టి రక్షించినట్లు చమోలీ అదనపు సమాచార అధికారి రవీంద్ర నేగి తెలిపారు.



బెర్లిన్‌లోని శ్రీగణేశ్ ఆలయంలో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ జర్మనీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

జర్మనీలో బతుకమ్మ వేడుకలు

ఈనాడు, హైదరాబాద్: జర్మనీ దేశ రాజధాని బెర్లిన్‌లో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ జర్మనీ ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక శ్రీ గణేశ్ ఆలయంలో జరిగిన వేడుకలకు జర్మనీ నలుమూలల నుంచి తెలంగాణ కుటుంబాల వారు తరలివచ్చారు. బెర్లిన్‌లోని భారత రాయబార కార్యాలయ మంత్రి మన్‌దీప్ సింగ్ తులి అతని కుటుంబ సభ్యులు ఇందులో పాల్గొన్నారు. తులి దంపతులు బతుకమ్మను తలపై ఎత్తుకొని ప్రాంగణంలోకి తీసుకొచ్చారు. దాదాపు ఆరు గంటల పాటు వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు చలిగంటి రఘు ఆధ్వర్యంలో ప్రతినిధులు రామ్ బోయినపల్లి, శరత్‌రెడ్డి, నటేశ్, యోగానంద్, బాల్‌రాజ్, శ్రీనాథ్ రమణి, అమూల్య, అవినాష్ రాజు, స్వేచ్ఛ, వేణుగోపాల్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు హాజరైన వారంతా సహపంక్తి భోజనాలు చేశారు.



గ్లాస్గో నగరంలో బతుకమ్మలతో తెలుగు సంఘం మహిళలు

స్కాట్‌లాండ్‌లోనూ..

స్కాట్‌లాండ్‌లోని గ్లాస్గో నగరంలో శనివారం బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలుగు సంఘం నాయకురాళ్లు డాక్టర్ ఉసికెల మమత, పునీత్ బేడి, రష్మీ నాయక్, బత్తుల వినీల ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న నది వద్ద బతుకమ్మ సంబరాలను జరుపుకొన్నారు. స్కాట్‌లాండ్‌లోని తెలుగు కుటుంబాలు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నాయి.

మహారాష్ట్రలో అగ్నిప్రమాదం.. ఏడుగురు సజీవదహనం

ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయిలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఏడుగురు సజీవదహనమయ్యారు. మృతుల్లో ముగ్గురు మైనర్లు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. చెంబూరు ప్రాంతంలోని సిద్ధార్థ కాలనీలో ఉన్న ఓ రెండంతస్తుల భవనంలో ఆదివారం తెల్లవారుజామున 5:20గంటలకు ఈ ప్రమాదం జరిగినట్లు వెల్లడించారు. భవనం కింది అంతస్తులో ఉన్న దుకాణంలో విద్యుత్ తీగలకు మంటలు అంటుకొని పై అంతస్తుకు వ్యాపించాయని వివరించారు.

ఊకదంపుడు ఉపన్యాసాలు.. వైఫల్యాలను కప్పిపుచ్చలేవు

- మోదీ ఆర్థిక విధానాలపై ఖర్గే విమర్శలు

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎప్పుడూ పాత ప్రసంగాలే చేస్తున్నారని.. ఈ ఊకదంపుడు ఉపన్యాసాలను ఎన్నిమార్లు పునరావృతం చేసినా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో భాజపా ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చలేరని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం తీవ్ర విమర్శలు గుప్పించారు. మోదీ చేపట్టిన 'మేకిన్ ఇండియా' విఫలమైందన్న ఖర్గే.. ప్రజలపై గృహరుణాల భారం, ధరల పెరుగుదల, తయారీరంగంలోని సమస్యలను ప్రస్తావించారు. "మోదీనామిక్స్ (ఆర్థిక విధానాలు) దేశ ఆర్థికవ్యవస్థకు శాపంగా మారాయి. 2013-14 నుంచి నేటి వరకు గృహ సంబంధిత ఖర్చులు, జీడీపీలో గృహరుణం ఎన్నడూ లేనంతగా పెరిగాయి. కొవిడ్ తర్వాత ప్రజలకు ఆదాయం కంటే ఖర్చు రెట్టింపయింది'' అని ఖర్గే 'ఎక్స్' ద్వారా పేర్కొన్నారు. అసంఘటిత రంగాన్ని నాశనం చేయడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని విమర్శించారు. గుజరాత్‌లోని సూరత్ వజ్రాల పరిశ్రమలో పలు ప్రధాన యూనిట్లు వారంలో నాలుగు రోజులే పనిచేస్తున్నాయని, గత ఆరు నెలల్లో 60 మందికి పైగా కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఖర్గే తెలిపారు.

గోవాలో మత విద్వేషాలు పెంచుతున్నారు: రాహుల్

భాజపా ప్రభుత్వం గోవాలో ఉద్దేశపూర్వకంగా మతపరమైన ఉద్రిక్తతలు సృష్టిస్తోందని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఆదివారం 'ఎక్స్' ద్వారా ఆరోపించారు. అయినా యావద్దేశమంతా ఇపుడు భాజపా విభజన ఎజెండాను గుర్తిస్తోందని తెలిపారు. గోవాలో మాజీ ఆరెస్సెస్ నేత ఒకరు ముస్లింలను ఆర్థిక బహిష్కరణకు గురిచేయాలని క్రిస్టియన్లను, సంఘ్ సంస్థలను రెచ్చగొడుతున్నట్లు వెల్లడించారు. అత్యున్నత స్థాయి వ్యక్తుల మద్దతుతో భారత దేశమంతటా సంఘ్ పరివార్ ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని రాహుల్ మండిపడ్డారు.

కాంగ్రెస్ పార్టీపై ద్వేషంతో ఉపాధిహామీ పథకానికి నిధులు కేటాయించడం లేదని, ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాలకు సకాలంలో నిధులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మండిపడ్డారు. ''దేశంలో రుతుపవనాలు వెనక్కు తగ్గాయి. భారత ఆర్థికవ్యవస్థపై చీకటి మేఘాలు ఇంకా కమ్ముకొని ఉన్నాయి'' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పార్లమెంటు, అసెంబ్లీల్లో మహిళల భాగస్వామ్యం మరింత అవసరం: రాహుల్

దిల్లీ: పార్లమెంటు, అసెంబ్లీల్లో నాయకత్వ పాత్రల్లో అసమానతలు నెలకొన్నాయని లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. నిజమైన సమానత్వం కోసం రాజకీయాల్లో మరింత మహిళల భాగస్వామ్యం కావాలని వ్యాఖ్యానించారు. 'సమాజంలో, రాజకీయాల్లో మహిళలు ఎప్పటి నుంచో ముఖ్యమైన శక్తిగా ఉన్నారు. కానీ పార్లమెంటు, అసెంబ్లీల్లో ఇప్పటికీ నాయకత్వ పాత్రల్లో అసమానత ఉంది' అని ఆదివారం రాహుల్ తన ఫేస్‌బుక్ ఖాతాలో రాసుకొచ్చారు. నిజమైన సమానత్వం కోసం మరింత మంది మహిళలు రాజకీయాల్లో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజకీయాల్లో మహిళల ప్రయోజనాల కోసం సమాన అవకాశాలను సృష్టించే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ 'శక్తి అభియాన్'ను తీసుకొచ్చిందని అన్నారు. సమాజంలో మార్పును కోరుకునే మహిళలు శక్తి అభియాన్‌లో భాగస్వామ్యం కావాలని కోరారు. రాజకీయ రంగంలో మహిళల గొంతును విస్తరించేందుకు.. సమాజంలో మార్పును తీసుకువచ్చేందుకు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ గౌరవార్థం 'ఇందిరా ఫెలోషిప్'ను కాంగ్రెస్ ప్రారంభించింది.

హిందువులంతా ఏకమవ్వాలి

- ఆరెస్సెస్ అధిపతి మోహన్ భాగవత్

కోట: భాష, కులం, ప్రాంతీయ భావం వంటి వ్యత్యాసాలను పక్కన పెట్టి భద్రత కోసం హిందువులంతా ఒక్కటవ్వాలని ఆరెస్సెస్ అధిపతి మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం రాజస్థాన్‌లోని బారాంలో జరిగిన 'స్వయంసేవక్ ఏకత్రీకరణ్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ విధంగా మాట్లాడారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, రాష్ట్రం పట్ల బాధ్యత, లక్ష్యం పట్ల అంకితభావం వంటి లక్షణాలు ఉండాలని నొక్కి చెప్పారు. 'ఆరెస్సెస్ యాంత్రికంగా కాకుండా ఆలోచన ఆధారంగా పనిచేస్తుంది. ఇది అసమానమైన సంస్థ. దీని విలువలు బృంద నాయకుల నుంచి వాలంటీర్లు, వారి కుటుంబాల ద్వారా సమాజానికి అందుతాయి' అని వ్యాఖ్యానించారు. సీనియర్ ఆరెస్సెస్ నాయకులతోపాటు 3,827మంది వాలంటీర్లు హాజరయ్యారు.

యువతి కడుపులో 2 కిలోల వెంట్రుకలు!

లఖ్‌నవూ; బరేలీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలీలో 21 ఏళ్ల యువతి కడుపులో రెండు కిలోల తల వెంట్రుకలను వైద్యులు బయటకు తీశారు. గత నెల 20న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తన తల వెంట్రుకలను తానే లాక్కొని తినే ట్రయికోటిలోమెనియాతో యువతి బాధపడుతోందని వైద్యులు తెలిపారు. గత 16 ఏళ్లుగా ఆమె వెంట్రుకలను తింటోందని పేర్కొన్నారు. ఇవి ప్రేగుల్లో కొంతభాగాన్ని పూర్తిగా బంధించి యువతిని ఎలాంటి ఘన, ద్రవ పదార్థాలను తీసుకోనివ్వకుండా చేశాయని తెలిపారు. దీంతో ఆమెకు సర్జరీ చేయాల్సి వచ్చిందని వివరించారు. కాగా ఐదేళ్ల వయసు నుంచి వెంట్రుకలను తింటున్నట్లు యువతి అంగీకరించింది.

ఇకపై మరింత విస్తృతంగా స్వచ్ఛభారత్

- 10వ వార్షికోత్సవ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ యోచన

దిల్లీ: 'స్వచ్ఛభారత్ అభియాన్-2014' ప్రారంభించి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇకనుంచి పారిశుద్ధ్య సేవలను మరింత విస్తరించాలని యోచిస్తోంది. పదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు దేశంలో అతిపెద్ద ప్రజా ఉద్యమంగా ప్రారంభమైన 'స్వచ్ఛభారత్' పారిశుద్ధ్యపరంగా గణనీయమైన మార్పులను తీసుకొచ్చిందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలను రూపొందించడానికి, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణను మెరుగుపరచడానికి నాడు రూపొందించిన ఈ పారిశుద్ధ్య ఉద్యమం సత్ఫలితాలనిచ్చిందని ఆ స్ఫూర్తితో మరింత విస్తృతంగా స్వచ్ఛభారత్ సేవలను అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికీ మరుగుదొడ్లు లేని కుటుంబాలను గుర్తించి వారికి వెంటనే ఆ సౌకర్యాన్ని కల్పించడం, వికలాంగులకు అందుబాటులో ఉండే టాయిలెట్ల ఏర్పాటు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ అభియాన్ తదుపరి దశ పనుల్లో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగం కోసం ఇప్పటికే దాదాపు 3,000 నిర్వహణ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. వ్యర్థాల సేకరణ నిమిత్తం 5 లక్షల వాహనాలను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. సేంద్రీయ వ్యర్థాల కంపోస్ట్, ఘన వ్యర్థ యూనిట్ల నిర్వహణలో కొత్త సాంకేతికత, ఆవిష్కరణలను పరిచయం చేసేలా యువత, మహిళలతో స్టార్టప్‌ల ఏర్పాటుకు సహకరిస్తామని పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణను ప్రతి ఒక్కరి విధిగా మార్చేలా కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



స్పెయిన్‌లోని టార్రాగోనాలో నిర్వహించిన మానవ పిరమిడ్ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు

అత్యాచారాన్ని ప్రతిఘటించడంతో హత్య

- బెంగాల్‌లో బాలిక అనుమానాస్పద మృతి కేసులో నేరం అంగీకరించిన యువకుడు!

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో కోచింగ్ సెంటర్‌కు వెళ్లిన పదేళ్ల బాలిక అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన కేసు దర్యాప్తులో కీలక పురోగతి చోటుచేసుకుంది. ఈ కేసులో మోస్తకిన్ సర్దార్ (19) అనే యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం- బాలికను తానే హత్య చేసినట్లు మోస్తకిన్ అంగీకరించాడు. అత్యాచారం చేయడానికి ప్రయత్నించగా బాలిక తీవ్రంగా ప్రతిఘటించడంతో.. చంపి కాలువలో పడేసినట్లు అతడు తెలిపాడు. ఈ అఘాయిత్యానికి పాల్పడడానికి కొద్దిరోజుల ముందు నుంచి నిందితుడు బాలిక పాఠశాలకు వెళ్తున్న సమయంలో ఐస్‌క్రీంలు ఇస్తూ పరిచయం పెంచుకోవడానికి ప్రయత్నించాడు. ఘటన జరిగిన రోజు బాలిక కోచింగ్ సెంటర్ నుంచి ఇంటికి వెళ్తుండగా సైకిల్‌పై లిఫ్ట్ ఇస్తానని నమ్మించి తీసుకెళ్లాడు.

మళ్లీ శవపరీక్ష నిర్వహించండి: హైకోర్టు

దక్షిణ 24 పరగణాల జిల్లాలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన బాలికపై రెండోసారి శవపరీక్ష నిర్వహించాలని కలకత్తా హైకోర్టు ఆదివారం ఆదేశించింది. కల్యాణిలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో బరూయ్‌పుర్ కోర్టు అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ (ఏసీజేఎం) సమక్షంలో సోమవారం ఆ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించింది. ఈ కేసులో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని కూడా ఆదేశించింది.

మరణశిక్ష పడేలా చూడండి: మమత

పదేళ్ల బాలిక అనుమానాస్పద మృతి కేసులో నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని పోలీసులను బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆదేశించారు. ఈ కేసులో నేరస్థులకు మూడు నెలల్లోనే మరణశిక్ష పడేలా చూడాలన్నారు.

నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్న జూనియర్ వైద్యులు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో వైద్యురాలు హత్యాచారానికి గురైన ఘటనలో న్యాయం చేయడంతో పాటు డాక్టర్లకు భద్రత పెంచాలని డిమాండ్ చేస్తూ శనివారం ప్రారంభించిన నిరవధిక నిరాహార దీక్షను ఆరుగురు జూనియర్ వైద్యులు ఆదివారం కొనసాగించారు. పారదర్శకత కోసం.. నిరాహార దీక్ష చేస్తున్న వేదిక వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశామని ఓ జూనియర్ డాక్టర్ తెలిపారు. పలువురు సీనియర్ వైద్యులు కూడా నిరాహార దీక్షకు దిగాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

ఆరో తోడేలు హతం

- యూపీలో చంపేసిన గ్రామస్థులు



బహరాయిచ్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బహరాయిచ్ జిల్లాను వణికిస్తున్న ఆరో తోడేలును ఎట్టకేలకు తమాచ్‌పుర్ గ్రామస్థులు మట్టుబెట్టారు. ఈ విషయాన్ని అధికారులు ఆదివారం ధ్రువీకరించారు. రామ్‌గావ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆడ తోడేలును శనివారం అర్ధరాత్రి గ్రామస్థులు చంపారని తెలిపారు. తోడేలు మృతదేహంపై గాయాలు ఉన్నాయని, రక్తస్రావం అయినట్లు గుర్తించామని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించినట్లు పేర్కొన్నారు. ఈ తోడేలు జనావాస ప్రాంతంలోకి ప్రవేశించి, మేకను తీసుకెళ్లే క్రమంలో గ్రామస్థులు దీన్ని చంపారని డీఎఫ్‌వో అజిత్ ప్రతాప్ సింగ్ వివరించారు.


చిరుత దాడిలో ఇద్దరు చిన్నారుల మృతి

యూపీలోని లఖింపుర్ ఖేరీ జిల్లాలో జరిగిన వన్యప్రాణుల దాడి ఘటనల్లో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. శనివారం సాయంత్రం గంగాబెహర్ గ్రామానికి చెందిన సాజేబ్(12) అనే బాలుడిపై ఓ అడవి జంతువు దాడి చేసింది. సైకిల్‌పై తన తండ్రి ఎరువు బస్తాలను గ్రామానికి తీసుకెళ్తోన్న క్రమంలో సాజేబ్ వెనుక నుంచి సైకిల్‌ను తోస్తున్నాడు. అదే సమయంలో అక్కడ మాటు వేసిన ఓ అడవి జంతువు దాడి చేసి అతడిని పొదల్లోకి ఈడ్చుకెళ్లింది. అదేరోజు అర్ధరాత్రి గ్రామానికి సమీపంలో ఉన్న చెరకుతోటలో బాలుడి మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు చెప్పారు. కుర్సైహా గ్రామంలో శుక్రవారం జరిగిన మరో ఘటనలో ఓ అడవి జంతువు ఇంట్లోకి చొరబడి రిజా బానో(3) అనే చిన్నారిని ఎత్తుకెళ్లింది. బాలిక మృతదేహం ఘఘ్రా నదిలో శనివారం లభ్యమైనట్లుగా పోలీసులు వెల్లడించారు. కాగా, చిరుత ఈ దాడులకు పాల్పడినట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

స్వల్పకాలంలో స్థిరీకరించుకోవచ్చు!

సెన్సెక్స్ విశ్లేషణ

అక్టోబరు 4తో ముగిసిన వారానికి



సమీక్ష: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావంతో గత వారం సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ముడిచమురు ధరలు పెరగడం, విదేశీ మదుపర్ల అమ్మకాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దేశీయంగా చూస్తే.. సెప్టెంబరులో హెచ్ఎస్‌బీసీ తయారీ పీఎంఐ, 8 నెలల కనిష్ఠమైన 56.5 పాయింట్లకు చేరింది. సేవల పీఎంఐ 10 నెలల కనిష్ఠమైన 57.7కు పరిమితమైంది. సెప్టెంబరులో జీఎస్‌టీ వసూళ్లు ఆగస్టుతో పోలిస్తే 1% తగ్గి రూ.1.73 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. వరుసగా మూడో నెలా వాహనాల విక్రయాలు తగ్గాయి. కార్పొరేట్ వార్తల నేపథ్యంలో షేరు/రంగం ఆధారిత కదలికలు సూచీలను నడిపించాయి. బ్యారెల్ ముడిచమురు ధర 8.4% పెరిగి 78 డాలర్లకు చేరింది. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చడమే ఇందుకు కారణం. డాలర్‌తో పోలిస్తే రూపాయి 83.99కు బలహీనపడింది. అంతర్జాతీయంగా చూస్తే.. యూరో జోన్ సేవల పీఎంఐ, జర్మనీ కాంపోజిట్ పీఎంఐ నిరుత్సాహ పరిచాయి. దీంతో ఈసీబీ వడ్డీ రేట్ల కోతలపై ఒత్తిడి పడింది. తనఖా రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించే ప్రణాళికలు ఉన్నాయని చైనా కేంద్ర బ్యాంక్ సంకేతాలిచ్చింది. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 4.5% నష్టంతో 81,688 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 4.4% తగ్గి 25,015 పాయింట్ల దగ్గర స్థిరపడింది. రంగాల వారీ సూచీల్లో స్థిరాస్తి, వాహన, యంత్ర పరికరాల షేర్లు నష్టపోగా.. లోహ, ఐటీ, ఆరోగ్య సంరక్షణ షేర్లు లాభపడ్డాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) నికరంగా రూ.40,511 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా, డీఐఐలు రూ.32,354 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు. ఈ నెలలో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) నికరంగా రూ.27,142 కోట్లు వెనక్కి తీసుకున్నారు.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:5గా నమోదు కావడం..
మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడిని సూచిస్తోంది.

ఈ వారంపై అంచనా: గత వారం సెన్సెక్స్ కీలక మద్దతు స్థాయులైన 84,600 పాయింట్లు, 83,800 పాయింట్లను కోల్పోయింది. దీంతో స్వల్పకాలంలో స్థిరీకరణ/దిద్దుబాటు దశలోకి జారుకుంది. సెప్టెంబరులో సూచీకి కనిష్ఠమైన 80,895 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభించే అవకాశం ఉంది. అంతకన్నా దిగితే ఆగస్టు కనిష్ఠాలు 78900/78300 పాయింట్ల వద్ద కీలక మద్దతు లభించొచ్చు.

ప్రభావిత అంశాలు: రాబోయే రోజుల్లో అంతర్జాతీయ సంకేతాలు, మన మార్కెట్లకు దిశానిర్దేశం చేయొచ్చు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో ఒడుదొడుకులు కొనసాగే అవకాశం ఉంది. ముడిచమురు ధరలు మరింత పెరిగితే దేశీయ సెంటిమెంట్ బలహీనపడనుంది. ఈ నెల 9న వెలువడనున్న ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాలు కీలకం కానున్నాయి. ద్రవ్యోల్బణం పూర్తిగా కట్టడి కాకపోవడంతో ఈసారి కూడా వడ్డీ రేట్ల కోతలు ఉండకపోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ద్రవ్యోల్బణం, వృద్ధిపై ఆర్‌బీఐ వ్యాఖ్యలను గమనించాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి కంపెనీలు ఆర్థిక ఫలితాలు ప్రకటించనున్నాయి. ఈ వారం టీసీఎస్, టాటా ఎలెక్సీ, డీమార్ట్, ఐఆర్ఈడీఏ ఫలితాలు వెల్లడిస్తాయి. ఆగస్టు పారిశ్రామికోత్పత్తి, సెప్టెంబరు ఎగుమతులు-దిగుమతుల గణాంకాలపై కన్నేయొచ్చు. అంతర్జాతీయంగా.. అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఓఎంసీ) మినిట్స్ విడుదల కానున్నాయి. బ్యాంక్ ఆఫ్ కొరియా వడ్డీ రేట్లు, ఐఎంఎఫ్ ప్రపంచ ఆర్థిక నివేదిక, అమెరికా, చైనా ద్రవ్యోల్బణం, యూరో ఏరియా రిటైల్ విక్రయాలు, చైనా ఎగుమతులు-దిగుమతుల గణాంకాలు రానున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలు, ఎఫ్ఐఐ పెట్టుబడులు, చమురు ధరల నుంచి సంకేతాలు తీసుకోవచ్చు.

తక్షణ మద్దతు స్థాయులు: 80,895, 80,000, 78,496
తక్షణ నిరోధ స్థాయులు: 82,700, 83,400, 84,100
స్వల్పకాలంలో సెన్సెక్స్ స్థిరీకరణకు అవకాశం ఉంది.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ



ఎస్‌బీఐలో 10,000 కొత్త ఉద్యోగాలు

మార్చిలోపే నియమిస్తాం ● ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి



దిల్లీ: దేశీయ అతిపెద్ద బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) భారీ స్థాయిలో నియామకాలు చేపట్టబోతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే సుమారు 10,000 మందిని కొత్తగా నియమించుకోనున్నట్లు బ్యాంక్ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. సాధారణ బ్యాంకింగ్ అవసరాలకు, సాంకేతికంగా మరింత బలోపేతమయ్యేందుకు ఈ నియామకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. 'ప్రవేశ స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు వివిధ విభాగాల్లో 1,500 మంది సాంకేతిక నిపుణుల నియామకాలను ఇటీవలే చేపట్టాం. ఇందులో డేటా సైంటిస్టులు, డేటా ఆర్కిటెక్టులు, నెట్‌వర్క్ ఆపరేటర్లు.. ఇలా ప్రత్యేక విభాగాల ఉద్యోగులున్నారు. డిజిటల్ విభాగాలు సహా, సాంకేతికంగా వివిధ అవసరాల కోసం వారిని వినియోగించుకుంటున్నాం. మొత్తంమీద బ్యాంక్‌కు 8,000-10,000 మంది అదనపు ఉద్యోగుల అవసరం ఉంద'ని శ్రీనివాసులు శెట్టి తెలిపారు.


నైపుణ్య శిక్షణ కొనసాగుతుంది

2024 మార్చి నాటికి బ్యాంక్‌లో మొత్తం సిబ్బంది 2,32,296 మంది ఉన్నారు. వీరిలో 1.10 లక్షల మంది ఆఫీసర్లే. దేశవ్యాప్తంగా బ్యాంక్‌కు 22,542 శాఖలు ఉన్నాయని, వచ్చే ఏడాది మార్చి కల్లా మరో 600 శాఖలను తెరిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇందుకనుగుణంగా అన్ని స్థాయుల్లోని ప్రస్తుత సిబ్బందికి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని ఎస్‌బీఐ ఛైర్మన్ తెలిపారు. 65,000 ఏటీఎంలతో పాటు 85,000 మంది బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా 50 కోట్ల మందికి పైగా ఖాతాదార్లకు సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

సాధారణ స్థితికి ఇండిగో కార్యకలాపాలు

దిల్లీ: ఇండిగో వ్యవస్థల్లో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని సరిదిద్దడంతో, ఆదివారం సంస్థ విమాన కార్యకలాపాలు సజావుగా జరిగాయని సమాచారం. శనివారం సంస్థ వెబ్‌సైట్‌తో పాటు చెక్-ఇన్ వ్యవస్థల్లో సమస్యలు ఏర్పడటంతో.. చెక్-ఇన్ ఆలస్యమై విమానాశ్రయాల్లో ప్రయాణికులు గంటల కొద్దీ వేచి చూడాల్సి వచ్చింది. ఇండిగో రోజువారీగా 2,000కు పైగా విమాన సర్వీసులు నడుపుతోంది. శనివారం పొద్దుపోయాక, వ్యవస్థలు సాధారణ స్థితికి రావడంతో, ఆదివారం ఇండిగో విమాన కార్యకలాపాలు యథావిధిగా కొనసాగాయని సంస్థ అధికారి ఒకరు వెల్లడించారు.

అంతరిక్ష రంగంపై ఎల్ & టీ దృష్టి



దిల్లీ: అంతరిక్ష రంగంలో విస్తరించేందుకు ఇంజినీరింగ్ దిగ్గజ సంస్థ ఎల్ & టీ సన్నద్ధమవుతోంది. గత అయిదు దశాబ్దాలుగా భారత అంతరిక్ష సంస్థ ఇస్రో స్పేస్ మిషన్ కార్యక్రమాల్లో ఎల్ & టీ భాగస్వామ్యం ఉంది. చంద్రయాన్, గగన్‌యాన్, మార్స్ ఆర్బిటర్ మిషన్ సహా ఇస్రో ప్రతి ప్రాజెక్ట్‌కు హార్డ్‌వేర్ సహా పలు పరికరాలను ఎల్ అండ్ టీ సరఫరా చేసింది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌తో కలిసి అయిదు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్స్‌ను ఎల్ & టీ తయారు చేసింది. ప్రస్తుతం కంపెనీ అంతర్జాతీయ విపణి వైపు చూస్తోంది. ముఖ్యంగా ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ దిశగా అడుగులు వేస్తోంది. ఆర్బిటల్ లాంచ్ సామర్థ్యాలు, స్పేస్ హాబిటేట్ సొల్యూషన్స్ అందించేందుకు జెఫ్ బెజోస్‌కు చెందిన బ్లూ ఆరిజన్‌తో ఎల్ & టీ చర్చలు జరిపినప్పటికీ.. ఫలప్రదం కాలేదు. ఇప్పుడు నాసాతో చర్చలు జరుపుతున్నామని, అమెరికా తదుపరి స్పేస్ స్టేషన్ కోసం అవసరమైన వ్యవస్థలకు భారత కంపెనీల అవసరం ఉందని ఎల్ & టీ ప్రెసిషన్ ఇంజినీరింగ్ అండ్ సిస్టమ్స్ వికాస్ ఖిటా పేర్కొన్నారు. స్పేస్ పోర్ట్స్, స్పేస్ పార్కులు, తయారీ క్లస్టర్స్ నిర్మాణంపై ఎల్ & టీ ఆసక్తిగా ఉందని తెలిపారు.

ఈ వారం 2 ఐపీఓలే



దిల్లీ: ఇటీవల దూకుడు మీదున్న ఐపీఓల హవా కాస్త నెమ్మదించినట్లు ఉంది. సెప్టెంబరులో 12 ప్రధాన కంపెనీలతో పాటు ఎస్ఎంఈ (చిన్న, మధ్య స్థాయి సంస్థలు) విభాగంలో 40 కంపెనీలు పబ్లిక్ ఇష్యూల ద్వారా నిధులు సమీకరించాయి. అక్టోబరు ఆరంభం నుంచి స్టాక్ మార్కెట్‌లో దిద్దుబాటు కనిపిస్తోంది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో ఆ ప్రభావం మార్కెట్లపై పడింది. దీంతో ఐపీఓలు కూడా నెమ్మదించాయని తెలుస్తోంది. ఈ వారంలో రెండు ఐపీఓలు కలిపి రూ.365 కోట్ల నిధుల సమీకరణకు వస్తున్నాయి. గరుడ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇంజినీరింగ్ ప్రధాన విభాగంలో (మెయిన్‌బోర్డ్), శివ్ టెక్స్‌కెమ్ ఎస్ఎంఈ విభాగంలో పబ్లిక్ ఇష్యూకు వస్తున్నాయి. ఈనెల 4న ప్రారంభమైన ఖ్యాతి గ్లోబల్ వెంచర్స్ ఇష్యూ 8న ముగియనుంది.

ఈ వారం నమోదుకు సిద్ధం

ఎస్ఎంఈ విభాగంలో 6 కంపెనీల షేర్లు, స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఈ వారం నమోదుకు సిద్ధంగా ఉన్నాయి. హెచ్‌వ్యాక్స్ టెక్నాలజీస్, సాజ్ హోటల్స్ షేర్లు 7న; సుబమ్ పేపర్స్, పారామౌంట్ డై టెక్ 8న, నియో పోలిటన్ పిజా అండ్ ఫుడ్స్ 9న, ఖ్యాతి గ్లోబల్ వెంచర్స్ షేర్లు 11న నమోదు కానున్నాయి.

ఐపీఓ	ఇష్యూ పరిమాణం	ఇష్యూ తేదీలు	ధరల శ్రేణి
గరుడ కన్‌స్ట్రక్షన్	రూ.264 కోట్లు	8-10	రూ.92-95
శివ్ టెక్స్‌కెమ్	రూ.101 కోట్లు	8-10	రూ.158-166

సహజ వాయువులో హరిత హైడ్రోజన్ మిళితం

ఇళ్లకు వంట అవసరాల కోసం సరఫరా: అదానీ టోటల్ గ్యాస్

4,000 మంది వినియోగదార్లకు



దిల్లీ: ఉద్గారాలను తగ్గించడానికి, నికర సున్నా ఉద్గార లక్ష్యాన్ని చేరుకోవడానికి వంట అవసరాల కోసం ఇళ్లకు సరఫరా చేసే సహజ వాయువులో హరిత హైడ్రోజన్ కలపడాన్ని అదానీ గ్రూప్ ప్రారంభించింది. అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్, ఫ్రాన్స్ ఇంధన దిగ్గజం టోటల్ ఎనర్జీస్‌తో ఏర్పాటైన సంయుక్త సంస్థ అహ్మదాబాద్‌లోని శాంతిగ్రామ్‌లో పైపుల ద్వారా ఇళ్లకు సరఫరా చేసే సహజ వాయువులో 2.2-2.3% హరిత హైడ్రోజన్‌ను కలపడం ప్రారంభించింది. స్వచ్ఛ పద్ధతుల ద్వారా ఉత్పత్తి చేసిన హైడ్రోజన్ కలిపిన సహజ వాయువును పైప్ లైన్ల ద్వారా సరఫరా చేస్తున్నందున, తక్కువ ఉద్గారాలకు అవకాశం ఉంటుందని అదానీ టోటల్ గ్యాస్ తెలిపింది. పవన / సౌర శక్తి ద్వారా, ఎలక్ట్రోలసిస్ ప్రక్రియలో నీటిని హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విభజిస్తోంది. ఈ హైడ్రోజన్‌నే సహజ వాయువులో మిళితం చేస్తోంది. ప్రస్తుతం ఈ మిశ్రమ గ్యాస్‌ను వంట అవసరాలు, పరిశ్రమల కోసం సరఫరా చేస్తున్నారు. అహ్మదాబాద్‌లోని అదానీ శాంతిగ్రామ్‌లో హైడ్రోజన్ బ్లెండింగ్ సిస్టమ్, ఇన్-సిటు హైడ్రోజన్ ఉత్పత్తిని విజయవంతంగా ప్రారంభించినందుకు ఆనందంగా ఉందని అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ (ఏటీజీఎల్) తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా 4,000 మంది గృహ, వాణిజ్య వినియోగదార్లకు హైడ్రోజన్ మిళితం చేసిన సహజ వాయువును అంతరాయం లేకుండా సరఫరా చేస్తున్నామని పేర్కొంది.

వాహన అమ్మకాలకు పండగ కళ

కంపెనీల ఆశాభావం



దిల్లీ: ప్రస్తుత పండగల సీజన్‌లో అమ్మకాలు పుంజుకోవచ్చని వాహన కంపెనీలు అంచనా వేస్తున్నాయి. వినియోగదారు సెంటిమెంట్ మెరుగై, ఏడాదిలో మిగతా కాలమంతా అదే జోరు కొనసాగొచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని నెలలుగా గిరాకీ నెమ్మదించి, కంపెనీలు-డీలర్ల వద్ద నిల్వలు పెరిగిపోతున్న విషయం తెలిసిందే. వీటికి ఆఫర్లు ఇవ్వడంతో పాటు కొత్త మోడళ్లను ఆవిష్కరించడం ద్వారా వినియోగదారులను ఆకట్టుకునేందుకు కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి.

● **కియా ఇండియా:** గత 3-4 నెలలుగా అంతంత మాత్రంగా ఉన్న వాహన విక్రయాలు, దసరా-దీపావళి సీజన్‌లో మెరుగుపడే అవకాశం ఉందని కియా ఇండియా నేషనల్ హెడ్ (అమ్మకాలు, మార్కెటింగ్) హర్దీప్ సింగ్ బరార్ పేర్కొన్నారు. పండగల సమయంలో గతేడాదితో పోలిస్తే 5-10% విక్రయాల వృద్ధి ఆశిస్తున్నామని తెలిపారు.

● **నిస్సాన్ మోటార్:** దసరా-దీపావళి సీజన్‌పై వాహన పరిశ్రమ ఆశలు పెట్టుకుందని నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరభ్ వత్సా తెలిపారు.

టయోటా కిర్లోస్కర్: ప్రస్తుతం కార్లు కొనేవారితోపాటు, కొత్త మోడళ్ల వివరాలు తెలుసుకోవడానికి వస్తున్న వారి సంఖ్య పెరిగిందని టయోటా కిర్లోస్కర్ మోటార్ ఉపాధ్యక్షుడు శబరి మనోహర్ (సేల్స్-సర్వీస్-వినియోగ కార్లు) పేర్కొన్నారు.

● **మారుతీ సుజుకీ:** కొన్ని పరిమిత కాల ఎడిషన్ మోడళ్లను తీసుకురావడం ద్వారా అమ్మకాలు పెంచుకోవాలని చూస్తున్నట్లు మారుతీ సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అమ్మకాలు, మార్కెటింగ్) పార్థో బెనర్జీ వెల్లడించారు.

● **టాటా మోటార్స్:** నెలవారీ వాహన రిజిస్ట్రేషన్‌లు పుంజుకున్నాయని, ఇదే ధోరణి కొనసాగొచ్చని టాటామోటార్స్ ఎండీ (ప్యాసింజర్ వెహికల్స్) శైలేశ్ చంద్ర తెలిపారు.

కోడి గుడ్డు



7న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	510	గోదావరి	525
వరంగల్	512	విశాఖపట్నం	525
విజయవాడ	525	చిత్తూరు	523

పసుపు దిద్దుబాటు!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి అక్టోబరు కాంట్రాక్టుకు ఈ వారం రూ. 75,663 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, లాంగ్ పొజిషన్లను కొనసాగించడం మంచిదే. రూ. 76,726 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ. 77,310; రూ. 77,991 వరకు రాణించే అవకాశం ఉంటుంది. ఒకవేళ రూ. 75,463 కంటే దిగువన కదలాడితే రూ. 74,782; రూ. 74,198 వరకు దిద్దుబాటు కావచ్చు.

వెండి



వెండి డిసెంబరు కాంట్రాక్టు రూ. 91,651 కంటే దిగువన చలిస్తే కొంత బలహీనతకు అవకాశం ఉంటుంది. రూ. 90,671 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ. 87,841; రూ. 85,483 వరకు పడిపోవచ్చు. అదేవిధంగా రూ. 94,444 కంటే పైన చలిస్తే సానుకూల ధోరణికి ఆస్కారం ఉంటుంది.

ప్రాథమిక లోహాలు



● **రాగి** అక్టోబరు కాంట్రాక్టుకు రూ. 861.80 ఎగువన షార్ట్ సెల్ పొజిషన్లకు దూరంగా ఉండాలి. ప్రతికూల ధోరణిలో చలిస్తే రూ. 843.75 వద్ద మద్దతు, సానుకూల ధోరణిలో చలిస్తే రూ. 867.15 వద్ద నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంది.

● **సీసం** అక్టోబరు కాంట్రాక్టుకు రూ. 184.50 దిగువన లాంగ్ పొజిషన్ల జోలికి వెళ్లకపోవడం మంచిది.

● **జింక్** అక్టోబరు కాంట్రాక్టు రూ. 293 ఎగువన కదలాడకుంటే, షార్ట్ సెల్ పొజిషన్ల వైపు మొగ్గు చూపాలి. ఒకవేళ ఈ స్థాయికి పైన చలిస్తే సానుకూల ధోరణికి అవకాశం ఉంటుంది.

● **అల్యూమినియం** అక్టోబరు కాంట్రాక్టుకు రూ. 243.75 ఎగువన షార్ట్ సెల్ పొజిషన్లకు దూరంగా ఉండాలి. రూ. 237.50 కంటే దిగువన మరింత తగ్గొచ్చు.

ఇంధన రంగం



● **ముడి చమురు** అక్టోబరు కాంట్రాక్టు రూ. 5,831 కంటే దిగువన చలిస్తే రూ. 5,312; రూ. 5,048 కు చేరొచ్చు. ఒకవేళ రూ. 6,614 కంటే పైకి వెళితే రూ. 6,878; రూ. 7,397 వరకు వెళ్లొచ్చు.

● **సహజవాయువు** అక్టోబరు కాంట్రాక్టు సానుకూల ధోరణిలో చలిస్తే రూ. 244.15 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. దీనిని అధిగమిస్తే రూ. 260.65; రూ. 267.05 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ ప్రతికూల ధోరణిలో కదలాడితే రూ. 234.25 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయినీ కోల్పోతే రూ. 227.65; రూ. 217.75 వరకు దిగిరావచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



● **పసుపు** అక్టోబరు కాంట్రాక్టు రూ. 14,000 కంటే పైన కదలాడకుంటే మరింతగా దిద్దుబాటు కావచ్చు.

● **పత్తి క్యాండీ** అక్టోబరు కాంట్రాక్టు మరింత నష్టపోవచ్చు. అయితే రూ. 56,906 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ. 56,563 వరకు పడిపోవచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/(క్షీణత)
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (అక్టోబరు)	75,979	76,143	0.22
వెండి (డిసెంబరు)	91,519	93,500	2.16
రాగి (అక్టోబరు)	857.30	855.35	-0.23
సీసం (అక్టోబరు)	184.30	186.85	1.38
జింక్ (అక్టోబరు)	282.00	287.80	2.06
అల్యూమినియం (అక్టోబరు)	238.15	242.90	1.99
ముడి చమురు (అక్టోబరు)	5,760	6,350	10.24
సహజ వాయువు (అక్టోబరు)	241.20	240.90	-0.12
పసుపు (అక్టోబరు)	14,250	13,352	-6.30
పత్తి క్యాండీ (నవంబరు)	57,530	57,250	-0.49

పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. ఆర్‌బీఐ వడ్డీరేట్లు

స్టాక్ మార్కెట్ ఈ వారం

● ఈ వారం మార్కెట్లపై ప్రభావం చూపే అంశాలివీ
● కార్పొరేట్ కంపెనీల సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలూ కీలకమే
● ఔషధ, లోహ షేర్లకు సానుకూలతలు ● విశ్లేషకుల అంచనాలు



పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల ప్రభావం సోమవారం కూడా ఈక్విటీ మార్కెట్లపై కనిపించే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. విదేశీ మదుపర్ల విక్రయాలు, షేర్ల అధిక విలువలు, డెరివేటివ్ ట్రేడింగ్‌కు సంబంధించిన తాజా నిబంధనలు కూడా ప్రతికూలంగా పనిచేయొచ్చని చెబుతున్నారు. అమెరికాలో సెప్టెంబరులో నియామకాలు బలంగా పుంజుకోవడం మార్కెట్‌కు సానుకూలాంశమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం, ఫెడరల్ రిజర్వ్ ధోరణిని గమనించాలి. దేశీయంగా చూస్తే ఈనెల 10 నుంచి కార్పొరేట్ సంస్థలు వెల్లడించే, సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు కీలకం కానున్నాయి. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● వచ్చే ఏడాదిలో టారిఫ్‌లు పెరుగుతాయన్న అంచనాలే స్వల్పకాలంలో **టెలికాం** షేర్లకు దిశానిర్దేశం చేయొచ్చు. గత వారం నష్టాల నేపథ్యంలో భారతీ ఎయిర్‌టెల్ ఈ వారం లాభాలందుకోవచ్చు.

● ప్రభావం చూపే వార్తలు లేనందున **సిమెంటు** కంపెనీల షేర్లు స్తబ్దుగా చలించొచ్చు. సిమెంటు ధరల పెంపు, మౌలిక రంగాభివృద్ధిపై ప్రభుత్వ దృష్టి వంటివి మధ్యకాలంలో సానుకూల ప్రభావాన్ని చూపొచ్చు.

● పశ్చిమాసియా పరిణామాలను బట్టి **చమురు** షేర్ల చలనాలు ఆధారపడతాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య సంఘర్షణ పూర్తి స్థాయి యుద్ధం దిశగా పరిణమిస్తే ,ఆ ప్రాంతం నుంచి చమురు సరఫరాకు అంతరాయం కలిగి.. ధరలు పెరగొచ్చు.

● అంతర్జాతీయ అనిశ్చితుల మధ్య **యంత్రపరికరాల** షేర్లు నష్టాలను కొనసాగించొచ్చు. సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు బాగుంటాయన్న అంచనాల మధ్య ఎంపిక చేసిన షేర్లలో నష్టాలు పరిమితంగానే ఉండొచ్చు.

● ఇటీవలి నష్టాల అనంతరం **ఎఫ్ఎంసీజీ** షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. మంచి వర్షాలకు తోడు పండగల సీజనులో నమోదయ్యే బలమైన వృద్ధి, రాబోయే త్రైమాసికాల్లో వృద్ధికి ఊతమిస్తుందన్న అంచనాలున్నాయి.

● చైనా ఉద్దీపన ప్రకటనల నేపథ్యంలో అంతర్జాతీయ గిరాకీ పెరుగుతుందన్న అంచనాలు వెలువడడంతో **లోహ** కంపెనీల షేర్లు ముందుకెళ్లొచ్చు.

● **ఔషధ** కంపెనీలు మార్కెట్ కంటే మిన్నగా రాణించొచ్చు. అనిశ్చితి పరిస్థితుల్లో రక్షణాత్మక రంగంగా భావించే ఫార్మా వైపు మదుపర్లు దృష్టి సారిస్తుండడం ఇందుకు నేపథ్యం.

● **ఐటీ** షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. టీసీఎస్‌తో ఫలితాల సీజన్ ఆరంభం కానుంది. చాలా ఐటీ కంపెనీల ఆదాయాలు జూన్ త్రైమాసికంతో పోలిస్తే పెరిగే అవకాశాలున్నాయి. కానీ ప్రస్తుత అంతర్జాతీయ అనిశ్చితులు కాస్త వృద్ధికి అవరోధంగా నిలుస్తాయన్న అనుమానాలూ ఉన్నాయి.

● **బ్యాంకుల** రుణ వృద్ధిలో కాస్తంత క్షీణత, డిపాజిట్ల వృద్ధిలో పెరుగుదల మధ్య నికర వడ్డీ మార్జిన్లు తగ్గే అవకాశం ఉంది. పశ్చిమాసియా సంఘర్షణలూ ఈ రంగ షేర్లపై ప్రభావం చూపొచ్చు. నిఫ్టీ బ్యాంక్ సూచీ 50,000ను పరీక్షించొచ్చు కాబట్టి, 52,500కు పెరిగితే గనుక లాంగ్ పొజిషన్లను వదిలించుకోవడం మంచిది.

● **వాహన** కంపెనీల షేర్లు పరిమిత శ్రేణిలో కదలాడొచ్చు. సెప్టెంబరులో రిటైల్ విక్రయాలు కూడా అంతంతమాత్రంగా జరిగాయనే అంచనాలే ఇందుకు నేపథ్యం. నిఫ్టీ ఆటోకు 26,600 వద్ద నిరోధం, 25,500 వద్ద మద్దతు కనిపించొచ్చు.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	225.39	235.20	219.00
బజాజ్ ఆటో	11774.40	12096.50	11477.90
ఐషర్ మోటార్స్	4706.80	4845.40	4621.50
హీరో మోటోకార్ప్	5520.85	5717.60	5385.70
ఎం అండ్ ఎం	3017.45	3209.60	2913.40
మారుతీ	12605.75	13030.70	12300.00
టాటా మోటార్స్	930.75	962.50	904.10
టీవీఎస్ మోటార్	2687.50	2792.20	2605.60

ఎఫ్ఎంసీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అదానీ విల్మర్	336.45	346.20	330.20
బ్రిటానియా ఇండస్ట్రీస్	6206.00	6402.00	6081.80
కోల్గేట్ పామోలివ్	3740.05	3883.30	3653.40
డాబర్ ఇండియా	572.45	590.10	562.20
ఇమామీ	742.85	765.00	714.00
హిందుస్థాన్ యునిలీవర్	2848.75	2956.90	2763.00
ఐటీసీ	503.55	523.30	491.70
మారికో	690.20	712.40	673.30

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	267.60	278.00	257.00
సీజీ పవర్	718.75	753.00	698.70
ఎల్ అండ్ టీ	3493.95	3590.40	3420.30
సీమెన్స్	7246.85	7452.40	7079.30
థెర్మాక్స్	5193.25	5541.00	4635.20

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	2773.05	2861.60	2719.30
బీపీసీఎల్	340.25	354.50	327.30
హెచ్‌పీసీఎల్	406.90	423.90	386.60
ఐఓసీఎల్	168.65	173.10	163.40
ఓఎన్‌జీసీ	295.25	302.60	289.60
ఆయిల్ ఇండియా	572.75	599.00	530.80

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	1,640.90	1709.10	1596.00
ఎమ్‌టీఎన్ఎల్	54.84	60.60	51.60
టాటా కమ్యూనికేషన్స్	2082.05	2189.50	2018.50
వొడాఫోన్ ఐడియా	9.79	10.30	9.40

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	747.90	766.00	731.00
హిందుస్థాన్ జింక్	517.25	534.70	501.10
ఎన్ఎమ్‌డీసీ	236.56	245.50	229.70
సెయిల్	139.01	144.40	131.50
టాటా స్టీల్	166.75	171.70	161.50
వేదాంతా	508.70	523.40	493.80

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1657.65	1704.80	1629.50
ఐసీఐసీఐ బ్యాంక్	1239.75	1275.00	1218.60
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	71.83	73.60	70.40
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1382.85	1421.70	1361.50
కోటక్‌మహీంద్రా బ్యాంక్	1809.00	1870.80	1767.50
పీఎన్‌బీ	105.85	109.10	102.60
ఎస్‌బీఐ	796.65	821.90	772.70

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1466.05	1513.50	1418.50
బయోకాన్	346.35	365.60	335.50
సిప్లా	1623.30	1698.10	1539.90
డాక్టర్ రెడ్డీస్	6633.25	6781.00	6537.20
గ్లెన్‌మార్క్ ఫార్మా	1662.70	1734.10	1594.20
లుపిన్	2198.25	2277.40	2123.40

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1776.60	1824.60	1743.30
ఇన్ఫోసిస్	1918.15	1987.50	1851.30
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5141.30	5486.80	4905.80
టీసీఎస్	4252.25	4332.10	4184.20
టెక్ మహీంద్రా	1616.45	1676.00	1561.20
విప్రో	533.55	548.40	520.60

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	2433.75	2510.80	2376.60
అంబుజా సిమెంట్స్	610.70	629.80	595.00
ఇండియా సిమెంట్స్	363.10	368.40	357.40
శ్రీ సిమెంట్	26034.20	26768.10	25498.10
అల్ట్రాటెక్ సిమెంట్	11450.25	12002.30	11104.00

ఈనాడు ప్రతిభ
హైదరాబాద్, సోమవారం, అక్టోబరు 7, 2024
pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

ప్రిపరేషన్ టెక్నిక్

పరీక్షలకు సానుకూల దృక్పథంతో సిద్ధం కావాలి. అప్పుడే చదివిన అంశాలు గుర్తుంటాయి. ప్రతికూల భావాలను పెంచుకోవడం వల్ల అనవసరమైన ఆందోళన పెరిగి తెలియని నష్టం జరుగుతుంది.

డీఎస్సీ/టెట్ - 2024
ఇంగ్లిష్ కంటెంట్

కరెంట్ అఫైర్స్



- రాజ్యసభా పక్షనేతగా ఏ కేంద్ర మంత్రి ఇటీవల నియమితులయ్యారు? (ప్రస్తుతం ఆ బాధ్యతల్లో ఉన్న పీయూష్ గోయల్ లోక్‌సభకు ఎన్నిక కావడంతో ఈయన నియమితులయ్యారు. రాజ్యసభలో కాంగ్రెస్ సభాపక్షనేతగా మల్లిఖార్జున ఖర్గే వ్యవహరిస్తున్నారు.)
  జ: కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా
- సరోగసీ (అద్దె గర్భం) ద్వారా సంతానవంతులైన ప్రభుత్వ ఉద్యోగినులు కూడా ఇకపై 180 రోజులు

మాదిరి ప్రశ్నలు

ప్రసూతి సెలవు తీసుకునే అవకాశం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఏ సంవత్సరం నాటి సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (లీవ్) రూల్స్‌లోని నిబంధనలను తాజాగా సవరించింది? **జ:** 1972

- ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) చీఫ్ తపన్ కుమార్ డేకా పదవీ కాలాన్ని కేంద్రం తాజాగా తిరిగి ఎంత కాలం పాటు పొడిగించింది? (2022, జులై 1న డేకా ఐబీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.) **జ:** ఏడాది
- కేరళ పేరును ఏమని మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కేరళ రాష్ట్ర శాసనసభ ఇటీవల ఏకగ్రీవ తీర్మానాన్ని చేసింది? (ముఖ్యమంత్రి పినరయి విజయ్ సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయి.) **జ:** కేరళం
- కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఛైర్మన్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? **జ:** అతుల్ జైన్

మరింత సమాచారం

వ్యవసాయ విత్తం

అన్నదాతలకు ఆర్థిక ఆసరా!



దేశంలో అత్యధికుల ఉపాధి వనరు, జీవనాధారం వ్యవసాయం. పండించే రైతుకు పెట్టుబడి ఇక్కడ ప్రధాన సమస్య. అరవయ్యో దశకం వరకు ఎక్కువ శాతం రైతులకు సంస్థాగత పరపతి లభ్యత లేదు. ఫలితంగా వడ్డీవ్యాపారుల దోపిడీతో వ్యవసాయ కుటుంబాలు అప్పులపాలయ్యేవి. దేశంలో సహకార వ్యవస్థ విస్తరణ, బ్యాంకుల జాతీయాకరణ తర్వాతే ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాల వృద్ధికి అవసరమయ్యే రుణాలు, వాటిని సంస్థాగతంగా సమకూర్చే విత్తవనరుల సమగ్రస్వరూపం, అభివృద్ధి క్రమంపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వ్యవసాయ రుణాల రకాలు, వాటిని అందించేందుకు దేశంలో అంచెలవారీగా ఏర్పాటైన సంస్థలు, రైతు శ్రేయస్సు, వ్యవసాయ వృద్ధి కోసం ప్రభుత్వం చూపిన చొరవ, సంబంధిత కమిటీలు, రూపుదిద్దుకున్న వ్యవస్థలు, ప్రవేశపెట్టిన పథకాలు, వాటి పనితీరు గురించి గణాంకాలతో సహా తెలుసుకోవాలి.

జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

వ్యవసాయానికి అవసరమైన ఉత్పాదకాలు అంటే విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాల కోసం రైతులకు అందించే ఆర్థిక సహాయాన్ని వ్యవసాయ విత్తం లేదా వ్యవసాయ పరపతి అంటారు. దీన్ని కాలం, ఉద్దేశం ఆధారంగా విభజించవచ్చు.

కాలం ఆధారిత పరపతి: ఇది మూడు రకాలు.

1) **స్వల్పకాల పరపతి:** 15 నెలల్లోపు తిరిగి చెల్లించే రుణాలను 'స్వల్పకాలిక రుణాలు' అంటారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు, కూలీల వేతనాలు చెల్లించేందుకు తీసుకునే రుణాలివి. వడ్డీవ్యాపారులు, సహకార సంఘాలు ఎక్కువగా ఈ రుణాలిస్తాయి.

2) **మధ్యకాలిక పరపతి:** 15 నెలల నుంచి 5 సంవత్సరాల మధ్య తిరిగి చెల్లించేవి. పశువులు, వ్యవసాయ పనిముట్ల కొనుగోలుకు ఉపయోగించే ఈ రుణాలను వడ్డీవ్యాపారులు, బంధువులు, సహకార సంఘాలతోపాటు వాణిజ్య బ్యాంకులు ఇస్తాయి.

3) **దీర్ఘకాల పరపతి:** ఐదేళ్లపైన తిరిగి చెల్లించే రుణాలివి. 15-20 ఏళ్ల వ్యవధి ఉంటుంది. భూమి అభివృద్ధి, బోరుబావుల తవ్వకం, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు కొనుగోలుకు, పాతరుణాలు తీర్చేందుకు ఈ పరపతిని ఉపయోగిస్తారు. వీటిని ప్రాథమిక పరపతి వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బోర్డులు అందిస్తాయి.

ఉద్దేశం ఆధారిత పరపతి: ఇది 3 రకాలు.

1) **ఉత్పాదక రుణం:** ఎరువులు, విత్తనాలు, పనిముట్ల కొనుగోలుకు రైతులు ఉపయోగించే పరపతి.

2) **వినియోగ అవసరాలకు రుణం:** పంటకు, పంటకు మధ్య వ్యవధిలో ఆదాయం లేకపోవడంతో రైతులు వ్యక్తిగత అవసరాలకు అప్పు చేస్తారు. దీనికోసం ఎక్కువగా వడ్డీవ్యాపారులపై ఆధారపడతారు.

3) **అనుత్పాదక రుణం:** కోర్టు వ్యవహారాలు, వివాహాలు, జననాలు, మరణాలు, పండగలు మొదలైన అనుత్పాదక అవసరాలకు తీసుకునే రుణాలు.

వ్యవసాయ పరపతి ఆధారాలు: ఇది రెండు రకాలు.

1) **సంస్థాగతం కాని పరపతి:** ఈ పరపతిని అందించేవారు వడ్డీ వ్యాపారులు, భూస్వాములు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, బంధువులు, స్నేహితులు. 1951 నాటికి సంస్థాగతం కాని పరపతి 93% ఉండేది. వడ్డీ వ్యాపారులు 1950-51లో 72% రుణాలు ఇచ్చేవారు. 2013 నాటికి 25.8% తగ్గింది. వడ్డీవ్యాపారులు విధించే వడ్డీ 18 నుంచి 50% వరకు ఉంటుంది.

2) **సంస్థాగత పరపతి:** ఈ పరపతిలో వాణిజ్య, గ్రామీణ బ్యాంకులు, సహకార సంఘాలు భాగం. రైతులకు తక్కువ వడ్డీకి రుణాలందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సంస్థాగత పరపతిని విస్తరిస్తోంది.

గ్రామీణ పరపతి - వాణిజ్య బ్యాంకులు: 1950-51లో గ్రామీణ పరపతిలో వాణిజ్య బ్యాంకుల వాటా 0.9% మాత్రమే. 1955లో ఎస్‌బీఐ ఏర్పాటు, 1963లో ఏఆర్‌డీసీ, 1969లో 14 వాణిజ్య బ్యాంకుల జాతీయాకరణ, అదే ఏడాదిలో లీడ్‌బ్యాంకు పథకం ప్రారంభం, 1980లో 6 వాణిజ్య బ్యాంకుల జాతీయం, 1989లో సర్వీస్ ఏరియా అప్రోచ్‌ని ప్రవేశపెట్టి గ్రామాల దత్తత ద్వారా పరపతిని అందించారు. 1969లో మొత్తం బ్యాంకు శాఖల్లో గ్రామాల్లో 22% మాత్రమే ఉండేవి. 2020-21 నాటికి 34.9 శాతానికి పెరిగాయి. 2021-22 నాటికి మొత్తం వ్యవసాయ పరపతిలో 76% వాణిజ్య బ్యాంకులు అందిస్తున్నాయి. 1970-71లో మొత్తం వ్యవసాయ పరపతి రూ.744 కోట్లు ఉండగా, 2022-23 బడ్జెట్‌లో రూ.18 లక్షల కోట్లకు పెరిగింది. 2023-24 బడ్జెట్‌లో రూ.20 లక్షల కోట్లు లక్ష్యంగా నిర్దేశించారు.

లీడ్‌బ్యాంకు పథకం (1969): గాడ్గిల్ అధ్యక్షతన ఏర్పాటైన అధ్యయన బృందం బ్యాంకులు ప్రాంతాలవారీ విధానాన్ని (ఏరియా అప్రోచ్) అనుసరించాలని సూచించింది. నారీమన్ అధ్యక్షతన నియమించిన బ్యాంకర్ల సంఘం ఏరియా అప్రోచ్‌ని లీడ్‌బ్యాంకు పథకంగా మార్చింది. ఒక్కో జిల్లాకు జాతీయ బ్యాంకును లేదా ప్రైవేటు బ్యాంకును లీడ్‌బ్యాంక్‌గా నియమించారు.

గ్రామీణ పరపతి - సహకార బ్యాంకులు: భారత్‌లో సహకార ఉద్యమం 1904లో ప్రారంభమైంది. 1912లో సహకార చట్టం చేశారు. ప్రస్తుతం స్వల్పకాలిక రుణాలకు మూడు అంచెలు, దీర్ఘకాలిక రుణాలకు రెండు అంచెల విధానాల్లో సహకార రంగం పనిచేస్తోంది.

మూడు అంచెల విధానం:

1) **ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్):** 10 లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఈ సంఘాలను ఏర్పాటు చేయవచ్చు. ఇవి రైతులకు స్వల్పకాలిక, మధ్యకాలిక రుణాలిస్తాయి. ప్రస్తుతం ఇవి 1,02,559 ఉన్నాయి.

2) **జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (డీసీసీబీ):** పీఏసీఎస్‌లకు, రాష్ట్ర సహకార బ్యాంకుకు మధ్యవర్తిగా జిల్లాకో డీసీసీబీ ఉంటుంది. ప్రస్తుతం 351 ఉన్నాయి.

3) **రాష్ట్ర సహకార బ్యాంకు (ఎస్‌సీబీ):** సహకార పరపతి వ్యవస్థలో ఇది శిఖరాగ్ర సంస్థ. నాబార్డు నుంచి రుణాలను సేకరిస్తుంది. ప్రస్తుతం వీటి సంఖ్య 34.

రెండంచెల విధానం: దీర్ఘకాలిక రుణాలు ఇవ్వడానికి ఏర్పాటైన వీటిని మొదట్లో భూమి తనఖా బ్యాంకులు అనేవారు. 1986 నుంచి భూమి అభివృద్ధి బ్యాంకులుగా, 2002 నుంచి వ్యవసాయ సహకార గ్రామీణ అభివృద్ధి బ్యాంకులుగా పిలుస్తున్నారు.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు: ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను(ఆర్ఆర్‌బీలు) నరసింహన్ కమిటీ సిఫార్సు చేసింది. ఇందిరాగాంధీ 20 అంశాల కార్యక్రమంలో 1975, అక్టోబరు 2న తొలుత 5 బ్యాంకులు ప్రారంభించారు. అవి మొరాదాబాద్, గోరఖ్‌పూర్(ఉత్తర్‌ప్రదేశ్), బీవానీ(హరియాణా), జైపూర్(రాజస్థాన్), మాల్దా(బెంగాల్). ఒక్కో ఆర్ఆర్‌బీ అధీకృత మూలధనం రూ.కోటి. ఈ మొత్తాన్ని కేంద్రం, రాష్ట్రం, స్పాన్సర్ బ్యాంకులు 50:15:35 శాతం చొప్పున సమకూరుస్తాయి. ప్రస్తుతం వీటి సంఖ్య 43. ఆర్ఆర్‌బీలపై 1977లో లింగాలయ కమిటీ, 2001లో వ్యాస్ కమిటీ, 2005లో సర్దేశాయ్ కమిటీలు ఏర్పాటయ్యాయి.



రచయిత: ధరణి శ్రీనివాస్

నాబార్డు

1979లో శివరామన్ అధ్యక్షతన ఏర్పాటైన 'వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి సంస్థాగత పరపతి కమిటీ' (క్రఫికార్డ్) సిఫార్సు మేరకు 1982, జులై 12న నాబార్డు ఏర్పాటైంది. గ్రామీణ పరపతిలో నాబార్డు శిఖరాగ్ర సంస్థ. నాబార్డు ప్రధాన కార్యాలయం ముంబయిలో ఉంది. ప్రస్తుత ఛైర్మన్ షాజీ కె.వి. నాబార్డు వ్యవసాయానికి అందించే పరపతి పలు రకాలుగా ఉంటుంది.

1) **పరపతి విస్తరణ:** నాబార్డు సహకార సంఘాలకు రుణాలు మంజూరు చేస్తుంది.

2) **గ్రామీణ అవస్థాపన సౌకర్యాల నిధి:** 1995-96లో నాబార్డు ఈ నిధిని ప్రారంభించింది. దీన్నుంచి నీటిపారుదల ప్రాజెక్టులు, వాటర్‌షెడ్‌లు, గ్రామీణ రహదారులు, వంతెన నిర్మాణాలకు రుణాలిస్తారు.

3) **సూక్ష్మవిత్తం:** 'పేదవారికి బ్యాంకింగ్' నినాదంతో సూక్ష్మ విత్తం ప్రారంభించారు. ఎలాంటి హామీ లేకుండా రూ.25 వేల వరకు పేదలకు స్వయం ఉపాధి ప్రాజెక్టులకు రుణాలిస్తారు.



4) **కిసాన్ క్రెడిట్ కార్డు:** 1998లో ఎస్.పి.గుప్తా కమిటీ సిఫార్సులపై రైతుకు స్వల్పకాలిక రుణాలిచ్చేందుకు ప్రవేశపెట్టిన పథకమిది. 2004లో సాగు అనుబంధ రంగాలకు విస్తరించారు. 2020లో సవరించిన కిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని ప్రారంభించారు. ఉపాంత రైతులకు రూ.50 వేల వరకు రుణం అందిస్తారు.

5) **సహకార అభివృద్ధి నిధి:** 1993లో సహకార పరపతి సంస్థల్లో అభివృద్ధి వనరుల సమీకరణ, ఇచ్చిన రుణాల వసూళ్ల కోసం ఏర్పాటు చేశారు.

JUNIOR INTER Q&A
Zoology

Generic and species name are the same

2 Marks — **Diversity of living world**

1) **What is trinomial nomenclature? Give an example.**



A: It is the extension of the binominal nomenclature. This system permits the designation of "Subspecies" with a three -worded name called Trinomen nomenclature.

e.g.: Human: Homo sapiens sapiens.
Crow: Corvus splendens splendens

2) **What is meantby tautonymy? Give two examples.**

A: The practice of naming the animals, in which the generic and species name are the same, is called "Tautonymy" so the name is called Tautonym.

e.g.: Spotted deer-*Axis axis* The IndianCobra-*Naja naja*

3) **Differentiate between protostomia and Deuterostomia?**

A: Blastopore develops into mouth, cleavage pattern is "Spiral" and determinate. Anus is formed from near the blastopore. Mouth is formed later, cleavage pattern is "radial" and "intermediate".

4) **What does ICZN stands for?**

A: ICZN - International code of Zoological Nomenclature.

5) **What is the full form of IUCN. In which book threatened species are enlisted?**

A: IUCN - International Union for the conservation of Nature and Natural Resources. Threatened species are listed in the "Red Data Books".

Some more Imp Questions

4 Marks — for Answers

1) What are the reason for the greater biodiversity in the tropics?
2) What is the evil Quartet?
3) Explain in brief 'Brodiversity Hot spots'.

-G. Venkat Reddy

ప్రాచీన భారతదేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు
(క్రీ.పూ. 3 నుంచి క్రీ.శ. 7 వరకు)

విదేశీ ఆక్రమణదారుల్లో శక్తిమంతులు కుషాణులు

ప్రాచీన భారతదేశ చరిత్రలో సువిశాల సామ్రాజ్యాలను స్థాపించి, సమర్థంగా పాలించిన వారిలో మౌర్యులు, గుప్తులు, శాతవాహనులు అగ్రగణ్యులు. ఉత్తరాది మహాజనపదాల్లో ఒకటిగా ఉన్న మగధ రాజ్యం మౌర్యుల హయాంలో మహాసామ్రాజ్యంగా విస్తరించి, ఉపఖండంలో తొలిసారిగా రాజకీయ ఏకీకకరణ సాధించి ఎన్నో సాంఘిక, సాంస్కృతిక, మతపరమైన మార్పులకు నాంది పలికింది. ఆ తర్వాత గుప్తులు, శాతవాహనుల హయాంలో స్వదేశీ భాష, సాహిత్యం, కళలు వెల్లివిరిశాయి. మౌర్యులకు, గుప్తులకు మధ్యలో ఉత్తరాదిని జయించిన కుషాణులు తమదైన ముద్ర వేశారు. భారతీయతను సుసంపన్నం చేసిన నాటి పాలకులు, పాలక వంశాలు, వారి విశిష్టతలు, రాజ్య పరిధి, నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ, మత మార్పులు, ఎదుర్కొన్న విదేశీ దాడుల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. చరిత్రలో గొప్పపాలకులుగా నిలిచిన అశోకుడు, కనిష్కుడు, సముద్రగుప్తుడు, గౌతమీపుత్ర శాతకర్ణిల విశేషాలు, వారి హయాంలోని ప్రసిద్ధ పండితుల రచనలు, శాస్త్రవేత్తల ఆవిష్కరణలు, విదేశీ యాత్రికులు గ్రంథస్థం చేసిన వివరాలను తెలుసుకోవాలి.


భట్టిప్రోలులో బౌద్ధమత శిథిలాలు

డీఎస్సీ/టెట్ - 2024 హిస్టరీ

1. చంద్రగుప్త మౌర్యుడి మనవడు?
   1) బింబిసారుడు 2) బిందుసారుడు 3) అశోకుడు 4) కనిష్కుడు
2. ఒకనాటి మగధ సామ్రాజ్యం ఏ ప్రాంతాల మధ్యలో విస్తరించింది?
   1) నేటి అఫ్గానిస్తాన్ నుంచి దక్షిణాన ఆంధ్ర, తూర్పున బెంగాల్ వరకు
   2) నేటి అఫ్గానిస్థాన్ నుంచి దక్షిణాన తమిళనాడు, తూర్పున ఒడిశా వరకు
   3) నేటి అఫ్గానిస్థాన్ నుంచి దక్షిణాన కర్ణాటక, తూర్పున బెంగాల్ వరకు
   4) నేటి అఫ్గానిస్థాన్ నుంచి దక్షిణాన కర్ణాటక, తూర్పున అస్సాం వరకు
3. పెద్ద రాజ్యాలను సామ్రాజ్యాలు అంటారు. వాటిని పాలించే రాజులను ఏమంటారు?
   1) రాజులు 2) పెద్ద రాజులు 3) చక్రవర్తులు 4) సామంతులు
4. కిందివారిలో భారత ఉపఖండంలోని తొలి చక్రవర్తుల్లో ఒకరు?
   1) చంద్రగుప్తుడు 2) రెండో చంద్రగుప్తుడు 3) చంద్రగుప్త మౌర్యుడు 4) కనిష్కుడు
5. కిందివాటిలో మగధ సామ్రాజ్యంలో భాగం కాని ప్రాంతం.
   ఎ) హిందూకుష్ పర్వతాలు, థార్ ఎడారి
   బి) గుజరాత్, గంగానదీ లోయలు
   సి) మధ్యభారత అడవులు, కృష్ణా, తుంగభద్ర, గోదావరి లోయలు
   డి) కావేరి నది తీరప్రాంతం
   1) ఎ, డి 2) బి 3) డి 4) సి, డి
6. మగధ సామ్రాజ్యంలో అధిక జనసాంద్రత ఉన్న ప్రాంతాలు?
   ఎ) గంగా, కృష్ణానది లోయలు
   బి) మాళ్వా, గుజరాత్
   సి) పంజాబ్
   డి) హిందూకుష్ పర్వతాలు
   1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి 3) ఎ, బి, సి 4) డి మాత్రమే
7. మగధ రాజధాని పాటలీపుత్రం, దానిచుట్టూ ఉన్న ప్రాంతాలను నియంత్రించేది ఎవరు?
   1) చక్రవర్తి 2) రాజు 3) గవర్నర్ 4) యువరాజు
8. కింది వాక్యాలు పరిశీలించి, సరైన సమాధానాన్ని ఎన్నుకోండి.
   ఎ) చక్రవర్తికి సమాచారం చేరవేసేవారు - వేగులు
   బి) చక్రవర్తి నుంచి సమాచారం తెచ్చేవారు - దూతలు
   సి) చక్రవర్తికి పరిపాలనలో సహాయపడేవారు - మంత్రులు, రాజకుటుంబం
   డి) ప్రాదేశిక రాజధానులను పరిపాలించేవారు - గవర్నర్‌లు
   1) డి మాత్రమే 2) సి, డి 3) ఏదీకాదు 4) ఎ, బి, సి, డి
9. మగధ సామ్రాజ్యంలో ప్రాదేశిక రాజధాని కానిది?
   1) తక్షశిల 2) ఉజ్జయిని 3) సువర్ణగిరి 4) చంప
10. చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానంలోని కౌటిల్యుడికి ఉన్న మరొక పేరు?
    1) చాణక్యుడు 2) విష్ణుగుప్తుడు 3) రాధగుప్తుడు 4) 1, 2
11. 'ఇండికా' గ్రంథ రచయిత మెగస్తనీస్ కాగా, అతడు ఏ దేశానికి చెందినవాడు?
    1) ఆస్ట్రియా 2) పర్షియా 3) గ్రీకు 4) రోమన్
12. కిందివాక్యాలు పరిశీలించి, సమాధానం ఇవ్వండి.
    ఎ) బంగారం అధికంగా దొరికే ప్రాంతం - తక్షశిల.
    బి) విదేశీ వస్తువులు ఎక్కువగా దొరికే ప్రాంతం - సువర్ణగిరి.
    సి) వ్యాపారులు, సైన్యం ప్రయాణించడానికి రహదారి మార్గాలున్నాయి.
    డి) రాజులు, ఆటవిక తెగల జీవితాల్లో అంతగా జోక్యం చేసుకునేవారు కాదు.
    1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి, డి 4) ఏదీకాదు
13. కౌటిల్యుడి అర్థ శాస్త్రంలోని అంశాలు-
    ఎ) రాజు రాజ్యాన్ని ఎలా పరిపాలించాలి?
    బి) రాజు రాజ్యాన్ని కుట్రలు, కుతంత్రాల నుంచి ఎలా కాపాడుకోవాలి?
    సి) రాజు ప్రజల నుంచి పన్నులు ఎలా వసూలు చేయాలి?
    డి) భారత ఉపఖండంలో లభించే వనరులు ఏమిటి?
    1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి 3) బి, సి 4) ఎ మాత్రమే
14. కిందివారిలో మౌర్యవంశ స్థాపకుడు?
    1) బిందుసారుడు 2) చంద్రగుప్త మౌర్యుడు 3) రిపుంజయుడు 4) బింబిసారుడు
15. అశోకుడు తన శాసనాలను ఏ భాషలో - లిపిలో చేయించాడు?
    1) బ్రాహ్మీ - ప్రాకృత 2) ప్రాకృత - బ్రాహ్మీ 3) బ్రాహ్మీ - సంస్కృత 4) సంస్కృత - సంస్కృత
16. ప్రపంచ చరిత్రలో యుద్ధాల్లో విజయం తర్వాత వాటికి స్వస్తి పలికిన ఒకే ఒక రాజు?
    1) బిందుసారుడు 2) అశోకుడు 3) కనిష్కుడు 4) కాలాశోకుడు
17. అశోకుడు చక్రవర్తి అయిన ఎన్ని ఏళ్లకు కళింగ యుద్ధం చేశాడు?
    1) 7 2) 8 3) 9 4) 6
18. ధమ్మ అనేది ఏ భాషాపదం?
    1) ప్రాకృత 2) సంస్కృత 3) తమిళ 4) హిందీ
19. కిందివాటిలో సరికాని వాక్యం?
    ఎ) అశోకుడి ధర్మంలో దేవతలకు జంతుబలులు అధికం.
    బి) తండ్రి పిల్లలకు నేర్పినట్లు అశోకుడు ప్రజలకు బోధించాడు.
    సి) బుద్ధుడి బోధనలకు అశోకుడు ప్రభావితుడు అయ్యాడు.
    డి) అశోకుడు తన సందేశాలను రాతి స్తంభాలపై చెక్కించాడు.
    1) బి మాత్రమే 2) ఎ మాత్రమే 3) ఎ, డి 4) ఎ, బి
20. ధర్మప్రచారం కోసం అశోకుడు ఎవరిని నియమించాడు?
    1) నవరత్నాలు 2) మంత్రులు 3) ధర్మమహామాత్రులు 4) అష్టప్రధానులు
21. కిందివాటిలో అశోకుడు బౌద్ధధర్మను ప్రచారం చేసిన దేశం కానిది?
    1) పర్షియా 2) ఈజిప్టు 3) సిలోన్ 4) సిరియా
22. మౌర్య సామ్రాజ్యం పతనం తర్వాత శాతవాహనులు ఏ నదుల మధ్య రాజ్యాన్ని పరిపాలించారు?
    1) నర్మదా - గోదావరి 2) నర్మద - పెన్నా 3) తపతి - కృష్ణా 4) నర్మదా - కృష్ణా
23. శాతవాహన వంశంలో గొప్పరాజు?
    1) మొదటి శాతకర్ణి 2) శ్రీముఖుకుడు 3) గౌతమీపుత్ర శాతకర్ణి 4) హాలుడు
24. కిందివాటిలో శాతవాహనుల రాజధాని నగరం?
    1) అమరావతి 2) కర్నూలు 3) ధాన్యకటకం 4) విశాఖపట్నం
25. శాతవాహనుల కాలం నాటి ప్రముఖ బౌద్ధక్షేత్రం?
    1) అమరాతి 2) వడ్లమాను 3) భట్టిప్రోలు 4) పైవన్నీ
26. శాతవాహనులు ఎవరితో వ్యాపారం చేశారు?
    1) బెంగాల్ 2) బిహార్ 3) రోమన్ 4) 1, 3
27. ఎవరి శైలితో కూడిన నాణేలు, కుండలను పురావస్తు శాస్త్రవేత్తలు కృష్ణా నది తీరం (శాతవాహన రాజ్యం)లో కనుక్కొన్నారు?
    1) గ్రీకు 2) రోమన్ 3) పర్షియా 4) ఇరాన్
28. మ్యాకదోని శిలాశాసనం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) తమిళనాడు 2) ఆంధ్రప్రదేశ్ 3) తెలంగాణ 4) కర్ణాటక
29. కిందివాటిలో సరైన వాక్యాలు?
    ఎ) పులోమావి యొక్క మహాసేనాపతి - స్కంధ నాగ
    బి) కుమారదత్త అధిపతిగా ఉన్న గ్రామం - వేపుర
    సి) వేపుర గ్రామంలో ఉన్న తెగ - కాంత తెగ
    డి) వేపుర గ్రామంలో చెరువును తవ్వించిన గహపతి - సమ్మ
    1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి 3) ఎ, బి, డి 4) డి మాత్రమే
30. కిందివాటిలో ఇక్ష్వాకుల రాజధాని?
    1) ధరణికోట 2) నాగార్జునకొండ 3) విజయపురి 4) విజయవాడ
31. ఇక్ష్వాకుల వంశంలో గొప్పవారు?
    1) క్షాంతమూలుడు 2) వీరపురుషదత్తుడు 3) 1, 2 4) హాలుడు
32. అలెగ్జాండర్ ఏ సంవత్సరంలో భారతదేశం నుంచి తిరిగి వెళ్లాడు?
    1) క్రీ.శ.327 2) క్రీ.పూ.326 3) క్రీ.శ.324 4) క్రీ.శ.326
33. భారతదేశానికి వచ్చిన విదేశీ ఆక్రమణదారుల్లో అత్యంత శక్తిమంతులు?
    1) శకులు 2) గ్రీకులు 3) కుషాణులు 4) పార్థియన్‌లు
34. కుషాణు వంశంలో గొప్పపాలకుడు, విజేత?
    1) కనిష్కుడు 2) కుజలకాడ్ ఫైజిస్ 3) వీమాకాడ్ ఫైజిస్ 4) కాలాశోకుడు
35. ప్రాచీన భారతదేశంలో స్వర్ణయుగం ఏ రాజు కాలం నాటిది?
    1) కుషాణులు 2) హూణులు 3) గుప్తులు 4) పుష్యభూతి
36. హర్షవర్ధనుడు ఏ వంశానికి చెందినవాడు?
    1) కుషాణులు 2) హూణులు 3) గుప్తులు 4) పుష్యభూతి
37. కిందివారిని వరుసలో అమర్చండి.
    ఎ) మౌర్యులు బి) కుషాణులు సి) గుప్తులు డి) పుష్యభూతి
    1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, డి, సి 3) ఎ, సి, డి, బి 4) ఎ, సి, బి, డి
38. కిందివాటిని జతచేయండి.
    1) అర్థశాస్త్రం ఎ) మెగస్తనీస్
    2) ముద్రారాక్షసం బి) విష్ణుగుప్తుడు
    3) మహాభాష్యసూత్రం సి) విశాఖదత్తుడు
    4) బుద్ధచరితం డి) వసుమిత్రుడు
    ఇ) అశ్వఘోషుడు
    ఎఫ్) నాగార్జునుడు
    1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-బి, 2-డి, 3-ఎఫ్, 4-ఇ 3) 1-ఎ, 2-సి, 3-డి, 4-ఇ 4) 1-బి, 2-సి, 3-డి, 4-ఇ
39. కిందివాటిలో తప్పుగా జతచేసిన వాక్యం?
    1) విశాఖదత్తుడు - దేవీచంద్రగుప్తం
    2) పాహియాన్ - ఫు - కువో - కి
    3) శూద్రకుడు - మృచ్ఛకటికం
    4) హర్షవర్ధనుడు - హర్షచరితం
40. కిందివాటిని జతచేయండి.
    1) కాళిదాసు ఎ) రఘువంశం
    2) హర్షుడు బి) ప్రియదర్శిని
    3) హుయాన్‌త్సాంగ్ సి) సి - యూ - కి
    4) ఆచార్య నాగార్జునుడు డి) సుహృల్లేఖ
    1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
    2) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ
    3) 1-ఎ, 2-సి, 3-బి, 4-డి
    4) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి



రచయిత: గద్దె నరసింగరావు

సమాధానాలు

1-3, 2-3, 3-3, 4-3, 5-3, 6-3, 7-1, 8-4, 9-4, 10-4, 11-3, 12-3, 13-1, 14-2, 15-2, 16-2, 17-2, 18-1, 19-1, 20-3, 21-4, 22-4, 23-3, 24-3, 25-4, 26-4, 27-2, 28-4, 29-1, 30-3, 31-2, 32-3, 33-3, 34-1, 35-3, 36-4, 37-1, 38-4, 39-4, 40-1.

ఈనాడు ప్రతిభ
■ e-mail: pratibhadesk@eenadu.net
22
సోమవారం అక్టోబరు 7, 2024 | హైదరాబాద్

ద్విసంఖ్యామానం - దశాంశమానం

ముఖ్యాంశాలు

✦ 0, 1 అనే అంకెలను ఉపయోగించి సంఖ్యలను రాసే పద్ధతిని ద్విసంఖ్యామానం అంటారు.

ఉదా: $1101_{(2)}, 1100_{(2)}$

నోట్: దీన్ని కంప్యూటర్, గణన యంత్రాల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు.

☛ 0, 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9 అనే అంకెలను ఉపయోగిస్తూ సంఖ్యలను రాసే పద్ధతిని దశాంశమానం అంటారు.

ఉదా: $25_{(10)}$, $51_{(10)}$

నోట్: 10 అంకెలను ఉపయోగిస్తున్నాం కాబట్టి 10ని భూమిగా తీసుకుంటారు. దీన్ని హిందూ - అరబిక్ సంఖ్యామానం అంటారు.

రోమన్ సంఖ్యామానం:

1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, 10లకు బదులుగా I, II, III, IV, V, VI, VII, VIII, IX, Xలను ఉపయోగిస్తూ రాసే పద్ధతిని రోమన్ సంఖ్యామానం అంటారు.

I	V	X	L	C	D	M
1	5	10	50	100	500	1000

ఈ పద్ధతి కొనసాగే క్రమంలో రోమన్ సంఖ్యామానంలో కొన్ని నియమాలు ఉంటాయి.

❖ పెద్ద సంజ్ఞలకు ఎడమవైపు చిన్న సంజ్ఞలను ఉపయోగిస్తే పెద్ద విలువలో నుంచి చిన్న విలువ తీసివేయాలి.

ఉదా: IX = 10 – 1 = 9

CM = 1000 – 100 = 900

● పెద్ద సంజ్ఞలకు కుడివైపు చిన్న సంజ్ఞలను ఉపయోగిస్తే పెద్ద విలువకు చిన్న విలువను సంకలనం చేయాలి.

ఉదా: MD = 1000 + 500 = 1500

XV = 10 + 5 = 15

● ఒకే సంజ్ఞను ఎన్నిసార్లు రాస్తే అన్నిసార్లు ఆ విలువను సంకలనం చేయాలి.

ఉదా: X X = 10 + 10 = 20

C C C = 100 + 100 + 100 = 300

● ఒకే సంజ్ఞను మూడుసార్లకంటే ఎక్కువగా ఉపయోగించకూడదు.

● పెద్ద సంజ్ఞలకు ఎడమవైపు V, L, Dలను ఉపయోగించకూడదు.

45 = VL (ఇలా రాయకూడదు)

45 = 40 + 5


= (50 – 10) + 5 = XLV (ఇలా రాయాలి)

V L	L L
V D	L D
V V	D D

⟶ వీటిని ఉపయోగించకూడదు

నోట్: V, L, Dలను ఒకసారి మాత్రమే ఉపయోగించాలి.

I సంజ్ఞను V, Xల నుంచి మాత్రమే సంకలనం, వ్యవకలనం చేయాలి.



దశాంశ సంఖ్యా పద్ధతిని తొలిసారిగా ప్రవేశపెట్టింది?

టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

అరిథ్‌మెటిక్

మాదిరి ప్రశ్నలు

1. $56_{(10)}$ అనేది దశాంశమానంలో ఉంది. దీన్ని ద్విసంఖ్యామానంలోకి మార్చండి.

1) $11001_{(2)}$ 2) $11100_{(2)}$
3) $100100_{(2)}$ 4) $111000_{(2)}$

సాధన:
2 | 56
2 | 28 - 0
2 | 14 - 0
2 | 7 - 0
2 | 3 - 1
1 - 1

$\therefore 56_{(10)} = 111000_{(2)}$

సమాధానం: 4

2. $85_{(10)}$ అనే దశాంశమానంలోని సంఖ్యను ద్విసంఖ్యామానంలోకి మార్చండి.

1) $1010101_{(2)}$ 2) $101010_{(2)}$
3) $10101010_{(2)}$ 4) $100110_{(2)}$

సాధన: $85_{(10)} \longrightarrow$
2 | 85
2 | 42 - 1
2 | 21 - 0
2 | 10 - 1
2 | 5 - 0
2 | 2 - 1
1 - 0

$\therefore 85_{(10)} = 1010101_{(2)}$

సమాధానం: 1

3. $11101_{(2)}$ను దశాంశమానంలోకి మార్చండి.

1) $29_{(10)}$ 2) $25_{(10)}$
3) $49_{(10)}$ 4) $35_{(10)}$

సాధన:

1	1	1	0	1
16	8	4	2	1

$16 + 8 + 4 + 0 + 1 = 29_{(10)}$

సమాధానం: 1

4. $101101_{(2)}$ను దశాంశమానంలోకి మార్చండి.

1) $26_{(10)}$ 2) $29_{(10)}$
3) $45_{(10)}$ 4) $51_{(10)}$

సాధన:

1	0	1	1	0	1
32	16	8	4	2	1

$32 + 0 + 8 + 4 + 0 + 1 = 45_{(10)}$

సమాధానం: 3

5. 1, 3, 5 అనే మూడు అంకెలనుపయోగించి మూడంకెల సంఖ్యలు ఎన్ని రాయగలం?

1) 2 2) 3 3) 5 4) 6

సాధన: $3! = 3 \times 2 \times 1 = 6$

135, 153, 315, 351, 513, 531

సమాధానం: 4

6. 1, 3, 5, 7 అనే అంకెలను ఉపయోగించి ఎన్ని నాలుగు అంకెల సంఖ్యలు రాయగలం?

1) 8 2) 16 3) 24 4) 12

సాధన: $4! = 4 \times 3 \times 2 \times 1 = 24$

సమాధానం: 3

7. మూడు వేర్వేరు అతి చిన్న అంకెలతో 5 అంకెల అతి చిన్న సంఖ్యను రాయండి.

1) 11123 2) 11132
3) 11213 4) 12311

సాధన: అతి చిన్న అంకెలు - 1, 2, 3

ప్రశ్న ప్రకారం అతిచిన్న సంఖ్య - 11123

సమాధానం: 1

8. ప్రపంచంలో మొదటిసారిగా దశాంశ సంఖ్యా పద్ధతిని కనుక్కున్నవారు?

1) చైనీయులు 2) గ్రీకులు
3) రోమన్‌లు 4) భారతీయులు

సాధన: ప్రపంచంలో మొదటిసారిగా దశాంశ సంఖ్యా పద్ధతిని భారతీయులు కనుక్కున్నారు.

సమాధానం: 4

9. 6, 4, 0, 8, 7, 9 అంకెలన్నింటితో ఏర్పడే ఆరంకెల అతిపెద్ద, అతిచిన్న సంఖ్యలను రాసి, వాటి మొత్తం, భేదాలను కనుక్కోండి.

1) 1443929, 410851 2) 194429, 100851
3) 1394429, 580851 4) 1294419, 590856

సాధన: 987640 + 406789 = 1394429

987640 – 406789 = 580851

సమాధానం: 3

10. MDVC కి సమానమైన హిందూ అరబిక్ సంఖ్య?

1) 1565 2) 1595 3) 0595 4) 1605

సాధన: MDVC = 1000 + 500 + (100 – 5) = 1595

సమాధానం: 2

13. 900 సంఖ్యకు సమానమైన రోమన్ సంఖ్య?

1) XC 2) MC 3) ID 4) CM

సాధన: 900 = 1000 – 100 = CM

సమాధానం: 4

11. కింది వాటిలో దశాంశమానం $1101_{(2)}$కు సమానమైన సంఖ్య?

1) సంయుక్త సంఖ్య 2) కరణీయ సంఖ్య
3) ప్రధానసంఖ్య 4) సరిసంఖ్య

సాధన:

1	1	0	1
8	4	2	1

8 + 4 + 0 + 1 = 13 (ప్రధానసంఖ్య)

సమాధానం: 3

12. ఒక కోటిలో ఎన్ని మిలియన్లు ఉంటాయి?

1) 100 2) 100 3) 10 4) 10000

సాధన: 1 మిలియన్ - 10 లక్షలు

10 మిలియన్లు - 100 లక్షలు = కోటి

సమాధానం: 3

13. ప్రధాన సంఖ్యలు కనుక్కోవడానికి జల్లెడ పద్ధతిని రూపొందించిన శాస్త్రవేత్త ఎవరు?

1) ఆర్యభట్ట 2) భానుచార్యుడు
3) వరాహమిహిరుడు 4) ఎరటోస్తనీస్

సాధన: ప్రధాన సంఖ్యలు కనుక్కోవడానికి జల్లెడ పద్ధతిని రూపొందించిన శాస్త్రవేత్త ఎరటోస్తనీస్

సమాధానం: 4

14. కింది వాటిని జతపరచండి.

i. సహజ సంఖ్యల సమితి a) Q
ii. పూర్ణాంకాల సమితి b) N
iii. పూర్ణ సంఖ్యల సమితి c) W
iv. అకరణీయ సంఖ్యల సమితి d) Z

1) i-b, ii-c, iii-d, iv-a 2) i-a, ii-b, iii-c, iv-d
3) i-c, ii-a iii-d, iv-c 4) ఏదీకాదు

సమాధానం: 1

15. $49_{(10)}$ అనే సంఖ్యను ద్విసంఖ్యామానంలో రాయండి.

1) $100100_{(2)}$ 2) $110001_{(2)}$
3) $101001_{(2)}$ 4) $100101_{(2)}$

సాధన:
2 | 49
2 | 24 - 1
2 | 12 - 0
2 | 6 - 0
2 | 3 - 0
1 - 1

$49_{(10)} \longrightarrow 110001_{(2)}$

సమాధానం: 2



రచయిత
యర్రమాద నర్సిరెడ్డి
విషయ నిపుణులు

433 Word of the Day

Glistening

Telugu meaning: మెరిసే, తళతళలాడే

English meaning: The word glistening is an adjective that describes something shining with a sparkling light.

Synonyms: Shimmering, Gleaming

Antonyms: Dull, Dim

Usage: **1.** The morning dew left the grass glistening under the first rays of sunlight.

2. Her eyes were glistening with tears of joy after hearing the good news.

Latest Updates

PG, PG Diploma Courses

Andhra University, Visakhapatnam in collaboration with Bollineni Medskills is offering the PG, PG Diploma courses for admission into self-supported courses for the academic year 2024-2025. The last date for online application is 15 October 2024.

Teaching Posts

School of Planning and Architecture, Bhopal, Madhya Pradesh is inviting applications for the teaching posts. The total no. of posts is 43. The application fee is Rs.3000. The last date for online applications is 21 October 2024.

Did You Apply..?

Today (October 7) is the last date for the following Posts/ Scholarships

☛ 50 Management Trainee posts in Exim Bank. ***Qualification:*** Post Graduation (MBA/ PGDBA/ PGDBM/ MMS).

☛ Graduate Aptitude Test in Engineering (GATE)-2025. ***Eligibility:*** Any undergraduate degree program.

☛ 56 Middle Level Consultants posts in TTD, Tirupati. ***Qualification:*** MBA.

☛ 54 Apprentice posts in DRDO-ITR. ***Qualification:*** Diploma, BE/BTech, BBA/BCom.


☛ Apprentice posts in NRCB. ***Qualification:*** Diploma, Degree (B.Sc./ BCA).

☛ JNV Selection Test-2025 for Class VI Admissions.

☛ MBA/ MCA courses in JNTU Kakinada. ***Eligibility:*** Bachelors Degree, AP ICET-2024 rank.

For more information and other notifications - scan QR code

ఈ-బుక్ (ఇండియన్ పాలిటీ)



ఒక వ్యక్తిని చట్టబద్ధంగా దేశ పౌరుడిగా గుర్తించడాన్ని పౌరసత్వం అంటారు. ఇది ఉన్న దేశ పౌరులకు ప్రభుత్వ రంగంలో పని చేసే అవకాశంతోపాటు; ఎన్నికల్లో పోటీచేసే హక్కు, ఓటు వేసే హక్కు, రాజ్యాంగ అత్యున్నత పదవులు చేపట్టే హక్కు మొదలైనవి ఉంటాయి.

❖ పౌరసత్వానికి సంబంధించిన రాజ్యాంగ వివరణ, పౌరసత్వ చట్టం, ద్వంద్వ పౌరసత్వం, పౌరసత్వ సవరణ చట్టం 2019, జాతీయ పౌర పట్టిక, జాతీయ జనాభా పట్టిక, మాదిరి ప్రశ్నలు మొదలైనవి ఈ-బుక్‌లో ఉన్నాయి.

చదవడం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

కరెంట్ అఫైర్స్



ఐఎస్‌ఎస్‌ఎఫ్ జూనియర్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ముకేశ్ నెలవల్లి తన ఖాతాలో నాలుగో స్వర్ణాన్ని వేసుకున్నాడు. 2024, అక్టోబరు 4న లిమా (పెరూ)లో జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో ముకేశ్, రాజ్‌వర్ధన్ పటేల్, హర్‌సిమర్ సింగ్‌లతో కూడిన భారత బృందం అగ్రస్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇది 11వ స్వర్ణం. ఇందులో ముకేశ్ ఖాతాలో నాలుగు పసిడి పతకాలు ఉండటం విశేషం.



2024 సెప్టెంబరు 27తో ముగిసిన వారానికి మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు 12.588 బి.డాలర్లు (దాదాపు రూ. లక్ష కోట్లు) పెరిగి జీవనకాల గరిష్ఠమైన 704.885 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.58.50 లక్షల కోట్ల)కు చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పేర్కొంది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 692.296 బి.డాలర్లుగా ఉన్నాయి.

● చైనా, జపాన్, స్విట్జర్లాండ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా 700 బిలియన్ అమెరికన్ డాలర్ల విదేశీ నిల్వలను అధిగమించిన నాలుగో ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది.

దాదాపు 2.5 గిగా వాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, హరిత రసాయనాల ఉత్పత్తి కోసం గ్రీన్‌కో గ్రూపునకు చెందిన ఏఎం గ్రీన్ సంస్థ, ప్రభుత్వ రంగంలోని గెయిల్‌తో 2024, అక్టోబరు 4న అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టులు ఉంటాయి.

కేంద్ర ప్రభుత్వం ప్రయోగాత్మక పద్ధతిన ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను 2024, అక్టోబరు 3న ఆవిష్కరించింది. అయిదేళ్లలో కోటి మంది యువతకు ముఖ్యంగా 21-24 ఏళ్ల వారికి ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం మొత్తం రూ.66,000 కోట్ల వార్షిక ఆర్థిక మద్దతును ప్రకటించింది.

కరెంట్ అఫైర్స్ ఈబుక్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

SSC Exams

English

Sentence Improvement

Directions (Qs. 1 - 18): *Select the most appropriate option to substitute the underlined segment in the given sentence. If there is no need to substitute it, select No improvement.*

1. The teacher as well as the students are attending the seminar.
A) is attending the seminar
B) have been attending the seminar
C) No Improvement
D) were attending the seminar

2. She did not knew about the meeting until it was too late.
A) has not known
B) did not know C) did not knows
D) No Improvement

3. We must ensure that all equipments are functioning properly.
A) No Improvement
B) all equipments were
C) all equipment is
D) all equipment was

4. The manager will resign if he will not receive the required support.
A) if he does not receive
B) if he did not receive
C) No Improvement
D) if he would not receive

5. They went for a walk despite of the heavy rain.
A) in spite the heavy rain
B) despite the heavy rain
C) No Improvement
D) due to the heavy rain

6. He ran as fast as he can to catch the bus.
A) as fast as he should
B) No Improvement
C) as fast as he could
D) as fast as he would

7. She succeeded because of she worked hard.
A) because then she work hard
B) due to she hard work
C) No Improvement
D) because she worked hard

8. Each of the boys have their own books.
A) has his own books
B) have his own books
C) No Improvement
D) has their own book

9. The players played good in the match last night.
A) have played good
B) played well
C) No Improvement
D) were playing well

10. He is one of those students who attends every class.
A) who has attend every class
B) who attending every class
C) who attend every class
D) No Improvement

11. The company have launched a new product in the market.
A) have been launching
B) had launch
C) No Improvement
D) has launched

12. The woman, along with her children, were rescued from the fire.
A) was rescued
B) were rescuing
C) No Improvement
D) had been rescued

13. He worked hardly to complete the project on time.
A) worked harder
B) worked hard
C) No Improvement
D) hardly working

14. We had went to the park before it started raining.
A) has gone to B) have went to
C) had gone to D) No Improvement

15. I prefer coffee than tea.
A) coffee rather than tea
B) coffee from tea
C) No Improvement
D) coffee to tea

16. He suggested me to consult a doctor for my condition.
A) suggested that I consult
B) suggested me that I can consult
C) No Improvement
D) suggested for me to consult

17. The report is due by the end to the next week.
A) at the end of the next week
B) by the end of next week
C) No Improvement
D) at next week's end

18. We should invest our time wisely and efficiently, as time is a precious resource.
A) invest the time wisely
B) invest our time wiser
C) No Improvement
D. invest time wise

Scan the QR code for Key

Writer:
P. Manoj Kumar, Subject Expert